DAMAGE BOOK

UNIVERSAL LIBRARY
OU_206237
UNIVERSAL LIBRARY

OUP—901—26-3-70—5,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. 923.2 Accession No. 74428

Author

Title

This book should be returned on or before the date last marked below.

# విప్లవాధ్యక్షుడు

రచన:

యన్. విజయరాజకుమార్

(శ్రీ ఆచార్య రంగాగారి పరిచయంతో)

లక్ష్మీ కిసాన్ హోం,

కాలేజి రోడ్ - గుంటూరు.

ఆంధ్ర బుక్ హౌస్

[ రు. 3—0—0

# విషయసూచిక


| | |
|---|---|
| పరిచయం | 1 — 36 |
| దేశభక్తుడు | 1 |
| దురదృష్టంలో ఆశాజ్యోతులు | 21 |
| ఖైదు | 45 |
| బహిష్కరణ | 96 |
| రాజీనామ | 120 |
| తిరుగుబాటు - జైలు | 155 |
| అదృశ్యంలో వివాహం | 176 |
| నిజమా? అబద్ధమా? | 193 |
| జైలులో తిరుగుబాటు | 213 |


౬

ప్రజాస్వామ్య ప్రచురణలు — 5

★

తొలి ప్రచురణ : 2000

★

సర్వహక్కులు రచయితవి

# అభిప్రాయం

ఈ గ్రంథం ముఖ్యంగా యువకలోకమంతా పరిశీలించుట అవసరమని చెప్పక తప్పదు. యువకులు సహజ వికాసానికై తమ ఆశయాలు సాధించాలంటే తమ కర్తవ్యాలేమిటో వాటిని ఆచరణలో పెట్టటానికి ఏవిధంగా కృషిచేయాలో ఎంతటి దీక్ష, కార్యదక్షత కావలెనో అనేవి నేర్చుకోవడానికి ఈ గ్రంథ పఠన చాల ఉపయోగపడగలదు. అన్నిటికంటే జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో విప్లవమూర్తి అయిన నేతాజీ బోస్‌బాబు జీవితచరిత్ర ఆబాలవృద్ధులందరికీ ఆదర్శప్రాయమైంది.

బారువా,
25—2—54,

గౌతు లచ్చన్న

మిత్రుడు

రావెల వెంకట సుబ్బారావుకు

(తుళ్ళూరు పంచాయితీ అధ్యక్షులు)

# ముందుమాట

ఆంధ్రదేశంలో నేతాజీ జీవితాన్ని గురించి కొన్ని గ్రంథాలు వెలువడినవి. కానీ రాజకీయ చరిత్రతో ఆయన జీవితాన్ని మిళితంచేసిన గ్రంథాలు అరుదు. ఆలోటును భర్తీ చేయాలనే దృక్పథంతో నేను ఈ పుస్తకాన్ని 1950 జనవరి 23 వ తేదీకే ముగించి ప్రకటించి, నేతాజీ జన్మదిన కానుకగా సమర్పించాలని ఆశించాను. కానీ, ముగింపు పూర్తి అయినా ఆర్థిక దుస్థితివలన ప్రకటించటానికి వీలు లేకపోయింది. తుదకు 58 వ జన్మదినోత్సవానికి ఈ పుస్తకాన్ని ఆంధ్రదేశానికి అందివ్వటానికి ఆనందిస్తున్నాను. ఆర్థిక యిబ్బందుల వలన నే సంవత్సరం పాటు ఈ పుస్తకం ప్రెస్‌లో వుంది. అచ్చు పొరపాట్లు లేకుండా సరిచూచే విషయంలో తగు వ్యవధి లభించనందున కొన్ని అక్షరాలకు వత్తులు, పొల్లులు, అదనంగానో తక్కువ గానో పడినవి. వాటిని పాఠకులు గమనించ ప్రార్థన.

ఈ పుస్తకాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపించే దానికి పంజాబ్ రచయిత అయిన సర్దార్ దుర్లభసింగ్ వ్రాసిన రెబెల్ ప్రెశిడెంటు నాకు ఎంతో తోడ్పడినందుకు ఆ రచయితకు నే నెంతో ఋణపడివున్నాను.

అడిగినంతనే పరిచయాలు వ్రాసిన శ్రీ ఆచార్య రంగాగారికి శ్రీ గౌతు లచ్చన్నగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ గ్రంథముద్రణకు తోడ్పడిన నా సన్నిహిత రైతాంగ మిత్రులకు హృదయ పూర్వకమైన శుభాకాంక్షలను తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకం వ్రాసి చాలకాలమైన తరువాత, చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, ప్రకటించాలనుకున్నప్పటికీ అక్కడక్కడ కొన్ని సవరణలు చేయవలసివుంది. కానీ, అది ఏకారణంవలనైతేనేమి సాధ్యంకాలేదు. ఇందులో "నిజమా? అబద్ధమా?" అనే శీర్షిక ప్రాధాన్యత ఈ సంవత్సరంతో అంతం కాబోతుంది.

తిరిగి ద్వితీయ ముద్రణకు పాఠకులు అవకాశాన్ని కల్పించినట్లయితే సమగ్రమైన రాజకీయ చరిత్రను సృష్టించేదానికి ఇంకా అనేకమైన ఘట్టాలను పెంచాలనివుంది. ఆంధ్రదేశంలో నా సోదర సోదరీమణుల పరిజ్ఞానాభివృద్ధికి ఇది ఏమాత్రం తోడ్పడినా నేను ధన్యుణ్ణి — నా శ్రమ వృధా కాబోదని ఆశిస్తున్నాను.

గుంటూరు,
15—1—55.

శైలవు
కుమార్

# పరిచయం

ఒక ఉత్తేజకరమైన ధోరణితో, నేతాజీ జీవితాన్ని మన ఆంధ్రులకు అందించి విజయరాజకుమార్‌గారు ప్రజలకు అమోఘమైన సేవ చేశారు, ఆనాటి భారత విప్లవ కాంగ్రెస్‌కు "తిరుగుబాటు అధ్యక్షుడు"గా "విప్లవాధ్యక్షుడు"గా, సాటిలేని అధ్యక్షుడు''గా నేతాజీ జగమెరిగిన పురుషుడు.

ఒక వైపున మంత్రివర్గాల, వాటి కీలుబొమ్మలుగా వ్యవహరిస్తున్న పరిపాలనా ఉపాంగాల, వ్యాపారస్తుల, పారిశ్రామిక వేత్తల ఇంకా తదితర సాంఘిక శక్తుల సానుభూతి సంపాదిస్తే, దయకు పాత్రులైతే, ఎన్నో విధానాల లాభం పొందే అవకాశాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనుపిస్తున్నప్పటికీ, ఈనాటికీ ఆయన విషయంలో మన ప్రజలు ఎందుకు అమిత శ్రద్ధని ప్రదర్శిస్తున్నారు ?

అతి బాధాకరమైన 1920–40 సం॥రాల మధ్యకాలంలో బ్రిటీషువారి నిరంకుశ సామ్రాజ్యవాదంతో, నిరంతరోత్సాహంతో సుభాష్‌బాబు ఆయన సహచరులు జరిపిన ఎడతెగని వీరోచిత పోరాటాల వివరాలను గురించికాని లేక కాంగ్రెస్‌తో దాని నాయకులైన సర్దారు న్యాయాలకు సంబంధించిన తప్పొప్పుల వివరాల గురించికానీ, వారిలో చాలమంది జ్ఞప్తిలో వుంచుకున్నట్లు కనుపడదు. అంత డాక నిరంతర స్వరాజ్య వీరుడని, మన జాతీయ స్వాతంత్ర్యానికి తన సర్వస్వాన్ని పణంగా అర్పించాడనీ, భావిత స్వరాజ్యోద్యమాన్ని చురుకుగా సాగించే

దానికి మహాత్మాగాంధీని సహితం ధిక్కరించే ధైర్యాన్ని ప్రదర్శించాడనీ, ద్వితీయ ప్రపంచ యుద్ధ సమయంలో మానవ మారణ హోమం జరుగుచున్న సంధర్భములో బానిస బంధాలను తేగగొట్టేదానికి అత్యంత ప్రాణప్రదమైన మాతృభూమిని విడచి వెళ్ళాడని, మనదేశంలో కాకుండ ఎక్కడో పోరాటం ముమ్మరంగా సాగుతున్న ప్రదేశంలో, మన తరఫున జరిపే పోరాటంలో, మన దేశంకొరకు ఆహుతయ్యాడని మాత్రమే వారికి తెల్సు. వారు ఉత్తేజితులు, అనుభూతులు కావటానికి ఆమాత్రం చాలు. అటువంటి ఉత్తమ రత్నాని అమోఘ త్యాగాన్ని చూచుకుని వారు గర్వపడుతున్నారు – తృప్తిపడుతున్నారు.

ఏ సందర్భంలోనైనా, ఏ దేశంలోనైనా, ఉన్న పరిస్థితుల బట్టి తమ సమకాలిక నాయకత్వ సాధనలతో, తమభావానుగుణ్యంగా తగినంత తృప్తిని వారు పొందలేక పోయినప్పుడు, తమకోర్కెలు ఉన్నదానితో పరిమితం చేసుకోలేక పోయినప్పుడు, అన్ని దేశాలలోనూ, అన్నికాలాలలోనూ స్త్రీలకు-పురుషులకు, ప్రత్యేకంగా యువకులకు-విద్యార్థులకు, అటువంటి మహాపురుషులు ఎప్పుడూ అమోఘ సందేశాన్నివ్వట మనేది సహజం. మానవుని దైనందిన సామాజిక అభిప్రాయాలు ఎప్పుడూ శాశ్వితం సుస్థిరమైనవికావు కాబట్టి, ఒక విధంగా అవి తమను అంటిపెట్టుకుని వున్నంతకాలం సామాజిక అభ్యుదయానికి-అభివృద్ధికి, అధునా తన ఆశలు-ఆశయాలతో, వారు కంటున్న నిరంతర కలలు వాస్తవిక స్వరూపాన్ని పొందేట్లు చేయగలిగిన, లేక తమను ప్రోత్సాహపరిచి పురోగాములుగా

చేయగలిగిన, నాయకుల నిమిత్తం, ఒక్కొకప్పుడు అర్రులు చాచుకుని చూడటం ఒక విశేషం. ఇదంతా ఊహాగానమా? ఒక విధంగా అభిప్రాయాలు ఆశయాలు ఎంత శాస్త్రీయంగా వున్నప్పటికీ మానవ సంఘాలు ఊహా ప్రపంచానికి తమ సౌఖ్యాన్ని పణంగా అర్పించటం లేదూ?

ఒకప్పుడుగానీ మరొకప్పుడుగానీ, మానవమాత్రుని ప్రవర్తనలో కనుపించే ప్రత్యేకత, ఊహాప్రపంచాన్ని స్వప్న జగత్తును సృష్టించుకోవటంలో వ్యక్తమౌతుంది. వేదాంతులు, స్వాప్నికులు, ధైర్యసహాసికులు, ఉన్నత పోరాట సాంప్రదాయికులు, భావదాస్య రహితులైన నాయకులు, అనంత ప్రజల సౌఖ్యప్రద మార్గాల్ని సాహసించి వెతుకుతూ వెళ్ళే సందర్భాలలో — ప్రతివ్యక్తి జీవిత పంథాలో నిజమైన సజీవ అభ్యున్నతిని చూపెట్టే - వారి మనోబలం ఎంతైనా సమర్థనీయం. అయినప్పుడు గ్రీస్ దేశపు అచెలీస్; భారతంనాటి అభిమన్య, కర్ణ, అర్జున - కృష్ణ; వాల్మీకి ఇండియా రామ-హనుమాన్, పురుషోత్తం అలెగ్జాండర్ నాటి జాట్లు; అశోక ఇండియాలోని కాళింగులు; కాకతీయుల ప్రతాపరుద్రుడు; మొగలాయి హయాంలోని శివాజి, భరతపూర్ జాట్లు; 20 వ శతాబ్దంలోని భగత్ సింగ్, జతీన్‌దాస్, సుభాస్‌బాబులు అమర జీవులుగా చిరస్మరణీయులు.

బుద్ధుడు, జీసస్ సింహాసన పరిత్యాగం చేసినట్లే, స్వరాజ్యభానోదయ సందర్భంలో మహాత్మాగాంధీ ఢిల్లీలో అస్తమించాడు. అయినప్పటికీ ఈనాటికి వారు కోటానుకోట్ల ప్రజా హృదయాలలో రారాజులు. అదేమాదిరిగా స్వరాజ్య భారత

దేశంలో, బలీయమైన మొదటినాయకుడుగానో, రెండవ నాయకుడుగానో, మూడోనాయకుడుగానో మహాత్మాజీ అనుచరులలో కాగలిగిన అవకాశాన్ని కలిగివుండేవాడు బోస్. అంతేగాక, స్వరాజ్య నాయకులలో, జవహరిలాల్‌లాంటి ప్రధాన మంత్రులలో ఒకడుగా, మన చరిత్ర గ్రంథాలలో ఆయనకూడా స్థానం ఆక్రమించి వుండేవాడు. ఈ అవకాశాల గురించి ఆయన ఆలోచించి వుండకపోలేదు. అయితే ఆయన తనకీర్తిని ఇనుమడింపచేసే మార్గం ఇదికాదని అసంతృప్తి పొందాడు. ఈనాడు ప్రఖ్యాతిపొందిన కాంగ్రెస్‌లోని అసంఖ్యాక మంత్రులవలె భారత చరిత్రలో తనస్థానం సుస్థిరం కాబడిందని ఆయనకు తెల్సు. అంతటితో ఆగలేదు. గొప్పవారు తృప్తి పడటానికి ఆమాత్రం గౌరవ ప్రతిష్టలు చాలు. అయితే ఆయన ఆగొప్పవారితో భేదించటానికి ఆతురత ప్రదర్శించాడు. ఎందుకంటే, అసంఖ్యాకులు కనుచూపుమేరలో అసాధ్యమని ఊహించే ఒక ఘన కార్య సాధనా ప్రయత్నం నిమిత్తం జరిపే పోరాటంలో, పూర్తిగా ఆగొప్పతనాన్ని మేళవించి, సత్ఫలితాన్ని పొందకపోతే, గొప్పతనపు ప్రత్యేకత ఏముంది? భారతదేశం స్వాతంత్రం పొందే నిమిత్తం, ద్వితీయ ప్రపంచ యుద్ధం సృష్టించిన ప్రత్యేక వాతావరణం అనుగుణ్యంగా వుందని, ఆయన గట్టిగా ఆలోచించి, ఆ ఆలోచనకు తాను ఏకైకంగానే కట్టుబడవలసి వచ్చింది. ఎందుకంటే, జాతీయ నాయకత్వం ఆయన చూపించిన ఈ అభిప్రాయంతో ఏకీభవించ లేకపోయింది. కాబట్టి భారత భూమిలో పోరాటం, జాతీయనాయకత్వ ఆశయానుగుణ్యంగా ముందుకు తీసుకు పోయేనిమిత్తం, సమర రంగాన్ని

స్వేచ్ఛగా కాంగ్రెస్‌కు వదలివేసి, ఒకే ఆశయసాధన నిమిత్తం, తన స్వంత పంథాలో పురోగామియై, ఆకాశంలో ఎగురుతూ నీళ్ళలో ఈదుతూ, దేశం విడిచి ఆయన వెళ్ళిపోయాడు. అప్పటినుంచి తన దేశ ప్రజలు ఆయన జరిపిన వీరోచిత ఉద్యమాల ద్వారానే, బ్రిటీషు ప్రభుత్వం భారత దేశాన్నుంచి వెళ్ళిందనీ, ఆవిధంగానే భారతదేశం స్వతంత్రం పొందగలిగిందని, దృఢమైన నమ్మకంతో వున్నారు. భారత జాతీయ నాయకత్వ సాధనలుకూడా అమోఘమైనవి – చైతన్య ప్రపూరితమైనవి. అయితే నేతాజీని ఉపయోగించుకోనేవారు, ఇంకా కొద్ది దైనప్పటికీ అతని అనుచరవర్గం తమ తిరుగులేని వీరత్వం, హద్దులులేని సహసం, అంతులేని త్యాగాలు ప్రదర్శించి, ఎంతో చైతన్యవంతులుగానున్నా అద్భుత వ్యక్తులుగానున్నా రుజువు చేసుకున్నారు. )

అమోఘమైన 1938–40 సంవత్సరాల మధ్యకాలంలో, నేతాజీ పక్షంగా నిలబడిన అనేకమంది అదృష్టవంతులైన స్వాతంత్ర్య సర్దార్లతోపాటు, నాకుకూడా నేతాజీ పక్షంగా వుండే అదృష్టం కలిగింది. మా రైతాంగోద్యమానికి ఆయన హరిపూర్ అధ్యక్షస్థానం ఎంతో మద్దత్తు నిచ్చింది. కొంతమంది కాంగ్రెస్ మితవాద నాయకులతో ఆయన ప్రారంభించిన పోరాటం, మెరికలలాంటి మాలోని కొందరిని అధికారంకోసరం తాపత్రయ పడేవారికి భిన్నమైన వర్గంగా ఏర్పడటానికి అవకాశం కలిగించింది. ఆయన బాహాటంగా రైతాంగోద్యమాన్ని సమర్థించటం, జాతీయ ఉద్యమంలో పనిచేస్తున్న మమ్మల్ని ఆయన బ్రిటీషు ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రదర్శించే ఎత్తు

గడలు, అమితంగా ఆకర్షించినయ్. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆయనవుండి, ప్రపంచయుద్ధం ఆ సంవత్సరం ప్రజ్వరిల్ల బోతుందని నొక్కి వక్కాణించినందున, స్వరాజ్య సముపార్జనకు అనువైన అవకాశం గలిగిన సందర్భంలో, ఆయన వంటి బలీయమైన అధ్యక్షుడు దేశానికి అవసరమని మేం అభిప్రాయపడ్డాం. కాబట్టి అదృష్టకరమైన త్రిపురీ కాంగ్రెస్ సందర్భములో, తిరిగి ఆయనే అధ్యక్షుడుగా వచ్చేందుకు మేమంతా సహాయ పడ్డాం. ఎప్పుడైతే మహాత్మాగాంధీ తద్భిన్నమైన అభిప్రాయానికి వచ్చాడో, అప్పుడు పరిస్థితులు మారి, సుబాస్‌బాబు, కాంగ్రెస్ మాజీరక్షకునికి మళ్ళీ అవకాశాన్నిస్తూ, రాజీనామా ఇచ్చేందుకు పరిస్థితులు వత్తిడి పెట్టటం ద్వారా, ఇక అప్పటి నుంచి అతివాద ఐక్యసంఘటన సంస్థ(Left Consolidation Committee) స్థాపనకు నేను కృషిచేయ ప్రారంభించాను. అయితే 1940 ఏప్రియల్ 1–వ తేదీలో మొదట రాయిష్టులు, తరువాత సోషలిష్టులు, ఆ తరువాత కమ్యూనిష్టులు వరుసగా అ. ఐ. సంఘటనా సంస్థని వదలిపోయినందున, కిసాన్ కాంగ్రెస్ వాదులమైన మేము, ఫార్వర్డ్‌బ్లాక్ వారు మాత్రమే అందులో మిగిలిపోయాం.

ఆయన వ్యక్తిత్వం ఎలాంటిది ? అనే విషయాన్ని వివరించాలంటే, మూడేండ్ల మా ఉభయుల మధ్యవున్న సన్నిహితమైత్రి రీత్యా ఏ కొంచెంగానో క్లుప్తీకరించి చెప్పటం సాధ్యంకాదు. బాపు మాదిరిగానే తన మిత్రుల్ని ఎలా ప్రేమించాలో, ఎలా గౌరవించాలనో అనే విషయం, ఆయనొక్కడికి మాత్రమే తెలుసు. ప్రతి స్వరాజ్య వీరుడూ ఆయ

నకు అత్యంత సన్నిహిత మిత్రుడు కావటంవలన, కొన్ని సంద ర్భాలలో ఆ సన్నిహితత్వం అనేక రాజకీయ చిక్కుల్ని కల్పించిందికూడ. తనతోటి ఉన్నత స్థాయిలో జరిగే రాజ కీయ చర్చలలో, రసాభాసంలో నిర్మొగమాటంగా భేదించే సహచరులతో సహితం, ఎంతో స్నేహంగానూ ఎంతో ఆదరంగానూ ఉండటం, ఆయనలోనే చూడగలిగాను. ఆయన వ్యక్తిత్వం, గాంభీర్యంతోనూ, విజ్ఞానంతోనూ కూడి వుండటమేకాక, అభిమానం, ప్రేమ, సాటిలేని విధేయతల కలయికల సమ్మేళనం కూడ. ఉన్నత స్థాయిలో వున్న కొద్ది మంది తమ సర్వస్వాన్ని అదే ఆశయం కోసరం త్యాగంచేసి నప్పటికీ, ఏదో వ్యక్తిగతమైన సేవాపరాయణత్వాన్ని, వ్యక్తి గత ధోరణిలోనే ప్రదర్శించటంగానీ, బలీయమైన నాయకుల సమాఖ్యలో పరస్పర విధేయతలు ప్రదర్శించుకోవటంగానీ, పరస్పర ప్రేమకు కట్టుబడటంకానీ బహు అరుదుగా గోచ రిస్తుంది. కానీ సుబాస్‌బాబు మాత్రం ఆ ప్రేమని, మైత్రిని ఎంతగా చూపెట్టేవాడంటే, ఒక్కొక్కప్పుడు మా మధ్యనున్న అభిప్రాయభేదాల్ని సహితం మర్చిపోయి, మా ప్రతి ఒక్కరి ఆనందాన్ని ఆయన్ను తృప్తిపెట్టేంతవరకు. అతివాద ఐక్య సంఘటన సంస్థలో కానీ, కాంగ్రెసు నాయకత్వంలో కానీ, మరో సహచరునికి ఈ ఘనత దక్కలేదు. మార్క్సిజాన్ని ఆ మూలంగా అర్థం చేసుకోవటంలో కానీ, ప్రజాసంఘాలు స్థాపించటంలో కానీ, ప్రజాస్వామ్య సాహిత్య విషయంలోగానీ, సిద్ధాంత - వేదాంత - చరిత్రల సంబంధంగా కానీ, మాలోని కొంతమందికి బాగా తెల్సుననే ఆలోచనలు వుండేవి. మాలో

కొంతమందిమి అంతకంటే మంచి వుపన్యాసకులం, సమర్థమైన సంఘ నిర్మాతలం, లేక అన్నింటిలో సామర్థ్యంగలవాళ్ళం వున్నాం. అనేకమంది ఏ మాత్రం తీసిపోనీ ధైర్య సాహసాలు త్యాగాలు ప్రదర్శించినవారూ వున్నారు. ఇంకా యితర విషయాలలో అనేక మందికి అంతకంటే అధికమైన అవకాశాలు పుట్టుకతోనే వున్నయ్. అయినప్పటికీ ఆయన్ను, విప్లవ వీరోచిత సాంప్రదాయాల చిట్టి బాబుగా, జాతీయ స్వాతంత్ర్య సమర ధృవతారగా ఎంతో సంతోషంగా మేం ఎందుకు ఎంచుకున్నామంటే, ఆయన అటువంటి చక్కని మిత్రుడు – సహచరుడు – వీరులమధ్య వీరుడు.

1938–39 సంవత్సరాల మధ్యకాలంలో ప్రపంచ యుద్ధం విధిగా వచ్చితీరుతుందని సుభాసుబాబు, మాలో చాల మందిమి నిశ్చయించుకున్నాం. అంతే కాకుండా "మ్యూనిచ్ ఒడంబడిక" అగౌరవం పొందింది కాబట్టి, ఇక అది యుద్ధనివారణకు తోడ్పడలేదని కూడా నిశ్చయించుకున్నాం. అందుకని, రాష్ట్రాలలోని కాంగ్రెసు మంత్రివర్గాలని, మొత్తంగా కాంగ్రెసుని, బ్రిటీషు ప్రభుత్వం మన మంత్రివర్గాలను రద్దుచేసి తమ సామ్రాజ్య నిరంకుశత్వాన్ని యధావిధిగా సాగించే సాహసం చూపెట్టే పక్షంలో, భారత స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకునే నిమిత్తం ప్రజల్ని సమాయత్తంచేసే తక్షణ కార్యక్రమాన్ని ఇవ్వాలని అభ్యర్థించాం. ఇది ఇలావుంటే మరో వైపున కొంతమంది మన పార్లమెంటరీ నాయకులు ఏదో ఒక రకమైన రాజీ కుదిర్చే నిమిత్తం బ్రిటీషువారితో మంతనాలు ప్రారంభించారు. అయితే బ్రిటిషు సామ్రాజ్య వాదంతో ఏ రాజీచేసుకునే

దానికి మేం తయారుగాలేము. అప్పటి కాంగ్రెసు అధ్యక్ష హోదాలో వున్న సుభాసుబాబు, 1937-వ సంవత్సరపు రాజ్యాంగం, భారతదేశానికి ప్రసాదించే ఫెడరేషన్ విధానాను గుణ్యంగా జరిగే ఏ రాజీబేరాలు సాగవని, ధైర్యంగా తెగ వేసి చెప్పాడు. మహాత్మాగాంధీ - జవహరిలాల్ నెహ్రూలు కూడా సమానంగానే ఫెడరల్ ప్రణాళికను వ్యతిరేకించారు. కానీ కాంగ్రెసు సంస్థ ద్వారా కానీ లేక కాంగ్రెసు మంత్రి వర్గాల చేతగానీ, దేశాన్ని బ్రిటీషు వ్యతిరేక పోరాటానికి సన్నద్ధంచేసే ధోరణిలో మాత్రం లేదు. ఈ విధంగా యుద్ధం సమీపించేకొలది 1939 ఢిల్లీ అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో విషయం చర్చకు వచ్చింది. ఏ విధంగా తాను పార్లమెంటరీ ప్రతిపక్షంగా వ్యవహరించగలడో లేక జాతీయ విరుద్ధంగా తయారౌతున్న కాంగ్రెసు మంత్రివర్గాలతో మేం పోరాడేందుకు సుభాసు ఏ విధంగా మాకు అనుమతి యిస్తాడో అనే అంశాలమీద మహాత్మా ఆశ్చర్య పోవటమేకాక సుదీర్ఘ ఆలోచనలో పడ్డాడు.

కాంగ్రెసును తిరిగి మంత్రివర్గీయుల హస్తగతం చేయటమా? లేక సుభాస్ మళ్లీ కాంగ్రెస్‌నుగానీ మంత్రి వర్గాలనుగానీ పోరాటోన్ముఖులుగా చేసేందుకు ఎన్నుకోబడ టమా? అనే సమస్యమీద విభేధాలు విధిగా వచ్చేట్లు కనుపిస్తుండటంలో ఆశ్చర్యపడవలసిం దేమీ లేదు. అందుకని అధ్యక్ష ఎన్నిక ప్రత్యేకంగా ప్రాముఖ్యత వహించింది. కాంగ్రెసు హేమా హేమీ నాయకులంతా ఎంత తీవ్రమైన బాహాట వ్యతిరేకత ప్రదర్శించినప్పటికీ, సుభాస్ తిరిగి ఎన్నిక

కావటం ఒక విధంగా అతివాదులలో కాంగ్రెస్ నిజమైన పోరాటపంథాలో ఇక పురోగమిస్తుందనే ఆత్మతృప్తికి హేతువైనప్పటికీ, మరో వైపున అకస్మాత్తుగా మహాత్మా గాంధీ తన సవాల్‌తో ముందుకు రావటంవలన, ఇక ఇప్పుడు బోస్-గాంధీలలో ఎవరు ప్రధానమో ఎంచుకోవలసిన గడ్డు పరీక్ష కాంగ్రెస్‌కు ఏర్పడింది. ఆ సందర్భంగా మాలో చాలమందిమి మహాత్మాగాంధీ చూపిన ధోరణి అన్యాయమని భావించాం. ఏమైనప్పటికీ తక్షణ భారత స్వాతంత్ర్య సాధన నిమిత్తం. బ్రిటన్‌తో పోరాడేందుకు దేశాన్ని సమాయత్తం చేసే విషయంలో అధిక సంఖ్యాక కాంగ్రెస్‌వాదులు తమ విద్యుక్త ధర్మాన్ని మరచి మహాత్మాజీని అనుసరించ నిర్ణయించుకున్నారు. 1939-వ సం॥లో జాతీయ సమరాన్ని ప్రారంభించాలని మేం నిర్ణయించుకున్న తరువాత అయిదారు మాసాలకు జరిగిన సంఘటనలు మా వాదాన్ని బలపరిచాయి. ఎలాగంటే, మాలో చాలామందిమి ఊహించినట్లు 1939 సెప్టెంబరులో యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా ప్రజ్వరిల్లింది ; కాంగ్రెస్‌తోకానీ, కాంగ్రెస్ మంత్రివర్గాలతో కానీ సంప్రదించకుండానే వలసవిధానంలో వున్న భారతదేశంలో, తమ పలుకుబడి ఎలా వుంది వ్యక్తంచేసుకుంటూ, ఇంగ్లాండు భారత దేశాన్ని యుద్ధరంగంలోనికి ఈడ్చింది.

కాంగ్రెసు నాయకులు ప్రదర్శిస్తున్న అసంబద్ధమైన, దౌర్భాగ్యమైన మంత్రివర్గాల మోజుతోపాటు, బ్రిటీషువారు తీసుకున్న ఈ క్రౌర్యనిర్ణయానికి దేశం ఒక్కుమ్మడిగావిస్తుపోయింది. సుభాస్‌బాబు కాంగ్రెసు అధ్యక్షస్థానానికి రాజీ

నామా ఇచ్చి దేశాన్ని పోరాటానికే తయారుచేయటం మంచిదని చేసుకున్న నిర్ణయం, నన్ను ఉత్తేజపూరితుడ్ని చేసింది. బ్రిటీషువారితో పోరాడేందుకు స్వతంత్రప్రతిపత్తి గలిగిన నాయకత్వం అవసరమని గుర్తించి మాలో చాలా మందిమి బాహాటంగా సుభాస్ శ్రేణిలో చేరాం.

ఆయన ఇటువంటి భయంకర వాతావరణంలో వున్నపుడు, కాంగ్రెసు కార్యవర్గం కాంగ్రెసు మంత్రివర్గాలను రాజీనామా లివ్వమని కోరింది. అయితే ఈ మాత్రమే సరి పోతుందా ? ప్రజాహృదయాల్ని చూరగొనటానికి ఇంత కంటే అదనంగా ఏదో చేసి చూపెట్టాలని మహాత్మ అభిప్రాయ పడ్డాడు. అలా యుద్ధభయాన్ని ప్రజలమధ్య ప్రదర్శించాలను కున్నాడుకూడ. అందుకని ఆయన వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు. 75000 ల మంది కాంగ్రెసువారు దానిలో పాల్గొనేందుకు అనుమతిచ్చాడు.

బాపు ఆలోచన ఏమంటే, ఆ ప్రసిద్ధపోరాటం కాంగ్రెసు వ్యతిరేకత ప్రదర్శించేవారి ఆటకట్టిస్తుందని. అయితే, ఆ ఆలోచన ప్రజలలో అంతగా పనిచేయలేదు. కారణం వారు సామ్రాజ్యవాదంతో పోరాడేందుకు ఒక తీవ్రమైన కార్య క్రమాన్ని వాంఛించారు.

నేను 1940 మార్చి 31 వ తేదీన జైలులో నిర్బం ధించబడ్డాను. ఏప్రియల్ ఆరవ తేదీన "జాతీయవారం" జరిపి నందుకు సుభాసుకూడా అరెస్టు చేయబడ్డాడు. ఇక అంతటితో బీహార్ బెంగాల్ రైతుకూలీలు కోపోద్రిక్తులై లేచారు.

సుదీర్ఘకాలంగా ఊహించుకుంటున్న స్వతంత్రపోరాటం, అలా అతివాద ఐక్యసంఘటనాసంస్థ ద్వారా ప్రారంభించబడిందని మహాత్మా, ఇంకా అనేకమంది మాపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారు. ఫర్వాలేదు–ఆతరువాత కొద్దిమాసాల వ్యవధికే సామ్రాజ్యవాద యుద్ధానికి కాంగ్రెసు మద్దత్తులేదని తెలిపే నిమిత్తం వ్యష్టి సత్యాగ్రహాన్ని ప్రకటించాడు.

ఆసందర్భంలో[6] సుబాస్‌బాబు మహాత్మాజీ తీసుకున్న ఈ కార్యక్రమానికి కొంతవరకు తృప్తిపడి, కాంగ్రెసు ఆకార్యక్రమాన్నే గనుక భారతదేశంలో ఎడతెరిపి లేకుండా సాగిస్తున్నట్లయితే, పోరాటాన్ని పటుతరం చేసేందుకు తాను ఇతర దేశాలకు వెళ్ళి ద్వితీయరంగాన్ని ప్రారంభించాలని అనుకున్నాడు. అలాగయితే, ఎంతోకాలంనుంచి కాంగ్రెసులో గాంధీజీ–ఆయన సహచరులకు – బోస్ అయన సహచరులకు మధ్యనున్న అభిప్రాయబేధాలు త్వరలో, సమసిపోతాయని కూడా ఆయన ఆశ.

1940–42 మధ్య జరిగిన ఈ సంఘటనలన్నీ అమూల్యమైన కాలాన్ని వృధాపరిచినయ్. ఈ క్లిష్టసమయంలోనే ప్రపంచసంఘటనలు భయవ్యవస్థనుంచి విభ్రాంతి వ్యవస్థకు నడిపించాయ్. యుద్ధ ప్రారంభదశలో తన జాతీయ అంతర్జాతీయ స్వార్థాన్ని చూపెట్టుకుంటూ, కమ్యూనిష్టు సమాజ భద్రత నిమిత్తం, నాజీ జర్మనీతో నిరాక్రమణ లేక నిర్యుద్ధసంధి జేసుకుని, మొదట పోలాండును, జర్మనీ ఆక్రమించుకునేదానికి దోహదం కల్పించి, దానిలో సగభాగం తానుకూడా వాటా

పుచ్చుకుని, తదుపరి ఆగ్నేయ ఐరోపాలోని మూడు బాల్టిక్ రాజ్యాలను దిగ్రమింగటాన్ని సహించి, రణతంత్రరీత్యా ఫిన్లాండ్‌లోని సగాన్ని గుటకాయ స్వాహాచేసేట్లు జర్మనీకి అవకాశాల్ని కల్పించి, సోవియట్‌రష్యా తనమీాద ఆధారపడిన ప్రపంచరాజ్యాలలోని పార్టీలన్నీ. ఆ యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా బావించారు. కాబట్టి, వలసరాజ్య జాతీయ పోరాటాలను బలపర్చటానికి తీర్మానించుకోవటం కూడా జరిగింది.

భారతదేశంలోని కమ్యూనిష్టులు కూడా, కాంగ్రెస్‌కు భిన్నంగా భారతదేశంలో పోరాటానికి కావలసిన స్వతంత్ర నాయకత్వాన్ని గాఢంగా వాంఛిస్తున్నట్లు నటించి అతివాద ఐక్యసంఘటనాసంస్థలో చేరారు. అయితే ఏ క్లిష్టపరిస్థితుల్లోనైనా, మేం జైళ్ళలో పడకుండావుంటే, ప్రజలలో మాకున్న పలుకుబడిని వినియోగించి కిసాన్ కాంగ్రెసు వాదులమైన మేము, సోషలిష్టులు, ఫార్వర్డ్‌బ్లాక్‌వారు సుసంఘటిత నిర్మాణాత్మకశక్తి గలిగివుండి, ఒక చక్కని పోరాట కార్యక్రమాన్ని ఇచ్చి, ఉద్యమాల్ని నడిపిపచగలరనే అనుమానం భయంతో వున్న కమ్యూనిస్టులు; తమలోని అధికసంఖ్యాకుల్ని ప్రవాసంలో అట్టిపెట్టి, కొద్దిమందిని మాత్రమే మాతో కలిపి, మమ్మల్ని బలవంతపెట్టి ఏదో ఒక పోరాటకార్యక్రమానికి ఉపక్రమిస్తే, అప్పుడు ప్రభుత్వందమననీతి చూపిస్తే మేంజైళ్ళలో నిర్బంధించబడితే, మాపరోక్షంలో రెచ్చిపోయిన ప్రజాజీవితాన్ని, ప్రజా కార్యక్రమాల్ని, తుదిపోరాటం ద్వారా పత్రివాసంలోని తమ అధిక బలంతో, తను వాస్తగతం

చేసుకుని, ఎర్ర సైన్యాలను భారతదేశానికి ఆహ్వానించి, బ్రిటీషువారిని ఓడించి, భారత ఆధిపత్యాన్ని స్వీకరించి భారతదేశంలో ఆవిధంగా కార్మిక నియంతృత్వాన్ని స్థాపించాలని, కమ్యూనిస్టులు ఒక దురభిప్రాయానికి వచ్చారు. సోషలిస్టులు దీన్ని వాసనబట్టి, రాంఘర్‌లో జరిగిన రాజీ వ్యతిరేక మహాసభకు వచ్చి సహాకరించేదానికి నిరాకరిందారు. నేను కూడా కమ్యూనిస్టులతో భేదించటానికి నిర్ణయించు కున్నాను. ఎందుకంటే, ఏ విధంగా మా స్వతంత్ర పోరాటం అతివాద ఐక్యసంఘటనా సంస్థ నాయకత్వాన సాగించబోతు న్నామో అనే అంశంమీద చర్చించే నిమిత్తం వార్ధాలో నేను, ఆ పార్టీ నాయకుడైన శ్రీ ఎ. కె. ఘోషను బాపూ దగ్గరకు తీసుకుపోయినప్పుడు; నిర్మాణ పోరాటానికి సంబం ధించినంతవరకు ఏ పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు పార్టీ అహింసా విధానానికి కట్టుబడి వుండదని, శ్రీ ఘోష్ బాపూకు స్పష్ట పరిచాడు. అంతే కాకుండా ఈ వాస్తవిక విషయాలన్నీ సుబాస్‌బాబు దృష్టికి వచ్చిన వెనువెంటనే కమ్యూనిస్టులతో చేరిన మా స్వతంత్ర పోరాటం అహింసాత్మకంగా సాగించబడు తుందని ప్రజలకు మనం హామీ యివ్వటం ఏమంత బాగుండ దని ఆయన ఆమోదించాడుకూడా. పై చెప్పిన ప్లాన్‌తో "ప్రొలిటేరియన్‌పాత్" అనే కమ్యూనిస్టుల రహస్య సిద్ధాంత గ్రంథం సుబాస్ చేతుల్లో బడింది. కమ్యూనిస్టులతో ఈ పరిస్థితుల్లో కలిసి వుండేదానికి వీలు లేదని సుబాస్ నిర్ణయించు కోవటానికి ఆ మాత్రం ఆధారంచాలు. ఈ విధంగా అతివాద ఐక్య సంఘటనా సంస్థ విచ్ఛిన్నం కావటమే కాక, బ్రిటిష్

వారితో అహింసాత్మకంగా పోరాటం సాగించేదానికి ప్రత్యామ్నాయ నాయకత్వం కోసరం మేం చేసిన ప్రయత్నాలన్నీ ఇలా భగ్నమైనయ్.

అధిక సంఖ్యాకుల్ని చిందరవందర చేయటానికి ఈ అనుభవాలు చాలు. యదార్థానికి ఈ సంఘటనల వలన మంచి సమర్థులైన కొంత మంది స్నేహితుల సహకారం కూడా మాకు దూరమైంది.

భారతదేశంలో నాయకత్వం నిమిత్తం జరుగుతున్న నిత్య సంఘర్షన తొలగించటం, బ్రిటీషువారికి వ్యతిరేకమైన ఇతర స్వతంత్ర రాజ్యాలలో వారి యుద్ధ ప్రచారాన్ని-పరికరాల్ని వినియోగించుకోవటం అనే, ద్వివిధ కార్యసాధన నిమిత్తం ఆ క్లిష్టపరిస్థితుల్లో తనమట్టుకు తాను దేశాంతరుడై కార్యక్రమాన్ని ప్రారంభించాలసి సుబాస్ నిర్ణయించుకున్నాడు.

సుబాస్‌బాబు రహస్యమార్గాన బ్రిటీషువారి ఇనుప హస్తాలనుంచి వారిని మైమరపించి, దేశాంతరుడు కావటాన్ని చూచి నేను తిరుచునాపల్లి జైలులోవుండి నిట్టూర్పు విడిచినప్పటికీ, ఒకగొప్ప రాజకీయ ప్రజ్ఞాదురంధరుని మాదిరిగా సుబాస్ బాబు రొంపినుంచి బైటపడ్డందుకు, జలాభారతస్వాతంత్ర్యఉద్యమం ద్విగుణీకృతంగా సాగబోతున్నందుకు సంతోషపడ్డాను. 1942 మార్చి-ఏప్రియల్ మాసాలలో వార్ధాలోనూ ఢిల్లీలోనూ మహాత్మాజీతో సంభాషించిన అనంతరం, దేశాంతరుడైన సుబాసుబాబు తీసుకున్న కార్యక్రమ ప్రాముఖ్యతనుబట్టి నా ఆశలు పటుతరమైనయ్. సుబాసుబాబుకు నాకు మధ్య

వున్న స్నేహసంబంధాలన్నీ బాపూకు తెలియనివికావు. కాబట్టి సుబాస్‌బాబు క్షేమంగానూ సురక్షితంగానూ ఉన్నాడని, తన ప్రత్యేకపంథాలో ప్రత్యేకధోరణిలో ఆయనిచ్చిన రేడియో ఉపన్యాసాన్ని ఒకరు విని అది సుబాసు కంఠమేనని తనకు స్పష్టపరిచారనీ నాకు హామీయిస్తూ, ఒకవిధంగా రాజకీయ విభేధాలున్నప్పటికినీ, తానింకా సుబాస్‌బాబును యధావిధిగా ప్రేమిస్తున్నానని బాపు చెప్పాడు. అయినప్పటికీ, నేను సుబాస్ బాబుకు అత్యంత సన్నిహిత మిత్రుడ్నిగావున్నా, ప్రజా యుద్ధంగా చిత్రించుకుని నినాదమిచ్చి కమ్యూనిష్టులు ధోరణి మార్చుకున్నందుకు, కాంగ్రెసు నాయకత్వంతో సహకరించే విషయంలో నేను వెనుకంజవేయలేదు. కాబట్టి నేను అంత కంటే అధికంగా ఆయన ప్రేమపాత్రుడ్ని కాగలిగాను. ఈవిధంగా నామాదిరిగానే అనేకమంది కాంగ్రెసుకు, సుబాసు బాబుకు విశ్వాసపాత్రులుగా వుండేట్లు బాపూ సహాయం లభించింది.

భారత కమ్యూనిస్టులు భావించిన దానికి భిన్నంగా సోవియట్ రష్యా పరిపాలకులు సుబాస్‌కు కావలసిన ప్రోత్సాహం-మద్దత్తు ఇవ్వటమే కాకుండా, ఉన్నతమైన జాతీయ అంతర్జాతీయ ప్రాముఖ్యతరీత్యా నాజీ పరిపాలకులను చేరేందుకు సుభాస్‌కు తగిన సహాయం కూడా చేశారు. నాజీ ఫాసిస్టు శక్తులు ఆయన్ను భారత మహానాయకుడుగా గుర్తించి, భారత జాతీయ సైనిక నిర్మాణం నిమిత్తం, మనుష్యుల్ని సేకరించుకునే అధికారం ఇవ్వటమే కాక, ఆయన్ను ఒక బాధ్యత కలిగిన భారత పెద్దగా భావించి, సంధులు కూడా చేసుకున్నారు.

భారత స్వతంత్ర పోటీప్రభుత్వాధినేతగా ఆయన పెంపొందిన ఒక సబ్మెరిన్‌లో బర్మా-మలయాలను చేరుకుని ఆగ్నేయాసియాలో ప్రశస్తి పొందిన అజాద్ హింద్ ఫౌజును స్థాపించి తానే దానికి సర్వ సేనాధిపతియై, నేతాజీగా స్తుతించబడి భారత స్వతంత్ర ప్రభుత్వానికి కావలసిన సాధన సంపత్తిని అమోఘమైన స్వతంత్ర ప్రతిపత్తితో సముపార్జించే కార్యక్రమానికి ఉపక్రమించి, భారతీయుల ప్రాణాల్ని-ఘనతని-గౌరవాన్ని, ఆస్తి-పాస్తుల్ని పోషించగలిగిన స్థాయికి, తన శక్తిసామర్థ్యతలను పెంపొందించుకొని, నాజీ-ఫాసిస్టు జపాన్ శక్తులతో అత్యంత గౌరవప్రదమైన ధోరణితో వ్యవహరించి, జపాన్ ఆక్రమిత ప్రాంతంలో భారత పౌరులకు ప్రత్యేకరాజ్య ప్రతిపత్తిని నేతాజీ సాధించి పెట్టిన ఈ వ్యవహారమంతా అత్యంతాశ్చర్యకరం. నేతాజీ యిచ్చిన ప్రముఖ నినాదాన్ని శిరసావహించి, హృదయపూర్వకమైన విప్లవాత్మక సహకారాన్ని, ఆ దేశాలలోని లక్షలాది భారత ప్రజానీకం ఇవ్వటాన్ని, రేడియో ఉపన్యాసాలద్వారా భారతదేశంలోని ప్రజలు తెల్సుకుని ఎంతో ఉత్తేజ పూరితులయ్యారు. ఇదంతా కూడా ఆ మహత్తర వ్యక్తిత్వంలో మూర్తీభవించిన ఒక విశేషం. నిర్దుష్టమైన ఆయన వాగ్ధోరణి, స్వేచ్ఛా స్వాతంత్రాల విషయంలో ఆయనకున్న ఆరని పిపాస, తిరుగులేని ఆయన వీరత్వం కేవలం సైనికబృందాల్లోనే గాక సామాన్య పౌరుల్లో కూడా, తాము సృష్టించుకోబోయే స్వతంత్రభారత ప్రభుత్వ వ్యవస్థాపనకు తమ సర్వస్వాన్ని అర్పించుకుంటున్నారనే వార్తలు, ఇక్కడ మన ప్రజానీకంలో

కాంగ్రెస్‌వా రనుసరిస్తున్న మందగొండి తనాన్ని తీవ్రంగా నిరశించేంతవరకు దోహదం కల్పించినయ్.

ఈ మధ్యకాలంలో యుద్ధం వక్రగతికి దారితీసింది. రష్యనులు ప్రపంచంలోవున్న తదితర కమ్యూనిష్టులు, జర్మనీ పిచ్చి నియంత రష్యామీద యుద్ధం ప్రకటించటంతో నాజీలకు వ్యతిరేకంగా వుండాలని తీర్మానించుకున్నారు. కాబట్టి అప్పటి వరకు కాంగ్రెస్‌ను - కాంగ్రెస్ నైతిక మేధను బలపరుస్తున్న భారత కమ్యూనిస్టులు, ఆ యుద్ధాన్ని ప్రజాయుద్ధంగా చిత్రించి, తమ సామ్రాజ్య వ్యతిరేక కార్యక్రమాలన్నింటినీ రద్దుచేసుకుని, బ్రిటిషు ప్రభుత్వాన్ని దాని తాబేదార్లను హృదయపూర్వకంగా బలపరిచే కార్యవిధానాన్ని చేబట్టారు. ఈ సమర్థనీయంకాని పరిస్థితుల నుంచి కోలుకోవటం ఎలాగని, భారతీయ మనస్తత్వ రీత్యా అప్పటి భారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షురాలైన భారతీదేవిగారు, భారత ప్రభుత్వాలు ఆలోచించారు. అందుకని ఆమె - ఆమె సహచరులు భారతదేశంలో మంత్రివర్గాల మీద, అంతర్జాతీయ వ్యవహారాల మీద, రక్షణకార్యక్రమాల మీద సంపూర్ణాధికారాలతో, భారతదేశంలో ఒక జాతీయప్రభుత్వం ఏర్పడినట్లయితే అప్పుడది ప్రజాయుద్ధమౌతుంది గాని, మరో విధంగా కాజాలదని విశ్వసించారు.

కిసాన్ ఉద్యమాలలో తగినంత అదనపుబలాన్ని పొందగలిగిన వ్యవధి నిమిత్తం, తాత్కాలికంగా మాత్రమే కమ్యూనిస్టులు ఆమె ధోరణిని అంగీకరించటం జరిగింది. దురదృష్ట వశాత్తు స్వామీసహజానంద, ఇందూలాల్ యాజ్ఞిక్‌లు విడు

దల అయినంతనే వారు కమ్యూనిస్టులతో చేతులు కలిపినందున ఫార్వర్డ్ బ్లాక్, కిసాన్ కాంగ్రెస్ వాదులు కమ్యూనిస్టులతో భేధించవలసి వచ్చింది. ఈ విధంగా బ్రిటీషువారిని బలపరిచే కిసాన్ సభ, కాంగ్రెసును బలపరిచి బ్రిటీషువారితో పోరాటం జరుపాలనే కిసాన్ కాంగ్రెస్ ఇలా రెండుసంస్థలు ఉద్భవించినయ్.

అసంఖ్యాక ప్రజానీకానికి సత్యాగ్రహ కార్యక్రమాన్ని తప్ప, అంతకుమించి వారిలో సాధారణ అసంతృప్తిని పోగొట్ట గలిగి, తమ మార్గంలోనే నడిపించటమనేది మహాత్మాగాంధీకి గానీ, కాంగ్రెస్‌కు గానీ అసంభవంగా కనుపించింది. బ్రిటీషు వారి సామ్రాజ్య తత్వాన్ని గురించి, ఇకనేమాత్రం ఆలోచించ టంకూడా వారికి సాధ్యపడలేదు. కాబట్టి 1942 ఆగస్టు క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించ నిర్ణయించుకున్నారు. కిసాన్ కాంగ్రెస్ వాదులమైన మనమంతా ఆ మహా ఉద్యమం లోనికి పరుగులుతీశాం. మాతృభూమి కర్పించవలసిన ఎటువంటి త్యాగానికైనా మనం వెనుదీయలేదు. ఒకవైపున మాకత్యంత సన్నిహిత సహచరుడు, మిత్రుడైన నేతాజీ ఒక అమోఘమైన కార్యక్రమాన్ని స్వీకరించి, ఉద్యమాన్ని నడుపుతున్న సందర్భంలో, మేం కూడా అటువంటి కార్యక్రమాన్ని ఇక్కడ స్వీకరించినందుకు తృప్తిపడినాం. అద్భుత చైతన్యాన్ని కల్పించిన క్విట్ ఇండియా ఉద్యమం, నేతాజీ బ్రిటీషుసామ్రాజ్య వాదాన్ని సమూలంగా నాశనం చేయాలని, తలపెట్టిన పోరాటానికి అత్యున్నతమైన, గౌరవమైన అవకాశాన్ని కల్పించటమే కాకుండా ఆయన అంచనాలుకూడా కార్యసాధనానుకూలంగానే వున్నట్లు కనుపించినయ్.

1921 వ సంవత్సరంలో ఇంగ్లాండులోని ఇండియన్ల వార్షిక సమావేశవేదికమీద సివిల్‌సర్వీస్‌లోని సభ్యుడుగా సుభాసుబాబు, ఆయనకంటె కొంచెం వెనుకగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చేరిన నేను మాట్లాడుట సంభవించిన తరువాత, మా ఉభయులకూ మిత్రులైన కొందరు అదొకరకమైన భయాన్ని చూపెట్టారు. మే ముభయులంకూడా భారత దేశానికి వేల్సు యువరాజు రాకను బహిష్కరించుటకు తీసుకున్న చర్యల్ని సంయుక్తంగానే సమర్థించాం. యూనివర్శిటీ విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో, ధైర్యసహసాలు కలిగిన ప్రముఖుల్లో, ఆయనొకడని మాత్రం నాకు తెలుసు.

కాంగ్రెసు మహాసభలు జరుగుతున్న సందర్భంలో రెండవసారి కరాచీలో ఆయన్ను కలుసుకున్నాను. ఒకవైపున గాంధీ-ఇర్విన్ సంధి చేసుకుంటూనే బ్రిటీషుదౌష్ట్యాలు మరో వైపున భగవత్‌సింగ్‌ను ఉరితీయటాన్ని ఖండించటానికి, ఆయనతోపాటు నేనూ ఆమోదించాను. అందుకనే ఆయన సమావేశానికి హాజరయ్యాను. అనేకమంది ఇతర విప్లవవాదులతో పాటు నేనుకూడా పోరాటానికి సంబంధించిన వివిధదృక్పథాల్లో తర్కించే నిమిత్తం వెళ్ళాను. గాంధేయమార్గానికి భిన్నంగా స్వాతంత్ర్య సముపార్జనకు అనుసరించాల్సిన పంథానుగురించి ఆయన ఆలోచిస్తున్నపుడు, కాంగ్రెసు జారీచేసిన ప్రాథమిక హక్కుల సూత్రావళి ఎడల నాతృప్తిని వ్యక్తంచేసి 'స్వరాజ్యం ప్రజాయత్తం, అన్న ధోరణిలో అభివృద్ధి పొందేందుకు ఆ విధానాలు దోహదంగా వుంటవని చెప్పాను. సుభాసు ఆమోదించాడు కానీ, ఆయన హృదయం స్వాతంత్ర్య సముపార్జన

నిమిత్తం తీసుకోవలసిన చర్యలు, కార్యక్రమంవైపు పరుగులు తీస్తుంది. మార్క్సిజాన్ని గురించి కమ్యూనిష్టుల ఎత్తుగడల గురించి సుదీర్ఘమైన తర్కం జరిగినతరువాత, మే ముభయులం దగ్గరగా వున్నామని పరస్పరం అర్థం చేసుకున్నాం. విప్లవకార్యక్రమానికి రైతాంగాన్ని కూడా సమీకరించాలన్న విషయంలో ఆయన నాతో ఏకీభవించాడు కానీ, అది వారిద్దైనందిన అవసరాలను తీర్చగలిగిన పునాదులమీద ఉండాలని, అసంఖ్యాక రైతాంగం విషయంలో కమ్యూనిష్టుల విరుద్ధధోరణి ఎంత అసంబద్ధంగా వున్నదో, ఆవిషయాన్నికూడా గుర్తించుకున్నాం. అయితే భారత రాజకీయాల్లో మా ధోరణికి సంబంధించి నంతవరకు ఒక గొప్ప భేదముంది. ఆయన గాంధేయ విధానాలను ఆమోదించడు. అంతే కాకుండా గాంధీనాయకత్వం తగినంత వేగంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టలేదని ఆయన భావిస్తుంటే, ఈ విషయంలో నేను ఎందుకు భేదిస్తున్నానంటే, ఏవిధంగా మహాత్మాజీతో భారత రైతాంగం సంబంధాలను కలిగివున్నారో, దేశస్వాతంత్ర్యానికి ఆయన నాయకత్వావస్యకత ఎంతో నేను గుర్తించాను.

అయినప్పటికీ మే ముభయులం ఒకరితో ఒకరు సహకరించు వేదానికి ఆమోదించుకున్నాం. అంతే కాకుండా ప్రజా సంఘాల్ని అభివృద్ధి చేయాలనే అంశంమీద ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరిగినయ్. కిసాన్ రంగంలో నిపుణుడైన సహచరుడుగా తీసుకోవటానికి ఆయన ఆమోదించాడు. ఇంతలోనే ఆయన జైలుకు—ఆ తరువాత యూరప్‌కు పోవలసిన

పరిస్థితు లేర్పడినయ్. ఆయన వియన్నాలో వున్నపుడు మా ఉభయులకు మిత్రుడైన ఒక వైద్యవిద్యార్థి రాజకీయ కార్యకర్త కాకపోయినా మా రాజకీయ వ్యవహారాల్లో శ్రద్ధని చూపెడుతున్నందుకు, ఆయన ద్వారా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుకున్నాం. ఆ విధంగా 1934-35 సం॥ లలో పరస్పరంగా నిత్యసంబంధాలు పెట్టుకున్నాం. జమిందారీ ప్రాంతాలలోని స్థితిగతులమీద, నిరంతరాయంగా ప్రజా పోరాటం నడుప గలిగిన ప్రోత్సాన్ని కల్గిస్తూ, నేను "జమిందారీ రైతుల ఆర్థిక స్థితిగతులు" అను గ్రంధాన్ని వ్రాస్తే దానికి ఆయన పరిచయ వాక్యాలు వ్రాశాడు.

మే మొకప్పుడు వార్ధాలో బజాజ్ భవనంలో మకాం పెట్టాం. మూడు మాసాల కొకమారు నేను బాపూను చూచే అలవాటు వుంది. 1937-39 సంవత్సరాల మధ్యకాలం లోని క్లిష్టపరిస్థితుల్లో నేను బాపూను చూచినపుడల్లా నా మీద ఏవో కొన్ని ఫిర్యాదు లుంటుండేవి. లేకపోతే కాంగ్రెస్ మంత్రివర్గీయులు, నేను సమాధానం చెప్పుకోవలసిన కొన్ని ఫిర్యాదులు నా మీద - కిసాన్ కాంగ్రెస్‌మీద పెట్టి వుంచేవారు. ఈ ఫిర్యాదు లన్నింటినీ బాపూ తన వద్ద అట్టి పెట్టుకుని, నేను ఆయన్ను సందర్శించినపుడెల్లా సంజాయిషీలు చెప్పుకుని జవాబులు రాబట్టుకోవలసిన, ప్రధాన ఫిర్యాదు లేమిటో, ఏరి నిర్ణయించుకునేవాడు. ఆయన నాకు పోస్టుద్వారా ఆ ఫిర్యాదుల్ని ముందుగా పంపించే విషయంలో ఎప్పుడూ బాధపడేవాడు కాదు. ఎందుకంటే వాటిని బైట పెట్టి నా విషయాలను బ్రిటీషు సి. ఐ. డీ. ల దృష్టికి తేవటం

ఆయనకు యిష్టముండేది కాదు. ఈ మారు కృష్ణాజిల్లా జమీందారీ ప్రాంతాల్లో, జమీందార్లు కొంతమంది రౌడీలను మేపి, దౌర్జన్య హింసాకాండ సాగించిన సందర్భంలో, దాన్ని దుర్కొనే విషయంలో నేను రైతులకిచ్చిన ఉపన్యాసాల గురించి, సంజాయిషీ యివ్వాల్సి వచ్చింది. జమీందార్ల మీదకు రైతులను ఉసికొల్పి దౌర్జన్యాలకు కారకుడినైనానని, మద్రాసు ప్రధాన మంత్రి అయిన శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులైన డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య పంతులుగారు, ఈ ఉభయులు విశ్వసించినట్లుగానే నేను కాంగ్రెస్ నుంచి బైటపడతానని, ఆంధ్ర కాంగ్రెవర్గాలలో కొన్ని ప్రబలమైన వదంతులు బయలుదేరినవి.

నాకు బాపూ పిలుపు వచ్చింది. సుభాస్ అంతకుముందే అక్కడవున్నాడు. "రాష్ట్రపతిరాక ఏమైనా అభ్యంతరకరమా" అని ఆయన నన్ను అడిగినాడు. "లేదు — ఆయన సమక్షాన్ని నేను ఆహ్వానిస్తున్నా" నని నే నన్నాను. క్రమంగా ఆయన చర్చలు పొడిగించి నా ఉపన్యాసాల ప్రసక్తి తెచ్చి, "అవి నీవే చేసివున్నట్లయితే పరిస్థితి అంధకారబంధురంగా వుంద" న్నాడు. సుభాస్‌బాబు జోక్యం కల్పించుకుని, "ఒకవేళ అందిన భోగట్టా సరైనది కాకపోవచ్చు; లేక సి. ఐ. డీ. లు దాన్ని తయారు చేసి వుండవచ్చు" అని అన్నాడు. "రైతులు భోగట్టా నిచ్చే విషయంలో అంత ఖచ్చితంగా వుండకపోవచ్చు. అయితే అటువంటి జాగ్రత్త తీసుకునే విషయంలో నేనపుడు తయారుగా లే" నని చెప్పాను. అప్పుడు బాపు "పరిస్థితి అలావుంది" అన్నాడు. అందు కాయనతో ఏకీభవిస్తూ "నేను చెప్పింది, చేసిందంతా

కూడా రైతుల సాంప్రదాయ సిద్ధమైన అహింసా విధానంతో ఉన్నద" ని సమర్థించుకున్నాను. అప్పుడు సుభాష్‌బాబు "అయి నట్లయితే ఆ ఉపన్యాసాలు ఆమోదించబడినవి. దౌర్జన్యో(ద్రే కాలకు గురిచేసింది అనే ఫిర్యాదు రద్దుపర్చబడింది" అని చెప్పాడు. "అలానే కావచ్చు; అయితే ఒకరైతు ఒక దొంగను కానీ, దోపిడీగాడిని కానీ, రౌడీని కానీ, సమాజ ద్రోహినికానీ కాళ్ళుచేతులు బంధించి సమీప పోలీసుస్టేషనుకు అప్పగించటం దౌర్జన్యపూరితమైన చర్యగా బాపు ఎన్నడూ భావించడని నేను నమ్మాను". వెంటనే బాపు "అది కాంగ్రెస్ ఉద్దేశ్యం కాదా?" అని అడిగాడు. అయినప్పుడు "కిసాన్ ప్రజలు ఆ అహింసా ధోరణినే అనుసరించారు. ఒకవైపున వారి నాయకులను చావ మోదుతూంటే, కార్యకర్తలను కాల్చివేస్తుంటే, స్త్రీలను అవ మాన పరుస్తుంటే నోరుకట్టేసుకుని ఆచరణ సాధ్యంకాని, అహింసావాదాన్ని అనుకరిస్తూ, పుణ్యదినం కోసరం కాంగ్రెస్ నిరీక్షిస్తుందితే" అని నేను సమాధానమిచ్చాను. ఇదంతా పరిశీలిస్తున్న సుభాస్‌బాబు "అయితే మీ నిర్వచన ప్రకారం అహింసావాదం చైతన్యపూరితమైంది – శక్తిగలిగిందన్నమాట" అని అన్నాడు. ఈ అవకాశాన్ని తీసుకుని "గాంధీజీ అమలు పెడుతున్న చైతన్యపూరితమైన, శక్తివంతమైన అహింసావాదం అటువంటిదేనని నేను హృదయపూర్వకంగా నమ్మాను" అని అన్నాను. గాంధీజీ బిగ్గరగా నవ్వటం ప్రారంభించాడు. తుదకు నేను వెలుగులో వున్నట్లు భావించుచున్నాను. "రంగా అన్నిట్లో వున్నాడ" ని బాపూ నవ్వుతుంటుంటే ఆయనతో

పాటు సుబాస్‌బాబు నేనుకూడా కలిశాం. ఈ విధంగా నా మీద తేబడిన అభియోగం అంతమైంది.

సేవాగ్రామ మందు ఆ సాయంత్రం తిరిగివచ్చే సందర్భంలో సుబాస్‌బాబు నేను ఒకే కారువైపుకు నడిచిపోతున్నపుడు, గాంధీజీ సమక్షంలో యధార్థాన్ని గురించి యిచ్చిన సంజాయిషీకి, ఆయన ఎంతో తృప్తిపడి బాపూ సమక్షంలో అలా చెప్పి ఒప్పించగలిగినటువంటి వారిని బహుకొద్దిమందిని మాత్రమే చూచాను, అని తన సంతృప్తిని ప్రదర్శించాడు. మేమే నిజమైన గాంధేయ భక్తులమని నాటకమాడుతున్న మితవాదుల ఆటలను అరికట్టేందుకు, తాను చేసే ప్రయత్నాలతో పూర్తిగా సహకరించమని కూడా కోరాడు. ఆ మరుసటి రోజు తేనీరు తీసుకుంటున్నప్పుడు, తాను నేషనల్ ప్లానింగ్ కమీషన్ స్థాపించినందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నాయకులు యెంతగా అసంతృప్తి పొందారో, ఈ సందర్భంగా కోరకుండానే జవహరిబాబు, నేషనల్ ప్లానింగ్ కమిటీలో చేరి దానికి అధ్యక్షుడుగా వ్యవహరిస్తూ తనకు ఎలా మద్దతిస్తున్నాడో, ఆ విషయాలన్నీ చెప్పాడు. అప్పుడు ఆయనకున్న బలాన్ని నేను గుర్తించగలిగాను. బలీయమైన మితవాదుల బారినుండి నాబోటి సన్నిహిత మిత్రులను ఎలా కాపాడేదానికి నమ్మకమైన ప్రయత్నాలు చేశాడో, ఆంతరంగిక విశ్వాసాన్ని చూపెట్టాడో తనతో సహకరించేదానికి – సన్నిహిత మైత్రికి నిష్కపటమైన ఆహ్వానాన్నిస్తున్నాడో, ఆధోరణినిబట్టి సుబాస్‌బాబు, నిరంతరం అభివృద్ధి అయ్యే మిత్రుల సన్నిహితుల సంఖ్యను పెంచుకోగలుగుతున్నాడు. బాపూ దగ్గరవున్న ఏ కాంగ్రెస్ నాయకుని

కంటే కూడా ఆయనకు నేను అత్యంత సన్నిహిత మిత్రుడుని అయిపోయాను.

1939 బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశానంతరం, అఖిలబర్మా కూలీ మహాసభకు అధ్యక్షత వహించే నిమిత్తం, కాంగ్రెస్ నూతన నియమావళిని ఎదిరించ టానికి వేసుకున్న పథకం ప్రకారం, నేను సహకరించటం సాధ్యం కాక పోవచ్చునని, సుబాస్‌బాబుకు తదితర మిత్రులకు ప్రయాణ మాతూ చెప్పాను. ఆ కార్యక్రమంలో నేను భాగస్తుడ్ని కాలేక పోయినపుడు దానిమీద నాఅభిప్రాయాన్ని వివరించే విషయంలో కూడా నా అశక్తతను ఒప్పుకున్నాను. అయితే సుబాస్‌బాబు మాత్రం మన పోరాటానికి అనుగుణ్యంగా నా బర్మా పర్యటన ఎంతగానో ఉపకరించగలదని కమిటీకి నచ్చజెప్పి, కమిటీ శుభా కాంక్షలను అందజేశాడు. దైవాంశ సంభూతులైన కాంగ్రెస్ వాదులుమాత్రం అంతగా తృప్తిపడలేదు. వాళ్ళు ఆ పరిస్థితుల్లో నేనేదో సుబాస్‌బాబు దగ్గరనుంచి ప్రత్యేకమైన సందేశాన్ని బర్మా రివల్యూషనరీపార్టీ నాయకుడైన బామాకు తీసుకు వెళు తున్నాననే అనుమానంతో నా బర్మా ప్రయాణానికి అసంతృప్తి పడ్డారు. అంతేకాకుండా నన్ను కాంగ్రెస్ నుంచి బహిష్కరించే సమయం కోసరం కూడా ఎదురుచూస్తున్నారు. నేను ఇండి యాలోనే గనుక వుండేట్లయితే అతివాద ఐక్యసంఘటనా సంస్థ యిచ్చిన కార్యక్రమం ప్రకారంగా వ్యతిరేక దినోత్సవం జరుపు తానని కూడా వూహించారు. ఆ తరువాత ఒక దేవత, అధి దేవతను సమీపించినపుడు, అధిదేవత ఆ దేవత నుద్దేశిస్తూ, "కాబట్టి పిట్ట మీ గూటిలోనే పొదుగుతుందా ?" అని ప్రశ్నిం

చగా, దేవత "లేదు పిట్ట బంగాళఖాత తీరాన్ననుసరించి, ఎగిరి పోయింద" ని చెప్పటాన్ని తరువాత నేను తెల్సుకున్నాను.

అతివాద ఐక్యసంఘటనా సంస్థలో నా మాదిరిగానే స్వామీసహజానంద, ఇందూలాల్ యాజ్ఞిక్ లతో కూడా ఆయన సహచర్యాన్నభివృద్ధి చేసుకోవటానికి ఎంతో సంతో షించే వాడు. నేను ఫార్వర్డ్ బ్లాక్ లో చేరక పోయినప్పటికినీ దాని కార్యవర్గ సమావేశాలకు రావల్సిందిగా సుబాస్ నన్ను బలవంత పెడుతుండేవాడు. కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు నా మీద తీవ్రమైన శత్రుత్వాన్ని వహించారంటే, మా యిరువురి మధ్యనున్న సన్నిహిత మైత్రే అందుకు కారణం. ఒక రోజున ఇద్దరు కాంగ్రెస్ అధిదేవతలు నే నెప్పుడు కాంగ్రెస్ నుండి బైటకు పోతానో ఆ విషయాన్ని గురించి తెల్సుకోవాలని కుతూహాల పడ్డారు. అప్పుడిది బాపూ అభిప్రాయమా అని నేను ప్రశ్నిస్తే, "ఈ మారు బాపూ కూడా నిన్ను రక్షించ లే" డని వారు నిష్కర్షగా సమాధాన మిచ్చారు. అప్పుడు స్వాతంత్ర్య సైనికులకు, వీరులకు కాంగ్రెస్ దక్కుతుంది కానీ, కొద్దిమంది ఉపదేవతలకు కాంగ్రెస్ స్వంత ముల్లెకాదని సమాధాన మిచ్చాను.

అటువంటి క్లిష్టభూయిష్టమైన, విషకలుషితమైన రాజకీయ వాతావరణంలో సుబాస్ బాబు, మాలోని చాలామందిమి జాతీయ స్వాతంత్ర్యం కోసరం నిరంతరాయంగా పనిచేసు కోవాల్సి వచ్చింది. ఒకవైపున బ్రిటీషువారు నిర్దాక్షిణ్యంగా మామీద దుముకుటకు సిద్ధంగా వున్నపుడు ప్రసిద్ధిపొందిన పలాస అఖిలభారత కిసాన్ మహాసభ జరిగింది. అనంతరం వారు

దయారహితంగా వ్యవహరించారు. మరొక వైపున కక్షసాధించాలని కాంగ్రెస్ దైవమ్మన్యులు, మేము అగౌరవ పర్చబడి రాజకీయంగా నామరూపాలు లేకుండా పోతే చూచి సంతోషించటానికి తయారుగా వున్నారు. ఇన్ని పరిస్థితుల్లోకూడా బాపూ చెప్పినట్లు "విపరీత ధైర్యంతో" బ్రిటీషువారి సవాల్‌ను ఎదుర్కొనేదానికి ఆమోదించాం. కష్టపడి పనిచేశాం. అయితే బ్రిటీషువారి ఉత్తర్వును ధిక్కరించేదానికి నిర్ణయించుకున్నపుడు బాపూవద్దనుంచి తాత్కాలికంగా, బ్రిటీష్ ఉత్తర్వుకు విధేయత చూపమని ఆయన కనీస కోరికగా, నాకొక ఆదేశం వచ్చినపుడు, అదినా జాతీయ ఆత్మగౌరవానికి ఒక గొప్ప అవమానంగా భావించాను. ఆ సందర్భంలోనే నిజమైన మిత్రుడుగా సుభాస్ బాబు ముందుకువచ్చి నేను జరుపుతున్నటువంటి పోరాటం గౌరవ ప్రదమైనదిగానూ పరిస్థితులకు అనుగుణ్యమైనదిగానూ వున్నదని ప్రజానీకానికి నచ్చచెప్పాడు. నాపరంగా నిలబడేందుకు రాజకీయ దూరదృష్టిని ప్రదర్శించే విషయంలో, సుభాస్ బాబుకు తప్ప మరింకెవ్వరికీ నైతిక ధైర్యం చాలకపోయింది. ఇటువంటప్పుడు ఆయనకన్న కలల ప్రకారంగా, ఆశయానుగుణ్యంగా తొలి తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వాధ్యక్షుడై, జాతికి నేత అయినప్పుడు, మా ఉభయుల మధ్యనున్న స్నేహధర్మరీత్యా దేశమంతటా వున్న మా సహచరులు కిసాన్ కార్యకర్తలు ఎంతో గర్వపడినారంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

సుభాస్ బాబు దీర్ఘప్రవాసానంతరం తిరిగి కలకత్తాలో కనుపించినపుడు 1938వ సంవత్సరంలో కలకత్తా శ్రద్ధానంద

పార్కులో అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యాన జరిగిన రైతుమహాసభకు అధ్యక్షత వహించే అవకాశంకూడా నాకు కలిగింది. 1938 వ సం॥ మార్చి మాసంలో హరిపురా రైతు యాత్ర సందర్భంలో నేను అధ్యక్షతవహించినపుడు, కిసాన్‌వాదు లందరూ కాంగ్రెస్‌లో చేరి భారత స్వాతంత్ర్యోద్యమాన్ని బల పర్చమని ఆహ్వానించాడు. సి. ఆర్. దాస్ నడిపినటువంటి "ఫార్వర్డ్" అనే దినపత్రిక పేరు సార్థకం చేసేనిమిత్తం "ఫార్వర్డ్ బ్లాక్" అని తన పార్టీకి నామకరణ చేయుమని నేనిచ్చిన సల హానుకూడా ఆయన సహృదయంతో స్వీకరించాడు. నేను ఫార్వర్డు బ్లాకులో చేరకపోయినప్పటికీ, నా విప్లవ కార్యవిధా నంలో విశ్వాసముంచిన ఆయన 1939 సం॥లో బొంబాయిలో జరిగిన అఖిలభారత ప్రథమ ఫార్వర్డు బ్లాక్ మహాసభలో నన్ను ప్రారంభోపన్యాసం చేయమని ఆహ్వానించాడు. యదార్థానికి మా మైత్రి ఎంత గాఢంగా వుండేదంటే, సర్దార్ వల్లభాయి కూడా నన్ను ప్రతీఘాతుకవర్గంలో ఒకడుగా భావించేంతవరకు. అయితే నేనెందుకు ఫార్వర్డు బ్లాక్‌లో చేరలేదు అని అంటే ఈ విషయంలో నేను సుబాస్‌కు స్పష్టంగా చెప్పాను. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య స్థాపన సాధ్యమైనంత త్వరలో జరిగే నిమిత్తం జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో సహకరించ దల్చు కున్నానని, ఆవిధంగా మన ప్రజానీకాన్ని బూర్జువాల-కార్మికుల నియంతృత్వాల బారినుంచి రక్షించాలని నేను వాంఛించాను. ఎంతకాలమైతే కాంగ్రెస్‌కానీ ఫార్వర్డు, బ్లాక్‌కానీ అటువంటి స్వరాజ్యానికి హామీ యివ్వలేకున్నారో, పోగా—స్వరాజ్య భారతదేశంలో పెత్తనం ఎవరికి సంక్రమింపజేయ దల్చు

కున్నారో, అనే ఆ విషయాలను గురించి ఆలోచించితే; కిసాన్ ప్రజానీకానికి ఎక్కడా దరీదిక్కు కనుపించదు. సుభాస్‌బాబు బాపు ఉభయులూ నే ననుసరించే సక్రమ విధానాన్ని, దీని నైతిక పునాదిని క్రమంగా గ్రహించారు. కాబట్టి జాతీయ స్వాతంత్ర్య సాధనా నంతరం, న్యాయమైన సామాజిక విధానాలు కాంగ్రెస్ అమోదించేదానికి సిద్ధంగా వుందని, బాపు దానిచేత ఒక ప్రకటన చేయించాడు. రైతుకూలీలు రాజ్యాధికారాన్ని చేబట్టే విషయంలో తన కభ్యంతరం లేదని ప్రకటించే దానికి సుభాస్‌కూడా సిద్ధపడ్డాడు. అయితే దేశభక్తియుతమైన, స్వార్థత్యాగ పూరితమైన మధ్యతరగతుల మాటేమిటని ఆయన విస్తుపోయాడు. నేమీా విషయంలో ఒక సంయుక్తాభిప్రాయానికి వచ్చేలోపలనే, నిర్మాణరహితమైన ఏప్రియల్ పోరాట సందర్భంలో ఆయన బంధించబడ్డాడు. అదే సందర్భంలో వివిధ రాష్ట్రాలలోని ఖైదీలను కల్పుకునే నిమిత్తం ఒక జైలునుంచి మరొక జైలుకు ప్రయాణంచేస్తూ, వివిధ భారత విప్లవ తరగతుల న్యాయమైన క్రమబద్ధమైన హక్కుల గురించి పునరాలోచన చేయవలసిన అవస్యకతను గుర్తుకు తెస్తున్నను. తుట్టతుదకు మామధ్య రైతుకూలీ కళాకారుల బుద్ధిజీవుల ప్రజాస్వామిక రాజ్యానికి సంబంధించిన నిర్వచన విషయంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఆసందర్భంలో సుభాస్ మాతో కనుక వున్నట్లయితే, ఆయన మా యీా సంయుక్తాభిప్రాయంతో ఏకీభవించేవాడని నిస్సందేహంగా అనుకున్నాం. దీన్ని స్పష్టమైన రాజకీయ ప్రకటనగా బహుళ ప్రచారంలో పెట్టేందుకుగాను, ఈ విధానాన్ని "కిసాన్ మజ్‌దూర్ ప్రజా

రాజ్యం" అన్నాము. ఈ ఆశయాన్ని బాపూముందు పెట్టి ఆయనకు లోతుపాతుల్ని చక్కగా వివరించి నేను ఆయన ఆశీస్సులు యివ్వమని కోరాను. 1942 ఏప్రియల్ మాసంలో తన మనసుకూడా ఈ విధానానికి అనుకూలంగా వుందని అయితే, తనమట్టుకు తాను అటువంటి రాజకీయ నినాదానికి రాజకీయంగా కట్టుబడలేనని ఒక హామీయిచ్చాడు. అదృష్టం దాన్ని వరించే కొలది 1942 ఆగష్టుమాసంలో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, స్వరాజ్య భారత దేశంలో రాజకీయాధికారం సాధారణంగా కష్టజీవులైన పొలాలలోని రైతులకు కర్మాగారాలలోని కూలీలకు తదితరంగా వున్న ప్రజలకు సంక్రమించాలని తన పాలసీగా ఒక ప్రకటన చేసింది. ప్రజాస్వామిక వాదులమైన మేం, జాతీయ నాయకులైన గాంధీజీ–నేతాజీ–నెహ్రూ–సర్దార్‌లతో భుజంభుజం కలిపి పనిచేసినందుకు మా కది ఘనవిజయంగా భావించుకున్నాం. జాతీయ మనస్తత్వంతో వున్న మాయీ ధోరణిని నేతాజీ ఎంతగానో ఇతరు లందరికంటే అధికంగా గౌరవించేవాడని నా వరకు నేను అభిప్రాయ పడ్డాను.

ఈ జీవితగాధ శ్రీ కుమార్‌గారు తన స్వంత ధోరణిలో ఉత్సాహవంతంగా వ్రాశారు. భారతదేశం స్వరాజ్యం పొందిన తరువాత ఈ ప్రముఖ భారత వీరపుత్రుని మహోన్నత జీవితాన్ని ఆదర్శంగా పెట్టుకుని, చైతన్య ప్రపూరితులైన అసంఖ్యాక ప్రధాన యువకులలో ఈయన ఒకడు. సుభాస్ నిర్వచించిన సేవాతత్వంతో చూపెట్టిన సహసమార్గంలో పతాకాన్ని నిరంతరం ఎగిరించాలని సాంప్రదాయం కలిగిన సుశిక్షిత

యువక బృందంతో, ఈయనకూడా చేరాడు. మన జాతీయ స్వాతంత్ర్య పోరాటసందర్భంలో కాంగ్రెస్ ప్రదర్శించిన అసమాన ధైర్య సహసాలను ఈయన చక్కగా చిత్రించాడు. స్వాతంత్ర్య యుద్ధంలోని సహసకృత్యాలమీద ప్రత్యేకంగా ఈయనదృష్టిని కేంద్రీకరించి పూజ్యమైన నేతాజీ ప్రధాన జీవిత విశేషాలను మనమనసుకు హత్తుకు పోయేలా చేశారు.

సుబాస్ నేతగా నిరూపించుకుంటున్నపుడు ఒక ధైర్య సహసాలు కలిగిన యువ ఉద్యోగి నేతాజీ అడుహాజ్ఞలలోనికి వెళ్ళాడు. ప్రాజాస్వామిక కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య ఆశయం ఆయన్ను ఆకర్షించినందుకు అది నా అదృష్టంగాభావించు కుంటున్నాను. అతడే వెనుకటి బ్రిటీషు సేనలో ఒక లెఫ్టినెంట్‌గానూ ఆజాద్ హింద్ ఫౌజులో ఒక కెప్టెనుగానూ ఉన్న శ్రీ అప్పారావుగారు యూరప్‌లో అ. హిం. ఫౌ. ను నేతాజీ సమీకరించుతూ వున్నప్పుడు నేతాజీతో అనేక సందర్భాలలో మాట్లాడాడు. బ్రిటీషు శక్తిని ధిక్కరించాడు. దేశాంతర జైళ్ళనుండి విడుదల పొందిని తరువాత కిసాన్ ఉద్యమానికి తనకు తానుగా అంకితమై దేశంలో తనమిత్రులతో సహచరులతో చేతులు కలుపమన్న నేతాజీ సలహాలను పాటించాడు. నేతాజీని గురువుగా భావించుకున్న ఏకలవ్యుడైన శ్రీ కుమార్ కూడా రైతుకూలీల ప్రతినిధి సంస్థ అయిన, రైతుకూలీ ప్రజారాజ్య ఆశయాన్ని సాధించ దల్చుకున్న, కృషికార్ లోక్ పార్టీలో చేరటానికి నిర్ణయించుకుని నేతాజీని గౌరవించే అనుచర బృందానికి ఇది సరైన మార్గమనికూడా ఈయన అభిప్రాయ పడ్డాడు.

ప్రగాఢమైన ఆత్మ విశ్వాసంతో, ఊహా ప్రపంచంలో ఎంతో సహాసంతో గాంధీ నేతాజీలు నిర్వహించిన వీరత్వాన్ని సేవాపరాయణత్వాన్ని ఆదర్శంగా పెట్టుకుని నేను సాగిస్తున్న కృషి, పోరాటం మన ప్రజానీకానికి నూతన ఉత్సాహం, ఉత్తేజం సంక్రమింపచేయ గలవని ఆశిస్తున్నాను.

కాంగ్రెసువారు చాల అరుదుగా తాపీగా దైనందిన రాజకీయ జీవితంలో నేతాజీ పునరాగమనాన్ని గురించి ఆలోచిస్తుంటారు. ఎందుకంటే ఆయ నొక్కడే సమర్థమైన ప్రతి పక్షాన్ని సృష్టిస్తాడనే భయం వారికి వుంది.

మన మిప్పుడు స్వతంత్ర భారతదేశంలో నివశిస్తున్నాం. అధికార ప్రతిష్టల కోసరం ప్రాకులాడే అధునాతన దైవాంశ సంభూతులు కూడా మన కిప్పుడున్నారు. ఇప్పుడిదే మాత్రం పరాయి ప్రభుత్వం కాదు. లేక దాన్ని 1946 కు ముందు మాదిరి ముక్తసరిగా ఎదుర్కొనే ఆవశ్యకతకూడా కనుపించదు. ప్రస్తుతం ప్రభుత్వంమీాద తిరుగబడటానికి తగిన సమయంకాదు. యుదార్థానికి అధిక సంఖ్యాకులు ఈ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేశారు.

అయినప్పటికీ మన యువకులు తిరుగుబాటుదారుల వైపు విప్లవకారులవైపు ఎందుకు ఆర్రులు చాచారు? లేక ప్రభుత్వ వ్యతిరేకుల వైపు ఎందుకు దృష్టిని ప్రసరిస్తున్నారు. అధిక సంఖ్యాకులు ప్రభుత్వానికి తంధానతాన అని తాళం వేస్తుంటే వీరు వారితో ఎందుకు మేళవించలేకపోతున్నారు? దీని కంతటికీ కారణం యువకుల్లో సహాసకృత్యాలను సమ

ర్థించేతత్వం ప్రభలివుండి, ఆ సహసకృత్యాలకు చెల్లించవలసిన మూల్యం ఎంత అనే విషయంలో వారికి నిమిత్తం లేకపోవటం, సమాజస్థాయి, రాజకీయ అధికారం, స్థిరపడిన నైతికపంథాలు ఎదుర్కోవలసిన సవాల్, ధైర్య సాహసాలు కలిగిన యువకులను ఎప్పుడు ఆకర్షిస్తుందో, ప్రపంచంలో కానీ లేక ఒక దేశంలో కానీ మానవత్వంలోని ఏదో ఒక భాగానికే, సామాజక స్వభావ విషయంలో, ఆశయాలు – సిద్ధాంతల విషయంలో మరో సహసధోరణిని రూపొందించి, ఆవిధంగా మార్గదర్శకులు అయ్యే అవకాశం వుందా ?

భయంకరమైన 1943–45 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశానికే ఆయన స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టి వుంటే ఆయన ఏధోరణిలో ఏ కార్యక్రమాన్ని సాగించ సహచించేవాడు ?—గర్వకారణంగా ఆయన కాంగ్రెసును పునరుద్ధరించేవాడా ? పునర్జీవం పోసేవాడా ? లేక ప్రతిపక్షాలను సంఘటితపరిచేవాడా ? అనే ఈ విషయాలు నేటి స్వరాజ్య భారత విజ్ఞాన యువజన సమాజంలోని ఉత్తేజకరమైన భావాలు. ఏది ఏమైనప్పటికీ వీరు నేతాజీ చర్యల్ని సమర్థించుకుంటూ సన్నిహితంగా వుంటున్నారు.

భారతభూమిలో ఆయన ఆంతరంగిక సహచర బృందంలోని సభ్యులుగా, ఆయన తుది కార్యకలాపాలు సాగిస్తున్న సందర్భంలో చేరిన; అంటే జాతీయ స్వాతంత్రాన్ని సాధించే నిమిత్తం దేశాంతగాన వున్న భారతీయులు – ఇతర రాజ్యాల సహకారాన్ని తీసుకోబోయేముందు ఆయనతో కలిసి పనిచేసిన వారు, ఈ పరిస్థితుల్లోనే కనుక ఆయన దేశంలో వున్నట్లయితే

ఏ విధంగా వ్యవహరించి వుండేవాడో ఊహించలేకున్నారు. అయినప్పుడు వారిలోవారికి ఏర్పడిన అభిప్రాయ భేదాలవలన కొంతమంది కమ్యూనిస్టులవైపు పోతుంటే, లేక వారికి సమీపంగా చేరుకుంటుంటే, మరికొంతమంది ప్రజాసోషలిస్టు పార్టీలో చేరుతుంటే, ఇంకా కొంతమంది తిరిగి కాంగ్రెస్‌లో కల్సిపోతుంటే, శ్రీ కుమార్ లాంటి కొద్దిమంది కె యల్. పి లోకి వస్తున్నారు. సుభాస్ బాబు ఈ దేశంలోగనుక వుండటం సంభవిస్తే 1947 సం॥ అనంతరం సుభాస్ బాబు ఏధోరణిలో తన కార్య విధానాన్ని సాగించివుండేవాడో ఎవరు ఊహించి చెప్పగలరు.

అనేక మందిప్రభుత్వంలోనూ రక్షక దళాల్లోనూ ఆ.హిం. ఫౌజులోనూ ఉన్న చురుకైన నాయకులు లక్ష్య సాధనా విషయాలలో ఆయనచూపే పట్టుదలకు సన్నిహిత స్నేహభావాలకు ఆత్మవిశ్వాసాన్ని పొందగలిగిన ఆయన అద్భుత శక్తికి ముగ్ధులై వివిధ విధాలైన దేశభక్తులుగా మారిన భోగట్టా నాకు క్రమంగా తెలిసింది.

తన హృదయంలోని లక్ష్య సూటిమార్గాల్ని ఇతోధికంగా అభివృద్ధి చేయగల విషయ మేదైనావుంటే దాన్ని సాధించేటందుకు తనశక్తినంతా కేంద్రీకరించి పోరాడుతాడు అన్నదానికి. ఒక విధంగా అనేకమందికి కష్టం కల్పించినప్పటికి కాంగ్రెస్ అధ్యక్షుడుగా తనపునరెన్నికకు సంబంధించిన నిదర్శన మొక్కటేచాలు. అదేమాదిరిగా అవసరమొచ్చినపుడు తృణప్రాయంగా పదవుల్ని త్యజించి బైటకు రాగలడనేందుకు, ఆ అధ్యక్షస్థానం, స్వాతంత్ర పోరాటాన్ని పురోగమింప చేసేందుకు

ఇ కేమాత్రం ఉపకరించ లేదని అభిప్రాయపడి మహాసంతోషంతో ఆ మహోన్నతపదవిని మందహాసంతో వదలివేసి దైవాంశ సంభూతులు, ఆశీనులైన సభావేదికను దిగి అత్యున్నత సన్నిహిత మైత్రి సూచకంగా నా ప్రక్క నేవచ్చి కూర్చుని ఆఫీసు నిర్వాహకులను–సమావేశకర్తలను–అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గాన్ని విస్తుపోయేలాచేయగలిగిన శక్తికూడా ఆయనలో వుంది.

ఇంకొక్క మాట. సన్నిహితమైత్రి చక్కని వ్యక్తిత్వం ఉత్తేజిత పూరితమైన సందేశం మూర్తీభవించిన ఆ నేతాజీని గొప్ప సహచరుడుగా నాయకుడుగా శ్రీ కుమార్ నాకు గుర్తు చేస్తున్నారు. ఇంతటి ఘనతవహించిన భారత విప్లవ వీరుని మహాశక్తిని గురించి గత అనుభవాలలోకి దృష్టిని మళ్ళించేలా – అలా ప్రజల్లో నా సంబంధాలను గురించి చెప్ప గలిగి నట్లుగా శ్రీ కుమార్ తోడ్పడినందుకు నా హృదయపూర్వకమైన కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.

| | |
|---|---|
| భారత రైతాంగ విద్యాలయం<br>"విప్లవవాదుల పరిశోధనాలయం"<br>(అని నేతాజీ నామకరణ)<br>నిడుబ్రోలు | జైహింద్<br>రంగా<br>1—3—54 |

# విప్లవాధ్యక్షుడు

## దేశభక్తుడు

**బెంగాలీ బాబులు** : భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో, భారత రాష్ట్రాల్లోకెల్లా బెంగాల్ ప్రముఖస్థానం ఆక్రమించుకుంటుంది. అది భారతజాతీయ కాంగ్రెస్ పునాదుల్ని బలపరిచే విషయములోనే కాక దేశస్వాతంత్ర్య పోరాటాలకు కావలసిన బలసంపత్తుల్ని అమితంగా, అధికంగా ప్రసాదించి కూడా తన ప్రముఖపాత్రని ఋజువు పర్చుకుంది. భారత దేశంలో అసలు జాతీయోద్యమాల్ని పురికొల్పిన మార్గ దర్శకులు ఈ రాష్ట్రవాసులని పిలువటం సహేతుకంగా వుంటుంది. చూపులకు ప్రశాంత మనస్కులుగా, సాధువులుగా, ధాతలుగా, వేత్తలుగా వారు కనిపిస్తారు. కానీ వాస్తవానికి ఘన ప్రవర్తనకల్గిన ధీరోదాత్త దేశభక్తులు. వారు తమ మాతృభూమికి అర్పించవలసిన అత్యున్నత త్యాగాలకు ఎన్నడూ దూరంకాలేదు. సామాన్యంగా స్వాభావికంగా వారు వుద్రేకులు; కొంచెం రౌద్రపూరితులైతే చాలు— బాంబులు, రివాల్వర్లతో చెలగాట మాడుతారు. ఈ తెలివిగల

చురుకైన, నిర్భాగ్య, అదృష్టరహిత బాబులు దేశం కోరుతుందని భావిస్తే సహసస్ఫూరిత హింసాత్మక చర్యలు జరుపటాన్ని ఎన్నడూ నిరశించలేదు. బెంగాల్ గవర్నర్ సర్ జాన్ ఆండర్సన్ "వారి మాతృభూమికి బెంగాలీజాతి అత్యధిక ప్రేమతో సహజంగా అర్పించేది వుడుకురక్తం" అని చక్కగా అంగీకరించాడు. వారు మతవేదికల పైనుంచైనా హింసను ప్రభోదిస్తూ, పత్రికల్లో రౌద్రాన్ని రేకెత్తించే భాషని ప్రయోగిస్తూ వెంటనే బాహాటంగా నిర్భయంగా కార్యక్రమం కొనసాగిస్తారు.

బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్, దేశబంధు సి. ఆర్. దాస్, జె. యమ్. సేన్ గుప్త, తుదకు సుభాస్‌చంద్ర బోస్ వంటి గొప్పనాయకుల్ని ఆరాష్ట్రం కాంగ్రెస్‌కు బహూకరించినందుకు దానికి దేశం ఋణపడివుంది.

సుభాష్ చంద్రబోస్ జన్మతః విప్లవతత్వానికి హేతువైన కొన్ని ప్రత్యేక ప్రాంతీయ ఆచారాలు, అలవాట్లు, అభిరుచులు దేశ పరిస్థితులు కొద్దిగా ఇవే అనవచ్చు.

**బోస్ పుట్టుక** :— ప్రస్తుత ఒరిస్సా రాజధాని అయిన కటక్‌నగరంలో సుభాష్‌చంద్రబోస్ 1897 వ సంవత్సరం జనవరి 23 వ, తారీఖున ఉద్భవించాడు. కటక్‌నగర పురపాలకసంఘానికి, జిల్లాబోర్డుకు చాలాకాలం వరకూ అధ్యక్షుడుగానున్నా, న్యాయవాదంలోని అఖండ మేధాసంపత్తి శక్తి స్తోమతలకు తగినట్లుగా న్యాయవాద సమూహనాయకుడుగానూ, పబ్లిక్ ప్రాసి

కల్యాటర్‌గానూ,పనిచేసిన రాయ్‌జానకీనాద్‌బోసు * బహద్దూర్ ఆయన తండ్రి. అతి సామాన్య అలవాట్లతో, తన బిడ్డల్ని కూడా అదేవిధంగా పెంచే విషయంలో అమితశ్రద్ధ తీసుకున్న ఒక శుద్ధ ఆచారబద్ధమైన శ్రీమతి ప్రభావతీబోస్ ఆయనకుతల్లి. సుబాస్‌కు ఆరుగురు అక్కా చెల్లెళ్ళకు తోడుగా ఏడుగురు అన్నతమ్ములుకూడా వున్నారు. వీరందరూ డాక్టర్లుగా పుర పాలక సంఘ సభ్యులుగా న్యాయవాదులుగా ఆయాపనులలో వారంతటవారే స్థిరపడిపోయారు. వారిలో ఒక్కరు తప్ప మాత్ర దేశానికోసరం బాధ పడినవారు లేరు. అన్న తమ్ములందరిలో చిన్నతనం నుంచీకూడా శరత్ చంద్రబోస్ సుబాస్‌ను అధిక ప్రేమతో చూచేవాడు. బాల్యంలోకూడ గత జీవితంలో వలె అన్ని సందర్భాల్లో ఒకరి కొకరు అండగా నిల్చున్నారు. కనీసం, ఈ మధ్య అధ్యక్షస్థానపు గడిబిడ సమయంలో — దేశ నాయక బృందమంతా పూర్తి అనాదరణతో బోస్‌ను గౌరవిస్తున్నపుడు — బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడుగా వున్న ఆయన జ్యేష్ఠ సోదరుడు శ్రీ శరత్ చంద్రబోస్ గొప్ప సహచరుడుగా ఋజువుచేసుకుని సంయుక్తంగా ఆ చారిత్రక విభజనని ఆ సోదరులు పంచుకున్నారు.

ఆయన అనేకసందర్భాల్లో చెప్పినట్లు చిన్నతనంలో చేయలేక పోయినా, ఆరోజుల్లో ఇంకా ఎంత అధికమైన శక్తి ఆయనలో మరుగుపడివుందో ఎవరూ గ్రహించలేదు. ఆ

* ప్రభుత్వం శాసనోల్లంఘన రోజుల్లో అనుసరిస్తున్న నిర్బంధవిధానానికి నిరసనగా ఆ బిరుదును పరిత్యజించాడు జానకీనాద్ బోస్

సుభాస్ చంద్రబోస్ ఒకప్పుడు భారతదేశంలోని బ్రిటీషు సర్వాధిపత్యానికి మరుపుకురాని ప్రభల శత్రువౌతాడని నిరంకుశ వాదపు ప్రాతినిధ్యం వహించిన రచయితలలో ఎవరూ ఆయన భావి జీవితాన్ని గురించి వూహించలేక పోయారు.

**ప్రాధమికవిద్య :**— సుభాస్ చంద్రబోస్ పాశ్చాత్య పద్ధతులతో మెరుగు పెట్టబడిన ఒక యూరోపియన్ ప్రొటెస్టాంట్ల స్కూలులో తన ప్రాథమికవిద్యని పూర్తిచేశాడు. అయితే తన దేశీయులందరికీ ఆ సమాన అవకాశం లభించలేదు. అనేక ఇతర అవసరాలతోపాటు భారతమాత బిడ్డలకు ఈ దేశంలో ఇది ఒక అలవికాని సమస్యగానేవుంది. సాంఘిక అలవాట్లు, కట్టుబాట్లు ఆ రూపంలో మనల్ని బంధించినయ్. సొత్తుయొక్క పంపిణీ అంత అసమత్వంగావుంది. మాధ్యమిక ప్రజానీకపు జేబులు అతిత్వరగా ఖాళీఔతున్నయ్. పెద్ద పెద్ద మిల్లుయజమానులు, భూస్వాములు వేసే ఎత్తుగడలు సూదంటురాళ్ళై వాటిని ఆకర్షిస్తున్నయ్. దేశంలోని ఆర్థిక పరిస్థితి, మన ప్రజానీకపు సాంఘిక, నైతిక, రాజకీయ జీవనంలో నెర్రెలు కొట్టటమే కాక, వారి ప్రత్యేక హక్కయిన, సక్రమ విద్యనుంచి కూడా దూరంచేసింది. మన పరిపాలకులచే వ్రాతలు వ్రాయబడి, అమలులోనికి తేబడిన విద్యా విధానపు లోట్లవలన, గొప్ప గొప్ప విద్యాలయాల్లో, బ్రహ్మాండమైన యూనివర్శిటీలలో, ధనవంతుల విద్యాలయాలన్నిటిలో, ధనిక సంతతికే ద్వారాలు తెరుచుకున్నయ్. కాని సామాన్య ప్రజలైన రైతుకూలీ పుత్రీ-పుత్రులకు అవి మూతపడినయ్.

అసలు ఘోరం ఏమంటే — ప్రపంచంలో సుద్దమొద్దులైనా అన్నివిధాలా, అన్నిరంగాల్లో ధనవంతుల పిల్లలే చదువుకు నేందుకు పూర్తి అవకాశాలు వున్నయ్. కానీ, నిజంగా తెలివి తేటలు వున్న రైతాంగంలో కనీసం వారిపిల్లలు ప్రాథమిక విద్యనైనా అభ్యసించే అవకాశాలు సహితం వృగ్యం. సాధారణంగా భారతదేశంలో "లాగ్ కాబిన్ నుంచి వైట్‌హౌస్" వరకు — అణగారిన తనం నుంచి, డౌనింగ్ వీధి కార్యాలయాల్ని, ఆక్రమించుకునేంత వరకూ — వ్యక్తులు తయారౌతారని మనం వ్రూహించుకోవటానకి, మన పాలకులు చూపే సవతితల్లి ప్రేమవలన, ఆస్కారం లేదు.

ఈ బడిలో తన ఏడేళ్ళలోపు విద్యను పూర్తిచేయటంతో ఈ కథ ప్రారంభమౌతుంది. తదుపరి "రావనేషాకాలీ గేట్‌స్కూలులో" చేరాడు (1913.)యూనివర్సిటీ మొత్తంలో రెండవ స్థానంలో ఈ విద్యాలయం నుంచి తన మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ప్రత్యేక తరగతుల్లో, విద్యాలయాల్లో విలాసతను ప్రదర్శించే విద్యార్థులు ఈ రోజుల్లో సాధారణంగా ప్రతిభను సంపాదించాలంటే ఉన్న అవకాశాలు బహుకొద్ది అనిచెప్పాలి. కాబట్టి ఆయన విజయం కేవలం తెలివితేటల మీాద ఆధారపడింది.

ప్రపంచంలో భావి జీవితంలో అత్యున్నత స్థానాల్ని పొందగలిగిన వేత్తల్లో చాలమంది, వారి ఉయ్యాళ్ళనుంచో లేకపోతే విద్యాలయపు మేజాబల్లల నుంచో, చైతన్యోత్సాహాల్ని ప్రదర్శించారు.

ఒకే చేతిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న శ్రామికజీవికి ఉద్భవించి, ఉన్నతపదవిని అధిష్ఠించిన ప్రముఖ – అమెరికా సంయుక్తరాష్ట్రాల, అధ్యక్షుడైన అబ్రహాంలింకన్, అంతటి గొప్పతనాన్ని పొందాడంటే అతని తల్లి గంటల పర్యంతరం ప్రపంచ దేశభక్త వీరోచిత కథల్ని చెప్పినందువలన; ఆ యా దేశవీరులు దేశక్షేమానికి రక్తాన్ని, జీవితాన్ని ఎలా ధారపోశారో ఆ విషయాలన్నీ అతని ప్రతి రక్తాణువులో ఇమిడిపోయి; స్వార్థరహితమైన దేశసేవ ఒక వ్యక్తియొక్క సుగుణాలన్నింటిలోనికి మహోన్నతమైంది. అనే సత్యాన్ని గ్రహించేట్లు చేసిన ఆ తల్లికి ఈ పుత్రుడు బాకీపడివున్నాడని భావించబడుతుంది.

అదేమాదిరి ప్రజ్ఞాధురంధర జగద్గురువుల శిష్యత్వం పొందిన విద్యార్థులు తదుపరి జీవితాల్లో వారియూహాయుక్తమైన ప్రపంచ నిర్మాణంకోసరం అనేక ఘనకార్యాలు సాధించిన వైనం చరిత్రలో కథానీకములై ప్రకాశిస్తుంది.

దేశభక్త ప్రపూర్ణుడైన వృద్ధోపాధ్యాయుడు వేణీబాబు ఆచారబద్ధమైన భక్తిపరురాలు తల్లి— వీరుభయగుణాలు సుభాస్ బాబుకు బహూకరించ బడినయ్. వీటన్నింటికి మించింది ఆయనలో చిన్నతనంలోనే కాక, తదుపరి జీవితంలో ప్రోత్సాహానికి, చైతన్యానికి కారకుడైన హేమునాద్ కుమార్ అనే ధీరమిత్రుని స్నేహం.

**హిమాలయాల్లో :—** 1913 సం॥ లో కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో తనకు ప్రవేశం లభించింది కానీ

చిన్నతనం నుంచీ ఆయనలో ప్రకాశిస్తున్న ఆశయాలు, వెంటనే కాలేజీ చదువుకు దూరంచేసినయ్. తన సహచర విద్యార్థుల మాదిరి కాక, ప్రముఖంగా ఆయన అభిరుచి వైజ్ఞానికంగా వుండేది. ఆయన అలసట యెరుగని ఆవేశ విద్యార్థి. వాస్తవానికి ఆయనకు అన్ని అవకాశాలు వున్నప్పటికీ, పుట్టుకతో ధనికుడైనప్పటికీ, భౌతిక వాదమంటే ద్వేషించి, తన పదమూడవ యేటనే మత సత్యాలకు విద్యార్థి అయ్యాడు.

భారత వీధుల్లో బాలురు పట్టణ అలవాట్లతో, అభిరుచులతో కేరింతలాడుతున్నపుడు ఏమాత్రం ఆత్మవిమర్శనా శక్తి అన్ని విషయాల్లో కోల్పోయి గుడ్డిగా తల్లిదండ్రుల అడుగు జాడల్లో భయభక్తులతో బళ్ళలోని విద్యార్థులు నడుచుకుంటుంన్నప్పుడు ఆ పసిప్రాయంలో ఈ బెంగాల్ బాలుడు తనగృహంలో ఒకమూలన కూర్చుని ఆత్మస్వేచ్ఛా విమర్శనా భావాల్ని మథిస్తున్నాడు. ఆయన తన పద్నాల్గవ యేట స్వామీ వివేకానంద అధ్వర్యాన నడుస్తున్న రామకృష్ణ పరమహంస సంఘాన్ని పరిశీలంచ ప్రారంభించాడు. పరలోక శాంతి — విముక్తి వుద్దేశ్యాలను దీర్ఘంగా పరిశీలించిన అనంతరం 1914 శీతకాలపు రోజుల్లో ప్రపంచసౌఖ్యాల్ని శాశ్వతంగా మర్చిపోవటానికి తన సుఖజీవనాన్ని వదలి, హిమాలయాలలోని అరణ్యహృదయ మధ్యభాగానికి వేదాంత వుపాధ్యాయుని వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆవిధంగా అపరబుద్ధుని మాదిరి మత పృథంతో వెనుకటి మహాఋషులు ఘనకార్యాల్ని సాధించిన మార్గంవైపు గృహాన్నివదలి వెళ్ళాడు.

సరిగ్గ ఈయుగపు ఘనపురుషుడు మహాత్మా గాంధీ జగద్విదితంగా తన సన్యాసత్వాన్ని స్వీకరించక ముందే, అయితే, యువబారిష్టరుగా డబ్బు సంపాదించే మార్గాన్ని వెతుక్కుంటూన్నపుడు; హ్యారో-కేంబ్రిడ్జి మైదానాల్లో మన యువ నెహూృఆటల్లో ఇంకా నిమగ్నుడై వున్నపుడు; రావుబహద్దూర్ బిరుదుతో జమ్నాలాల్ బజాజ్ ధనార్జనా కార్యక్రమంలో తీరికలేకుండా వున్నపుడు ఈ గొప్పసాధు తనగురు పూజకు అర్హుడైన వేదాంత వుపాధ్యాయుని ఏకాంత మనస్కుడై వెతుక్కుంటున్నాడు.

ఒక ప్రభుత్వ వుద్యోగిగా భవిష్యత్తులో భవ్యజీవితాన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతూ కలలు కంటున్న తల్లిదండ్రులు ఇతని అదృశ్యానికి నిశ్చేష్టులయ్యారు. అంతటితో చాలరోజుల వరకు కుటుంబశాంతి క్రమత్వం అదృశ్యమైనయ్. ఎముకల్ని సహితం కొరికివేసే ఆ భయంకర శీతాకాలపు రాత్రింబవళ్ళను చాలినన్ని బట్టలు, తిండి లేకుండా కేవలం ప్రకృతి సహజశక్తుల పైనే ఆధారపడి గడిపాడు.

కటిక చీకటిలో దొంగలూ దోపిడీగాండ్రుతప్ప సమస్త ప్రపంచం ఆ భయంకర రాత్రుళ్ళందు ప్రశాంత నిద్రావేసులై వున్న సందర్భంలో; పగలంతా పక్కలు మాడ్చుకొని ఆ నిశా రాత్రుళ్ళు తిండికై క్రూరమృగాలు వెతుక్కుంటూ వచ్చేసమయంలో; నదుల, సెలయేళ్ళ పతనఘోషతో వీచేగాలి, రక్తాన్ని సహితం గడ్డకట్టించే ఆ హిమాలయ ఆటవికగాలి, అలలలలుగా కరుడు కట్టిన హృదయాల్ని సహితం కరిగింపచేసే సమయంలో

సంచార అవకాశాలు లేని భయంకర ప్రదేశాల్లో ఈ బాలుడు ఏకాంతంగా తిరిగాడు. ఒక ప్రాంతంనుంచి మరో ప్రాంతానికి తిరుగుతూ ఇంద్రవనం, కాశీ, గయ మొదలైన ప్రాంతాల్లోని పురాతన హిందూ దేవాలయాల్ని దర్శిస్తూ, మొహాంతుల వ్యక్తిగత జీవనవిధానాల్ని అర్థంచేసుకుంటూ ఆరుమాసాలు తిరిగి తిరిగి, తుదకు; సాధారణ మానవులవద్ద నున్న నీతి నియమాలు కోల్పోయి భోగలాలస జీవితాల్ని గడుపుతున్న ఆ మొహాంతుల పద్ధతుల్ని చూచి నిరుత్సాహపడి తిరిగి స్వగృహానికి ప్రయాణమయ్యాడు.

ఆ కుటుంబంలోని మనసులన్నీ నాటకరూపం ధరించి నయ్. ఆకస్మికంగా ఆయన ఇంటిలోనికి అడుగుపెట్టినప్పుడు అందరూ చిత్ర ప్రదర్శన గదిలో [illegible] కూర్చుని వున్నారు. మొదటగా ఆయన [illegible] పూజ్యనీయమైన తల్లిని సమీపించి [illegible] గ్రహించాడు. ఆయన అదృశ్యంసపలం పనిచేసిన [illegible], తిరిగి ప్రత్యక్షమైనప్పుడు పెల్లుబికిన మాతృప్రేమ, రెండూ మిళితమై, ఆనంద భాష్పాలు కార్పించుతూ వున్నపుడు "సుభాస్, నువ్వు నన్ను చంపటానికి పుట్టావ్" అని ఆ మాతనొక అస్పష్టమైన కంఠంలో ఆ దీర్ఘ ఎడబాటును సహించలేక అన్నది. దైన్య వాతావరణంతో నిండివున్న ఆ చిత్రప్రదర్శనగది వెంటనే ఆనంద దృశ్యాలు ప్రసరింపచేసింది. ఆ కుటుంబ మంతటికీ ముద్దుమూర్తి అయిన సుభాస్ తిరిగి రావటాన్ని అది హర్షించింది. స్నేహితులు,

సహచరులు తమ ప్రేమపాత్రుని ఆహ్వానించారు. తల్లిదండ్రులు ఆ గారాబ బాబుని మన్నించారు.

**ఉన్నతవిద్య :**—సుభాస్ బాబును కేవలం ఆయనలోని మానసిక వేదనకానీ మరింకేమైనా ఇతర కారణాలు కానీ, ఇంటినుంచి బైటకు పంపించలేదు. ఒక నిశ్చిత సందేశాన్ని దృష్టియందు పెట్టుకున్న వుత్సాహపూరిత యువకుడాయన. తరువాత, అంటే 1915 సం॥ లో ఆయన తిరిగి వచ్చిన వెంటనే తన మిత్రుల్లో ఒకనికి "నేను రోజురోజు విమర్శించుకుని చూచుకుంటే నా జీవితంలో ఒక నిశ్చితమైన సందేశం ఇవ్వాల్సివుంది. దాని కోసరమే నేను ఈ శరీరాన్ని భరిస్తుంటే ఇటీవలి సమాజ వుద్దేశ్యానికి నేను బద్ధుణ్ని కాను. ప్రజలు మంచిచెడ్డల గురించి మాట్లాడ్తారు. ఇదే ప్రపంచపు లక్ష్యంకూడా. కానీ నా ఏకైక మానసిక దీక్ష దీనికి అనుబంధంగా వున్నప్పటికీ నేను దానిచే కదలించబడలేను" అని ఈ విధంగా వ్రాశాడు.

ఈ సహసిక యానం ఆయన ఆరోగ్యంలో మార్పు తెచ్చింది. ఏ లోటుపాటు లేకుండా జీవితాన్ని గడుపుతున్న ఆయన ప్రాణం ఆటవిక వాతావరణానికి తట్టుకోలేక పోయింది. ఈ కారణాన తిరిగి రాగానే జబ్బుపడి చాలాకాలం పక్క మీదనే వున్నాడు.

1915 లో జబ్బు నయమైన వెంటనే, తిరిగి కాలేజీలో చేరి అతి సులభంగా కాలేజీ చదువులో మొదటిభాగమైన యఫ్. ఎ. పూర్తి చేశాడు.

ఈ కాలేజీలోనే అప్పటి అఖిలభారత ట్రేడ్ యూని యన్ కాంగ్రెస్ అధ్యక్షుడైన డాక్టర్ సురేస్ బెనర్జీతో పరిచయం కల్గింది. అయితే బిరుదుకు సంబంధించిన చదువు మళ్ళీ ఒక సంఘటనతో ప్రారంభమైంది. బ్రిటీషువారి సామ్రాజ్య తత్వంలో అధికభాగం పంచుకుని గర్వించే మిష్టర్. సి. యఫ్. ఓటన్ ♦ అనే ప్రెసిడెన్సీ కాలేజీలో ఐరోపీయ ఆచార్యులలో ఒకడు భారత విద్యార్థులు చివరకు తిరుగబడేంత నీచంగా చూడటంతో ఈ సంఘటన ప్రారంభ మౌతుంది.

జాతీయ ఆత్మగౌరవాన్ని సుబాస్ అమిత ప్రాణంగా చూచేవాడు. ప్రారంభంలోనే ఈ ఆచార్యుని మొరటుభావానికి రౌద్రరూపం దాల్చాడు. ఒకరోజు ఓటన్ ఒక డిగ్రీ విద్యార్థి మొఖంమీద కొట్టి గర్వాన్ని ప్రదర్శించాడు. ఒక విశ్వవిద్యా లయంలో ఇది జరుగరాదని దుస్సాహసచర్య. వాస్తవానికి, ఆచార్యునిచర్య సహించరానిది, మన్నించరానిది ఈ ఆచార్యుని ప్రవర్తనకు సుభాష్ హృదయం బాధతో క్రుంగిపోయింది. ఇతర విద్యార్థులతో కలసి ఆయన రహస్య సమావేశాలు జరిపి, చివరకు – కాలేజీ నిబంధనల ప్రకారం – ఆ సంగతంతా ప్రవర్తించిన ఆచార్యునిపై ఏదొక చర్య తీసుకునేంత వరకు విద్యార్థులు సమ్మె సాగించాలనే నిర్ణయానికి వారందర్నీ బద్ధు లుగా చేశాడు. కాలేజీ కార్యవర్గం విద్యార్థులకు గౌరవ ప్రదంగా మధ్యవర్తిత్వం నిర్వహించేట్లు సమ్మె సుబోస్ అధ్య

♦ Director of public Instruction of Bengal.

ర్యాన నిరాటంకంగా కొనసాగింది. ఈ సంఘటన జరిగిన అనంతరం ఆచార్యుడు కొంతకాలం వరకు జాగ్రత్తగా మెలిగాడు కానీ, తన కుక్క బుద్ధిని మాత్రం పూర్తిగా మర్చిపోలేదు. తరుచుగా మరోమారు భారతీయ విద్యార్థుల్ని అగౌరవపరిచాడు. కుక్క కాటుకు చెప్పు దెబ్బగా కొందరు బెంగాలీ యువకులు—ప్రొ. ఓటన్‌ను చావచితక కొట్టారు. భవిష్యత్ క్రమవిరుద్ధతకు ప్రధానాచార్యుడు భయపడి కొంతమంది విద్యార్థులపై క్రమశిక్షణ చర్య తీసుకున్నాడు. ఎప్పుడూ కాలేజి విద్యార్థి బృందానికి నాయకుడై నడిపిస్తున్న సుభాస్ ఈ దెబ్బలాటకు, గలాటకు కూడా కారకుడని వాదుపెట్టారు. కలకత్తా యూనివర్శిటీ నుంచి ఈ కారణంచేత కాలనిర్ణయం లేకుండా తొలగించబడ్డాడు. ఆయనతోపాటు మరికొందరు కూడా తీసి వేయబడ్డారు.

ఆత్మగౌరవాన్ని సహజ ఘనతని పోషించుకోవటానికి ప్రయత్నించిన కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థులకు నాయకత్వం వహించాడు అనే నేరారోపణతో యూనివర్శిటీ నుంచి రెండేళ్ళవరకు చదువటానికి వీలులేకుండా తొలగించబడిన ఈ చిన్న నాయకుడు, ఒకానొకప్పటికి తన భావి జీవితంలో స్వయంనిర్ణయాధికారం కోసరం, సంపూర్ణస్వాతంత్ర్యం కోసరం, పోరాడే తన దేశ ప్రజలకు నాయకత్వం వహించినందుకు జైలు వూసల వెనుక, అల్లంతదూరాన అండమాన్‌కు తుల్యమైన బర్మాజైలు చీకటి గదుల్లో నిర్బంధించ బడతాడని ఆరోజు ఎవరూ వూహించలేదు.

రెండేళ్ళ వ్యవధి జరిగిపోయిన తరువాత 1917 లో సర్ అసుతోష్‌ముఖర్జీ సహాయంతో తిరిగి కలకత్తా స్కాటిష్ చర్చి కాలేజీలో చేరి, వేదాంతం (Phylosphy) ప్రధానంగా గల హానర్సు కోర్సును ప్రథమ తరగతిలో పూర్తి చేసుకుని 1919 లో తన బిరుదును స్వీకరించాడు. ఈకాలంలో బెంగాల్ విద్యార్థులకు సైనిక శిక్షణ ఇచ్చేదానికి నూతనంగా ప్రారంభించబడిన కాల్బలవర్గంలో చేరి, అనేక ప్రత్యేకతల్ని సాధించాడు.

**లండన్ విద్యార్థిగా :—** ఇది నల్లబల్లులు, పంజాబ్ దురంతాలు, ఖిలాఫత్ పోరపాట్లు జరిగి, దేశాన్ని పూర్తి ఆందోళనలో ముంచి తేల్చుతున్న సమయం. పాలించే వారికి, పాలించబడేవారికి మధ్య ద్వేషభావాలు రగుల్కొంటున్న రోజులు. పరిపాలకులు ప్రజల విషయంలో దయారహితంగా ప్రవర్తిస్తుంటే ప్రజలు మొదటి ప్రపంచయుద్ధంలో సహాయనిరాకరణ పద్ధతితో పాలకుల్ని దెబ్బతీశారు.

అమాయక ప్రజల్ని అనేకచోట్ల కొరడాలతో మోదటం, దుర్భరమైన శిక్షలు విధించటం, ప్రశాంతంగా జరుపుకుంటున్న సభలపై తుపాకులు కాల్చటం, బారీయెత్తున అరెస్టులు చేసి, ప్రముఖనాయకుల్ని జైళ్ళకు పంపించటం, ఇవన్నీ కలసి యువకుల రక్తాన్ని పుష్పోంగించినయ్.

సుభాష్ యొక్క సహసయుత — రౌద్రపూరిత, చర్యల్ని ఇంతవరకూ సహించిన తల్లిదండ్రులు, బి. ఏ. పరీ

క్షులు అయిన తరువాత — తన శక్తినిమించి చూపుతున్న పుత్సాహం చూచి — తానింకా ఆ మార్గాల్లోనే నడుస్తాడేమో నని అనుమాన భయపూరితులయ్యారు. ఇందుకోసరం ఐ. సి. యస్. పరీక్షలకు కూర్చోవటానికి ఇంగ్లాండు వెళ్ళమని అడిగారు. ఒకవేళ లండన్‌లోని అనేకమంది భారతీయ యువకులు సహజంగా అచ్చటి అలవాట్లకు లొంగిపోయి, సమాజ జీవితానికి అంకితమై పోయినట్లు బోసుకూడా స్థిరజీవి అవుతాడని వారు భావించి వుండవచ్చు.

అయితే సుభాస్ ఈ అవకాశాన్ని ఏవగించుకున్నాడు. పంజాబ్‌లో మార్షల్‌లా ప్రయోగఫలితంగా జరిగిన ఘోరాతి ఘోరమైన దుస్సంఘటనలు, దేశమంతటా అనుసరించబడుతున్న దార్జన్య హింసాచర్యలు ఆయన కండ్లముందు తాండవమాడుతున్నయ్. ఆయనలోని దేశభక్తభావాలు ఐ. సి. యస్ కు కూర్చోవద్దని వుద్బోధించినయ్. కాని, ఆయనలోని గొప్పతనాన్ని అర్థంచేసుకున్న ఆయన మిత్రుడొకడు, ఇంగ్లండు వెళ్ళే సదవకాశాన్ని ఏపరిస్థితులలో కూడా పోగొట్టుకోవద్దని సలహా యిచ్చాడు. జీవితంలో ఒక ప్రత్యేక సందేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సుభాస్ ఈ సలహాకు "అయితే, సివిల్ సర్వీస్ పోటీలు నెగ్గివచ్చినట్లయితే ఒకబాధవుంది, అప్పుడునేను నాభావాల్ని పోగొట్టుకోవాల్సివుంటుంది." అని ఇలా సమాధానమిచ్చాడు. చిట్టచివరకు అతికష్టంగా ఆ అవకాశాన్ని అంగీకరించటానికి నిర్ణయించుకున్నాడు. ఇంగ్లండు ఏపరిస్థితుల్లో పోవటానికి అంగీకరించాడో ఆ సందర్భంలో తన మనోభావాల్ని

తన మిత్రునికి వ్రాసిన వుత్తరంలో వ్యక్తీకరించాడు. "గత కొలది దినాలు మానసిక తుఫాన్‌లో గడిపాను. నాలో నాకు గొప్ప సంఘర్షణ జరిగిన అనంతరం ఐ. సి. యస్. కోసరం ఇంగ్లండు వెళ్ళటానికి నిర్ణయించుకున్నప్పటికీ యీ నిర్ణయం సరైందేనని నా ఆత్మను సంతృప్తి పర్చలేకున్నాను."

ఈ విధంగా సుభాస్ మొదటసారి ఇంగ్లండు వెళ్ళాడు. ఆయన హిందూమహాసముద్రం దాటిపోయిన అనంతరం పాశ్చాత్య ప్రపంచపు మెరుగులు ఆకర్షించలేక పోయినందు వలన, ఆయన తన ఏకైక మానసిక నిర్ణయానికి బద్ధుడైవున్నందు వలన, తల్లిదండ్రులు భావించిన దానికి విరుద్ధంగా జరిగింది. ఆయన స్వదేశపు నిర్భాగ్య- నిరుపేద జీవన పద్ధతులవైపు ఆలోచనలు మళ్ళింది. అలానే తనజీవితం గడిపాడు. ఒకవైపు ప్రజలు పౌరహక్కుల్ని అనుభవిస్తూ స్వేచ్ఛావాయువు పీల్చుకోవటం, యువకులు భావిజీవన విధానాల్ని స్వయంగా చిత్రించుకోవటం, పిల్లలు సమయోచిత అవసర సైనిక శిక్షణ పొందటం మరోవైపున బీదతనంలో అణగారి పోతున్న బాల బాలికలు చిన్నతనంనుంచీ జీవితంతో నిత్యపోరాటం జరుపటం; పౌర హక్కులు-నాగరికత-సంస్కరణ-విద్య, ఈమొదలైన అన్ని విషయాలుపరాయిజాతి దయాదాక్షిణ్యాభిక్షపై ఆధారపడటం; తమ భావిజీవితాన్ని తాము నిర్ణయించుకోలేని యువకులు ప్రభుత్వ వుద్యోగాలు కోసరం నిరీక్షించటం చూచాడు. తన దేశ దుర్భర దుస్థితిని గ్రహించిన అనంతరం, మేలుకున్నాడు కానీ, ఆయన లండన్‌లో వున్నపుడు అన్ని సమయాల్లో బ్రిటీషు సామ్రాజ్య

వాదం ఎలా వడపోత విధానాన్ని అనుసరిస్తుందో అతిజాగ్రత్తగా పరిశీలించి చూచాడు.

చిన్నతనంనుంచీ తన కాలేజీ జీవితం వరకూ కూడ, భారతదేశం లొంగి వుండటం చూచినప్పుడు ఆయన పడే బాధకు అంతువుండదు. అందుకని భారతదేశం పూజించబడి, భారతీయులు గౌరవించబడే సుభదినాన్ని కండ్లపండుగగా చూడటానికి ఉవ్విళ్ళూరు తుండేవాడు.

ప్రెసిడెన్సీ కాలేజీలోని ఓటన్ అవమానకర చర్య సందర్భంలో జరిగిన సంఘటన ఒకటి, భారతదేశంలోని తన మిత్రులకు వ్రాసిన మరిరెండు వుత్తరాలు, ఆయన మనోభావాలకు ఆధారంగానూ, సాక్ష్యాలుగానూ వున్నయ్. "తెల్ల ప్రజలు నా బూట్లుకు పాలిష్ పెట్టటం, నాకు సేవచేయటం చూచినప్పుడు, నేను అమితంగా సంతోషిస్తాను." అని 1919 నవంబరు మాసంలో కేంబ్రిడ్జి ఫిడ్జివిలియం హాలునుంచి హేమంత కుమార్‌కు వ్రాసిన తన మొదటి వుత్తరంలో వ్యక్తీకరించాడు. అసంఖ్యాకమైన భారత - ఇంగ్లీషు ప్రజానీక సమక్షంలో అద్భుతమైన వుపన్యాసాల్ని శ్రీమతి సరోజనీ నాయుడు శ్రీమతి రేణుకా రేలు; లండన్‌లోని ఇండియన్ మజ్లిస్ వార్షిక సమావేశపు విందులో ఇచ్చినప్పుడు ఈ విషయాన్ని గురించి ముచ్చటిస్తూ మరో వుత్తరం వ్రాశాడు.

వాటిని గురించి మహాఘనతగా "శ్రీమతి సరోజనీ నాయుడు, ఇక్కడ వుపన్యశించనప్పుడు నా హృదయం

గర్వంతో నిండిపోయింది. పాశ్చాత్యులముందు ధీమాగా నిల్చోగల ఆ సంస్కరణ - విద్య - సుగుణాలు ఆ భారతీయ యువతిలో మూర్తీభవించి వుండటం ఆ రోజు చూచాను. ఇలాంటి బిడ్డల్నికన్న దేశానికి ఉజ్వల భవిష్యత్ వున్నది-అని నే నాటితో ఒక నిశ్చయానికి వచ్చాను" అని వ్రాశాడు.

లండన్‌లో విద్యార్థిగా వుంటున్నపుడు ఈ భారత పుత్రునిలో అటువంటి వున్నతోద్దేశ్యాలు ప్రతిబింబించినయ్. భారతమాతని, ఆమె గౌరవాన్ని ఆయన అమితంగా ప్రేమిస్తాడు. అంతేకాదు, ఒక ప్రత్యేక సందేశం ఆయన హృదయంలో ప్రతిధ్వనిస్తుంది. అందుకోసరం, యూరపుకు చదువు నిమిత్తం వెళ్ళేకొందరు ధనవంతుల పిల్లలకు భిన్నంగా ఆయన భావాలున్నయ్. లండన్ హోటళ్ళలో తండ్రి పంపించే ధనంతో చీట్లపేకలు, టెన్నిసులు ఆడలేదు సరికదా, ఐరోపా దేశపు రంగు రంగుల టింగ్ మిఠారీల దుమ్ముకొట్టుకున్న తీపి మిఠాయికి, వారు ప్రేమనటనతో భారతయువరాజులకు, ధనిక విద్యార్థులకు చూపించే అరచేతి వైకుంఠంలోని, ఆ మాయ బజారుకుపోయి, ఆ తుచ్ఛ అలవాట్లకు ఆహుతికాలేదు. 1920 ఆగస్టు మాసంలో 9 మాసాల స్వల్పవ్యవధిలో ఐ. సి. యస్. పోటీలో డిగ్రీ సంపాదించే విషయంలో 4వ స్థానం సంపాదించి, అమిత నేర్పుగా మానసిక, నైతికశాస్త్ర ట్రిపాస్ సబ్జక్టులుగా కేంబ్రిడ్జి యూనివర్శిటీ నుంచి బి. ఎ. డిగ్రీపొందాడు.

**ఐ. సి. యస్. కు రాజీనామా :—** ఆయన ఐ. సి. యస్. పరీక్షలందు వుత్తీర్ణుడైనప్పటికీ తన వున్నతోద్దే

శ్యాల్ని ఏమాత్రం మర్చిపోలేదు. తన ఈ విజయానికి బాధ పడినట్లు ఇండియాలోని మిత్రునికి "దురదృష్టవశాత్తు" ఐ. సి. యస్. పరీక్షలందు ఉత్తీర్ణుడైనట్లు, వ్రాసిన వుత్తరాన్ని పట్టి తెలుస్తుంది. భారతదేశంలోని కొందరు స్నేహితులకు వ్రాసినజాబులబట్టి, బోస్‌యొక్క ఈ వుత్తీర్ణత ఆయన బరువును రెట్టింపుచేసింది; ఇండియా కార్యదర్శి అయిన మిష్టర్ మాంటేగ్ వద్దకు తన రాజీనామా పత్రాన్ని దాఖలు చేసేటందుకు తనంతట తానే పోలేక బాధపడినట్లు గోచరిస్తుంది. కార్యదర్శి అన్ని అవకాశాల్నికల్పించాండు. కానీ అవన్నీ వృథా అయిపోయినయ్. ఆయన ప్రశాంత, ఉద్రేక మనస్కుడైన స్వాభావిక యువకుడు. తాను తీసుకున్నచర్య అవ్యక్తమైందే మాత్రం కాదు. ఆ గొప్ప పదవికి రాజీనామా ఇస్తూ "నేను 1920 సంll లో ఇంగ్లండులో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్ష యందు ఉత్తీర్ణుడయ్యాను. అయితే బ్రిటీషు ప్రభుత్వానికి, నా దేశానికి ఈ ఉభయ యజమానులకు ఏకకాలంలో సేవ చేయటం, అసంభవం — అసంబద్ధం అని గ్రహించి, 1921 మే మాసంలో నా పదవికి రాజీనామా యిచ్చి, చాలా ఘటికంగా వున్న నాటి జాతీయోద్యమంలో నాపాత్ర నిగ్రహించే నిమిత్తం, అపరిమితోత్సాహంతో భారతదేశానికి బయలుదేరాను."

**సి. ఆర్. దాస్ శిష్యత్వం :—** అలా నూతన ఆశతో, నూతన ఆశయాలతో విస్తృత విజ్ఞానంతో మాతృ భూమికి చేరుకున్నాడు. 1921 జులై 16వ తారీఖున బొంబాయి చేరుకుని ఆ సాయంత్రమే బొంబాయ్‌లోని మణీభవ

నంలో నివశిస్తున్న, మహాత్మ గాంధీతో, కార్యవిధానపు లోతు పాతుల్ని అర్థం చేసుకొనే వుద్దేశ్యంతో సంప్రదించాడు. ఒక గంటవరకూ సంభాషణ సాగింది, కొన్ని విషయాలపై వున్న అనుమానాన్ని నివృత్తి చేసు కోవటానికి గాంధీజీని అసంఖ్యాక మైన ప్రశ్నలు అడిగాడు. కానీ, ఆయన సమాధానాలతో పూర్తిగా తృప్తి చెందలేక పోయాడు. కాబట్టి "నిరుత్సాహ-నిస్పృహ" పూరితుడై బెంగాల్‌లో అద్వితీయ పలుకుబడి కలిగిన సి. ఆర్. దాస్ – దేశంలో కెల్లా విజ్ఞాన జ్యోతి, రాజకీయ వేత్త, ప్రజ్ఞాదురంధరుడును – కల్సుకోవటానికి బొంబాయి– వదలి వెళ్ళాడు.

రాజకీయరంగంలో గాంధీజీ నూతన వీరుడై నప్పటికీ ఆయన ఆత్మ సంసోధన, సాధారణ జీవనం, దేశీయులపై ప్రయోగమై విధేయులుగా చేయటానికి ఆట్టె అంత ఎక్కువ కాలం తీసుకోలేదు. అంతేకాదు, దేశంలోని హేమా హేమీ నాయకుల్ని కూడా ఆయన జయించాడు. అయితే, ఆయన రాజకీయ ప్రజ్ఞ కానీ, ఋషిప్రాయ జీవనం కానీ వారి ప్రథమ సమావేశంలోనే బోస్‌మీద ప్రయోగం నిరుపయోగమైనయ్. ఈ సందర్శన సంఘటన గురించి తన అభిప్రాయాన్ని ఇస్తూ ఒకప్పుడు బోస్ ఏమిట్రా శాడంటే; "మహాత్మ గాంధీయే భారతదేశ లక్ష్యమైన స్వాతంత్ర్యాన్ని సాధించే ఉద్యమ అణువుల విషయంలో ఒక నిశ్చితమైన అభిప్రాయాన్ని కలిగిలేడు అని పదే పదే నా మనసుకు గోచరించింది"

ఆయన కలకత్తా చేరిన వెంటనే దేశబంధు-యింటికి వుద్దేశ్యాలను పరస్పరం సమర్పించుకునేందుకు సరాసరి వెళ్ళాడు. ఆ రోజుల్లో భారతరాజకీయాల్లో దేశబంధు సి. ఆర్. దాస్ ఒక ప్రత్యేక ప్రముఖవ్యక్తి. ఆయన యువజన మిత్రుడుగా దేశమంతటికీ ఎరుకే! ఆయనెప్పుడూ యువకుల సాధక బాధకాలకు సానుభూతిని ప్రదర్శించి ఆఫలితాల్ని అనుభవించేవాడు. సుభాస్ చెప్పింది ఓర్పుతో విని అన్నివిధాల సాధ్యమైనంత ఎక్కువ ప్రోత్సాహ మివ్వగలనని హామీ యిచ్చాడు. అంతటితో ఈ యువకుడు పూర్తిగా తృప్తి చెందాడు. కాబట్టి ఆయన నాయకత్వపు అడుగుజాడల్లో నడువటానికి నిశ్చయించుకున్నాడు.

# దురదృష్టంలో ఆశాజ్యోతులు

రాజకీయ స్వాతంత్రం, ఆర్థిక స్తోమత, సాంఘిక అభివృద్ధి అనే, ఇవిమూడూ, ఒక దేశం వున్నతస్థాయిని పొందటానికి, ముఖ్యంగా కావలసివుంటయ్. అయితే భారతదేశంలో, ఈ మూడూ కొరతపడి వున్నయ్. ఒక గొప్పజాతి, దైన్య - దౌర్భాగ్య - దుస్థితికి దిగజారటం, మన కండ్లకువున్న, నైరాశ్య సులోచనాలగుండా, చూస్తున్నాం. ఆనాటి, అఖండ మొఘల్ సామ్రాజ్య, ఔన్నత్యపు విచ్ఛిన్న దశనుండి; తూర్పు ఇండియా కంపెనీ సర్వాధి పత్యాన్ని స్థాపించుకున్న ప్రతిఫల మైన, ఈనాటివరకూ; తన స్వంత చట్టాల్ని ఏర్పాటు చేసుకోవ టానికి కానీ, తన కోశాగారాల్ని భద్రిబరుచుకోటానికి గాని తన సమస్యల్ని పరిష్కరించు కోవటానికికానీ, భారతమాతకు స్వేచ్ఛ లేదు. సత్యానికి, ఈ అనంత ప్రజానీకాన్ని నపుంసకులు గానున్నూ, నిరాయుధులు గానున్నూ, తయారు చేసేందుకు, శక్తివంచనలేని, లెక్కలేని, ప్రయ త్నాలు జరిగినయ్. ఆర్థికంగా దేశాన్ని అధఃపతనం చేసేం దుకు, అప్పుడప్పుడు, తీవ్రచర్యలు జరుపబడినయ్. అంతేకాని, ఆమె ప్రజానీకానికి, అభివృద్ధి - ఔన్నత్యతల్ని పొందకలిగే, ప్రోత్సాహం ఏనాడూ లభించలేదు. రాజరిక లొంగుబాటు: అనే ఆమె కథనంవలన, భారత ప్రజానీకం, అనేక సందర్భాల్లో సాధారణ మానవ పౌరహక్కుల్ని సహితం అనుభవించలేని దురదృష్ట వంతులయ్యారు.

ఇలాంటి పరిస్థితుల్లో, అనేక జాతులు తమ నైతిక ధర్మాలనుంచి పతనమైనట్లు, చరిత్ర చాటుతుంది. అయితే, భారతీయుల ఘనతకు, ఒక ప్రబల నిదర్శనంగా – నూటపభై సంవత్సరాల దుర్భర పరిపాలన అనంతరం కూడా – సమకాలిక మైన, అనేక ఇతర నాగరిక రాజ్యాలకు, ఏ మాత్రం తీసిపోని, అసంఖ్యాక వీరపుత్రులు – ధీరనరులు, మేధావరులు, అత్యున్నత నైతిక ధర్మాలమధ్య, సగర్వంగా, తలలెత్తుకుని, భారతమాత పవిత్ర గర్భంనుంచి వెలువడ్డారు.

స్వార్థచింతనల్ని తృణప్రాయంగా పరిత్యజించి, దేశాన్ని స్వేచ్ఛగానూ – అత్యున్నతంగానూ వుంచే ప్రయత్నాలకు – పోరాటాలకు, వారిజీవితాల్ని అంకితంచేసిన, ఆ మహామహు లైన, మన పితామహుల పవిత్ర భోగట్టా భారతదేశంలో సజీవంగానేవుంది. పందొమ్మిదవ శతాబ్దపు ఆఖరిదశలో అలాంటి అద్భుతాల్ని చూచాం. దేశమంతటా కానీ, లేక ఏదోఒక మూలకానీ, గొప్పగొప్పవ్యక్తులు, మేధామన స్కులు, దగ్ధహృదయులు, కాలానుకూలంగా, నిస్సహాయులైన ప్రజావసరాల్ని గమనించి పనిచేయ ప్రారంభించారు. వీరంతా బానిసత్వ భూతాన్ని పారదోలటానికి సంఘ దుర్నీతుల్ని తొలగించి, ప్రజల్ని విముక్తి చేయటానికి కొందరు; ప్రజల పేదతనాన్ని రూపుమాపటానికి ఇంకొందరు; పరిపాలనతో పోరాడటానికి మరికొందరు—ఇలా సాధ్యమైనన్ని విస్తృత రంగాల్లో కృషిచేశారు. ఈ కాలంలో, ఈవుద్యమాలకు అన్ని వైపుల, భారతదేశం రవీంద్ర నాథటాగూర్ వంటి మహాకవిని

అరవిందఘోష్‌లాంటి ఆధ్యాత్మిక వేత్తని- రచయితని, సరోజినీ నాయుడువంటి కళాసరస్వతిని- కవయిత్రిని, జగదీస్ చంద్రబోస్‌వంటి వృక్షశాస్త్రజ్ఞుణ్ణి, హర్దయాల్‌వంటి విజ్ఞాన శాస్త్రజ్ఞుణ్ణి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌వంటి వేదాంత వేత్తని, చిత్తరంజన్‌దాస్‌లాంటి న్యాయవాద శిరోభూషణాన్ని,(వీరంతా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన జగద్గురులు) సృష్టించుకుంది; భారతదేశం, ఈనాటికీ, విశ్వఖ్యాతులలో పోటీకి నిలబడు తూనేవుంది. ఇక యువనాయకుల్లో— జవహర్‌లాల్ నెహ్రూ), సుభాస్‌చంద్రబోస్‌లు యువక హృదయాల్ని ఆకర్షించి, ఇంతకుముందు, ఇంతవరకు, ఎవరూ కలిగించ నటువంటి చైతన్యాన్ని తేగలిగారు.

ఇప్పటికి, అర్థశతాబ్దంవరకూ దేశాన్ని కాపాడిన ప్రముఖ రాజకీయసంస్థ అయిన, భారతజాతీయ కాంగ్రెస్, అద్భుతవ్యక్తుల్ని- అమోఘువుద్యమాల్ని సృష్టించింది. దాని ఆధిపత్యంక్రింద, పందల- వేలసంఖ్యకు మించి ప్రజానీకం పోరాటాల్లో బాధలకు గురిఅయ్యారు. ఇలా అనేకశతాబ్దాల క్రౌర్యం- నిస్పృహల మధ్య, జీవన కాధాల్ని దుర్భరంగా నడి పించిన, ఈదేశంలో, సంభవించిన, ఆకస్మిక సంఘటనల్లో నటించిన, వీరవ్యక్తుల ప్రవర్తనకు మేంసాక్షులం.

ఈ ప్రముఖ సంస్థావిధానం, ఒకసారికీ- మరోసారికి నాయకత్వంలో వచ్చే తేడాఫలితంగా, మారుతూ, కాలక్రమేణ పూర్వుల సహానశక్తినుంచి,ప్రజల్ని దూరంచేసి, విప్లవ ప్రవ ర్తనకు దారితీసింది. మొట్టమొదటి మితవాదులనుంచి గాంధీ

వరకు, గాంధీనుంచి- నెహ్రూవరకు, ఈ వ్యవధిలో ఆవర్గం నుంచి యువకులకు, కాంగ్రెస్ హస్తగతమైంది. ఈ బృందానికి కాపరి, మాజీకాంగ్రెస్ అధ్యక్షుడైన సుబాస్‌చంద్రబోస్.

ఈ ప్రముఖ వ్యక్తియొక్క జీవిత చరిత్ర, త్యాగాలు, ఇతర కార్యవిధానాలు, వ్యక్తీకరించబోయేముందు, ఈ బ్రహ్మాండమైన సంస్థయొక్క అభివృద్ధి ఘట్టాలద్వారా, పరిణామం ఎలా సిద్ధించి, తదుపరి, విప్లవశక్తి దాని సిద్ధాంతాలలోనికి, ఎలా ప్రవేశించిందో ఆ భాగోవతం, కాస్త మీ దృష్టిముందు పెట్టటం, అసందర్భం కాదనుకుంటాను.

## కాంగ్రెసు పుట్టుక - ప్రాథమిక మనుగడ

భారత ప్రభుత్వ ఆంతరంగిక శాఖలో, చాలాకాలంనుంచీ వున్నత కార్యదర్శి పదవిని నిర్వహిస్తున్న, "మిస్టర్ ఎ. ఒ. హ్యూమ్" అనే ఒక ఇంగ్లీషు ఉద్యోగి కృషిఫలితంగా, అసలు ఈ సంస్థ 1885 వ సం॥లో పుట్టినప్పటికీ; భారతదేశంలో, కొంతవరకు ఇంగ్లీషు చదువు ప్రవేశపెట్టటానికి కారణభూతులైన, నవభారత నిర్మాతల్లో ఒకరైన శ్రీ రాజారామమోహన రాయ్ ద్వారా; 1835 వ సంవత్సరంలోనే, అంటే: అప్పటికి 50 సం॥ లకు ముందుగానే, దీని విత్తనాలు వేయబడ్డాయని చెప్పబడుతుంది.

కేవలం, ప్రభుత్వ యంత్రాంగాల్ని నడిపే తాబేదార్ల-తొత్తుల బృందాన్ని తయారుచేసేనిమిత్తం, ఇంగ్లీషుభాష అమలుజరుబడినప్పటికీ, అది కొంతమంది యువకుల దృక్పథాల్లో

మార్పులు తేవటమే కాక, భారతదేశములోనూ, ఇతరత్రా కూడ, వున్న చదువుల్ని అభ్యసించిన ఫలితంగా; వారు రాజకీయ-జాతీయ సమస్యల్ని, అవగాహన చేసుకున్నోళ్లుగాకూడ, తోడ్పడింది. ఆవిధంగా, ఆత్మగౌరవాన్ని - దేశభక్తిని వారిలో మొలకలెత్తించి, తద్వారా వారి మాతృభూమిని వున్నతంగా-స్వేచ్ఛగావుంచే కోర్కెలకు దారితీసింది. ఇక ఇంతటితో, ఇంగ్లీషువారి ఘోరసామ్రాజ్యాధిపత్య కాంక్షపైన, శ్వేతాధిక్యతాభావంపైనా, ఇంతకాలంనుంచి అణగిమణగివున్న ప్రజానీకపు తిరుగుబాటు ప్రారంభమైంది.

మిస్టర్ హ్యూమ్, సాంఘిక జీవితంలో సంస్కరించబడినకొంతమంది భారతీయుల్ని, వుద్యమపు ఆవశ్యకతని గుర్తించేట్లుచేసి, ఆతదుపరి, చట్టం-ప్రతిపత్తులకు, విరుద్ధంగా పరిస్థితులు మారకుండా వుండేట్లు; శాంతిశాశ్వతంగా స్థిరపడేట్లు— భారతీయుల మానసిక నైతిక సాంఘిక, రాజకీయ అభివృద్ధి లక్ష్యాలుగా — జాతిపునర్జీవించేట్లు చేసేటందుకు; ఒక సంస్థ ఏర్పర్చవలసిన ఆవశ్యకతను నచ్చచెప్పేటందుకు, అప్పటి వైస్రాయిఅయిన, 'లార్డుడఫ్రిన్' దగ్గరకు, ప్రాతినిధ్యం వహించి వెళ్ళాడు. ఈవుద్దేశ్యం వైస్రాయిని సంతృప్తిపరిచింది. ఇటువంటి సంస్థ పుట్టుకను సమర్థిస్తూ, వైస్రాయి తన సమ్మతాన్ని ఇలా వ్యక్తీకరించాడు, "ప్రభుత్వ వున్నతోద్యోగిగా హ్యూమ్ వుండటంవలన, ఇలాంటి సంస్థ లేనప్పుడు ప్రజల నిజవాంఛ గ్రహించటంలో ఇతనికి గొప్ప ప్రతిబంధకమౌతుంది. భారతీయుల బహిరంగాభిప్రాయాల్ని. ప్రభుత్వం అవగాహన

చేసుకునేట్లుచేసి, పరిపాలన సులభతరంచేయగల, ఒక బాధ్యతాయుత సంస్థ ఏర్పడటం, ప్రజలకే క్షేమదాయకం" మిష్టర్ హ్యూ, లార్డుడఫ్రిన్, అనుమతి పొందిన తరువాత, అనతికాలంలో, అంటే 1885 డిసెంబరు 28 వ తేదీలో, 'డబ్ల్యు. సి. బెనర్జీ' అధ్యక్షాన, భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ సమావేశం. బొంబాయిలో జరిపి, తన వ్యూహ ప్రణాళికని విజయవంతం చేశాడు.

అసలు విషయం, కాంగ్రెస్ సంస్థతో ప్రారంభించాలంటే - అది చాల విశ్వాసంగల సంస్థ. అది తన రకరకాల కంఠంతో, బ్రిటీషు ప్రభుత్వానికి భక్తిని ప్రదర్శిస్తూ, అతి సామాన్యమైన కోర్కెల్ని కోరింది. వాస్తవానికి, నేటి గొప్ప విప్లవాత్మకమైన ఈ సంస్థకు - భారత స్వాతంత్ర్య సముపార్జనా పోరాటపు చావు బ్రతుకుల్లోవున్న ఈ సంస్థకు - ఆనాటికి వున్న ఆశయ మేమంటే, దేశంలోవున్న రాజకీయ కార్యకర్తలమధ్య, పరస్పర సంబంధాన్ని కల్పించటం; కొంత పరిమితికి సంస్కరణలు తేవటం; ఉద్యోగ నియామకంలో, ఎక్కువ అవకాశాల్ని కల్పించటం; వ్యాపారస్తులకు, కొన్ని వ్యాపార లాభాలు చూపించటం.

తదనంతరం, అనేక సంవత్సరాలవరకూ, కాంగ్రెస్ కళ్ళెం 'దాదాబాయ్ నౌరోజీ,' ఆయన అనుయాయుల హస్తగతమై నిలబడింది. ఆకాలంలో వారంతా స్వాతంత్ర్య సర్దార్లుగా పరిగణింపబడ్డారు. అన్ని విధాలైన గౌరవార్హతలు వారి కున్నయ్. అయితే, గౌరవానికి భంగకరంకాని, తీర్మా

నాలు చేయటంతప్ప, అంతకుమించిన విశేషం, ముఖ్యంగా వారి చర్యలో మృగ్యం; అనే సత్యాన్ని మరుగున పెట్టటం, భావ్యంకాదు. వారికి, బ్రిటీషు పార్లమెంటులో పరిపూర్ణ విశ్వాసముంది. అది వారి కోర్కెల్ని మన్నిస్తుందని భ్రమ పడ్డారు. వారు కోరిన కోర్కెలన్నింటిలో, మితిమించి కోరిందేమిటంటే పరిపాలనలో వాటా ఎక్కువకావాలనీ; లెజిస్లేటివు కౌన్సిల్‌లో అధిక ప్రాతినిధ్యం వుండాలని; విమర్శనలకు ఎక్కువ స్వేచ్ఛఇవ్వాలని. దాని వార్షిక సమావేశాల్లో, రాజకీయ సాధక బాధక సమస్యల్ని గూర్చి, ఇండియా పురోభివృద్ధికి సంబంధించిన సమస్యలగూర్చి చర్చించారు. స్వప్రభుత్వ సిద్ధాంతం తన ఆశయమని, 1907 వ సంవత్సరపు తన అధ్యక్షోపన్యాసంలో దాదాభాయ్‌నౌరోజీ వుద్ఘాటించినప్పటికీ, కాంగ్రెస్ వాంఛలు, ప్రభుత్వంలో అధిక ప్రాతినిధ్యం- పరిపాలనా అవకాశాలు తాత్కాలికంగా వున్న కష్టనిష్ఠూరాల నివారణ, అనే వాటికిమించి, అధికంగా పోలేక పోయినయ్.

అలా చాలాకాలంవరకు కూడా, కాంగ్రెస్ ప్రభుత్వంతో, ప్రత్యక్ష పోరాటానికి దిగలేకపోయింది. అయితే ఇరవైయవ శతాబ్ద ప్రారంభములో, వరుసగా అనేక అహింసాయుత పోరాటాల్ని నడిపింది. విభజనరోజుల్లో బెంగాలు ప్రజానీకం ప్రదర్శించిన ధైర్య సాహసాలు, యావద్భారత దేశానికి ఒక నూతన కనువిప్పుకు దోహదమైనయ్. వివిధమత దృక్పథం వున్న ప్రజానీకం, ప్రభుత్వంచేసిన సవాల్‌ను పరిగ్రహించటానికి అనేక రాష్ట్రాలనుంచి వచ్చి, బెంగాల్‌తో చేతులు కలుపటమే

కాక, ఆ క్లిష్ట పరిస్థితుల్లో, విపరీతధైర్యానికి – క్రమశిక్షణకి మార్గదర్శకులైనారు. జైలు నిర్బంధనల్ని – తుపాకి గుండ్లని సాహసంతో ఎదుర్కొన్నారు. తుట్టతుదకు ఆ ఆందోళన తుఫాన్‌గా పరిణమించింది. అది నిరంకుశత్వాన్ని భరించి – దేశంలో నూతన యుగాన్ని ప్రారంభింపచేసింది.

అలా ప్రజా చైతన్యాన్ని అంచనావేసి చూస్తే, ఏదైనా సరే ఒక సుదీర్ఘ ఆశయాన్ని, సాధించటానికై ప్రారంభించే పోరాటానికి – వుద్యమానికి, ప్రజాసహకారం లభిస్తుంది అనే ఆశ, నాయకుల్లో స్థిరపడిపోయింది. ఫలితంగా భవిష్యత్‌కై నిరీక్షిస్తున్న అతివాదులు, కాంగ్రెస్ రాజకీయాల్లోనికి కాలుపెట్టారు. వీరితో పొత్తు కుదురని మితవాదులు, క్రమేపి కాంగ్రెస్‌ను వదలిపెట్టిపోయారు. కొంతమంది మితవాదులు ఏవిధంగానైతేనేం, అంటిపెట్టుకుని ఇంకావున్నప్పటికీ, చైతన్య పూరితులైన ప్రజానీకం, ఘటికమైన నాయకత్వాన్ని వాంఛిస్తున్నారని గ్రహించిన అనంతరం, వారుకూడా రంగంనించి నిష్క్రమించారు. నాటినుంచీ తిలక్ కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రజామన్నన పొందిన "స్వరాజ్యం నాజన్మహక్కు- దానిని పొందితీరవలసిందే" అనే నినాదంతో, బలీయమైన నాయకుడయ్యాడు.

పై విధంగా, ఆ నినాదం, ఈ గొప్పమహారాష్ట్ర మహానాయకుని, నైజాన్ని ప్రతిబింబింపచేసింది. ఆదినుంచీకూడ కాంగ్రెస్ చరిత్రని దీర్ఘంగా పరిశీలించి నట్లయితే, యుగసంధ్యలో గొప్పప్రవర్తన- ధైర్యం- త్యాగం అనేవి వ్యక్తిత్వ

భూషణాలుగా, వేత్తలు వెలిశారు; అనే సత్యానికి అను బంధంగా దానిపుటల్లో నిదర్శనాలు కనుపడు తున్నయ్. తిలక్ మహాశయుడు అనుమాన రహితంగా, ఈప్రత్యేక తరగతికి చెందినవాడు. ఆయన ఆకాంక్ష- ఆవేశాలు ఎప్పుడూ కూడ, తక్షణ- ప్రత్యక్షచర్యల నైపువుంటుంటయ్. ఆయన మిత వాదుల 'పరిమిత' ధోరణిని ఖండాడుతూ, వాయు పక్షీయుల ధైర్యాన్ని స్తుతించేవాడు. ఆయన తన వుపన్యాసాలలో, రచ నలలో, హింసావాదాన్ని సహితం ప్రబోధించేంత వరకూ పోయూడని చెప్పటం, అభూనం కాదు. సంగీయుల వీరోచిత చర్యల్నిచూచి, ముభావత ప్రదర్శించక తన పత్రికద్వారా సమర్థిస్తూ వుండటంద్వారా, ఆయనచేసే చేతలకు- వ్రాసే వ్రాతలకు, అసలా వ్యక్తిత్వానికే, వారి సహకారం- సాను భూతి లభించినయ్. ఆయన వ్యాసాలన్ని, సదా, యువకుల్లో నవోత్సాహాన్ని పురికొల్పుతున్న కారణాన, వారెప్పుడూ ఆయన నాయకత్వాన్నే కోరుకుంటుంటారు. తిలక్ దీర్ఘకాల జైలువాసం, పరదేశ అజ్ఞాతవాసం కూడా, ఆయన దార్ఢ్యయుక్తమైన కలానికున్న శక్తిని, చూపినందువలననే, సంభ వించినయ్. ఇద్దరు ఆంగ్లేయస్త్రీలు, ఒకచేతిబాంబు ప్రేలుడు ద్వారా మరణించి నప్పుడు, ప్రోత్సాహకరంగా ఆసంఘటనని నిర్వచించిన సందర్భంలో, న్యాయవాది 'మిష్టర్ దేవర్' ఆ రేండ్ల శిక్షవిధిస్తూ; "ఆవ్యాసాలు దార్ఢ్యాన్ని పురికొల్పు తున్నయ్. అవి హింసను ప్రబోధిస్తున్నయ్. ఖూనీలకు ప్రోద్బలపరాతున్నయ్. చాటుగా బాంబుప్రయోగాల ద్వారా

ఖూనీలుచేయటం తప్పరి ఆమోదముద్ర పొందటమేకాక, మీరు భారతదేశంలో బాంబులవలన రాగల ఏదైనా మంచికి బదులు అది దుర్వినియోగపరాటకు కారణభూతు లయ్యారు." అని తన అభిప్రాయాన్ని వివరించాడు.

అంతటి అతివాద నాయకత్వ ఫలితంవలన, 1920వ సంవత్సరంనుంచి మహాత్మగాంధీ కార్యాచరణా రాజకీయల్లో తన పాత్రని తీసుకోబోయేముందు, కాంగ్రెస్ అప్పటికి శైశవావస్థను దాటనట్లుగానే భావించబడింది. రౌలత్ బిల్లులు (నల్ల బిల్లులు) ప్రవేశపెట్టటం ఆరంభంకావటంతో కాంగ్రెస్ యుగంలో గాంధీహాయాం ప్రారంభమైంది.

ప్రభుత్వంచేత ఏర్పర్చబడిన "హంటర్ కమీషన్" జలియన్ వాలాబాగ్ దురంతాల భోగట్టాని విచారించేటందుకు, దీర్ఘకాలంగా ఆ చర్యల్లో నిమగ్న మైనట్లుగా నటించి కాలవ్యవధిలో అసలు సమస్యకు మసి పూయటానికి వేసిన ఎత్తుగడలు - కాంగ్రెస్ నాయకులు ఆశించిన దానికి భిన్నంగా జరిగినయ్. మహాత్మాగాంధీ కాంగ్రెస్ నియమావళికి నిర్మాణాత్మక కృషియొక్క రూపం తేవాలని కోరాడు. 1920 సెప్టెంబరు మాసపు కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశంలో అయన తన చరిత్రాత్మకమైన సహాయ నిరాకరణ తీర్మానాన్ని ముందుకు తెచ్చాడు. చాలాకాలం అనంతరం, అప్పుడే అమెరికానుంచి తిరిగివచ్చిన లాలాలజపతిరాయ్ దానికి అధ్యక్షుడు. అయన మహాత్మాగాంధీ తీర్మానాన్ని వ్యతిరేకించాడు. బెంగాల్ ప్రజామన్ననల పొందిన

ప్రముఖ నాయకుడు సి. ఆర్. దాస్ కూడా అధ్యక్షునితో చేతులు కలిపి వ్యతిరేకించిన కారణం కేవలం ఆ తీర్మానపు నిరుపయోగ్యతే కాదు, అది శాసన సభల్ని సహితం బహిష్కరించ కోరింది. కొంతమంది మితవాదులు కూడా వీరితో చేతులు కలిపిన ఫలితంగా మహాత్మగాంధీ సూచనకు తీవ్రమైన వ్యతిరేక వర్గం ఒకటి ఏర్పడింది. తీర్మాన ప్రతిపాదకుడు తన సిద్ధాంతాన్ని అంగీకరింపచేయటానికి గంటలతరబడి సతమతమై పోరాడాడు. దీనికితోడు, హకాలాన మహమ్మదాలీ, పండిట్ మోతీలాల్ నెహ్రూల సంపూర్ణ సహకారం లభించింది. సవాల్ పై వేడివేడిగా తర్క-వితర్కం జరిగిన అనంతరం, విషయ నిర్ణయసభలో అది ఎన్నికకు నిలచినప్పుడు చాల స్వల్పమెజారిటీ అయిన ఏడు ఓట్లతో అతి కష్టంగా తీర్మానం నెగ్గింది. అయితే సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించే అంతిమనిర్ణయం ఉభయ పార్టీల చేత నాగపూర్ మహాసభకు వదలబడింది.

ఈ సమావేశం 1922 డిశంబరు మాసంలో ప్రముఖ మద్రాస్ నాయకుడైన శ్రీనివాస అయ్యంగారి ఆధ్వర్యాన జరిగింది. లండన్‌లోని లేబర్ పార్టీ ప్రతినిధి మిష్టర్ వెడ్జివుడ్ బెన్ కూడా ఈ సమావేశంలో పాల్గొనటానికి ఒక ప్రతినిధిగా వచ్చాడు. ఇది ఒక కాలానుగుణ్యసమావేశం అని అనటంలో సందేహంలేదు. కలకత్తా సమావేశానికి నాగపూర్ సమావేశానికి మధ్య లభించిన వ్యవధిలో ఇరుపక్షాలు శక్తి వంచన లేని ప్రచారం చేసుకున్నాయ్. విషయ నిర్ణయసభలో సమస్య చర్చకు వచ్చినప్పుడు, మితవాద కాంగ్రెస్ నాయకుల అభి

ప్రాయానికి భిన్నంగా మిష్టర్ బెన్ కూడా పూర్తి వ్యతిరేకతని ప్రదర్శించాడు. కాని, గాంధీ తనపూర్తి మనోబలంతో ప్రతి పక్షుల్ని ఓడించటంలో కృతకృత్యుడయ్యాడు. తత్ఫలితంగా బహిరంగ సమావేశంలో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించ బడింది.

ఆ సందర్భంలో, కాంగ్రెస్ ప్రభుత్వంతో ఒక అహింసాయుత పోరాటాన్ని ప్రారంభించేవిషయం ఆలోచిస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ టర్కీ-శాంతిఒడంబడిక విషయంలో భారత ముస్లింలుకూడా ఆందోళనచేయు ప్రారంభించారు. యుద్ధకాలంలో బ్రిటిషు ప్రధానమంత్రిచే తయారు చేయబడిన టర్కీ-సుల్తాన్ యొక్క హక్కును భంగపరిచే, నిబంధన నియమావళి ప్రజామనస్తత్వానిక దూరమైంది. చేసిన ప్రమాణాల్ని బ్రిటీషు ప్రభుత్వం అధిగమించటం భారత ప్రజానీక మనస్తత్వ - హృదయంలో బాధకలిగించింది. దీని ఫలితంగా టర్కీ-సుల్తాన్ యొక్క-యుద్ధాత్పూర్వస్థానం పునరుద్ధరింపచేయుటానికి భారతముస్లిం ప్రజల్ని సమీకరించి తద్వారా ప్రభుత్వం పైవత్తిడి తేవటానికి, ముస్లిం నాయకులు చేతులుకలిపారు. గాంధీజీకూడా ముస్లింలకు సంభవించిన ఈ అన్యాయానికి అసంతృప్తిచెంది ఈ కారణంచేత వారికోర్కెలకు తనహృదయపూర్వక సహకారం ఇచ్చాడు. అదృష్టవశాత్తు మనదేశ జాతీయజీవిత సుస్థిరతకేమో నన్నట్లు ముస్లింలు కూడా ఆయన్ను అనుసరించ నిర్ణయించుకున్నారు. ఇలా హిందూ ముస్లింలను, సమైక్యతతో సమిష్టి

పోరాటంలో నడిపించే నదవకాశం గాంధీజీకి లభించింది. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో, ఈ సంయుక్త ఆందోళన ఒక మరువరాని అధ్యాయాన్ని సృష్టించిది. అనేకమంది ప్రభుత్వ బిరుద ప్రదానులైన వుద్యోగులు తమ పదవులకు రాజీనామాలిచ్చి కార్యాలయాల్ని బహిష్కరించారు. విద్యాలయాలు, విశ్వ - విద్యాలయాలు, న్యాయస్థానాలు, శాసన సభలు బహిష్కరించ బడ్డయ్. అనేక ప్రాంతాల్లో ప్రజలు పన్నులు, భూశిస్తులు యివ్వ నిరాకరించారు. చట్టానికి విరుద్ధంగా ప్రతిచోటా అవిధేయత చూపాలని అనేకచోట్ల ప్రదర్శించారు. ప్రజలు అధికార్లతో ప్రత్యక్ష సంఘర్షణకు తలపడ్డారు. దేశమంతటా విపరీత విపత్కర పరిస్థితి ప్రత్యక్షమైంది. అసలు విషయం: ఈ వుద్యమం అనేకమంది కాంగ్రెస్ నాయకుల్ని - కార్యకర్తల్ని, స్వచ్ఛంద సేవకుల్ని జైళ్ళకు పంపింది.

ఈ అహింసాయుత ఆయుధం సక్రమమైందిగా బుజువైంది. భారతదేశం దానివలన మేలుకుంది. కానీ దురదృష్టవశాత్తు "చౌరీచౌరా" అనే చోట ప్రజాసమూహం ఒక అరడజన్ పోలీసు బృందాన్ని స్టేషన్‌లోనే పెట్టి నిప్పంటించి తగులపెట్టినందువలన అకస్మాత్తుగా, 1922 ఫిబ్రవరి మాసంలో మహాత్మ గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని రద్దుచేశాడు. పరిస్థితులు ఇలా ఆకస్మికంగా పరిణామం చెందిన ఫలితంగా ఆ వుద్యమంలో కాంగ్రెస్ పోరాటపు సమస్య బలబడుతున్నపుడు- ఈ రద్దువార్త ప్రజల్ని ఆశ్చర్య విభ్రాంతుల్నిగా చేసింది. మహాత్మాగాంధీ తన వ్యక్తిగత ఓటమిని ధైర్యంగా అంగీకరించినా, అహింసా

యుత సిద్ధాంతానికే జీవిత పర్యంతరం ప్రాతినిధ్యం వహించాడు. స్వరాజ్యం అనే పదం ప్రజానీకంలో ఒక ప్రముఖ నినాదంగా పరిణమించి నప్పటికీ, దేశంలో అధికభాగం, 1928 వ సంవత్సరం వరకూ, అంటే - సైమన్ కమీషన్ ఇండియాకు వచ్చేంత వరకూ కాంగ్రెస్ కానీ, మహాత్మకానీ ఏ పోరాటాన్ని నడిపించే సమర్థతలో లేరుకాన నిస్తబ్ధత - నిస్తేజతలోవుంది దేశం.

ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకునే నిమిత్తం, ఈ కమీషన్ మహాఘనత వహించిన ప్రభుత్వంచే నియమించబడింది. అంతేకాక దేశంలో రాజ్యాంగ సంస్కరణల్ని ఎంతవరకు అమలు జరుపవచ్చో సిఫార్సు చేయటంకూడా దీని నియామకోద్దేశ్యం. అది అదృష్టమో దురదృష్టమో కాని దానిలో ఒక్కరైనా భారత ప్రతినిధి లేడు. రాయల్ కమీషన్‌లో భారతీయుల ప్రాతినిధ్యం లేకుండా కేవలం పాలకవర్గ ప్రతినిధులతో అది భారతీయ స్థితిగతుల్ని విచారించటం అసంభవమని నమ్మారు. పరిశీలనార్థం పంపబడిన ఆలాంటి కమీషన్ ఆయా సమస్యలకు సరైన నివృత్తి మార్గాల్ని చూపించలేదు; అనికూడా హృదయపూర్వకంగా నమ్మారు. అంతేకాక ఒకవైపు అప్రమత్తుడైవున్న లార్డు ఇర్విన్, ఒకవేళ కాంగ్రెసువారు ఈ విచారణను వ్యతిరేకిస్తున్నప్పటికీ, అది యథాతథంగా తనవిచారణా కార్యక్రమం సాగిస్తూనే వుంటుంది - అని ప్రకటించాడు. 1928 ఫిబ్రవరి రెండవ తేదీన కాంగ్రెస్ ఈ సవాల్‌ను పరిగ్రహించింది. అదే రోజున కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, కొద్ది కాలంక్రిందట యువ

రాజు సందర్శనాన్ని బహిష్కరించి వ్యతిరేకించినట్లే రాయల్ కమీషన్‌ను నల్లజండాలతోను హర్తాల్‌తోను గౌరవించమని ఆదేశించింది. ఫిబ్రవరి మూడవ తారీఖున సైమన్ కమీషన్ బొంబాయిలోనికి కాలుపెట్టింది. దేశం నాయకుల ఆదేశం ప్రకారం పరిపూర్ణతలేని అసంతృప్తికర పూర్తి హర్తాల్‌ను ప్రదర్శించింది. సైమన్ కమీషన్ ఎక్కడెక్కడికైతే వెళ్ళవల్సివుందో అక్కడా యా రైల్వే స్టేషన్లవద్ద, నల్లజండాలతో విజయవంతమైన బహిష్కరణ ప్రదర్శించటానికి నాయకులు దేశమంతటా వుత్సాహంగా పనిచేశారు. ప్రభుత్వం ఈ వుద్యమం అణచటానికి నిర్ణయించుకుంది. అన్ని స్టేషన్‌లవద్ద సమూహాల్ని చెదరగొట్టండనే వుత్తర్వులతో తయారైన పోలీసుబృందాలు పికెటింగుకు పోటీగా నిలువాల్సి వచ్చింది. "సైమన్ తిరిగిపో" అనేనినాదంతో, అహింసాయుత పద్ధతులతో దేశమంతటా కాంగ్రెస్‌వారు శాంతియుతంగా, నల్లజండాలు ప్రదర్శించారు. విపరీతంగా పోలీసుబలం ఏర్పాటు చేసు కున్నప్పటికీ సైమన్ కమీషన్ "వెనక్కుపో" అన్న నినాదం విజయం పొందినప్పుడు వారు వెనక్కుపోక తప్పలేదు. మద్రాసులో ఆందోళనా సమూహాంపై కాల్పులు జరిగినయ్. పంజాబులో లాలా లజపతిరాయ్, సంయుక్తరాష్ట్రాల్లో వుభయ పండితులు, గోవింద వల్లభపంత్, జవహరిలాల్ నెహ్రూలు- పోలీసుల లాఠీదెబ్బలకు గురిఅయ్యారు. లక్నోలో కైజర్‌బాగ్ అనేచోట కమీషన్ విందుచేస్తున్నపుడు గాలిపటాలు, ఆకాశబుట్టలు, "సైమన్ కమీషన్ వెనక్కుపో"

అనే నినాదం వ్రాసి వాగుచూచేట్లు ఎగిరించారు. ఆతరువాత ఆరుమాసాలు ఆచైతన్యం రగులుకునేట్లుచేసి మార్చి 31 వ తేదీన ఇండియానుంచి సైమన్ కమీషన్ నిష్క్రమించింది.

కాంగ్రెస్ అహింసాయుత విధానానికి ఇరువైపులా ఈ సందర్భాన దేశంలో హింసావిధానం కూడా తలఎత్తింది. దేశమంతటా విప్లవచర్యలు జరుగటం, కొంతమంది వున్నత ప్రభుత్వోద్యోగులపై కాల్పులు చేయుటం, ఢిల్లీ శాసన సభలో ఒక బాంబు ప్రేలటం, అనే సంఘటనలుకూడా సంభవమైనయ్.

ఇవి వివిధ విధాలైన దేశైక సంఘటనలు. మరో మారు ప్రజలు ప్రభుత్వంతో సంఘర్షణ పడేట్లు 1929 లాహోర్ కాంగ్రెస్ చేసింది. ఇంతవరకూ కాంగ్రెస్ ఆశయం, అధినివేశ ప్రతిపత్తిఅనే నినాదంతోనే గడిచింది. పరిమిత కోర్కెలనుంచి ముందడుగు వేయాలని 1928 సంవత్సరపు కల కత్తా సమావేశంలో యువకబృందం ప్రయత్నించింది కానీ, వృద్ధనాయకత్వం దీనిని మన్నించి కల్సిరాలేక పోయింది.

ఉన్నపళంగా నెహ్రూ రాజ్యాంగాన్ని బ్రిటిషు పార్ల మెంట్ ఆమోదించక పోయినట్లయితే భారతప్రజకు సంపూర్ణ అధినివేశ ప్రతిపత్తిని రాబోవుసంవత్సరం లోపుగా దారాదత్తం చేస్తునట్లు ప్రకటించక పోయినట్లయితే, అప్పుడు కాంగ్రెస్ దేశానికి, పన్నులు ఇవ్వవద్దు అనే సలహాయిస్తూ అహింసా యుత సహాయ నిరాకరణ పోరాటాలు జరుపాలని, రాబోవు సంవత్సరం వరకూ సంపూర్ణ స్వాతంత్రేచ్ఛ పరిమితం

చేయాలనీ మహాత్మగాంధీ ఆవిధంగా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. అతివాదవర్గానికి నాయకత్వం వహించిన సుభాస్‌చంద్రబోస్, అసలు తీర్మానానికి సంబంధించిన ఒక సవరణను ప్రతిపాదించాడు. బ్రిటీషు ప్రభుత్వం భారతీయ నిజవాంఛల్ని ఎప్పుడూ కొన్ని అసంబద్ధ ప్రకటనల ద్వారా వేటాడుతోందని వాదించాడు. కాబట్టి, కాంగ్రెస్ తదుపరి ప్రకటనల కోసరం ఏమాత్రం నిరీక్షించక తక్షణం సంపూర్ణస్వాతంత్ర్యవాంఛని బహిర్గతం చేయాలని కోరాడు. ఈ సవరణ – దాని సారాన్ని – సారాంశాలనుబట్టి ప్రపంచ మన్ననలు పొందింది. కానీ, అధిక బలసంపన్నుడైన గాంధీజీ పలుకుబడి ఈ సవరణను సులభంగా త్రోసిపుచ్చి అసలు తీర్మానాన్ని నెగ్గించుకుంది.

దరఖాస్తులు, వ్యతిరేకతలు పాలకులహృదయాల్ని కదలించలేక పోయినప్పుడు — దయానుభూతమైన ఈ సంవత్సరమంతాకూడ — కేవలం స్వశక్తిపైనే ఆధారపడితేనే తప్ప భారతదేశం తన అంతిమలక్ష్యాన్ని చేరుకోలేదని కాంగ్రెస్ పునరాలోచించుకుంది. కాన, 1929 డిసెంబరు 31 వ తేదీన లాహూర్‌లో రావీనది ఒడ్డున అర్ధరాత్రి సమయంలో పండిత జవహరిలాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో; ఇప్పటికి సంపూర్ణస్వాతంత్రానికి తక్కువైన ఏపద్ధతినీ ఇండియా ఆమోదించటానికి నిరశిస్తుందనీ, బ్రిటన్‌చే ఇండియా కొరకు తయారు చేయబడిన ఏరాజ్యాంగ మైనప్పటికీ భారత ప్రజలకు, అది అయోగ్యమైందని; ముక్త

కంఠంతో ప్రకటించింది. అనంతరం, జనవరి 26 వ తేదీన, మూల మూలలా, వాడవాడలా దేశమంతటా జరిపిన సభలలో ఆ తీర్మానం మారుమ్రోగింది. భారతజాతీయ స్వాతంత్ర్య ప్రతిపత్తిని సాధించేవరకు స్త్రీ పురుషులు విశ్రాంతి తీసుకో కూడదని ప్రమాణాన్ని స్వీకరించారు.

గతమూడు నాలుగు దశాబ్దాలనుంచీ కాంగ్రెస్ విధా నంలో అనేక మార్పులు సిద్ధించిన విషయం పాఠకులు ముఖ్యంగా గమనించాలి. ఇంతకు పూర్వం కాంగ్రెస్ కొన్ని ప్రత్యేక హక్కుల్ని, దేశపరిపాలనలో అధిక బాధ్యతల్ని మాత్రమే కోరింది. కాని ఇప్పుడు ఒక ప్రముఖమైన మార్పు వచ్చింది. ప్రస్తుతం ఒత్తిడి చేయబడుతున్న విషయం ఏమంటే బ్రిటన్‌తో సంబంధబాంధవ్యాలు లేని సర్వస్వాతంత్ర్యం : అంతేకాని అధినివేశ ప్రతిపత్తికాదు. ఇంతకు ముందు అధిక విమర్శనా స్వాతంత్ర్యాన్ని విస్తృత సంస్కరణల్ని బ్రిటన్‌నుంచి కోరారు. కానీ ఇప్పుడు దాన్ని త్రోసివేయ సంకల్పించారు.

అయితే ఏవిధంగా ఇవి పరాయి విలాసవ్యక్తులపై పని చేస్తాయ్ ? వాస్తవానికి వారు అంగీకరించే దానికి కూడా అవ కాశాలు మృగ్యం. కారణం ? స్వాతంత్ర్యం దయాధర్మ భిక్ష రూపాల్లో ఎవరికీ ఎక్కడా ప్రసాదించబడలేదు. ఎప్పుడూ, సముపార్జించుకోబడింది— అనే సత్యం, మనకు గత అనుభ వాన్ని బట్టి అనుమానరహితంగా తేలిపోతుంది. అనుకున్న "నిరాకరణ" ప్రస్ఫుటమైన మాటలలో కాకపోయినా బ్రిటీష్ పార్లమెంట్ - బ్రిటీషు రాజకీయ వ్యక్తులనుంచి, దాని పత్రికల

నుంచీ అస్పష్టంగా చేరింది. మహాఘనత వహించిన ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన అప్పటి వైస్రాయి లార్డు ఇర్విన్ 1917 సంవత్సరపు ప్రకటననే పునర్వ్యక్తీకరించాడు. ఆ ప్రకటనలో నవీనతేం లేదు. సహజంగా, భారతజాతీయ వాదుల్ని అది ఏమాత్రంమన్నించదు. ఇందుకోసం మరో ప్రయత్నం ద్వారా, తనసహాయ నిరాకరణ ఆయుధానికి మహాత్మ గాంధీ పదును పెట్టాల్సి వచ్చింది. ప్రభుత్వంకూడా ప్రజాహృదయాల్లో జ్వాలాయమానంగా ప్రజ్వరిల్లుతున్న దేశభక్తిని నిరోధించటానికి అనేక ఎత్తుగడల్ని పన్నింది. ఉద్యమాన్ని బలహీన పర్చటానికి చేసిన వత్తిడి భగ్నమైంది. వేలాది స్త్రీ పురుషులు యువకులు జైలు పాలయ్యారు. అఖిల కాంగ్రెస్ సంస్థలు, నౌజవాన్ భారత సభలు, ఇంకా ఇతర రాజకీయ సంస్థలు చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించబడినయ్. దేశనాయకులందరూ బంధించబడ్డారు. వైస్రాయి తన ప్రత్యేక అధికారాల్ని పురస్కరించుకుని వుద్యమాన్ని తరచు అణచటానికి అనేక వుత్తర్వులు జారీచేశాడు. భారతదేశమంతటా నిర్బంధాలు అధికం కావటంచేత నూతనంగా అనేక నిర్బంధ గుడారాలు సృష్టించి కుట్రనేరాలుమోపి అనేకమంది యువకుల్ని వురితీయటం, ద్వీపాంతరవాసానికి పంపించటం సంభవించింది.

ఇలా ప్రజా చైతన్య కెరటవుధృతాన్ని తగ్గించటానికి తీసుకున్న సమస్తచర్యలూ ఫలించకపోయినా తరువాత, భారత ప్రజావాంఛల్ని తెల్సుకునే నిమిత్తం, సమస్త పార్టీల్ని ఆహ్వానిస్తూ బ్రిటీషు పార్లమెంటు లండన్‌లో ఒక సున్నాబల్ల సమా

వేశం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దేశంలో ఉద్యమాన్ని అణచటానికి అమలుజరుపబడుతున్న వత్తిడివిధానానికి నిరసనగా ఆ సమావేశంలో పాల్గొనటానికి కాంగ్రెస్ నిరాకరించింది. ఒక గొప్పరాజకీయ సంస్థపరోక్షంలో ఆ సమావేశం భగ్నమై నామావశిష్టమైంది. ఇక ప్రభుత్వం శాంతికోసరం తహతహలాడ వలసి వచ్చింది. ఈ శాంతి సందేశకులుగా సర్ - తేజ బహద్దూర్ సప్రూ, శ్రీ యం. ఆర్. జయకర్‌లు ముందుకొచ్చారు. మార్చి ఐదవ తారీఖున, ఈ ప్రముఖ శాంతి దూతల కృషి ఫలితంగా మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని రద్దుచేసి, "ద్వితీయ సున్నాబల్ల" సమావేశానికి హాజరయ్యేట్లు, వైస్రాయి ఇరతుల రహితంగా రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేసేటట్లు ఒక మైత్రి ఒడంబడిక కుజరింది.

అఖిల భారత కాంగ్రెస్ యొక్క ఏకైక ప్రతినిధిగా మహాత్మాగాంధీ దాని కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. కానీ "చీలించి పాలించే" సహజధోరణి బ్రిటీషు రాజకీయ వేత్తలు ప్రదర్శించటంచేత ఈ సమావేశ ఫలితంకూడ సున్న! అందుకని మహాత్మగాంధీ తిరిగివచ్చిన వెంటనే 1934 సంవత్సరం వరకూ నిరంతరాయంగా జరిగిన ఉద్యమాన్ని మళ్ళీ ప్రారంభించాడు.

**గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ :—** ఒక సంవత్సరం తదుపరి "1935 ఇండియా గవర్నమెంటు యాక్టు" అనే ఒక చట్టాన్ని తయారుచేసి మొదటికిత్తాగా 1937 ఏప్రియల్ ఒకటవ తేదీన భారతదేశంలో ప్రవేశపెట్టారు.

కాంగ్రెస్‌లోని అతివాతవర్గం, రాజ్యాంగంలోని ప్రధమ భాగమైన రాష్ట్ర ప్రతిపత్తిని అంగీకరించ నిరాకరించారు. కానీ, కాంగ్రెస్ వృద్ధాధినేత దాన్ని అంగీకరించే మొత్తదనం చూపాడు. 1937 సం॥ లక్నో కాంగ్రెస్‌లో పండిట్ జవహరిలాల్ నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో ఈ నూతన రాజ్యాంగం బ్రిటీషురాజ్యం చేతనేకాదు - కేవలం - మోతు రాజ్య ప్రసాదిత మైనప్పటికీ, భారత ప్రజలచేత అది ఏ పరిస్థితుల్లోనూ అంగీకరించ బడవలసిందికాదు; అని బహిరంగంగా ప్రకటించారు. అయినా, కాంగ్రెస్ దాని పరిమితుల్ని పరిశీలించ నిశ్చయించుకుంది. కాగ్రెస్, రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీకి నిలబడి మొత్తం ఇండియాలోని పదకొండు రాష్ట్రాల్లో ఏడింట సంపూర్ణ మెజారిటీ సంపాదించింది.

ఆశ్చర్యకరమైన ఈ ఫలితాలు సాధించకల్గిన తరువాత, మితవాదులు మంత్రివర్గ కార్యాలయాల బాధ్యతని గ్రహించటానికి అంగీకరించారు. అదే సమయంలో వామ పక్షీయులు, కాంగ్రెస్ అలా ఏడురాష్ట్రాల్లోవుండీ, మెజారిటీ బలంతో కృషిచేయ సంకల్పించినప్పటికీ; ఏదారీ తోచని నైరాశ్యాయి - అసెంబ్లీ యంత్రాల్ని రద్దుచేస్తాడని భావించారు. రాజ్యాంగ బహిష్కరణ విధానాన్ని సాగించాలని మహా గొప్పగా ప్రచారం చేసిన పండిట్ జవహరిలాల్ నెహ్రూ, తన అధ్యక్ష స్థానాన్నుంచి రాజీనామాయిచ్చి రావటానికి - కాంగ్రెస్ ఆ విధానాన్ని హర్షిస్తున్నంతకాలం - నిరాకరించాడు. అదే సందర్భంలో కాంగ్రెస్ ఈ అవకాశాన్ని జారవిడచినట్లయితే తాను

దేశానికి బాహాటంగా ఆదేశించగలనని సత్యమూర్తి ఒక ప్రకటన చేశాడు. అప్పుడు ఒక నిరంతర చీలిక కాంగ్రెస్‌లో సంభవిస్తుందని అనుకున్నారు. ఉభయపార్టీలు ప్రకటించుకుంటూ ఖండనమండనల కార్యక్రమంలో చిక్కుకున్నయ్. ఉభయపార్టీల విశ్వాసాన్ని చూరగొన్న మహాత్మాగాంధీ, తృప్తిగా కలహాభోజనం తిన్న అనంతరం ఈ క్లిష్ట సమస్యా నివారణ మార్గానికి ఒక సూత్రం కనిపెట్టాడు.

కాంగ్రెస్ అధ్యక్షుని ఆధిపత్యాన—ప్రముఖ విషయంపై నిర్ణయం జరిపేందుకు — కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం ఢిల్లీలో జరుపటానికి నిశ్చయించబడింది. కాంగ్రెస్ ముద్రతో వచ్చిన అసెంబ్లీ సభ్యులందరూ ఆ సమావేశానికి హాజరుకావాలని కోరబడ్డారు. దైనందిన రాష్ట్ర మంత్రివర్గ పరిపాలనా విషయాల్లో ఆయా రాష్ట్ర గవర్నర్లు జోక్యం కల్పించుకోము అని రాష్ట్ర శాసన సభల్లోని కాంగ్రెస్ నాయకులకు హామీ ఇచ్చినట్లయితే; లభించిన అధికారాన్ని అంగీకరించవచ్చు అని మహాత్మగాంధీ మహాసభలో ఒక సూచన చేశాడు. ఇది ఒక్కటే అలాటి సందర్భంలో తీసుకోవలసిన ఉత్తమచర్య. తద్వారా ఉభయపార్టీలు రెట్టింపు ఉత్సాహంతో దీన్ని అంగీకరించినయ్.

రాష్ట్ర గవర్నర్లు యిచ్చిన హామీదృష్ట్యా గవర్నర్ జనరల్ అయిన లార్డులిన్‌లిత్‌గో సర్వసాధారణ హామీఇస్తూ ఒక ప్రకటన చేసిన అనంతరం, ఆరు రాష్ట్రాల్లో కాంగ్రెస్

మంత్రివర్గాలు ఏర్పడ్డయ్. తదుపరి సరిహద్దు రాష్ట్రంలో — కొంతకాలం వరకు అస్సాంలోకూడా ఏర్పడినయ్.

అమిత శక్తివంతంగా కాంగ్రెస్ మంత్రివర్గాలు పని చేయటం, వారు సముపార్జించుకున్న హస్తులు లేని ఆగౌరవం, వారు వారి కార్యాలయాల్లో కొద్దిన్నరవధిలో పనిచేసి ప్రదర్శించిన పరిపాలనా దక్షత, — బాధ్యతా రహితంగా ఎప్పటినుంచో బ్రిటీషు రాజకీయ వేత్తలు భారతీయులకు స్వపరిపాలన శక్తి సామర్థ్యాలులేవు అని చేస్తున్న వాదనలకు — శాశ్వతంగా తాళాలు వేసినయ్. పరంపరలుగా, లెక్కలేనన్ని లోటుపాట్లు ఇండియా గవర్నమెంటు యాక్టులో వున్నప్పటికీ భారత అహింసావాదులు, సహాయ నిరాకారులు, భావి స్వేచ్ఛాభారతంలో ప్రజానీకానికి రాగల ఒక రాజ్యాంగపు ప్రత్యేకతను ఉదహరణ రూపంలో ప్రదర్శించారు. వారి చేతుల్లోని పరిమిత ఆదాయపు ధనంతో అణగద్రొక్కబడిన రైతాంగానికీ, పీల్చి పిప్పిచేయబడిన కూలీలకు, అద్భుతమైన అవకాశాల్ని కలిపిస్తూ త్రాగుడు, నిరక్షరాస్యత, అమాయకత్వంఅనే బాధలనుంచి తొలగించటానికి మరో వైపు నిరంతర కృషిచేశారు. నాగరీక ప్రపంచాన్ని ఇప్పటి వరకూ తప్పుడు దృక్పథంలో నడిపించటానికి నిరాఘాటంగా తనజండా ఎగిరించిన జాన్‌బుల్ గారడీసమాజం దాని ఘనతని కోల్పోయింది. భారత పరిపాలకులు తమతమ విధానాలలో జొప్పించిన ఆధిక్యతాభావాలకు కాంగ్రెస్ మంత్రివర్గాలు స్వస్తి చెప్పించినయ్.

ఇండియా గవర్నమెంటు యాక్టులోని ద్వితీయ భాగమైన ఫెడరేషన్ విధానాన్ని ప్రవేశపెట్టే విషయం ఆలోచిస్తున్నపుడు తిరిగికొన్ని మాసాలవరకూ కాంగ్రెస్‌లో చీలిక విధిగా వచ్చేట్లు కనుపించింది. చట్టంలోవున్న నేటి ఫెడరల్ స్కీమును కాంగ్రెస్ ముక్తకంఠంతో ఎదిరించి వున్నప్పటికీ మితవాదులు వారిచే చేయబడిన కొన్ని సవరణ ప్రతిపాదనలు చేర్చబడినట్లయితే అంగీకరించటానికి సిద్ధమయ్యారు. ఇంతటితో అనుక్షణ చీలికదృశ్యం కాంగ్రెసులో కనుపించినా ఈసారి కాంగ్రెస్‌లోని జన్మతః అతివాది అయిన విప్లవజ్యోతి బాబూ సుబాస్ చంద్రబోస్ — ఆదినుంచి ఆస్కీమును అతిభీషణంగా వ్యతిరేకిస్తున్న వ్యక్తి — భారతజాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు.

ఈ నూతన అధ్యక్షుడు, ఈపేజీల కథానాయకుడు దేశంకోసరం ఆయనచేసిన త్యాగాలు, సంక్షిప్తమైన ఆయన జీవితం, అందులోని అభిప్రాయాలు – ఆశయాలు; రాజకీయ రంగంలోని ఆయనచర్యలు ఎలా సమీకరించబడిందీ; ప్రపంచంలో ఒక సామ్రాజ్యానికి ఒక సందర్భంలో ఎలా వ్యతిరేకంగా వ్యవహరించిందీ తన సహచరులుపై మరోసందర్భంగా ఎలా తిరుగుబాటుచేసిందీ; ఏవిధంగా ఏరూపంలో వున్న ఆయన సిద్ధాంతాలకు గౌరవం లభించిందీ ఈ పుస్తకంలోని తదుపరి కొద్ది అధ్యాయాల్లో విశదీకరించ బడింది.

# ఖైదీ

**జాతీయ విశ్వ విద్యాలయాలు:-** 1921వ సం॥ చివరి భాగంలో మాత్రం, సుభాస్‌బోస్ కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమాల్లో కాలుపెట్టాడు. మహాత్మగాంధీ సహాయ నిరాకరణోద్యమం ఆ సందర్భంలో ప్రారంభించబడింది. అసంఖ్యాకంగా వైద్యులు, న్యాయవాదులు, తమతమ వృత్తులకు స్వస్థి చెప్పటం, ప్రజలు తమ సాధారణ పదవుల్ని వదలిపెట్టటం, సంభవించింది. అనేక రాష్ట్రాల్లో తమ గొప్పనాయకుడైన మహాత్మాగాంధీ ఆదేశానుసారంగా; లెక్కకు మించిన విద్యార్థులు చదువుల్ని ఆపివేశారు. ఉద్యమంలో తమతమ పాత్రల్ని గ్రహించటానికి, విద్యాలయాల్ని వదలివచ్చిన విద్యార్థులందరికి, తదుపరి విద్యావిధానం సాగించటానికి, అదేమాదిరి విద్యాలయాలు ప్రారంభించాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల్లో వున్న స్థానిక నాయకుల ఆధ్వర్యాన, అనేక రాష్ట్రాల్లో జాతీయ విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడినయ్.

పంజాబ్‌లోని జాతీయ విశ్వవిద్యాలయం, ఆ రాష్ట్రానికే మకుటం లేని చక్రవర్తి - ప్రజానాయకుడు అయిన, శ్రీ లాలాలజపతిరాయి ఆధ్వర్యాన; అదే సందర్భంలో కలకత్తాలోని "గాండీయ విద్యాయతన్" అనే పేరుతో, భారతీయ విశ్వవిద్యాలయం, సి. ఆర్. దాస్ ఆధ్వార్యాన పెట్టబడినయ్. సుభాస్ బోస్‌యొక్క అద్భుతశక్తి అమోఘ ప్రవర్తనలపైన

విశ్వాసం వుంచిన శ్రీ దాస్, తన ఆ భారాన్ని బోస్ బుజాలపై మోపాడు.

సాధారణ పాఠకులకి, సుభాస్‌బోస్ యూరప్‌లో వున్నది: కేవలం విద్యాసమాప్తి కోసమే ననే భావంస్ఫురిస్తుంది; కానీ ఇది సత్యం కాదు. ఆ పరాయి దేశంలో, ఆయన అంతర్జాతీయ రాజకీయ విద్యార్థిగా, ఐ. సి. యస్. విద్యార్థిత్వానికి ఏమాత్రం తీసిపోకుండా పరిశీలించాడు. ఐరోపా యూనివర్శిటీల నుండీ, అంతులేని సారాన్ని పిండీ, ఆ అనుభవాన్ని అట్టేపెట్టి, ఇప్పుడు కలకత్తాలోని జాతీయ విశ్వవిద్యాలయానికి, ప్రధానాచార్యుడుగా పనిచేస్తూ, దానిని అమలుపెట్టే అవకాశం ఆయనకు లభించింది. ఇతర ప్రభుత్వ పోషణక్రిందవున్న కాలేజీల మాదిరిగాక, ఈ విశ్వవిద్యాలయంలో, ప్రప్రథమంగా విద్యార్థులకు నేర్పేదేమిటంటే: దేశభక్తి – త్యాగాలు. స్వాతంత్ర్య మనేమంత్రం ప్రతి విద్యార్థి నరాల్లోనికి జొప్పించేటందుకు, ఈయన ప్రధానాచార్యుడు తన శక్తివంచన లేకుండా కృషిచేశాడు. అంతేకాక స్ఫురద్రూపి – ప్రఖ్యాత వేత్తయిన సి. ఆర్. దాస్ అండదండలుకూడ వారికి అన్నివిధాల లభించినయ్.

ఫలితం : – దేశభక్తి త్యాగయుక్తమైన శిక్షణ. మేధస్సుకు – రచనాశక్తికి తోడ్పడి అనేక మంది భావి భారత వీరుల్ని తయారు చేసింది. కొంతకాలం వరకూ ప్రభుత్వం జాతీయ విశ్వ విద్యాలయాల్ని సహించింది. కానీ, అసూయ – అసహానత అనేవి అభివృద్ధి పొందుతున్నకొద్ది నిరుత్సాహ విధానం

అమలు జరిపింది. ప్రధానాచార్యుని చర్యలు ప్రమత్తతతో సేకరించిన బెంగాల్ ప్రభుత్వం మొగ్గలోనే ఈ శక్తిని త్రుంచి వేయటానికి తహతహ లాడింది.

ఇదే సందర్భంలో ఆయన బెంగాల్ రాష్ట్రకాంగ్రెస్ కమిటీ ప్రధాన ప్రచారకోద్యోగిగా కూడా పనిచేశాడు. బెంగాల్ కాంగ్రెస్ చర్యలపై ఎవరు ఏ విమర్శన తీసుకవచ్చినా బోస్ ఇచ్చే సహేతుకమైన సమాధానాలు ప్రతికక్షుల నోళ్ళు మూయిస్తూ ప్రజలకు తర్కయుక్తంగానూ - తృప్తిగానూ ఉండేవి. ఆయన విషయాన్ని గూర్చి "స్టేట్స్‌మన్" పత్రిక ఇలా వ్రాసింది.

"సుభాస్ చంద్రబోస్ ఇచ్చిన ఐ. సి. యస్. రాజీనామా వలన కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికి అసమాన శక్తియుక్తుడైన ఒక ఉద్యోగి దిట్టలభ్యమయ్యాడు. బ్రిటిష్ ప్రభుత్వం ఒక చురుకైన ఉద్యోగిని పోగొట్టుకున్న చలుపుగను చూపింది. విమర్శనలు సందేశాలు సమాధానాలు చెప్పటంలో సిష్టా ప్రభుత్వాన్ని ఎందుకూ కొరగానిదిగా చేశాడు బోస్."

**యువరాజు రాక - మొదటి ఖైదు :-** ఆవస్యకత తొందరగా వచ్చింది. ఇండియాకు వేల్సు యువరాజు వచ్చే సందర్భంలో "భారతజాతీయ కాంగ్రెస్" ఆ సంబంధమైన కార్య కలాపాలన్నిటినీ బహిష్కరించింది. యుద్ధసమయపు ప్రణాళికల్ని భగ్నపరచి నందుకు జలియన్‌వాలా బాగ్ కాల్పులు దురంతరాలు జరిపినందుకు, నల్లబిల్లులు ప్రవేశపెట్టి

సందుకు దేశం కోపభూయిష్టమైంది. ప్రభుత్వవిధానానికి నిరసనగా యువరాజు సందర్శనాన్ని కాంగ్రెస్‌నాయకులు బహిష్కరిస్తూ ప్రకటించారు. ఇదొక క్లిష్టసమయం. ఏ నాయకులైతే యుద్ధకాలంలో అత్యుత్సాహంతో బ్రిటన్‌కోసరం యుద్ధంలో చేరండని ప్రచారంచేశారో వారే మహాఘనత వహించిన వారి జ్యేష్ఠ పుత్రుడైన, రాబోవు భారతచక్రవర్తి అయిన యువరాజు సందర్శనాన్ని బహిష్కరించారు.

1921 నవంబరు 17వ తారీఖున యువరాజు దేశానికి రావాల్సివుంది. అతని సందర్శన సమయంలో పూర్తిహర్తాల్ అమలుజరిపి నిరసనగా నల్లజండాలు ప్రదర్శించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. చక్రవర్తిగారి తరఫున ప్రపంచ యుద్ధంలో భారతదేశం చేసిన సహకారానికి సద్భావంతో భారత ప్రజానీకానికి యువరాజు అభివందనాలు తెలుపటానికి వస్తున్నాడని అధికార యుక్తమైన ప్రకటనలు వెలువడినయ్. ఉత్సవ ఊరేగింపులకు బదులు ఆయన బొంబాయిలోనికి అడుగుపెట్టిన రోజు మహాత్మగాంధీ బహిష్కరణ దినంగా ప్రకటించాడు. నాయకుని పిలుపును ప్రజలు గౌరవించారు. ఎక్కడెక్కడికైతే యువరాజు వెళ్తున్నాడో అక్కడరాజ్యాంగ నిర్ణీత ప్రదేశంలోనెవుండి ప్రజలు బ్రిటీషు విధానానికి నిరసన ప్రదర్శించారు.

నిర్ణయం ప్రకారం యువరాజు డిశంబరు 25 న అంటే 'క్రిస్‌మస్' పండుగరోజున కలకత్తాను సందర్శించ వలసివుంది. ఒక హెచ్చరిక చర్యగా ఒకనెల ముందుగా బెంగాల్ జాతీయ స్వచ్ఛంద సేవకాదళాన్ని ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ప్రకటిం

చింది. ఆసదర్భంలో సుబాస్ చంద్రబోస్ నాయకత్వం క్రింద వున్నయ్ అవన్నీ. రాష్ట్రఖిలాఫత్ కమిటీకి కలిసిన బెంగాల్ రాష్ట్రకమిటీ, ప్రభుత్వఉత్తర్వును ధిక్కరించటానికి నిర్ణయించుకుంది. తత్ఫలితంగా ప్రముఖ నాయకులతో సహా దేశబంధుదాస్, ఆయన భార్య, కుమారుడు, మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్, సుబాస్‌బోస్ వీరంతా అరెస్టు చేయబడి వివిధరకాల శిక్షలకు గురియై జైళ్ళకు వెళ్ళారు. ఇండియాలోకెల్లా బ్రహ్మాండమైన ఈ పట్టణం నాయకత్వ రహితంగా ఉన్నపుడు, ఇప్పుడు నిరాటంకంగా యువరాజ సందర్శనం జరుగుతుందని భావించారుగానీ దేశబంధు సి ఆర్. దాస్ బెంగాల్‌ను ఉద్రేకపరిచే ఒక ప్రకటన చేశాడు. " నేను నా మణికట్లకు వేయబడిన బేడీల బరువును, శరీరంపైనున్న ఇనుప గొలుసుల భారాన్ని మోస్తున్నాను. ఇదే బానిస బ్రతుకులోని బాధ. విశాల భారతదేశమే ఒక విస్తృతఖైదు. కాంగ్రెస్ కార్యక్రమం అలాగే సాగిపోతుండాలి. నేను తీసుకుపోబడినా, లేక, మీకు దూరమైనా లెఖ్ఖేమిటి ? నేను చచ్చినా బ్రతికినా లెఖ్ఖేమిటి ? "

సుబాస్‌బోస్ విపరీత కృషితో కూడిన బెంగాల్ ఏకైక నాయకుని ఈసందేశం మానసికంగా బెంగాల్ ప్రజలపై బాగ పనిచేసిన ఫలితంగా చివరకు పూర్ణహర్తాల్ జరుపటానికే పట్టణం తీర్మానించుకుంది.

హౌరా స్టేషన్‌లో అడుగు పెట్టినంతనే యువరాజు పట్టణంలోనికి దారితీశాడు. వ్యాపార కేంద్రాలతో కిటకిటలాడుతున్న ఈ బ్రహ్మాండమైన పట్టణం ఒక్కమారు జన

శూన్యమైన ఎడారివలె మారిపోయింది. మొత్తమీద పట్టణమంతా దైన్యదుఃఖ వాతావరణాన్ని ప్రదర్శించింది. అంతులేని ఆ భవనాలు బ్రిటీష్ పతాకాలతో అలంకరించ వలసిన దానికి బదులు నల్లజండాలు పిట్టగోడలపై ఎగురుతున్నయ్. సుభాస్ బోస్ నాయకత్వాన కలకత్తా పౌరులు బ్రిటీషుప్రభుత్వ విధానంతో దేశం తృప్తి పడలేదని సామ్రాజ్య సింహాసన వారసునికి తెలియజేశారని ఒక్కమాటతో చెప్పవచ్చు.

రాజసందర్శన సందర్భంగా తీసుకున్న వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రముఖ నాయకులందరూ దేశమంతటా అరెష్టు కావించబడి, జైళ్ళలో నిర్బంధించబడ్డారు. అదే నేరారోపణ క్రింద సుభాస్‌బోస్ కూడా మొట్టమొదటి మారు అరెష్టయి ఆరుమాసాలజైలు శిక్షకు పాత్రుడయ్యాడు. ఆయన దీర్ఘకాల శిక్ష తప్పదనుకున్నపుడు; మాజిస్ట్రేట్ శిక్షను ప్రకటించినప్పుడు ఆశ్చర్యపోయి "ఆరుమాసాలేనా ! అయితే నేనొక కోడిపెట్టను దొంగలించానన్నమాట !!" అని అన్నాడు.

**బోస్‌యొక్క - సేవ:—** బోస్ ఈ ఆరుమాసాల జైలు జీవితం చిత్తరంజన్‌దాస్‌తో గడిపాడు. ఈ బంధిఖానాలోన దేశబంధుదాస్ యొక్క మహత్తరశక్తి సామర్థ్యాల్ని ధృఢత్వాన్ని బోస్ తెల్సుకోగలిగాడు. దేశబంధుకు జైలులో సుబాస్ వంటచేసి పెట్టాడు. కార్యదర్శిగా పనిచేశాడు. అనేక సందర్భాల్లో దాస్‌కు నైతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడుగా కూడా బోస్ వ్యవహరించాడు.

పూర్తిశిక్షను అనుభవించిన తరువాత 1922 సెప్టెంబరు మాసంలో సుభాస్ విడుదలయ్యాడు. ఈ సందర్భంలో బెంగాల్ ప్రజానీకం ఒక వినాశస్థితిలో ఉన్నారు. వేలాది స్త్రీలు - పురుషులు - పిల్లలు రాష్ట్ర ఉత్తరభాగంలో సంభవించిన గంగావరదల ఫలితంగా గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టబడి 'నిర్వాసులై దరీదిక్కు-లేని వారయ్యారు. జైలువాసం కొత్త అయినప్పటికీ అది ఆయన శక్తిని కుంటుపర్చలేకపోయింది. వరదప్రాంత ప్రజానీకపు కష్టగాథల్ని విన్న ఆయన హృదయం కరిగిపోయింది. తక్షణం స్వచ్ఛంద సేవకదళంతో వరద ప్రాంతానికి పరుగులుతీసి సహాయార్థనిధి వసూలు చేయటంలో ఆయన నిమగ్నుడైనాడు. కలకత్తా ఫిలాంత్రపిస్టు అయిన 'పి. సి. రే' అధ్యక్షత క్రింద ఒకవరద బాధితుల విముక్తి సంఘం ఏర్పడింది. దీనికి బోస్ కార్యదర్శి.

ప్రభుత్వప్రోత్సాహం లేకపోయినప్పటికీ నాల్గు లక్షల రూపాయలనిధి - బట్టలు - పశుగ్రాసం, తిండిగింజలు విరివిగా లభించినయ్. తరువాత బెంగాల్ ప్రభుత్వంకూడా 20 వేల రూపాయల చందా ఇచ్చింది. అమిత స్వల్పవ్యవధిలో బాధితులకు విముక్తి కలిగించబడింది. ఈ సహాయ కార్యవిధానానికి విస్మయుడైన వైశ్రాయి లార్డులిట్టన్ శాంతాహార్ లో ఒక వ్యక్తిగత సందర్శన సందర్భాన ఆయన కృషికి తృప్తిపడి అభినందనాలు తెలిపాడు.

**ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు :**—కాంగ్రెస్‌లో సుభాస్ బోస్ ప్రవర్తన 1922 వ సంవత్సరం తో ప్రారంభమౌతుంది.

సి. ఆర్. దాస్ అధ్యక్షతన కాంగ్రెస్ వార్షిక సమావేశం డిసెంబరు మాసంలో గయలో జరిగింది. ఇది కాంగ్రెస్ సమావేశాల్లో ఒక ముఖ్యమైన సమావేశం. దానిలో శాసన సభా ప్రవేశ సమస్యపైన రేగిన వాదోపవాదాలు కాంగ్రెస్‌లో నిరంతర చీలికకు దోహదమిచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షుడు బాయికట్లు మొ॥ కార్యక్రమాలకంటే శాసనసభలో ప్రవేశించినందు వలన అసలు సమస్యను ముందుకు తీసుకు పోవచ్చునని హృదయ పూర్వకంగా నమ్మేవారిలో ఒకడు. 1917 వ ప్రకటన సూత్రాన్ని గట్టిగా అంగీకరించిన మితవాదులతో రాజీ పడటానికి సహితం అతివాద భావాలు కలిగిన దేశబంధు అంగీకరించాడు. ఫలితం: కాంగ్రెస్ సంస్థలోనే అంతర్భాగంగా స్వరాజ్యపార్టీ ఏర్పడింది. సి. ఆర్. దాస్‌ను దాని నాయకునిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కేంద్ర శాసనసభా ఎన్నికల్లో పోటీకి నిలబడటమే పార్టీ ప్రణాళిక.

దేశబంధుకు రాజకీయంగా కుడిచేయి అయిన సుభాస్ బాబుకు ఆపార్టీ ఉద్దేశ్యాల్ని కార్య విధానాల్ని దేశంలో ప్రచారం చేసేభారం అప్పగించబడింది. "ఫార్వర్డ్" అనే ఒక ఇంగ్లీషు దినపత్రిక ఈ కార్యవిధానం జయప్రదం చేసేందుకు ప్రారంభించబడింది. సంపాదక వర్గంలో ప్రధానస్థానం సుభాస్ బాబుకు లభించింది. ఈ ఉభయ ధర్మాల్ని ఆయన సమర్థతో నిర్వహించిన ఫలితంగా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అత్యధిక సంఖ్యాక బలంతో అనుకున్న దానికంటే ఎక్కువ సభ్యత్వాలులభించినయ్. ఈఎన్నికల్లో విజయంవలన సుభాస్‌బోస్‌కు

ప్రముఖ నాయకుడైన దేశబంధు హృదయంలోనే కాక దేశ మంతటాకూడ స్థానం లభించింది.

1924లో స్వరాజ్యవాదులు కలకత్తా పురపాలక సంఘానికి ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలబడి అత్యధిక సంఖ్యా బలాన్ని సాధించారు. దేశబంధు మేయర్‌గా ఎన్నికైనాడు. సుబాస్‌బోస్ నెలకు 1500రూపాయల జీతంతో దానికి ప్రధాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఏప్రియల్ 24వ తేదీన నియమించ బడ్డాడు. ఇంతకుముందు కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుకు నెలకు మూడువేలజీతం ముట్టుతుండేది. అయితే, బోస్‌మాత్రం ప్రజాక్షేమం దృష్ట్యా ఈ మొత్తాన్ని 15 వందలకు తగ్గించు కున్నాడు. ఈసమయంలో ఈయన వయస్సు 27సం॥ రాలు మాత్రమే! అనేకమంది ఆయన అభివృద్ధిని చూచి అసూయ పడేవారు. ఇంతటిచిన్న వయస్సులో అంతగురుతరమైన పనిని కట్టబెట్టటం 'తప్పు' అని ఈ నియామకాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వం కూడా ఈ నియామకాన్ని అంగీకరించటానికి బాధ పడింది. "విపరీతమైన నిరసనతో — వారి అంగీకారం ఇచ్చే టందుకు, విధినియమావళి ప్రకారం, గత్యంతరం లేకపోయింది." అని బోస్ తన స్వతమాటల్లో ఈనియామకం పై నిర్వచించాడు.

ఈ యువ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు అనధికారిగా ఉన్న పుడే, అనుమాన రహితంగా, రాష్ట్రమంతటా తనసేవాత్యాగ తత్పరతలకు ప్రతిఫలంగా, అఖండమైన పలుకుబడిని సంపా దించాడు. అయితే భారతదేశంలోని ప్రధాన పురపాలక సంఘ మైన కలకత్తా కార్పోరేషన్ ఉద్యోగిగా వుంటూ ఆరోగ్య -

విద్య – తదితర లాభసాటి సంస్కరణల్ని రాత్రింబగళ్ళు విశ్రాంతిలేకుండా కృషిచేసి సాధించి ప్రతివారిచేత ప్రేమించబడ్డాడు. తనకు లభించే జీతంలో అధికభాగం ఎప్పుడూ బీద పిల్లలకు స్టయిఫండ్, అలవెన్సుల రూపంలో పంచిపెట్టి వారి ప్రేమాదరాభిమానాల్ని చూరగొన్నాడు.

ఒక చురుకైన రాజకీయవేత్త, ఒక సమర్థుడైన పరిపాలకుడు, విజ్ఞానశక్తియుతుడై అందుకుతోడుగా నమ్మిన మిత్రుల తోడ్పాటు ఎప్పుడు సులభంగా లభిస్తుందో అప్పుడు అలాంటి అదృష్టకర ఫలితాల్ని మాటలతో చెప్పేదానికంటే ఊహించుకోవటమే మంచిది. కలకత్తా మున్సిపాలిటీ స్వరాజ్యవాదులచేత ఆక్రమించుకో బడినప్పుడు, దేశబంధు — సుబాస్‌ల మధ్య అలాంటి సంయుక్తత వ్యక్తమైంది. మొత్తం పరిపాలనా విధానం సంపూర్తిగా మారిపోయింది. నిరంకుశ పాలన స్థానంలో ప్రజాస్వామిక పద్ధతివచ్చి నిలచింది. క్రొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, ఆల్డర్‌మెన్, మేయర్లతోసహా స్వదేశ ఖద్దరుదుస్తులు ధరిస్తుండే వారు. ఇలా కార్పొరేషన్ ఖాదీ యూనిఫారంగా మారిపోయింది. మున్సిపల్ పార్కులకు, వీధులకు, రస్తాలకు భారతమహానాయకుల నామకరణలు చేయబడినయ్. వైస్రాయీలకు గవర్నర్లకు, తదితర ఉద్యోగులకు, వారు పట్టణం చూడవచ్చినపుడు, ఇంతకు ముందునుంచీ ఆహ్వానిస్తుండే ఆచారం రద్దయిపోయి జాతీయ నాయకులకు ఆ గౌరవం ఇవ్వబడింది. ఉచిత ప్రాథమిక విద్య పౌరులకు కల్పించే అవకాశాలు ప్రారం

ధించ బడినయ్. ఉచిత వైద్యాలయాలకు తోడుగా ఒక పాల పొయ్యి పేదపిల్లలకు పాలుసరఫరాచేసే నిమిత్తం ఏర్పాటు చేయబడింది. మొట్టమొదటిసారిగా కార్పోరేషన్‌లోని బ్రిటీష్ ఉద్యోగులు 'మనం యజమానులంకాదు సేవకులం' అని విమర్శించి చూచుకుని బాధ పడసాగారు. అప్పటికీ, ఏ వుద్యోగి అయినా పదవీ ధీమాను కాని, జాత్యాహంకారం కాని చూపి నట్లయితే, స్వరాజ్యవాది అయిన మనఎగ్జిక్యూటివ్ ఆఫీసరు తగిన బుద్ధి చెప్తాడు అని ఋజువైంది.

కాలనిర్ణయం లేకుండా అచ్చం జాతీయ కార్యకర్తల పెత్తనాన్ని ప్రభుత్వం యథావిధిగా సాగనిచ్చేట్లు లేదు. ఆయన ఆరు మాసాలు అతికష్టంగా ఆఫీసులో ఉండగలిగాడు. 1924 అక్టోబరు 25 వ తేదీ ఉదయం కలకత్తా పోలీస్ డిప్యూటి కమీషనర్ ఆయన్ను ప్రక్కమీదనుంచి లేపి బెంగాల్ ప్రభుత్వ ఉత్తర్వుక్రింద జారీచేయబడిన అరెస్టువారెంటు చూపించాడు.

ఈ ఉత్తర్వు అక్టోబరు 24 వ తేదీ అర్ధరాత్రి బెంగాల్ ప్రభుత్వానికి, విచారణలేకుండా వ్యక్తుల్ని అరెస్టుచేసి నిర్బంధంలో ఉంచటానికి ఇచ్చిన ప్రత్యేక అవకాశం వలన జారీ చేయబడింది. ఆ మరుసటి ఉదయమే అది అమలులోనికి వచ్చింది. రాష్ట్రమంతటా పోలీస్ పెచ్చరిల్లి శాసన సభ్యులతో సహా అనేకమంది ప్రముఖకాంగ్రెస్ వాదుల్ని పట్టుకుని నిర్బంధించి తుడిచిపెట్టినట్లు చేసింది. దీనికి ముందు స్వరాజ్యవాదులు బెంగాల్ ఉద్యోగుల నిరంకుశత్వానికి పాడెకట్టారు. ఆ కార

ణంగా అసంఖ్యాక నిర్బంధాలు జరిగినయ్. సుభాస్ తన స్వంత మాటలల్లో. "స్థానిక సంస్థల్లో (ముఖ్యంగా కలకత్తా మున్సిపాలిటీలో) శాసనసభల్లో, తారకేశ్వరంలో స్వరాజ్యవాదులు తెచ్చిన వత్తిడి ప్రభుత్వ నరాల్ని బలహీనపర్చటం, విప్లవవాదుల కుట్ర ఇక కొన్ని ఘడియల్లోనే వుందని ఉద్యోగవర్గాలు క్షమాపణకోరుతూ బైటకు రావటం, అందుకని పరిస్థితులు సుళ్ళితిమించి రాగాన పడకముందే అరెస్టులు చేయుటం ఆ నాటి బహిరంగ వాతావరణం."

వేల్సు యువరాజు రాక సందర్భంలో సుబాస్ స్వరాజ్య వాదుల ఎన్నికల సంరంభంలో వున్నాడు. అంతేకాక ఎగ్జికూ్యటివ్ ఆఫీసరు హోదాలో ఆయన ఎంతపలుకుబడి సంపాదించాడంటే విచారణ లేకుండా ఆయన్ను జైల్లో నిర్బంధించి ఉంచటం అమిత కష్టం అని అధికారులు గుర్తించేంతవరకు. తమ ప్రేమాభిమానాల్ని చూరగొన్న నాయకుని నిర్బంధానికి నిరసనగా ఒకవైపున ప్రజానీకం భీషణఘోష ప్రారంభిస్తుంటే మరోవైపున "ది స్టేట్స్‌మన్" - "ఇంగ్లీషుమన్" అనే రెండు ఆంగ్లో ఇండియన్ దిన పత్రికలు ఆ సమస్యని నిర్వచిస్తూ "విప్లవ బృంద కుట్రకు తలకాయ" వంటివాడని సుభాస్‌ను అధికారులు చేసిన అరెస్టుకు వంత పాటలు పాడినయ్.

**మేయర్ సవాల్:—** ఆంగ్లో ఇండియన్ దిన పత్రికలు చేసిన నేరారోపణలకు కాంగ్రెస్ వర్గాలలో గొప్ప కోపాగ్ని చెలరేగింది. అందుకోసరం వారిమీద పరువునష్టానికి పరిహారార్థం, కేసులు పెట్టారు. పత్రికలకు ఆ నేరారోపణల్ని

ఋజువుచేయటానికి [illegible] సాక్ష్యమేదీ లభించలేదు. అందుకని ఆయన్ను [illegible] అభియోగం ఋజువు చేసేందుకు తగిన సహాయం చేయమని బెంగాల్ పోలీస్ అపరాధ పరిశోధక [illegible] పట్టారు. అదే మాదిరి ప్రయత్నం [illegible] సహాయం పొందేదానికి చేశారు. [illegible] నాభాసం సాగింది. డిఫెన్స్ [illegible] వారి మీద ఏలాంటి [illegible] తీసుకోలేదు. ఆకస్మికంగా [illegible] చేయటం వలన కార్పొరేషన్ [illegible]. అధికార్లు అందరు [illegible] అలాంటి పర్యాయం [illegible] లోన వుండే మున్సిపల్ [illegible]. ఒక పోలీస్ ఉద్యోగి కాపలా [illegible] అనుపూర్తి పనులకు సంబంధించి [illegible] రెండు మాసాల వరకు జైలులోనికి మోసుకు పోయి [illegible].

సుభాస్ బాబుకి దగ్గర సంబంధమున్న దేశబంధు ఈ ప్రాసిక్యూషన్ విషయంలో [illegible] అధికంగా బాధ పడ్డాడు. ఆయన [illegible] నుండి కార్పొరేషన్ సమావేశంలో ఒక ప్రముఖమైన ఉపన్యాసం ఇచ్చాడు. "దేశాన్ని ప్రేమించటమే ఒక అపరాధమైతే నేనుకూడా అపరాధినే! సుభాస్ చంద్రబోస్ ఒక అపరాధి అయితే నేనూ ఒక అపరాధినే!! కార్పొరేషన్ ప్రధాన ఎగ్జిక్యూటివ్

ఆఫీసరేకాదు; ఈ కార్పొరేషన్‌కు మేయరైన నేనుకూడా అతనికి సమానమైన నేరస్తుడ్నే" ఆ తరువాత ప్రధాన ఎక్జిక్యూటివ్ ఆఫీసరు చేసిన పనులకు బాధ్యత వహించమని బెంగాల్ ప్రభుత్వాన్ని సవాల్ చేశాడు. అదే నేరంక్రింద తననికూడా అరెస్టు చేయడానికి దమ్ములుంటే ముందుకు రమ్మని ప్రభుత్వానికి ఎలగీశాడు. ప్రజల విపరీత ఆందోళన శక్తికి అధికార్లు తట్టుకోలేక అరెస్టుచేసిన ఒక మాసంలోపల ఆయన్ను విడుదల చేయుటానికి ఆలోచనలు జరిగినయ్. అయితే ఆ విడుదల పోలీస్ గౌరవానికి ఒక వెన్నుపోటు అని గ్రహించిన తరువాత ఆ నిర్ణయం రద్దుపర్చుకుని ఆయన్ని ఆలీపూర్ జైలుకు మార్చారు. అతి కష్టంగా 'ఆలీపూర్' 'బర్హాంపూర్' జైళ్ళలో మూడుమూసాలు గడిపిన అనంతరం 1925 జనవరి 25 న తారీఖున మాండలే జైలుకు మార్చబడినట్లు ఆకస్మిక ఉత్తర్వులు వచ్చినయ్. ఆమరుసటి మాపిటికి చీకటిముసుగులో "అసిస్టెంట్ ఇనస్పెక్టర్ జనరల్" అయిన 'మిష్టర్ లోమన్' క్రింద ఉన్న సాయుధ పోలీస్ పహరాతో సుబాస్ బోస్‌ను మరి ఏడుగురు ఆయన సహచరుల్ని ఒక జైలువానులో ఎక్కించి తీసుకుపోయారు.

రాజకీయ నేరస్థుల్ని నిరుత్సాహపరిచేటందుకు భయపెట్టేందుకు సృష్టించబడిన ఆమాండలేజైళ్ళను నేరస్థులుగా వున్న దేశభక్తులు వాటిలో నివశించటానికి సగర్వంగా ఆహ్వానించారు. ఒకప్పుడు వారిజైలు మార్పిడీ జీవిత కథను చెప్పూతూ సుభాస్ వ్రాశాడు: "అయితే లోకమాన్య బాలగంగాధర

తిలక్ ఆరుసంవత్సరాలు వరకు, లాలాలజపతిరాయ్ ఒక సంవత్సరం వరకూ నిర్బంధించబడింది – ఈ స్థలంలోనేనని నేను బాగాగుర్తు పెట్టుకున్నాను. కాబట్టి ఆ నాయకుల అడుగుజాడల్లో మనం నడుస్తున్నాం అనే ఆత్మతృప్తికి ఢీమాకు హేతువైంది.

ఈజైలు మార్పిడీవార్త ఆయన తల్లి గంద్రులకు చేరగానే "మేం సుభాస్ బాబును చూచి గర్విస్తున్నాం" అని అప్రయత్నంగా అన్నాడాయన తండ్రి.

**మహాండలేస్వర్గాల దీవెనలు:-** బర్మాలో ఆయన జైలు జీవితానికి సంబంధించిన ఒక అతిముఖ్య సంఘటన జరిగింది. ప్రపంచంలో ఏమూలైనాసరే బెంగాలీ కుటుంబం ఉంటే సంవత్సరానికి ఒకమారు ప్రతిఇంటా కూడా బెంగాల్ జాతీయ పండుగైన "దుర్గపూజ" జరుపబడుతుంది. 1926వ సం॥ లో అది అక్టోబరు 25వ తేదీన వచ్చింది. భారతదేశంలోని "అత్యంత ప్రమాదకరమైన ఎనిమిదిమంది వ్యక్తులు" అని ఇంగ్లండునుంచి ఒక "ప్రిజన్ కమీషనర్ అయిన మిష్టర్ పీటర్‌సన్" నిర్వచించినట్లు ఆ ఎనిమిది మంది బెంగాల్ రాష్ట్ర బందీలు వారి సహజ అలవాటు ప్రకారం ఉత్సాహంతో తమజాతితోపాటు భాగం పంచుకోవటానికి దుర్గపూజ చేసుకునే అవకాశాలు అవసరపడే నిధులు ఇవ్వాలని కోరారు. రంగూన్ ప్రజలు సమావేశమై ఒక సానుభూతి తీర్మానాన్ని అంగీకరించారు.

'సీక్రెట్ ఫండ్స్' - సూపరింటెండెంట్ - ఆయన స్వంత బాధ్యతలో వారి కోర్కెను మన్నించి అంగీకరించినా, ప్రభుత్వం అందుకు సమ్మతించినట్లు కనుపించదు. తత్ఫలితంగా 1926 ఫిబ్రవరిలో ఆకలిసమ్మె ప్రారంభించారు. ఈవార్త ఏ విధంగానైతేనేం బైటకువచ్చి ప్రజా హృదయాల్లో భయానకమైన తుఫాన్ లేపింది. ఒక పక్షం రోజుల్లో అధికార్లకు మోకాళ్ళు ముడతలు పడి యస్. అంతటితో కావల్సిన డబ్బు తదితర పూజాసరాలు ఇవ్వటానికి ఒప్పుకుని రాబోవు ఉత్సవాలకు ఆమోదించి సమ్మె విరమింపచేసుకుంది.

ఆయన విచారణ విషయంలో ప్రభుత్వం రెండేళ్ళు నిశ్శబ్దంగావుంది. బెంగాల్ ప్రజలు బహిరంగ న్యాయస్థానంలో ఆయనమీద విచారణ జరగాలని పదేపదే కోరినా ప్రభుత్వం అణుమాత్రమైనా చలించలేదు. 1926 నవంబరులో బెంగాల్ కాంగ్రెస్ మనోమార్గం వెతికింది. ఈ సమయంలో బెంగాల్ శాసనసభకు తిరిగి నూతన ఎన్నికలు జరుగుతయ్. సుభాస్ చంద్రబోస్ ఆయన సహచరుడైన యస్. సి. మిత్ర పేర్లను బెంగాల్ కాంగ్రెస్ సంఘం చెరొక నియోజక వర్గానికి అభ్యర్థులుగా వారిదివరకే అంగీకరించినందుకు నియమించింది. బలీయమైన ప్రత్యర్థులు ఉన్నప్పటికీ ఉభయులు అత్యధిక సంఖ్యాక బలంతో నెగ్గారు. శాసనసభలో బైటకూడా ఇంతకాలంలో ఆ ఇద్దరినీ విడుదల చేయటానికి విపరీతమైన ఒత్తిడి వచ్చినా ప్రభుత్వ కార్యవిధానం అలాగ సాగింది.

భారత రాజకీయ విద్యార్థులకు మాండలే జైలులో ఎన్ని స్వల్ప అవకాశాలు ఉన్నాయో బాగా తెలుసు. ఎప్పుడైతే నాయకులు అక్కడ శిక్ష అనుభవించి తిరిగి వస్తారో అప్పుడు వారి అనుభవాల్ని వేదికలనుంచి పత్రికలద్వారా ప్రకటించే వారు. అది భూలోక నరకంగా వర్ణించబడుతూ ఉండేది. సుభాస్ బాబు అలాంటి వాతావరణానికి ఎప్పుడూ అలవాటుపడి ఉండ లేదు. కాబట్టి ఆయన జబ్బు పడ్డాడు. కొద్ది వ్యవధిలో ఊపిరి తిత్తులకు 'బ్రాంకో న్యుమోనియా' జబ్బు తటస్థించింది. దాని వలన 40 పౌనులు బరువు కోల్పోయాడు. 1927 ఏప్రియల్ మాసానికి ఆయన మంచంలోనుంచి కదలలేనంత అశక్తుడైనాడు. పరిస్థితి ప్రమాదానికి సమీపంగా ఉందని వైద్యులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఎన్నడూ కనివిని ఎరుగ నంత అశక్తుడయ్యాడు. భారీఎత్తుగా బెంగాల్ ప్రజలు ఆయన్ను షరతుల రహితంగా విడుదల చేయాలనీ ఆందోళన చేశారు.

దీనిద్వారా ప్రభుత్వం బోసును రంగూనుకు మార్చి లెఫ్టినెంట్ కలనల్ కేల్సల్ బోస్ సోదరుడు సునీల్ చంద్ర బోస్‌లతో కూడిన ఒక వైద్యసంఘం నియమించింది. వారు సంయుక్తంగా చేసిన సిఫార్సు ననుసరించి రంగూన్‌నుంచి ఏ భారత రేవులోనూ ఆగకుండా సరాసరి ఆయన స్వంతఖర్చులపై వైద్య సహాయత తీసుకునే నిమిత్తం, స్విట్జర్లాండ్ వెళ్ళటానికి — తను అంగీకరించే పక్షంలో — అనుమతించ బద్ధమని ప్రభుత్వం తరఫున 'మోబర్లీ' బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్లో తెలియ జేశాడు. బోస్ ఇంతటి క్షీణదశలో ఉన్నప్పటికీ ప్రభుత్వం

చూపిన ఈ అవకాశానికి ఏ మాత్రం చెలించలేదు సరికదా నిర్బంధ విముదలకంటే నిర్బంధ చానే మేలని నిశ్చయించు కున్నాడు.

ఈ సందర్భంగా 1927 ఏప్రియల్ నాల్గవ తేదీన శరత్ చంద్రబోస్‌కు ఒక ఉత్తరం వ్రాశాడు.

"గతరెండేండ్లుగా ప్రభుత్వం నన్ను పెట్టిన హింసలు మర్చిపోయినట్లుంది. వాటన్నింటినీ అనుభవించింది నేనుకాని ప్రభుత్వంకాదు. అక్రమంగా నన్ను దుర్భర నిర్బంధంలో పెట్టింది. నన్ను నిర్బంధంలో పెట్టినా ఈనాటివరకూ నాపై ఆధారపడిన వారెవ్వరికీ ఏవిధమైన జీవన భృత్యాన్ని ప్రభుత్వం ఇవ్వలేదు. నేను ఒక తుదివిన్నపాన్ని వ్రైశాయికిపంపితే దాన్ని కూడా బెంగాల్ ప్రభుత్వం త్రొక్కిపెట్టింది. ఇదంతా ఇలా ఉన్నపుడు పైగానన్ను మూడేళ్ళపాటు యూరప్ ప్రవాస నిర్బంధంలో ఉండమంటుంది. ఆ యూరప్ ప్రవాసానికి కావలసిన డబ్బు దస్కం నన్నే చూచుకోమంటుంది. ఇది ధర్మసమ్మతమైన ఏర్పాటేనా? 1924 లో నేను ఎటువంటి ఆరోగ్యంలో ఉన్నానో అటువంటి యధాస్థితిలోనే నన్ను తిరిగి విడుదలచేయాలన్న నైతిక ధర్మబుద్ధి సహితం ప్రభుత్వానికి లేకపోవటం చాలా శోచనీయమైన విషయం. అంతేకాకుండా (1) యూరప్‌కు వెళ్ళేందుకు డబ్బు ప్రభుత్వమే భరించాలి. (2) పోయేముందు స్వకుటుంబీకుల్ని బంధువర్గాన్ని చూడాలి. (3) ప్రవాసా నంతరం ఏనిర్బంధం ఉండకూడదు."

**మరో ఉత్తరంలో:**— "బంధిఖానాలో ఇలా అవస్థలు పడటం ఇదివరకు భారతజాతి చేసిన తప్పుల పరిహారార్థంగా తరుగుతున్న తపస్సుగా మనం భావించు కుంటున్నాం. ఇంతమాత్రానికే మన భావాలు ఒక తరంవారి నుంచి మరో తరంవారికి వ్యాప్తి చెందుతయ్. ఈ నమ్మిక ఒక్కటే నాకీ అవస్థల్ని ఎదుర్కొవటానికి కావలసిన నైతిక శక్తిని సమకూర్చుతుంది."

బోస్‌నుంచి ఏదైనా ఒకహామీపుచ్చుకునే విషయంలో వారి ప్రయత్నాలన్నింటా పప్పులో కాలువేసిన ప్రభుత్వోద్యోగులు షరతులు లేకుండా విడుదల చేయటంతప్ప వేరే మార్గం కనుపించలేదు. వాస్తవానికి ఈ బెంగాల్ చైతన్య యువకుడు జారిపోయినట్లయితే ఆ బరువును భరించలేమని భయపడ్డారు. ఈ విపరీత భారాన్నుంచి తప్పుకోవాలని ప్రయత్నించారు. ఇదో తమాషా: ఆయన ఆరోగ్యం కోసరం 'ఆల్మోరా' కు మార్చాలని ఉత్తర్వులు నిస్తూ 1927 మే 15 వ తేదీ ఉదయం రంగూన్ నుంచి ప్రయాణమై వస్తున్న ఒక పడవలో బోస్‌ను వెనక్కి తీసుకవచ్చి హుగ్లీ ముఖద్వారంలోవున్న 'డైమండ్ హార్బర్' లో పడవను లంగర్ వేసి ఉంచారు. డాక్టర్ సర్ నీలరతన్ సర్కార్, డాక్టర్. బి. సి. రాయ్, లెఫ్టినెంట్ కల్నల్ శాండ్స్, మేజర్ హడ్సన్, ఐ. యం. యస్. (మహాఘనత వహించిన ప్రభుత్వంవారి ప్రత్యేక వైద్యునితో కూడిన మరో వైద్యసంఘం) మహాఘనత వహించిన బెంగాల్ గవర్నర్‌తోసహా లాంచీలో వుండగానే

పరీక్షించటం సంభవించింది. ఆ రోజంతా అలా ఆ లాంచీలోనే ఆయన గడిపాడు. ఆ మరునాటి ఉదయం అపరాధపరిశోధక శాఖా పోలీస్ ప్రముఖుడు షరతులు లేకుండా విడుదలకు అనుమతించిన ఒక టెలిగ్రాం చూపించాడు.

"నేనిప్పుడు నా స్వగృహం చేరుకున్నాను. నేను మొదట నా ఆరోగ్యం చక్కబడటం చూచుకోవాలి. మళ్ళీ సాధ్యమైనంత త్వరలో ఆ తరువాత నా వెనుకటి సేవాకార్యక్రమాన్ని అనుసరించాలి, ఇదే నా నిర్ణయం" అని సందేశమిచ్చాడు. ఈ విధంగా 1927 మే 16వ తేదీన మూడు సంవత్సరాలు దుర్భరజైలు జీవితం గడిపిన తరువాత స్వేచ్ఛ లభించింది. ఆయన నిర్బంధంలోనికి తీసుకపోబడేముందు ఆరోగ్యవంతుడుగా యువరక్తం ఉరకలు వేస్తుంటే కలకత్తా ప్రధాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పనిచేసే మేధావి. కానీ విడుదలానంతరం, శల్యాకారంతో జబ్బుతో పక్కమీద ఆరోగ్యం - తేజస్సు - తెలివి పూర్తిగా కోల్పోయి కదలలేని పరిస్థితిలో ఉన్నాడు. ఇవన్నీ మాండలే స్వర్గాల మహా దీవెనలు.

ఇంకా పూర్తి ఆరోగ్యం పొందకముందే పాట్నాలో ఉపన్యసిస్తూ "మనం జబ్బుపడటానికి వీలులేదు. మన దేశ ప్రస్తుతస్థితిలో మనం జబ్బుతో మూల్గుతూ ఒకచోట కూర్చోవటానికి ఏమాత్రం వీలులేదు." అని చైతన్యాన్ని పురికొల్పాడు.

**కాంగ్రెస్ జనరల్ శెక్రటరీగా బోసు:—** ఇదే సమయంలో దయారహితంగా ఇనుప హస్తాలు చాచిన క్రూర

మృత్యుదేవత స్వరాజ్యోద్యమాలకు వీరుడైన, బెంగాల్ రాష్ట్రపు ప్రముఖ నాయకుడైన దేశబంధు చిత్తరంజన్‌దాస్‌ను దేశంనుంచి అదృశ్యం చేసింది. ప్రజానీకం సుభాస్‌బోస్ వైపు రాష్ట్రాన్ని నడిపే విషయంలో అర్రులుచాచుకుని చూస్తూ వూరుకుంది. కాబట్టివిడుదలానంతరం, కొంతకాలంవరకూ, ప్రక్క మీాదనేవుండి, వెనుకటి ఆరోగ్యాన్ని పొందినతరువాత ఆయన రాజకీయ కార్యక్రమం ప్రారంభించాడు. ఆయన ప్రత్యేక రాజకీయ నైపుణ్యతకు పసి వయసులో ప్రదర్శించిన అసంఖ్యాక త్యాగాలకు గౌరవ సూచకంగా బెంగాల్ ప్రజానీకం దేశబంధుదాస్‌కు వారసుడుగా నియమించుకొంటూ బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు.

ఢిల్లీ ముస్లింల ప్రముఖ నాయకుడైన డాక్టర్ అన్సారి అధ్యక్షతన భారతజాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం మద్రాస్‌లో బోస్ విడుదలానంతరం ఆరుమాసాలకు జరిగింది

ఇంతకుముందు దేశబంధుచేత నడిపించబడిన బెంగాల్ ప్రతినిధి బృందం సుబాస్ నాయకత్వాన ఇప్పుడు మహాసభకు హాజరైంది. అక్కడే పండిట్ జవహరిలాల్ నెహ్రూ, సాహెబ్ ఖ్యూరేషీలతోపాటు బోస్ బాబునుకూడా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమించారు.

**సుబాస్‌బోస్ ప్రథమ తిరుగుబాటు :—** అనేక మార్లు నెహ్రూ కమిటీసమావేశమూటం, అన్ని పార్టీల సమావేశం ఈ సంవత్సరం నూతన రాజ్యాంగ సిద్ధాంతాల్ని గురించి

చర్చించటానికి జరుపబడటం వలన 1928 వ సంవత్సరానికి ఒక ప్రత్యేకతఉంది. దేశ ఆర్థిక - సాంఘిక - రాజకీయ స్థితిగతుల్ని "కోరబడిన బాధ్యతాయుత ప్రభుత్వం ఏ పరిమితి వరకు ఏర్పర్చవచ్చో —" దేశంలో విచారించే నిమిత్తం సైమన్ కమీషన్ పేరుతో రాయల్ కమీషన్ ఒకటి భారతదేశానికి వచ్చింది.

చెప్పుకోతగిన అధిక సంఖ్యతో నెహ్రూకమిటీ రాజ్యాంగపు పునాదిగా అధినివేశ స్వాతంత్ర్యం "సంపూర్ణ స్వాతంత్ర్యం అంతిమలక్ష్యంగాగల, రాజకీయ సంస్థల స్వాతంత్ర్యాన్ని కుదించకుండా" అంగీకరించ బడింది. లక్నోలో జరుపబడిన అఖిల పార్టీ సమావేశంలో నెహ్రూకమిటీ రిపోర్టు ప్రతిపాదించ బడింది. కానీ ఉడుకురక్తం ఉప్పొంగిన యువకులు మహా ఉద్ధృతంగా దాన్ని ఎదుర్కొన్నారు.

సుభాస్‌బోస్ వంటి వ్యక్తులు వృద్ధనాయకుల రాజ్యాంగపు కుట్టులంటే అంత ప్రేమ చూపించలేక పోయారు. వారు ఈ సమావేశం జరుగటంతోనె తృప్తిపడలేదు. అధినివేశ స్వాతంత్ర్య ప్రతిపత్తి భారతదేశ అంతిమలక్ష్యంగా వారు గుర్తించింది; వామ పక్షీయులందరూ ఏకమై లక్నోలో ఒక మహా సభ జరిపి పండిట్ జవహరిలాల్, సుభాస్‌చంద్రబోస్ సమక్షంలో ఇండిపెండెన్సులీగ్ అనే పేరుతో ఒక ప్రత్యేక సంస్థగా ఏర్పడి సమైక్యతకు భంగంలేకుండా నెహ్రూకమిటీ నిర్ణయాలకు - అదేమాదిరి అఖిల పార్టీ సమావేశ నిర్ణయాల్ని ధిక్కరించటానికే అంగీకరించింది. ఇక్కడ ఈ తిరుగుబాటుబృందాన్ని మొట్ట మొదటి సారిగా సుభాస్‌బోస్ లేవదీశాడు. కాంగ్రెస్ నియమా

వళికి భిన్నంగా ప్రత్యక్షమైన రాజీబేరగాళ్ళని ఎదిరించటానికి ధైర్యంగా ముందడుగు వేశాడు.

**వివిధ సంఘటనలు :—** ఆ సంవత్సరపు రెండవ ముఖ్య సంఘటన ఏమంటే, సైమన్ కమీషన్ భారత దేశానికి రావటం : భారత జాతీయ కాంగ్రెస్ నల్లజండాల ప్రదర్శనలతోటి ఆ సంబంధమైన అన్ని ఉత్సవాల్ని, ఊరేగింపుల్ని విందుల్ని వ్యతిరేకించ నిశ్చయించింది. తన జీవితంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదంతో ఎడతెగనిపోరు సాగించటానికి నిలబడిన – అతివాద రక్తం పొంగులుతీస్తున్న సుబాస్‌బోస్ సైమన్ కమీషన్‌రాక సందర్భములో దేశాన్ని సక్రమంగా నడుపమని అర్థించాడు.

"ద్వివిధంగా కాంగ్రెస్ కార్యవర్గ ధైర్యంగా ఉన్నట్లయితే 1930 వ సం. పు ఉద్యమం రెండు సంవత్సరాలకు ముందుగా ప్రారంభమై ఉండే దనటంలో ఏమాత్రం సందేహం లేదు. అంతేకాక సైమన్ కమీషన్ నియామకమే అలాంటి ఉద్యమానికి నాందియై వుండేది." ఇవి ఆయన స్వంతమాటలు. శ్రీయుత బోస్ 1928 మే మాసంలో మహాత్మాని సబర్మతిలో వున్న ఆయన ఆశ్రమంలో దర్శించినప్పుడు, అనేక రాష్ట్రాల్లో తాను స్వయంగా చూచివచ్చిన ప్రజా ఉత్సాహాన్ని నివేదించి తన అలసటనుంచి ముందుకువచ్చి దేశానికి నాయకత్వం వహించమని అర్థించాడు. ఆ సందర్భంలో మహాత్మా సమాధానం : తాను ఏ వెలుగూ చూడడం లేదనీ బార్డోలీ లైతాంగం పన్నుల నిరాకరణ ప్రదర్శన చేయుటం తన కండ్ల

ముందు తాండవిస్తుందనీ వారు పోరాటానికి సిద్ధంగా వున్నారనీ చెప్పాడు.

పైన బోస్ చెప్పిన ఉత్సాహమనేది వుట్టినే మాటలతో వర్ణించలేదు. గత ఐదారు మాసాలబట్టి అనేక సమావేశాలకు హాజరైనందువలన 'ఆ చైతన్యానికి' ఆయన ప్రత్యక్ష సాక్షి. 1928 మే మాసంలో 'పూనాలో' మహారాష్ట్ర సమావేశానికి అధ్యక్షత వహించాడు. పండిట్ జవహరిలాల్ నెహ్రూ అధ్యక్షతక్రింద కలకత్తాలో ఆగష్టు మాసంలో జరిగిన అఖిల బెంగాల్ విద్యార్థి సమావేశానికి, ప్రముఖ బొంబాయి ముస్లిం నాయకుడు కె. యం. నారీమన్ అధ్యక్షతన డిసెంబర్‌లో కలకత్తాలోనే జరిగిన అఖిలభారత యువజన మొదటి మహాసభకు ఆహ్వానించబడ్డాడు. ఈ సమావేశ ఆహ్వానసంఘ అధ్యక్షుడుగా బోస్ గాంధీ విధానానికి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా చేసిన బహిరంగోపన్యాసం వలన దీనికి ఒక ప్రత్యేకత సిద్ధించింది. ఆయన తన నివేదికలో మహాత్మాగాంధీ సబర్మతీ ఆశ్రమంనుంచి బోధించే అహింసా సాంఘిక అవిధేయతలకు (Passivism) తభిన్నంగా అరవిందఘోష్ పాండిచేరి ఆశ్రమంనుంచి చైతన్యతను (Activism) బోధిస్తున్నాడు. అని ఉద్బోధించాడు. భౌతిక దృష్ట్యా జీవిత నవీనతను కూడా ఆయన పొగిడాడు.

**కలకత్తా కాంగ్రెస్** (1928) :- కడకాక పోయినా కనీసం 1928లోని ప్రముఖ ప్రత్యేకత భారతజాతీయ కాంగ్రెస కలకత్తా వార్షిక సమావేశంలో వుంది. కాంగ్రెస్‌లోని ఇరు

పక్షాల మధ్యఉన్న అగడ్త పెరిగినట్లు ద్యోతమైంది. "నెహూ్రు రిపోర్టు" అక్షరాల అంగీకరింప బడాలని పండిట్ మోతీలాల్ వర్గం పట్టుబడితే గత సంవత్సరమంతా నిరాటంకమైన అధికారాన్ని ప్రబోధించిన యువకబృందం "సంపూర్ణ- స్వాతంత్ర్యంకోసరం" నిలబడింది. మొత్తంమీద "ప్రస్తుత రాజకీయ వాతావరణ దృష్ట్యా, 1921 డిశంబరు 31వ తేదీలోపుగా బ్రిటీష్ పార్లమెంట్ చేత నెహూ్రు రాజ్యాంగవిధానం, ఉన్నపళంగా అంగీకరించ బడినట్లయితే కాంగ్రెస్ దానిని ఆమోదిస్తుంది. అయితే ఆ తేదీలోపల అది అంగీకరించని పక్షంలో లేక దీనికి ముందుగానే తృణీకరణ గోచరించే పక్షంలో కాంగ్రెస్ దేశానికి పన్నుల నిరాకణకు సలహాయిస్తూ అహింసాయుత సహాయ నిరాకరణ పోరాటాన్ని ప్రారంభిస్తుంది. ఆ తదుపరి విషయాలు అప్పటికి నిర్ణయించ బడతయ్, అనే రాజీతీర్మానంతో మహాత్మా ముందుకు దూకాడు.

మద్రాస్ కాంగ్రెస్‌లో ఆమోదించ బడిన సంపూరణ స్వాతంత్ర్య తీర్మానానికి ఉన్న 'పురి'ని మహాత్మా ప్రవేశపెట్టిన తీర్మానం కుంచిస్తుందంటూ బోస్ తీర్మానంపై ఉపన్యశించాడు.

"1921 డిశంబరు 31వ తేదీలోపుగా నెహూ్రు నివేదిక సూచించిన ప్రకారం అధినివేశ ప్రతిపత్తిని బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశానికి ప్రసాదిస్తే కాంగ్రెస్ దానికి తయారౌతుంది. ఇక ఇంతటితో కాంగ్రెస్ శాశ్వతంగా అధినివేశ ప్రతిపత్తి ఆశయాన్ని అంటిపెట్టుకొని దానితో తృప్తిపడి ఊరుకుం

టుందన్న మాట. అధినివేశ ప్రతిపత్తితోనే తృప్తిపడి ఆశయం మేరకే ఉండటమంటే మేము సుతరామూ అంగీకరించము. ఈ నాడే అధినివేశ ప్రతిపత్తి దారాదత్తం చేయబడినా అదే మనజాతీయఆశయంగా మేం అంగీకరించలేం. స్వాతంత్ర్యం అనేది ఏనాడో వచ్చేదికాదు. అది ఈ క్షణాన్నే సిద్ధించటం మా రాజకీయ ఆశయంగా పరిగణిస్తాం" అంటూ గాంధీ తీర్మానానికి సుభాస్ క్రింది సవరణ ప్రతిపాదించాడు.

"కాంగ్రెస్ (మద్రాస్) సమావేశంలో ఆమోదించిన సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం 1928 లో జరిగే ఈ కలకత్తా సమావేశంలో మేం మళ్ళీ ఆమోదిస్తున్నాం. ఆలక్ష్యం అలానే ఉంటుంది. అంతేకాక బ్రిటిష్ ప్రభుత్వ జోక్యం లేకుండా చేసుకుంటేనే కాని నిజమైన స్వాతంత్ర్యం లభ్యంకాదు అనికూడా ఈ సభవారు నమ్ముతున్నారు."

ఈ సవరణ ప్రతిపాదిస్తూ బోస్ ఇలా ఉపన్యసించాడు.

"ఊరికె సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం చేసినందువల్ల మనకు జరిగేదేమిటని మీరనవచ్చు. తద్వారా, మనలో ఒక నూతన ధోరణి – నూతన తత్వం ప్రారంభమౌతయ్. అసలు మనరాజకీయ పతనానికి ముఖ్యకారణం ఏమిటి? అనేదే మన తత్వానికి సంబంధించిన విషయం. మనం ఈ తత్వాన్ని – బానిసత్వాన్ని పోగొట్టుకోవాలంటే మన ప్రజానీకాన్ని సంపూర్ణ స్వాతంత్ర్యంకోసరం పోరాటానికి ఉద్యుక్తులుగా చేయకతప్పదు. నేను మరొక విషయంకూడా చెప్తున్నాను – ఒకవేళ మనం

ఈ తీర్మానంశాన్ని కార్యరూపేణ ఆచరణలో పెట్టే విష యంలో విఫలులమౌతామనుకోండి. అయినా, మన ప్రజలకు ఒక ఉన్నత ఆదర్శం చూపించిన వాళ్ళమౌతాం. ఉన్నత ఆశయాలు - మహోన్నత ఆదర్శాలు కలిగి ఉండటంలో తప్పేముంది ? అలా స్వాతంత్ర్యాన్ని గురించి ప్రచారంచేస్తే మనకళ్ళఎదుట ఒక ఆకర్షవంతమైన చిత్రాన్ని సృష్టించిన వాళ్ళమౌతాం. తద్వారా, ఒక క్రొత్తఆవేశంగల నూతన భారత జాతిని సృష్టించగలుగుతాం. కానీ ఇకముందు మనం చేతులు ముడుచుకొని కూర్చోము అని నేను హామీయిస్తు న్నాను. అప్పటికప్పుడే, భారత యువక బృందం, తమ విద్యుక్తధర్మాన్ని గ్రహించి తద్విధంగా కార్యక్రమం అనుష్టించ టానికి సన్నద్ధమౌతుంది. అయితే మనం ఒక జీవం ఉన్న కార్య క్రమాన్ని నిర్ణయిద్దాం. అలా నిర్ణయించిన దాన్ని అలక్ష్యం చేసే అగత్యం ఏర్పడదు. బెంగాల్‌కు సంబాధించినంతవరకూ స్వాతంత్ర్యమంటే సంపూర్ణ స్వాతంత్ర్య మనే నిర్వచనానికే జీవంవుంది; జాతీయోద్యమం ప్రారంభమైన నాటినుంచీ నేటి వరకూ 'స్వాతంత్ర్యం' అంటే 'అధినివేశ ప్రతిపత్తి' అని మేం ఏనాడూ వ్యాఖ్యానం చెప్పలేదు. ఈ అధినివేశ ప్రతిపత్తి అనేది మన యువకుల క్షేమాత్రం గిట్టదు. యువజనులే భావిభారత భాగ్యోదయులనే మాట మనసులో పెట్టుకోండి"

ఈ తీర్మానం ఓటుకుపెట్టగా సవరణకు అనుకూలంగా 973 ఓట్లు, వ్యతిరేకంగా 1350 ఓట్లు రావటంతో అది వీగి పోయింది.

అయితే బోస్ తన స్వంతమాటల్లో "వామపక్షం కోరిన కనీస కోర్కెలో కనీస భాగంకంటే మించి - అధికంగా వారు అవకాశ మిచ్చిందేముంది ? అని వర్ణించాడు ఫలితంపైన ఓటమిని ఆమోదిస్తూ. ఆ విధంగా తాను ఒక సవరణ తెచ్చి తన తిరస్కారపు ఉపన్యాసంలో కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యానికి ఏమాత్రం తక్కువైనా అంగీకరించరాదు; అని ధృవీకరించాడు. పండిత జవహారిలాల్ నెహ్రూకూడ ప్రపంచ మన్ననల పొందిన ఆ గొప్ప సవరణను బలపరుస్తూ గంభీరోపన్యాసం చేశాడు.

అసలు గాంధీజీ తీర్మానం పెద్ద మెజారిటీతో తృణీకరించబడేట్లు గోచరించింది. అలా జరిగితే అది వామపక్షానికి అఖండ విజయం. కాబట్టి 'అసలు - తీర్మానాన్ని' బలపర్చే వారు; ఒకవేళ మహాత్మ ఓడించ బడేట్లయితే ఆయన కాంగ్రెస్ నుంచి వైదొలగి విశ్రాంతి తీసుకుంటాడని బైటపెట్టారు. సాధు-సన్యాసి - పవిత్రజీవిత విధానాలతో ప్రజా మనస్తత్వాన్ని లొంగదీసుకున్న దేశంలో జాతీయ నిర్ణయాన్ని మార్చటానికి ఆమాత్రపు మాటచాలు. కాబట్టే జాతి గాంధీ నాయకత్వం కోసం ఆ ప్రముఖ సవరణను ఓడించింది.

1929 లాహోర్ కాంగ్రెస్ ఘడియలు సమీపిస్తున్నయ్. 1928లో బ్రిటన్ దయా దాక్షిణ్యాలకు వదలి పెట్టబడిన సమయం సమావేశ సమయానికి ముగిసి పోవస్తుంది. కలకత్తా కాంగ్రెస్ సందర్భంలో వామపక్షం చూపించిన

బలం మహాత్ముని తబ్బిబ్బులు చేస్తూనేవుంది. కాబట్టి ఈసమా వేశంలోరాబోవు గడ్డు పరిస్థితిని ఎదుర్కోవటానికి ఒక అతి సమర్థుడైన రాజకీయపు ఎత్తులెరిగిన, పరిస్థితిని అదుపులోనికి తేగలిగి పోరాటాన్ని సమయింప చేయగలిగిన బలీయమైన అధ్యక్షుడు కావాల్సివుంది.

**కాంగ్రెస్‌లో కలకలం:-** అధ్యక్ష స్థానానికి గాంధిజీ పేరు ప్రతిపాదించబడింది. కానీ ఆ బాధ్యత తీసుకోవటానికి ఆయన తృణీకరించాడు. పోతే ఇక ఆ అవకాశం గుజరాత్ రైతాంగాన్ని మేల్కొలిపిన సందర్భంలో అత్యంత ఉత్సాహాన్ని ధైర్యాన్ని ప్రదర్శించి, ఉద్యమాల్ని నడిపి బార్డోలీ వీరుడనిపించుకున్న సర్దార్ పటేల్ కు వుంది. అయితే ఈ ప్రతిపాదన గాంధీజీకి ఇష్టంలేని కారణం ఏమంటే, ఆయనకు ప్రతిపక్ష బలమెంతో బాగ వూహించి గ్రహించగలిగిన శక్తివుంది. ఒక సంవత్సరంక్రింద చెప్పనలవికాని యువలోక చైతన్యం, ఆయన కండ్లముందు తాండవిస్తుంది. పూనా, అహమ్మదాబాద్, నాగపూర్ లలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ శ్రీమతి కమలాదేవి ఛటోపధ్యాయ, సుభాస్ చంద్రబోస్ లు అధ్యక్షత వహించి విజయవంతం జేసిన యువజన సమావేశాలు లాహోర్ లో బోస్ అధ్యక్షతక్రింద జరుపబడిన విద్యార్థి సమావేశం ఇవన్నీ కలసి రాబోవు సమావేశానికి పునాది అయితే వామపక్ష సమైక్యం ఎంత బలవత్తరమైందో ఈ లాహోర్ సమావేశంలో దానిఫలితం కనుపిస్తుంది. కాబట్టి

మహాత్మ అధ్యక్ష ఎన్నికలో అమిత ఎత్తుగడలు పన్ని జాగ్రత్త పడవలసిన అవసరం కనుపించింది.

"వామపక్ష ప్రత్యర్థిత్వాన్ని పడగొట్టాలంటే మహాత్మ గాంధీ పండిట్ జవహర్‌లాల్ నెహూ్రను తనవైపుకు త్రిప్పు కోవటం అత్యంత అవసరం. మళ్ళీ కాంగ్రెస్‌పై ఇంతకు ముందున్నటువంటి ఎదురులేని పెత్తనం— మహాత్మునకున్న అవకాశం బుజువైంది. అయితే కాంగ్రెస్ వామపక్షపు దురదృష్టం కూడా ధృవపడింది. ఏవిధంగానంటే, ఆసంఘటన మహాత్మాగాంధీ—పండిత జవహరిలాల్ నెహ్రూల మధ్య రాజకీయ ఒడంబడిక జరుగటానికి దోహదం కల్పించింది. అదేమాదిరి సమైఖ్యత నెహ్రూకు కాంగ్రెస్ వామపక్షానికి కలుగటానికి దోహద మిచ్చింది...బాహ్య ప్రవర్తనలో ఆయన అధ్యక్షుడుగా ఎన్నిక కావటం నూతనాధ్యాయ సృష్టికి హేతువైంది. అప్పటినుంచీ పండిత జవహరిలాల్ నెహ్రూ మహాత్ముని అమితంగా, శాశ్వితంగా బలపర్చేవాడుగా మారిపోయాడు." అని బోస్ దీనిపై స్వయంగా వ్రాశాడు. మరొకప్పుడు అంటే 1934 సం॥లో తన పుస్తకంలో ఏం వ్రాశాడంటే:

"— పండిత జవహరిలాల్ నెహ్రూ స్థానం చాలా తమాషాఅయింది. ఆయన ఉద్దేశ్యాలు అభిప్రాయాలు వామపక్షవిధానంలో వుంటయ్. తనంతట తానే పక్కా-సోషలిష్టునని చెప్పుకుంటాడు. అయితే ఆచరణలోమాత్రం గాంధీజీని నమ్మినబంటు, ఒకవిధంగా ఇలాచెప్పటం సమంజసమేమో—

ఆయన మనసు అతివాదులవైపు, హృదయం మహాత్మా గాంధీ వైపు."

సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం:— సమావేశ దినం శీఘ్రంగా సమీపిస్తుంది. అధ్యక్షస్థానానికి ఎన్నిక పూర్తి అయ్యేటట్లున్నా బ్రిటీషు ప్రభుత్వం మాత్రం సంధి తీర్మానాన్ని గురించి ఏ చర్యా తీసుకున్నట్లు తోచదు. సంపూర్ణ స్వాతంత్ర్య నినాద పిలుపుకు దేశం సిద్ధమై 1929 అక్టోబరు 31వ తేదీ కోసరం నిరీక్షిస్తుంది. 1929 అక్టోబరు అంటే రెండు మాసాలు ముందుగా లార్డు ఇర్విన్‌తోను "మహా ఘనత వహించిన ప్రభుత్వంచేత అధికారం పొంది 1917లో సహజంగా జారీచేసిన ప్రకటనలో భారత రాజ్యాంగాభి వృద్ధి యుక్తంగా క్రమేణ అధినివేశ ప్రతిపత్తిని సాధించటం ప్రభుత్వం ఆశయం" అని ఆ సమస్యపైనున్న సందిగ్ధతను పోగొడ్తూ ఒక ప్రకటన చేశాడు. తరువాత మరో ప్రకటన చేస్తూ, సైమన్ కమీషన్ నివేదిక ప్రకటించబడిన వెంటనే ఒక సున్నాబల్ల సమావేశం జరుపబడుతుందని వ్యక్తపరిచాడు.

ఈ ప్రకటన కనుపడిన వెంటనే అఖిలపార్టీల నాయకులు తిరిగి ఢిల్లీలో సమావేశమై వైస్రాయి ప్రకటనకు సంతోషపడుతూ, అధినివేశ ప్రతిపత్తిగల రాజ్యాంగాన్ని తయారు చేసేటందుకు మహాఘనత వహించిన ప్రభుత్వ సహకారం లభించగలదని విశ్వసిస్తున్నాం, అంటూ అత్యధిక సంఖ్యాబలంతో ఒక ప్రణాళిక తయారుచేయ నిశ్చయించుకున్నారు. ఆ ప్రణాళిక

మీద సంతకం చేసిన వారిలోకెల్లా ఈ దిగువవారు ముఖ్యులు. మహాత్మాగాంధీ, పండిత మూర్తిత్రయం – మోతీలాల్, జవహారిలాల్, మాళవ్యాలు–డాక్టర్ అన్సారి, డాక్టర్ మూంజి, సర్దార్ పటేల్, రైట్ హానరబుల్ శాస్త్రి, సర్ తేజ్ బహుద్దూర్ సప్రూ, శ్రీమతి అనెబీసెంట్, శ్రీమతి సరోజనీనాయుడు.

సుబాస్ బోస్ ఏ విధంగానూ ఆ ప్రణాళికకు అనుకూలంగా లేడు. కాంగ్రెస్ ముందుకు పోవటమే ఆయనవాంఛ. అందుకని ఆ ప్రణాళికపై సంతకం చేయకుండా నిరాకరించాడు. అంతేకాక, సున్నాబల్ల సమావేశంలో పాల్గొనటాన్ని ఖండిస్తూ అధివేశ ప్రతిపత్తిఅంగీకారాన్ని వ్యతిరేకిస్తూ మరో ప్రణాళికను ప్రకటించాడు. తృణీకరణ ప్రణాళికపై సంతకం పెట్టిన ఇతర నాయకులు అమృత్ సర్ నివాసి డాక్టర్ సఫీఉద్దీన్ కిచ్లూ, పాట్నా నివాసి అబ్దుల్ వారీ.

ప్రణాళికపై సంతకాలు అయిపోయిన అనంతరం, ఆ సమయంలో, కేంద్ర శాసనసభా అధ్యక్షుడుగా వుంటున్న ప్రముఖ రాజ్యాంగవేత్త అయిన శ్రీయుత వి. జె. పటేల్ సహకారం వలన గాంధీ – మోతీలాల్ నెహ్రూలు వైస్రాయిని సందర్శించారు కానీ వట్టిచేతుల్తో లాహోర్ కాంగ్రెస్‌కు తిరిగి వచ్చారు. మహాత్మగాంధీ, మహాఘనత వహించిన లార్డు ఇర్విన్ ప్రయాణం చేస్తున్న రైలుపెట్టె బాంబుప్రేలుడు నుంచి అదృష్టవశాత్తు తప్పించుకుని బ్రతికి బైటపడి బాగున్నందుకు అభివందనల్ని సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానంలో ఒక 'క్లాజ్' ద్వారా తెలుపుతూ మహాసభముందు పెట్టాడు. సుభాస్

బోస్‌చే నడుపబడుతున్న యువక బృందపు రక్తం ఈ క్లాజ్ చేర్చినందుకు ఉడికిపోయి రౌద్ర పూరితులయ్యారు. కానీ మెజారిటీ లేనందున అసలు తీర్మానమే ఉన్నది ఉన్నట్లుగా నెగ్గింది.

అనేక కారణాలవలన లాహోర్ కాంగ్రెస్ అతి ప్రాముఖ్యమైంది. జాతిభేద బహుమతి - నెహ్రూ రిపోర్టులకు సంబంధించిన సమస్యలపై పండిట్ మోతీలాల్ నెహ్రూకు - సుభాస్ చంద్రబోస్‌కు అభిప్రాయభేదాలు పెరిగినయ్. పండిట్, వృద్ధనాయకులందరి ఆదరాభిమానాలు పొందిన నాయకు డౌటమేగాక, మహాత్మగాంధీ సహకారం పిల్చినప్పుడల్లా లభిస్తున్న కారణాన బోస్ బృందం సహజంగా నిరుత్సాహానికి ఆహుతి కావాల్సి వచ్చింది.

ప్రముఖ వామపక్షనాయకుడైన పండిట్ జవహరిలాల్ నెహ్రూను, ఒక అధ్యక్షస్థానం కట్టపెట్టి వారివైపు వంచుకోవటం అనుమాన రహితంగా కాంగ్రెస్‌పై గాంధీజీ ఆధిపత్యత స్థిరపడిపోయింది. ఆ నాటికి సముపార్జించుకున్న అతివాదుల బలం — ఒక సంవత్సరానికిముందు అతివాదుల ధీమాలో భాగం పంచుకున్న - ప్రస్తుత లహోర్ కాంగ్రెస్ అధ్యక్షుని చేతుల్లో గట్టిగా దెబ్బతిన్నది. రాజభోగంగా జరిగిస్తున్న అడ్వకేట్ జనరల్ పదవికి రాజీనామాఇచ్చి కాంగ్రెస్‌లో చేరి 1926 లో కాంగ్రెస్ అధ్యక్షుడుగా పనిచేసిన మద్రాస్‌లోని ప్రముఖవ్యక్తి శ్రీ శ్రీనివాస అయ్యంగారు 1927 మాండలే జైలునుంచి విడుదల అయినప్పటినుంచి కాంగ్రెస్ కార్యవర్గ

సభ్యుడుగా వుంటున్న సుభాస్ చంద్రబోస్ (వీరుభయులు) నెహ్రూ వర్కింగ్ కమిటీకి దూరమైపోయారు.

కాంగ్రెస్ కలకత్తా సమావేశంలో ఏ సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని తృణీకరించిందో, అదే తీర్మానాన్ని లక్ష్యంగా లాహోర్ సమావేశంలో అంగీకరించింది. సుభాస్‌బోస్ అసలు తీర్మానానికి, పూర్తిబహిష్కరణతో భారతదేశంలో "సిన్‌ఫిన్" ఉద్యమ తుల్యమైన ఒక ఉద్యమం ద్వారా పోటీప్రభుత్వం స్థాపించాలని ఒక సవరణ ప్రతిపాదించాడు. తదుపరి దేశంలోని కార్యకర్తల్ని, రైతుల్ని, యువకుల్ని సమీకరించి నడిపించే విషయంలో కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలని కోరాడు.

గాంధీ తీర్మానానికి లాహోర్‌లో బోస్ తెచ్చిన ఎమెండ్‌మెంట్ ఈవిధంగా వుంది.

కలకత్తా కాంగ్రెస్ తీర్మానంలో నుదహరించబడిన స్వరాజ్యం అనే పదానికి అర్థం; బ్రిటన్‌తో ఏవిధమైన సంబంధాలులేని సంపూర్ణ స్వాతంత్ర్యం !

"బ్రిటీషు సామ్రాజ్యవాదం, దానికి ఇండియాలో సహకరించే ఇతర తాబేదారిశక్తులు—వీటిని త్రోసి రాజంటూ పూర్ణస్వరాజ్యంసంపాదించటానికి, అమోఘమైన స్వాతంత్ర్య ప్రచారం చేయాలి. ప్రస్తుత ప్రభుత్వానికి తుల్యమైన మరో పోటీ ప్రభుత్వాన్ని (Parlal Government) స్థాపించి పన్నుల నిరాకరణ శాసనసభా బహిష్కరణ మొదలైన వుద్య

మాల్ని మరోవైపుల అదేసమయంలో ప్రారంభించి అవకాశ మున్న ప్రతిచోట సాధారణ సమ్మెలు సాగించాలి.

"పై కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టేటందుకు భారతీయులు యువజనోద్యమాల్ని పురికొల్పి కర్షక-కార్మిక సం॥ మైన ఆ శాఖలవారికి అదుపు ఆజ్ఞల క్రింద తీసుకరావాలని ఈ సభవారు కోరుతున్నారు.

"కాంగ్రెస్ ఆశయానికి భంగం రాకుండా వుండే విధానంలో ఈపై కార్యక్రమాన్ని ఒక పంధాలో నడపటానికి భారతీయులు కేంద్ర - రాష్ట్ర శాసన సభల్ని బహిష్కరించాలి. ప్రభుత్వం స్థాపించిన విచారణ సంఘాలు, స్థానిక సంస్థలు. పోర్టుట్రస్టులు, న్యాయ స్థానాలు వీటిలో జోక్యం పెట్టుకో రాదు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లోవున్న సభ్యత్వానికి రాజీనామా నివ్వాలి. న్యాయవాదవృత్తికి స్వస్థి చెప్పాలి.

"ఈ పై కార్యక్రామాన్ని అమలులో పెట్టటానికి కాంగ్రెస్ కార్యవర్గానికి సంపూర్ణాధికారం ఇవ్వడమైనది. కాలం - ప్రాంతం, అవసరాల్ని పురస్కరించుకుని కార్యవర్గం తమ ఇష్టంవచ్చినట్లు కార్యక్రమం అమలుపర్చవచ్చు."

కాంగ్రెస్ ఈ సవరణను తిరస్కరించింది. ఆసందర్భంలో తన గంభీరోపన్యాసంద్వారా కాంగ్రెస్‌ను ఈ విధంగా హెచ్చరించాడు. "దేశం నా సవరణ గుర్తించటానికి దేశానికి మరో పన్నెండు మాసాల వ్యవధి కావాలి. రాబోవు కాంగ్రెస్ సమావేశంలో ఇదే కాకపోయినా దీనిమాదిరి మరొకటైనా

తయారుచేయబడగలదు అనే విషయంలో నాకు అణుమాత్ర మైనా సందేహం లేదు. నా బాధంతా ఏమంటే ఈ లోపుగా విలువైన కాలమంతా వృథాఅయిపోతుందనే ! రాజకీయ విజ్ఞతకు ఒకోకప్పుడు స్వల్పసంచలనం వుంటుంది. ప్రత్యేకంగా అనేకమంది ప్రముఖ నాయకుల పలుకుబడి కార్యరూపేణ వ్యతిరేక ధోరణిలో పడుతుంటుంది. కాబట్టి ఇంతకు మించి చేయగలిగిందేమీ లేదు.

**బోస్ వ్యక్తిత్వం** :— తాను తెచ్చిన ఆ సవరణ వీగిపోయినప్పటికీ సుభాస్ వ్యక్తిత్వం లాహోర్ సమావేశంలోని వ్యక్తులందరిపైనా ప్రతిబింబించింది. ఒక ట్రిబ్యూన్ పత్రికా ప్రతినిధి లాహోర్‌లో సుభాస్ పాత్రనిగురించి ఇలా వ్రాశాడు. "జాతీయ ఘనతకు దెబ్బతీసే వత్తిడివిధానం ఏదైనాసరే దానితో పోరాడే వుత్సాహంలో సుభాస్ సి. ఆర్. దాస్‌కు ప్రతిబింబంమాదిరి కనుపించాడు." లాహోర్‌లో ఆయన యువజన, విద్యార్థి, రైతు - కూలీలకు సంబంధించిన అనేక సమావేశాల్లో మాట్లాడాడు. ప్రతిచోట నవోత్సాహంతో ఆయన్ను గౌరవించారు. ఒక బహిరంగ సమావేశపు తన ఉపన్యాసంలో, బోస్ ఇలా ప్రకటించాడు. "యువకులకు సేవచేయటంలో, ప్రోత్సహించటంలో నాకు నమ్మకముంది. వారిలో ఏవైనా సుగుణాలు వుంటే ఆ గుణాల్ని మనం ప్రోత్సహించాలి. మన నిర్ణయం వృద్ధ రాజకీయ వాదులకు లొంగిపోవటాన్ని నేను హర్షించలేను." ఆయన గున్నబల్ల సమావేశాన్ని వ్యతిరేకిస్తూ అలాంటి సమావేశంవలన రాబోవు

ఫలితాలు శూన్యం - అని స్పష్టపరిచాడు. " రేపే అధినివేశ ప్రతిపత్తిభిక్ష పెట్టబడినా మన విద్యుక్తధర్మం ఏమంటే, యువ శక్తిని సమీకరించి సంపూర్ణ స్వరాజ్యం కొరకు పోరాడే ' రిపబ్లిక్ పార్టీగా ' వారిని తయారు చేయటమే ! "

ఎప్పుడైనా ఒకప్పుడు మహాత్మాగాంధీ అడుగులకు మడుగులొత్తే, ఏ అసలయిన కాంగ్రెస్ నాయకుడైనా అది ఆలోచించటం బహుకష్టం. సబర్మతీ పూజ్యనీయుడు, అఖిల కాంగ్రెస్ నాయకులపైన విజయవంతంగా తన వ్యక్తిత్వాన్ని ప్రయోగించాడు. కానీ బోస్ విషయంలో మాత్రం, ఆయన ఏనాడూ గాంధేయ సిద్ధాంతాలకు తలఒగ్గలేదనీ గాంధేయాన్ని సర్వవిధాల వ్యతిరేకిస్తూ ఆయనకు నిప్పుకోరివవంటి వాడై నాడనీ మనం చెప్పవచ్చు.

ఈ శతాబ్దపు మూడవ దశాబ్దంలో ఆయన యువకుడుగా ఉన్నపుడే, రాజకీయాల్లో తన మార్గాన్ని అన్వేషిస్తున్నపుడే ఆయన్ను సి. ఆర్. దాస్ వ్యక్తిత్వం ఆకర్షించిందికానీ మహాత్మాగాంధీ వ్యక్తిత్వం కాదు. సి. ఆర్. దాస్ బ్రతికి వున్నంతకాలం సుభాస్‌బోస్ ఆయనకు అతి సమర్థుడైన సహకారేకాదు స్వరాజ్యవాదాన్ని అమితంగా బెంగాల్‌లో బలపర్చిన వాడుకూడ. ఆయన మరణించినప్పుడు ఆయన స్థానే ఆ రాష్ట్రానికి బోస్ రాజకీయ వారసుడుగా ఎన్నుకొనబడ్డాడు.

సుభాస్‌బోస్ భారతజాతీయ కాంగ్రెస్ రాజకీయాలలో ప్రవేసించి అసలైనపాత్ర తీసుకున్న సరైనతేదీ 1921 వ

సంవత్సరమని ఎవరైనచెప్తారు. కానీ ఆయన అసలైన రాజకీయ జీవితచరిత్ర 1927లో మాండలేజైలు విడుదలానంతరం నిస్పృహాపూరితులైన బెంగాల్ ప్రజానీకం, ఆయన, దేశబంధు విధానానికి ధృడమైన ప్రాతినిధ్యం వహించినందుకు తమను. నడిపించమని వాంఛించడం నిస్సందేహంగా హర్షనీయం. పరిపూర్తి స్వతంత్ర్య భావాలతో ఋజువర్తనుడైన రాజాజ్ఞుడుగా తనరాజకీయ జీవితంలో నిరూపించుకున్నాడు. ఆయనయందు దేశబంధులో వున్న విశేషాలలో అధికభాగం మూర్తీభవించి వున్నయ్.

వయసులో చిన్నవాడైనా, సాధారణంగా ప్రజ్ఞావంతులలో అధికసంఖ్యాకులు చూపే బలీయమైన వ్యతిరేకతకు ధైర్యంగా తమ స్వాభిప్రాయాలతో పోటీకి నిలబడేవారిలో ఆయన వరకు ఆయనకు ఒకమంచిస్థానం వుంది. అఖండధైర్య స్థైర్యాలు కలిగిన లోకమాన్య బాలగంగాధర తిలక్, శ్రీ లాలా లజపతిరాయ్, పండిత మోతీలాల్ నెహ్రూ దేశబంధు చిత్తరంజన్ దాస్‌లవంటి జాతీయనాయకుల వకువడిలో బోస్ పోకడ చూపటం గమనార్హం. ఆయనజీవితమంతా ఒక పోటీదారుడుగా, గాంధీజీని విమర్శించే వారిలో ఘటికుడుగా ప్రవర్తించేవాడు.

కాంగ్రెస్ రాజకీయల్లో ఏకారణంచేతనైనా మహాత్మా మనసుకు కంటక ప్రాయమైన వ్యక్తిఅయితే, ఆయావ్యక్తిత్వాలకు ఎదురు తిరగటానికి స్తోమత లేకుండా లేక ఆఎత్తుగడల్ని అర్థంకాకుండా ఒకక్రమ పద్ధతిలో వారినికాంగ్రెస్ పదవులనుంచి

యీడ్చివేయబడే సత్యాన్ని ఎవరూ మభ్యపెట్టలేరు. బోస్ విషయం మాత్రం ఇందుకు పూర్తివిరుద్ధం.

ఆయనచేసిన ఎడతెగని త్యాగాలు, అనుభవించిన బాధలభోగట్టా, ఆయనలోని రాజకీయశక్తి - ప్రత్యేక ప్రతిభలు, ఆయన సహాసకృత్యాలు, ఆయన కళంకరహితమైన పవిత్రజీవితం, దేశస్వాతంత్ర్య సమరంలో ఆయన నెరపిన నిరంతర విధానాలు ఇవన్నీ కలసిపూర్తి మితవాదవర్గపు సుసంఘటిత పలుకుబడికి కానీ, గొప్ప మహాత్ముని శక్తికికానీ గ్రహణాత్మకం కాక, ఒక స్థానం సంపాదించే విషయంలో ఆయనకు తోడ్పడినయ్.

## సేన్‌గుప్త సుబాస్‌బోసు అభిప్రాయభేదాలు:-

లాహోర్ సమావేశపు మరో ముఖ్య సంఘటన ఏమంటే బెంగాల్ రాష్ట్రకాంగ్రెస్ పార్టీకి సంబంధించిన తగాయిదా. అప్పటి విధంగా బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్మాణంతో తృప్తిచెందలేని జె. యం. సేన్‌గుప్తా వర్గంవారినుంచి ఈ తగాదా ప్రారంభమైంది. ఎన్నికలు సుబాస్‌బోస్‌కు అత్యంతానుకూలంగా వున్నందువలన అత్యధిక సంఖ్యాక బలంతో బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆయన అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. ఇది కేవలం బెంగాల్ ఎన్నికల తగాయిదాయే గనుక అయినట్లయితే దీనిని మనం స్వల్పవిషయంగానే విమర్శించవచ్చు. దీని లోతుపాతులు అనేకం వున్నయ్. కాన మనం క్లుప్తంగా ఈ రసాభాస కారణాల్ని గురించి యోచిద్దాం.

సుభాస్‌బోస్, జె. యం. సేన్‌గుప్త వీరుభయులూ కీ. శే. దేశబంధుదాస్‌కు కుడి - ఎడమ కళ్ళవంటివారు. సి. ఆర్. దాస్ బ్రతికి వున్నంత కాలం మొత్తంలోకూడ బెంగాల్ రాజకీయల్లో అద్భుతమైన పాత్రల్ని నిర్వహించారు. పూర్తి అతివాద ధోరణిలోవున్న సుభాన్‌బోస్ ప్రభుత్వంతో ఘర్షణలకు సిద్ధపడి అనేకమార్లు జైలుకు వెళ్ళాడు. ఆయన పరోక్షంలో సేన్‌గుప్త ఐదుమార్లకు తక్కువకాకుండా కలకత్తా కార్పొరేషన్‌కు మేయర్‌గా స్వరాజ్యపార్టీ నాయకుడుగా వుండి ప్రముఖుడైనాడు. అయితే సుబాస్‌బోస్ మాండలేనుంచి విడుదల కావటంతో రూపాలు మారినయ్. బెంగాల్‌లోని ప్రజా దృక్పధం సుబాస్‌బోస్ వైపుకు మళ్ళింది.

ఇది కేవలం బెంగాల్‌లోని ఆయన ప్రత్యర్థులకేకాక, బోస్ అనేకమార్లు ఎవరిమీదైతే వ్యతిరేక బృందాన్ని లేపాడో ఆ కాంగ్రెస్ వృద్ధరక్షకునికికూడా కంటకంగానేవుంది. వారంతా కలసి ఆయన్ను బెంగాల్‌లో శక్తివంతుడుగా వుండనివ్వదల్చుకో లేదు. వారంతా అవకాశాలున్న ప్రతిమార్గంలో సేన్‌గుప్తాను ఎగద్రోశారు. లాహోర్ సభలోని తగాదా దాని అసలు స్వరూపం.

కాంగ్రెస్ ఇక్కడ మళ్ళీ ఒకసారి బోస్‌పైన చూపిన సవతితల్లి ప్రేమ మనకు ప్రత్యక్షమౌతుంది. మాధ్యవర్తిగా పట్టాభి శీతారామయ్య పేరు సూచించబడింది. అయితే సుబాస్‌బోస్ ఈ ప్రతిపాదన అంగీకరించలేదు. ఈ విధానాల్ని వ్యతిరేకించి, బెంగాల్‌లో శాంతి మార్గాల్ని వెతకండని

కోరాడు. కానీ ముసలి నాయకుని ఒడిలో ఆట ఆడటానికి మాత్రం ఒప్పుకోలేదు. "మా పక్షానికి సంబంధించినంత వరకూ ఎలాంటి ద్వేషమూ లేదు. పండిట్ మోతీలాల్ ఏ నిర్ణయం చేసినా దానికి మేము కట్టుబడి ఉండటానికి ఇప్పటికీ సంసిద్ధులమే ! ఒకవేళ పండిట్ మోతీలాల్ కనుక బెంగాల్ తగాయిదా నా రాజీనామాతో సమసి పోతుందని భావించే ట్లయితే అందుకు నా ఆటంకం ఏమీ లేదు." అనికూడా బోస్ చెప్పాడు. అంతకంటే శాంతి నెలకొనటానికి వేరే ఉత్తమ మార్గం ఉంటుందా ? సేన్‌గుప్తా కనుకూలంగా కాంగ్రెస్ వాణి వున్నందువలన ఉభయులమధ్య రాజీ పొసగింది.

**కాంగ్రెసు డెమోక్రాటిక్ పార్టీ నిర్మాణం:–** లాహోర్ సమావేశంలో. ఇక ఇక్కడినుంచి కాంగ్రెస్ కార్యవర్గాన్ని కూడా అధ్యక్షుని మాదిరిగానే అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యులే ఎన్నుకోవాలి. కానీ అధ్యక్షుడు కోరి ఏర్పరుచ్చుకోవ టానికి వీలులేదు; అనే తీర్మానాన్నికూడా బోస్ ప్రతిపాదిం చాడు. పండిట్ మోతీలాల్ వర్గం ఏకంగా దీన్ని ఎదుర్కోటం వలన ఈ తీర్మానం వీగిపోయింది.

ఇక ఇంతటితో మితవాదులు పూర్తి ప్రజాస్వామ్య రహితంగా అక్రమంగా ప్రవర్తించారని సుభాస్‌బోస్ సమా వేశంనుండి నిష్క్రమించి కాంగ్రెస్‌లోనే "కాంగ్రెస్ డెమో క్రాటిక్ పార్టీ" అనే పేరుతో ఒకవర్గాన్ని పది నిముషాల్లోనే ఏర్పాటుచేసి ప్రకటించటం జరిగింది. బోస్‌బాబు ఈ చీలికకు –

1922 లో 'గయ' కాంగ్రెస్‌లో ఏర్పడిన చీలికకు ఎంత ప్రాముఖ్యత వుందో అంత ప్రాముఖ్యతనిస్తూ; కలకత్తాలోని శ్రీమతి దాస్‌కు " అధిక సంఖ్యాకుల ఇనుపహస్తాలు, పరిస్థితులు, గయలో మాదిరి "కాంగ్రెస్ డెమొక్రాటిక్ పార్టీ" అనే పేరుతో ఒక ప్రత్యేక పార్టీని స్థాపించేదానికి దోహదమై ఒత్తిడిపెట్టినయ్. దేశబంధుయొక్క పార్టీ చైతన్యం మమ్మల్ని కాపాడుతుంటే, మీఆశీర్వాద బలం ఉత్సాహాన్ని ఇనుమండింపచేయ గలదు." అని ఒక టెలిగ్రాం పంపించాడు. కొంతకాలం కాంగ్రెస్ అధ్యక్షుడుగా పనిచేసిన (శ్రీ) శ్రీనివాస అయ్యంగారు ఉన్నత కాంగ్రెస్ కార్యవర్గంతో ఉన్న తన సంబంధాన్ని చక్కగా నిర్వచించి తనజీవిత కాలంలో ఆ మాజీ అధ్యక్షుడు మళ్ళా ఎన్నడూ దాని మడతల్లోనికి వెళ్ళలేదు.

1929 అనంతరం కాంగ్రెస్ అధిష్టానవర్గం గురించి బోస్ వ్రాసిన కొన్ని వాక్యాలు ఇక్కడ ఉదహరించటం అవసరమను కొంటాను.

"లాలాలజపతిరాయ్, పండిత మోతీలాల్ నెహ్రూ, సి. ఆర్. దాస్; ఈ ముగ్గురు రాజకీయ దురంధరులు మరణించిన అనంతరం కాంగ్రెస్ నాయకత్వం కుబుద్ధి స్థానానికి దిగజారిపోయింది. ఈనాడు కాంగ్రెస్ కార్యవర్గం భారతదేశంలోని ఘనప్రవర్తన, దేశభక్తి, త్యాగపూరితులైన ప్రముఖ వ్యక్తుల సమీకరణ అని అనడంలో సందేహంలేదు. వారిలో అనేక మంది మహాత్ముని గ్రుడ్డిగా అనుసరించిన ఫలితంగానే ప్రాథ

మికంగా ఎన్నుకోబడ్డారు. అందులో మహాత్మ బుద్ధిపూర్వకంగా తప్పటడుగులు వేస్తున్నప్పుడు వ్యతిరేకించి మాట్లాడే కుతూహలం కలవారు కానీ తమవిషయం గురించి విమర్శించి చూచుకునే వారుకానీ బహుకొద్దిమంది ఉన్నారు. ఈ పరిస్థితులలో ఈనాటి కాంగ్రెస్ ఒకవ్యక్తియొక్క గారడీ అని చెప్పాలి.

వారు మరణించి నప్పటినుంచీ సంపూర్ణంగా కాంగ్రెస్ విజ్ఞానం ఒకవ్యక్తికి తాకట్టుపెట్ట బడింది. ఎవరైనా స్వేచ్ఛగా ఆలోచించటం కానీ, బహిరంగంగా, ధైర్యంగా మాట్లాడటం కానీ, సంభవిస్తే మహాత్మాగాంధీ, ఆయన శిష్యవర్గం వారిని తిరుగుబాటు దారులుగా, ద్రోహులుగా చూచేవారు.

**తెల్లవారు ఝామున అరెస్టు:-** కొన్ని మాసాల అనంతరం సాంఘిక అవిధేయతోద్యమానికి ఇవ్వబడిన పిలుపుతో బెంగాల్ తయారుగావుంది. ప్రతిరాష్ట్రం కూడా అమూల్యమైన త్యాగాల్ని ప్రదర్శించి, 1930 ఏప్రియల్ 21 వ తేదీన ఆలీపూర్ జైలులో సంభవించిన దుర్భర సంఘటన వంటివి యింకా బహుగొద్దిగా వున్నయ్. 124 సెక్షన్. క్రింద సుబాస్‌బోస్ నవమాసాలు శిక్షకు పాత్రుడైనాడు. కలకత్తాకార్పొరేషన్ మేయర్ జె. యం. సేన్‌గుప్త "లిబర్టీ" పత్రికా సంపాదకుడు, సత్యరంజన్ భక్షీ బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కిరన్ శంకర్రాయ్, కూడా అదే జైలుకు నడిచారు.

ఏప్రియల్ 21వ తేదీ ఉదయం "మాఛూబజార్" బాంబు కేసు ఖైదీలను కోర్టుకు విచారణ నిమిత్తం తీసుకుపోయే ముందు, అందులో ప్రభుత్వోద్యోగులపై నేరారోపణలు పెట్ట దలచిన కొందరు, జైలుకారులో ఎక్కటానికి నిరాకరించారు. సౌంజ్ఞచేసిన వెంటనే కొంతమంది పఠాన్ ఖైదీ ఉద్యోగులు, వార్డర్లు రంగంలో ప్రత్యక్షమయ్యారు. అదేసమయంలో సుభాస్‌బోస్ జె. యం. సేనుగుప్త తదితరులు కూడా అక్కడకు వచ్చారు.

జైలు సూపరింటెండెంట్ వారిని బలవంతంగానైనా వాన్‌లో తీసుకపోవటానికి ఉత్తర్వు చేస్తూ సుబాస్‌బోస్ తదితరుల్ని వెళ్ళిపొమ్మన్నాడు. కానీ పఠాన్ వార్డర్లుచేసే బలప్రయోగానికి నిరసనగా వారు వెళ్ళ నిరాకరించారు. సూపరింటెండెంట్ బలవంతంగా సమూహాన్ని చెదరగొట్టమని ఉత్తర్వు చేశాడు. పఠాన్‌లు బోస్ – ఆయన సహచరులపై విరుచుకపడ్డారు. సుబాస్ లాఠీచార్జీలో తగిలిన దెబ్బకు ఒక గంటకు పైగా స్పృహతప్పి పడిపోయాడు. ఈ సంఘటన అలలలలుగా దేశమంతా ప్రాకి భయ విభ్రాంతుల్ని కల్పించింది. ఈ విషయానికి సున్నం పూయటానికి ప్రభుత్వం ఒకప్రకటన చేసింది. అయితే ఫలితం మాత్రం సూన్యం. డాక్టర్ బి. సి. రాయ్ ఆ ప్రకటన్ని కాగిత పూర్వక అభూత కల్పన అని వర్ణించాడు. బెంగాల్‌లో ప్రముఖ నాయకులందరూ, ప్రభుత్వ తాబేదార్లు సహితం ప్రభుత్వ లోట్లను బైటపెట్టి ఈ నిర్దాక్షిణ్య చర్యను ఖండించారు. ఈసంఘటనానంతరం దేశమంతటా చెలరేగిన

భీషణ వ్యతిరేక వాతావరణం చూచిన జైలు సూపరింటెండెంట్ తన మనుగడకే ప్రమాదం సంభవించిందని భయపడుతున్నపుడు అతడ్ని మరో ప్రాంతానికి బదిలీచేశారు.

**ఆలీపూర్ జైలులో మేయర్‌గా ఖైదీ :–** ఈ సారి ఆయన జైలులో ఉండగానే బెంగాల్ ప్రజలు ఆయన్ను మేయర్‌గా ఎన్నుకున్నారు. భారతస్వాతంత్ర్యం విషయంలో ఆయచేసిన త్యాగాలకు గౌరవసూచకంగా బెంగాల్ ప్రజలు ఆ ఉన్నతస్థానాన్ని అలంకరింపచేసి తమనాయకునియందు పూర్ణ విశ్వాసం చూపారు ఆయన విడుదలానంతరం అదే సంవత్స రంలో "అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్"కు అధ్యక్షు డుగా ఎన్నుకున్నారు. ఇదొక్కటే దేశైకవిస్తృత అఖిలభారత కార్మికసంఘం. ఈయన అధికారంలో ఉన్న ఈ తరుణంలో ఈ సంస్థని భారతజాతీయ కాంగ్రెస్‌కు సన్నిహితం చేశాడు. 1930వ సం॥ సెప్టెంబరు మాసంలో ఆయన విడుదల చేయ బడిన అనంతరం 31 జనవరిలో మరోమారు కొద్దికాలంలోనే బోస్ ఉత్తరబెంగాల్‌లో మూర్షిదాబాగ్ నాడియా ప్రాంతాల్లో తీవ్రప్రచారం చేసుకుంటూ 'మాల్టా' జిల్లా సరిహద్దు చేరే వరకు బోస్ రైలులో వుండగానే జిల్లాలో అడుగు పెట్టరా దంటూ మేజిస్ట్రేట్ జారీచేసిన 144 వ సెక్షన్ ఉత్తర్వులతో పోలీస్ సూపరింటెండెంట్ నోటీస్ అందించాడు. ఆనోటీస్‌ను బోస్ నిరాకరించాడు. అంతట పోలీస్ సూపరింటెండెంట్ 'అమనూర' అనేస్టేషన్‌లో బోస్‌ను రైలునుండి దించివేశాడు. తదుపరి జిల్లా మాజిస్ట్రేట్, స్పెషల్ డివిజనల్ ఆఫీసరు మరి

కొంతమంది పోలీస్ బలంతో అక్కడకు చేరారు. అంతటితో మొదటితరగతి ప్రయాణీకుల విశ్రాంతిగది కోర్టుగా మారిపోయింది. ఆవిచారణ విచిత్రమైంది. 'రాజసాహీ' సెంట్రల్ జైలులో 7రోజులు విడిఖైదీగావున్నాడు.

కోర్టు ఎదుట చెప్పుకోవటానికి ఏదైనావుందా? అని మాజిస్ట్రేట్ అడిగితే:

"క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 144వ శెక్షన్‌ను పూర్తి దుర్వినియోగం చేశారు. ఆత్మగౌరవం కల భారతీయుడనైననేను ఈ నిర్బంధ శిక్షను శిరసావహించలేను. దీనిని నేను అనుసరిస్తే నాపౌరసత్వవిధిని నేను నిర్వహించని వాడనౌతాను." అని బోస్ సమాధానమిచ్చాడు. తరువాత రాజసాహీ జైలు నుంచి 'నాటుక్' రైల్వేస్టేషన్‌కు 30 మైళ్ళ దూరంగావున్న సెంట్రల్ జైలుకు జనవరి 18వ తేదీ అర్ధరాత్రి పన్నెండుగంటల వేళకు మార్చారు.

లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం దాని అంతిమలక్ష్యం అన్న ప్రకటన ప్రతిసంవత్సరం జనవరి 26వ తేదీ స్వాతంత్ర్య దినంగా ఉత్సవం జరుపబడుతుంది. దేశం నలుమూలలా బహిరంగ సభలు జరుపబడి కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీచే తయారు చేయబడిన నివేదిక భారత ప్రజానీకపు సంపూర్ణ స్వాతంత్రేచ్ఛను ప్రతిబింబించేట్లు చేసేందుకు చదువ బడుతుంది.

దేశంలో జాతీయోద్యమాలు ప్రారంభించ బడినప్పటి నుండీ జాతీయోత్సవాలు చేయుటలో బెంగాల్ ఎప్పుడూ

ముందుగా వుంటుంది. ఈ సంవత్సరం కార్పొరేషన్ మేయర్ గా వుంటున్న బోస్ కలకత్తాలో స్వాతంత్ర్య దినోత్సవపు ఉత్సవాన్ని ప్రారంభించి ఊరేగింపు బయలుదేర దీశాడు. పోలీస్ దాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించింది.

ఊరేగింపులో అందరికంటే ముందుగా బోస్ నిలబడ్డాడు. ఆయన వెనుక తదితర నాయకులు, వారివెనుక అనేక మంది స్త్రీలు, వారితరువాత సేవాదళ సభ్యులు, అసంఖ్యాక ప్రజానీకం ఆ వెనుక ఊరేగింపులో పాల్గొంటుంది. ఈ ఊరేగింపు ముందుకు సాగకుండా పోలీస్ కమీషనర్ గుఱ్ఱపు దళంతో గోడకట్టించాడు. ఉత్సవం ఆగింది. పోలీస్ కమీషనర్ అడుగు ముందుకు వేయటానికి వీలు లేదని హుకుంచేశాడు. ఈ సందర్భంలో సుభాస్ ఏంచేస్తాడు? ఏంజరుగుతుందోనని కిక్కిరిసి వున్న ప్రజా - ప్రేక్షక సమూహం ఎదురు చూస్తుంది.

వీర సుభాస్ తేరిపారచూచి తన ఎదురుగా వున్న గుర్రాలవైపు అడుగులు వేసి రెండుగుర్రాల కళ్ళేలను రెండుచేతుల్తో పట్టుకొని బలంగా ముందుకులాగి ప్రక్కకు నెట్టివేసి అలా గుర్రపు తెరను ఛేదించుకుని వీరోచితంగా ముందుకు వెళ్తుంటే ఆ స్వాతంత్ర్యయోధుని వెనుకనున్న బృందం ఆయన్ను అనుసరించింది. అందుకని పోలీసు దమన శక్తితో, ఊరేగింపుపై లాఠీలు ప్రయోగించి ప్రజానీకాన్ని చెదరగొట్టి నాయకునికి ఇంకా అనేకమందికి ప్రమాదకరంగా గాయపర్చింది. అనంతరం ఆమరునాడే ఆయన్ను అరెస్టుచేసి ఆయనతోపాటు ఇంకా పదకొండుమందికి ఆరుమాసాలశిక్ష విధించారు. అయితే గాంధీ

ఇర్విన్ సంధి అమలులోనికి రావటంతో అసలుశిక్ష పూర్తికాక ముందే వదలివేశారు.

**నాయకుల విడుదల:—** భారతదేశంలోని ప్రముఖ రాజకీయ సంస్థతరఫున ప్రాతినిధ్యం లేకుండా జరుపబడిన మొదటి "నున్నబల్ల సమావేశం" దాని వుద్దేశ్యాలను సాధించే విషయంలో అపజయం పొందినప్పుడు, సాంఘిక అవిధేయతో ద్యమాల్ని అణచేవిషయంలో దాని ప్రాబల్యాలన్నింటినీ ప్రభుత్వం కోల్పోయినప్పుడు నైత్రాయితో 'సంధిసంచలనం' వచ్చింది. లిబరల్ నాయకుడైన సర్ తేజ్ బహద్దూర్ సప్రూ శ్రీ యం. ఆర్. జైకర్ శాంతిదూతలుగా నటించాడు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులందరూ వివిధజైళ్ళల్లో వున్నారు. శాంతికోసరం తహతహాలాడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులందర్నీ గాంధీజీ వుంటున్న ఎరవాడజైలుకు చేర్చి ఆ తరుపరి వారందర్నీ ఏషరతులూ లేకుండా—పరిష్కార విషయంలో వారొక సంయుక్త నిర్ణయం చేసుకునే దానికి— విడుదలచేసి అవకాశమిచ్చింది. చిట్టచివరకు పరిష్కారం కుదిరింది. అదే చరిత్రాత్మకమైన గాంధీ-ఇర్విన్ సంధి. దాని నిబంధనల ప్రకారం గాంధీజీ సాంఘిక అవిధేయతోద్యమాన్ని కొంతకాలం వరకూ విరమించి "ద్వితీయ నున్నాబల్ల సమావేశంలో" కాంగ్రెస్ ప్రతినిధిగా పాల్గొనటానికి అంగీకరించారు. హింసాత్మక చర్యలు జరిపినవారు తప్ప మిగిలిన రాజకీయ ఖైదీలందర్నీ లాంఛనంగా ప్రభుత్వం విడుదల చేయటానికి మరో వైపున అంగీకరించబడింది.

**భగత్ సింగ్ ఉరి :—** రాయబారాలు ప్రారంభమైన మొదటినుండీ, యువనాయకులందరికీ, ప్రత్యేకంగా గాంధీజీకి, పంజాబ్ కుట్రకేసులో, అసెంబ్లీబాంబు కేసులో ఇరుక్కుబడిన ప్రఖ్యాత విప్లవ యువకుడైన భగత్ సింగ్‌ను షరతులు లేకుండా విడుదలచేయు అవకాశాలు కలుగని ఏ రాయబారాలనైనా భారత ప్రజలు ఆమోదించజాలరని స్పష్టపరిచారు. గాంధీజీ ఈ సమస్యపైకూడా తన సంభాషణ సాగించాడు. కానీ వైస్రాయి ఏ ప్రమాణమూ బుద్ధిపూర్వకంగా చేయుటానికి అంగీకరించలేదు. గాంధీజీకి ఆయన చెప్పిందేమంటే ఆ విషయం పంజాబ్ ప్రభుత్వానికి సంబంధించినది కాబట్టి తానేమీ సహాయం చేయలేనని స్పష్టపరిచాడు. గాంధీజీకి బాగా తెల్సు: వైస్రాయికి ప్రత్యేకంగా శిక్షితుల్ని మన్నించే హక్కు వున్నదని; అయినా, ఈ సమస్యమీద రాయబారాల్ని విఫలంచేయటం ఇష్టంలేక దేశంలోని యువకుల మొరని లెక్కచేయక సంధిపత్రంపై సంతకం పెట్టాడు.

కుదిరిన సంధి షరతులగురించి దేశంలోని యువకులు విపరీతమైన ఆందోళన చేశారు. "నౌజవాన్ భారతసభ" అఖిలభారత నౌజవాన్ భారత సమావేశం, మహాత్మాగాంధీ విధానానికి నిరసనగా, గాంధీ – ఇర్విన్ సంధిని ఖండించే దానికి– కరాచీ కాంగ్రెస్ సమావేశ సందర్భంలోనే – జరుపటానికి నిర్ణయించబడింది. బ్రిటీష్ సామ్రాజ్య వాదంతో ఏ పరిస్థితుల్లోనైనా, ఎప్పుడూ రాజీపడడానికి విముఖతచూపే బోస్ ఈ సమావేశానికి అధ్యక్షుడుగా పోటీలేకుండా ఎన్నుకోబడ్డాడు.

మార్చి 23వ తేదీన సరిగ్గా కరాచీలో కాంగ్రెస్ సమావేశ మధ్యే సమయంలో యువనాయకులైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ఉరితీయబడ్డారు. ఈవార్త దేశాన్ని శోకంలోముంచెత్తింది. ఒకయువకబృందం గాంధీజీ కరాచీలో అడుగుపెట్టగానే నల్లజండాలు ప్రదర్శించి తుదకు ఆయన మీద ఇటుకముక్కలుకూడా విసిరారు. వైస్రాయితో సిగ్గు చేటయిన షరతులకు అంగీకరించినందుకు, దానికి బహుమతిగా ఒక నల్లని పుష్పాన్నికూడా ఆయనకు బహూక రించారు.

కాంగ్రెస్ సమావేశానికి ప్రక్కనే కరాచీలో సుభాస్ బోస్ అధ్యక్షతన నౌజవాన్ సమావేశంకూడా జరిగింది. అదే పందిరిలో జరిగిన అఖిలభారత రాజకీయ బాధితుల సమావేశానికికూడా ఆయన అధ్యక్షత వహించాడు.

ఆయన తన అధ్యక్షోపన్యాసంలో మహాత్మాగాంధీ విధానాన్ని అతిదారుణంగా విమర్శించి, దేశంలో ప్రజలు ఒక వైపున పోరాటానికి సర్వసన్నద్ధులై వున్నపుడు మరోవైపున సాంఘిక అవిధేయోద్యమాన్ని రద్దుచేస్తూ ఆయన తీసుకున్న చర్యలు, ప్రజానీకాన్ని మోసగించిన తెలివితక్కువపని అని విమర్శించాడు కూడ.

ద్వితీయ సున్నాబల్ల సమావేశానంతరం 1932లో మహాత్మాగాంధీ దేశానికి నిరుత్సాహంతో తిరిగి వచ్చాడు. వెంటనే బొంబాయిలో వర్కింగ్‌కమిటీ సమావేశాన్ని ఏర్పరి

చాడు. లాహోర్ కాంగ్రెస్‌లో కార్యవర్గంలో స్థానం లేకుండా అప్పుడు బోస్‌ను తృణీకరించి, ఇప్పుడు కొన్ని ఉద్దేశ్యాలలోని అనుమానం పోగొట్టటందుకు కాంగ్రెస్ ఉన్నత కార్యవర్గంతో సుహృద్భావాన్ని ఏర్పరుచుకునేందుకు ప్రత్యేక ఆహ్వానం పంపారు. కానీ 1818 చట్టంలోని మూడవ రెగ్యూలేషన్ ప్రకారం ఆయన్ను అక్కడ అరెస్టుచేశారు. బలహీనత వలన ఈసారికూడా జైలులోనికి వెళ్ళినవెంటనే విపరీతమైన జ్వరంతో మళ్ళీ జబ్బుపడ్డాడు. పైగా 'సానీసద్' జైలులో కొంతకాలం, అక్కడినుంచి "జబ్బల్‌పూర్" సెంట్రల్‌జైలుకు, తరువాత భవానీ శానిటోరియంకు ఇన్ని విధాల మార్చటంవలన ఆయన ఆరోగ్యం ధ్వంసమై పోయింది.

1933లో ప్రభుత్వంవారు వైద్యసహాయం నిమిత్తం స్విట్జర్‌లాండ్ వెళ్ళటానికి అంగీకరిస్తూ విడుదలను ఆమోదించారు. కానీ ఇండియాలో తల్లిదండ్రుల్ని కల్సుకోగూడదన్నారు. ఆయన ఫిబ్రవరి 23వ తేదీన బొంబాయిలో నావఎక్కాడు. "బెంగాల్ ధ్వంసమైతే జీవించేదెవరు? బెంగాల్ బ్రతికుండగా చనిపోయే దెవరు?" అనే సందేశం ఇచ్చి; ఇకనావ కదలి సముద్రంలోనికి పోయింది అనే నమ్మకం కలిగిన తరువాత కానీ అధికారులు ఆయనపైన వున్న వుత్తర్వులను రద్దుపర్చుకోలేదు.

# బహిష్కరణ

**యూరప్‌కు ప్రయాణం :—** ప్రమాదకరమైన జబ్బులో వున్నందువలన, 1933 మొదటిరోజుల్లో సుభాస్ బోస్‌ను బంధిఖానానుంచి వదలివేశారు. ఆరోగ్యాన్ని కోలుకు నేందుకు - యూరప్ వెళ్ళేందుకు కూడా అనుమతించారు. ప్రభుత్వం ఆయన్ను స్వేచ్ఛగా వదలి వేసినప్పటికీ, దేశాంతరాన ఆయన్ను పూర్తి స్వతంత్రుని హోదాలో మననివ్వదల్చుకోలేదు. కామన్సు సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, సర్. శామ్యుల్ హోర్, "బోస్ నిర్బంధనారహితమైన స్వాతంత్ర్యం అనుభవించటానికి అనుమతించబడలేదని, ఆయన జర్మనీని సందర్శించ కూడద"ని చెప్పాడు.

సుభాస్‌బోస్ మొట్టమొదట వియన్నా వెళ్ళి అక్కడ కొంత కాలంవరకూ ఉన్నాడు. ఆనాటికి 'డాక్టర్ డస్లస్ ఛాన్సిలర్‌గా నామకా ప్రజాతంత్ర రాజ్యంగా అదివుంది. నిజానికి "హీంవ్వేర్ - ఆష్ట్రియన్ - ఫాసిస్టు" నాయకులైన "ప్రిన్సిస్టార్ హాంబర్టు," మేజర్ "ఫె" చేతుల్లో ఆష్ట్రియన్ రాజకీయా లుండుటవలన, వారే దాన్ని పరిపాలిస్తున్నారు. వియన్నా పట్టణం మాత్రం సోషలిస్టు డెమోక్రాట్ల చేతుల్లో వుంది. వారి పన్నెండేళ్ళ వియన్నా అవిచ్ఛిన్న పరిపాలనా ఫలితంగా, ప్రపంచంలో అందమైన పట్టణాల్లో ఒకటిగా తయారు చేశారు. వారి సామ్యవాద ప్రయోగాలు సుభాస్

బోస్‌కు అభిరుచిని కల్పించినయ్. సోషలిష్టుల మున్సిపల్ పరిపాలన వలన సాధించిన పనులను వియన్నా మేయరైన "కారల్‌సీట్జు" తనను సుభాస్ కల్సుకున్నపుడు చూపించాడు. వారు కలకత్తా స్థితిగతులు వియన్నాతో పోల్చుకున్నారు. ఎందుకంటే సుభాస్‌బోస్, కలకత్తా మున్సిపాలిటీకి మేయర్‌గా వున్నందువలన, భారత మున్సిపాలిటీల స్థితిగతులు ఆయనకు కొట్టినపిండి, సుభాస్ సోషలిష్టుల ప్రయోగ ప్రయోజనాలకు ఉత్సాహపడి, అలాంటివే కలకత్తా మున్సిపాలిటీలో కూడ ప్రవేశపెట్టాలని వాంఛించాడు. అయితే, సోషలిష్టుల పద్ధతిపై ఆయనకు విశ్వాసం వున్నప్పటికీ, ఆష్ట్రియా సోషలిష్టులలో కల్సినట్లు మాత్రం నటించలేదు. వారి నిర్మాణ కార్యక్రమంలోని గొప్పతనాన్ని మాత్రం స్తుతించాడు.

ఆయన ఒకమారు వియన్నా "సా్రన్ బరన్" ప్రాంతంలో వున్న "హీంవ్యేర్ పటాలాల" కవాతుచూడటానికి వెళ్ళాడు. టర్కీయులతో సాధించిన పోరాటపు విజయవార్షిక దినోత్సవం నాడు ఆ కవాతు ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. తానెప్పుడూ వాంఛిస్తున్న క్రమశిక్షణ తనకక్కడ గోచరించినందున అది ఆయన్ను ఆకర్షించగలిగింది. ఈ రెండు సంఘటనలు సుభాస్ బోస్‌ను పూర్తిగా ఆకర్షించినా, కేవలం సోషలిష్టు ఫాసిష్టు సంస్థల్ని సందర్శించటంతోనే ఆయన తనకాలాన్ని వృధాపుచ్చలేదు. ఇండియాకు సంబంధించిన పనికూడ ఏదోకొంత చేయదల్చుకొన్నాడు. తన మాతృదేశంపై తనకున్న ప్రేమ అంత అచంచలమైంది. కాబట్టి ఆయన ఎక్కడికి పోయినా, భారత

సేవని ప్రధానాశయంగా అట్టిపెట్టుకుని, ఆమె సౌభాగ్యానికి స్వార్థరహితమైన నిరంతరకృషి చేశాడు.

**బోస్ - విఠల్‌భాయి పటేలు:-** ఈ సమయంలో జగమెరిగిన మాజీకేంద్రశాసన సభాధ్యక్షుడైన శ్రీ విఠల్‌భాయి పటేల్‌కూడా, వియన్నాలో వైద్యసహాయత తీసుకుంటూ అక్కడే వున్నాడు. ఈ ప్రముఖ రాజ్యాంగవేత్తతో కలసి, ఆయన్ను జయించి, తద్వారా ఆదరాభిమానాల్ని గౌరవాన్ని బోస్ పొందగలిగాడు. ఉభయనాయకులూ సంయుక్తంగా నివసించారు. పటేల్ పరిస్థితి కంటే సుభాస్‌బోస్ పరిస్థితికొంత మెరుగు కావటంవలన, ఆయన మరణం పర్యంతరం బోస్, పటేల్‌కు సహాయకుడై సమీపంలో వుండి, తన అవకాశాన్ని ఆయన్ను ఆదరించటంలో భక్తితో వినియోగించాడు. ఉభయులకూ చాలా విషయాల్లో పోలికలున్నట్లు ఒకరినొకరు గుర్తించారు. కాంగ్రెస్‌లోని అభివృద్ధి నిరోధక వర్గానికి ఉభయులూ ప్రబల శత్రువులు, కాంగ్రెస్‌ను రాజీపడే ధోరణి నుంచి మళ్ళించి, భారతీయ సమస్యను ప్రపంచదృష్టికి తేవాలని ఉభయులూ గాఢంగా కృషిచేశారు. కాబట్టి భారతదేశం కోసరం చేసే కృషిలో, భేదరహితంగా వారిద్దరూ ఒకరికొకరు అతుక్కుపోయారు. అంతర్జాతీయ ప్రచారం విషయంలో పటేల్‌కు ఎంతో వుత్సాహం వుంది. కాబట్టే తన మరణానికి ముందు, సుభాస్‌బోస్ సంరక్షణక్రింద, అంతర్జాతీయ ప్రచార నిమిత్తం, ఒక లక్షరూపాల నిధిని అట్టిపెట్టాడు.

1933 మే మాసంలో మహాత్మాగాంధీ సాంఘిక అవిధేయతోద్యమాన్ని ఆరువారాలపాటు రద్దుచేసి, సంధికోసరం ప్రభుత్వంతో రాయబారాలు మొదలు పెట్టాడని తెల్సినపుడు వారుభయులు, వియన్నానుంచి ప్రకటించిన సంయుక్త నివేదికలో, "సాంఘిక అవిధేయతోద్యమాన్ని రద్దుచేసిన మహాత్మాగాంధీ ఇటీవల చర్య, దాని ఓటమిని అంగీకరించినట్లు విదితమవుతుంది.", అని విమర్శించారు. ఇంకా తదుపరి చెప్పిందేమంటే "గాంధీరాజకీయ నాయకుడుగా స్వప్నంలో కాలువేశాడనే భావం మాసందరికీ తేటతెల్లమైంది. కాబట్టి, నూతన విధానంలో, నూతనసిద్ధాంతంతో, శీఘ్రంగా కాంగ్రెస్‌ను పునరుద్ధరించి బలపర్చ వలసిన కాలం ఆసన్నమైంది. గాంధీజీ సుస్థిరం కాని జీవితాంత సిద్ధాంతాలతో కార్యవిధానం సాగిపోతుందిలే అని; భావించటం కేవలం వెర్రి అని చెప్పక తప్పదు. అందుకోసరం ఒకనూతన నాయకుడు కూడా కావాలి" ఇంకా ఆప్రకటన "మొత్తంమీద కాంగ్రెస్, ఈమార్పిడి ప్రకారం పోయినట్లయితే అది ఒక మహత్తర కృషి కాగలదు. దీనిని తప్పితే, వామ పక్షాలతో కూడిన ఒకనూతనపార్టీ కాంగ్రెస్‌లో సృష్టించబడాలి." అనేంతవరకు వెళ్ళింది.

**సమవాద్య సంఘం:-** తరువాత అంతర్జాతీయ ప్రచారోద్దేశ్యం, మొదట ఈవియన్నా నిరుపయోగులతో జమకట్టబడిన జవహార్‌లాల్ నెహూ్రను కూడా బాగ ఆకర్షించింది. వారి కున్న అస్వల్ప ఆరోగ్యంతోనే విలువకట్ట వీలులేని కార్యక్రమాల్ని సాగిస్తూనే వున్నారు. అక్కడ వున్న భారతీయులు

ఒక్కమారు లండన్ దర్శించమని సుబాస్‌బోస్‌ను కోరారు. లండన్‌లోని భారతీయుల సర్వపక్ష సమావేశానికి అధ్యక్షత వహించమని కూడా కోరారు. అయితే ప్రభుత్వం ఆయనకు ఇంగ్లండు పోవటానికి అనుమతి పత్రం ఇవ్వ నిరాకరించింది. ఇండియా కార్యాలయమే దానికి కారణం. సరే- అవకాశాలు లేనప్పుడు చేసేదేముంది? ఒక వ్రాతపూర్వకపు ఉపన్యాసాన్ని ఆసమావేశానికి పంపిస్తే, ఆయన పరోక్షంలో డాక్టర్ భట్ దాన్ని చదివాడు. చెప్పుకోదగిన ఆ వుపన్యాసంలో అక్కడ నివసిస్తున్న భారతీయుల్ని ప్రపంచమంతటా జరిగే సంఘటన వెలుగులో భారతపరిస్థితిని కూడా చూచి భారతదేశానికి అనుగుణ్య ప్రచారం చేయమని ఉద్బోధించాడు మహాత్మాగాంధీ విధానాన్ని విమర్శిస్తూ ఇలా చెప్పాడు.

" 1931 ఢిల్లీ ఒడంబడిక ఒక తప్పుల తడికైతే, 1933 లొంగుబాటు వినాశనానికి ప్రళయ స్వరూపం. అతిక్లిష్ట ఘడియల్లో సాంఘిక అవిధేయతోద్యమాన్ని రద్దు పర్చటం-చేసిన శ్రమనంతా బూడిదపాలు చేయటమేకాక - ఒక జాతిగత 13 ఏండ్లగా చేసిన త్యాగాలన్నీ నిష్ప్రయోజనా లౌటకు దోహదమైంది.

ఈ సమావేశమందే మొట్టమొదటి సారిగా " సమవాద్య సంఘ " అభిప్రాయాన్ని గూర్చి ప్రతిపాదన పెట్టాడు బోస్. తదుపరి పార్టీ సిద్ధాంతాల్ని ఆశయాల్ని బహిర్గతం చేసేందుకు, 22 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీ నియమించబడింది.

సమవాద్య సంఘాభిప్రాయాల్ని గురించి ప్రప్రథమంగా బహిర్గతం చేసేప్పుడు, ఐరోపాలోని ప్రజానీకాన్ని, కమ్యూనిజం – ఫాసిజం విభజించుకున్న తరుణంలో "సమవాద్య సంఘం" బోస్‌కు ఆపత్సమయంలో అండగా నిలుస్తున్న బ్రిటన్‌లోని వామపక్షీయుల కొరకు కాదుకానీ, కన్సర్వేటివ్‌ల పత్రికల విమర్శల కొరకు స్పష్టించినట్లుగా కనుపించింది.

**అద్భుత సందేశం:—** జినీవానుంచి తనను తాను సమర్థించుకుంటూ విమర్శకులకు సమాధానంగా ఈ క్రింది ప్రకటన ద్వారా చేశాడు.

"కొన్ని బ్రిటీష్ పత్రికలు బైటపెట్టిన ప్రకటనలు, తిరిగి అవే భారతపత్రికల్లో ముద్రించబడుతున్న ధోరణి అంతా చూస్తే; ఇది నా సాంఘిక రాజకీయోద్దేశ్యాల్ని అపార్థం చేసుకునేట్లు తయారు చేయబడిన ట్రిక్కు. నా విషయంలో మూల సూత్రావళిలో మార్పులు అణుమాత్రమైనా లేవని చెప్పటానికి నేను సంతోషిస్తున్నాను. నేను యూరప్ వచ్చినప్పటినుంచి, ఇంతకుముందు ఎన్నడూ అనుసరించని జాగ్రతను స్థిరతను పోషించుకుంటున్నాను. అవసరపడి నంతవరకూ మనం బాహ్యంగావున్న అన్నిరకాల నూతనోద్యమాల్ని అర్థం చేసుకుని ఆ తదుపరి భారతదేశంలో సంబంధంవున్న అన్నివిషయాల స్వరూప నిర్ణయం – మనకోసరం మనమే – ప్రపంచంతో పాటు సమానంగా, మన గత చరిత్రను పోటీపెట్టి ప్రస్తుతానికి భవిష్యత్ అవసరాల్ని సాధించాలి.

"అనేక శతాబ్దాల తరబడి, ప్రపంచంతో భౌగోళిక వైజ్ఞానిక విషయాల్లో వేరుపడి అనుభవించిన భారతదేశం, ఇతర దేశాలతో – జాతులతో, సహనతని మనం అలవరుచు కోవటానికి చేస్తున్న కృషిని నిరోధిస్తుంది. మన అంతరంగిక అంతర్జాతీయ విధానాన్ని. శాశ్వతంగా – సుస్పష్టంగా ప్రకటించటం అవసరం. మన అంతరంగిక విధానాలలో మన అవకాశం ఫాసిజం కమ్యూనిజంల మధ్య వున్నదని చెప్పటం ఒక గొప్ప పొరపాటు......................నవీనజాతుల సాంఘిక రాజకీయ సంస్థలు లేక సిద్ధాంతాలు, వారివారి చారిత్రక అవసరాల్ని బట్టి, వాతావరణాను గుణ్యంగా మాత్రమే ఉద్భవించినయ్. ఒక మానవజీవితం మాదిరి అవి మారిపోవటానికి లేక అభివృద్ధి పొందటానికి అర్హాములు.

జ్ఞప్తిపెట్టుకోవలసిన మరోవిశేష మేమంటే: ఈనాటి అనేక ప్రోత్సాహకర సంఘాలన్నీ ప్రయోగాలు చేస్తున్నయ్. అవి సాధించిన విజయాల్ని ప్రకటించుకోబోయే ముందు కాల వ్యవధిని తప్పక గ్రహిస్తయ్. ఈ మధ్యకాలంలో మన తెలివి తేటల్ని ఎక్కడాకూడ తాకట్టు పెట్టకూడదు. ఈనాడు మనం చూస్తున్న వివిధ ఉద్యమాలలోనుంచి, మంచికి దోహదం కల్పించే ఉపయోగకర సమన్వయతను అన్ని విషయాల యందూ, భారతదేశం కృషిచేసి సాధించాలనేదే, ఎల్లప్పటికీ నా వ్యక్తిగతాభిప్రాయమై వుంటుంది. ఈపని నిమిత్తం. అతి క్లిష్ట సానుభూతితో యూరప్‌లోను, అమెరికాలోను నడుప

బడుతున్న ఉద్యమాల ప్రయోగ ఉనికిని మనం అవగాహన చేసుకోవాల్సి వుంది.

మనం ఏ ఉద్యమాన్ని గానీ, ప్రయోగాన్ని గానీ, ఫలితాన్ని గానీ లేక రూపాన్ని గానీ, ఏదో ఒకటిగానీ ముందుగా ఊహానిర్ణయం చేసుకుని, శత్రుద్వేషంతో ఇతరుల్ని మొరటుగా చూచినట్లయితే, మనలోని చైతన్యశక్తి నశిస్తుంది.

అప్పుడే బ్రిటీష్ రాజకీయవేత్తలు భారతసమస్యలపై ప్రముఖవ్యక్తీకరణ కర్తలుగా, ప్రపంచంముందు నాటకం ఆడుతున్నారు. ప్రపంచ ఆర్థిక మహాసభలో, భారత దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే వారెవ్వరూ లేరు. లండన్‌లో జరుపబడిన ఆర్థికసమావేశానికి ముందు, అంతర్జాతీయ వ్యాపార సంస్థ - సమావేశం వియన్నాలో కూడా జరిగింది. భారత దేశం ఆ సమావేశంలో ప్రాతినిధ్యం వహించింది కాని లండన్‌లో కాదు. భారతదేశానికి సంబంధించి చేసిన నిర్ణయాలపై, భారత ప్రతినిధులతో సంప్రదించకుండానే చేయబడిన వని, సుభాస్‌బోస్ బాహాటంగా ఒక ప్రకటనచేస్తూ, ఆయన ఇలా చెప్పాడు. "వియన్నా సమావేశం టారిఫ్‌ట్రూస్" వుద్దేశ్యాల్ని వ్యతిరేకించింది. అయితే ఈ భావాలు లండన్ ఆర్థిక సమావేశంలో వారిచెవులకు సోకిన పాపాన పోలేదు."

## ఆగ్నేయ - పశ్చిమ యూరప్‌లో బోస్ :—

ఇంగ్లండు వేళ్ళేదారులు ఇలా ఇనుప కటకటాలతో మూసి వేయబడివున్నప్పటికీ, ఆగ్నేయ - పశ్చిమ యూరప్‌లో

సుబాస్‌బోస్ వెళ్ళటానికి అనుమతించబడిన దేశాలు మిక్కుటంగా వున్నాయ్. 1933 జులైమాసంలో విమానంలో ఆయన "ప్రేగ్" వెళ్ళి పదిరోజులున్నాడు. యిరోపా మాధ్యతర గతి ప్రజాతంత్రమైన ఆ దేశం, ఆయన్ను అత్యంత ఉత్సాహంతో ఆహ్వానించింది. లార్డు బిరుదాంకితుడైన ప్రేగ్ మేయర్ ఆయనరాకకు హర్షించి ఆహ్వానించాడు. ప్రేగ్ మున్సిపాలిటీ చేసిన కృషినంతటినీ సందర్శించటానికి, అవసరమైన వసతులన్నీ ఏర్పాటు చేయబడినాయ్. నిష్ప్రయోగులకుష్టురోగుల కొరకు ఏర్పరచిన "మాసరిక్" గృహాలన్నీ దర్శించి 'పిల్సన్' లోని "స్కోడా యంత్రాలయాల్ని" ప్రేగ్ యూనివర్సిటీ భాగాల్ని చూడటానికి అనేకప్రాంతాలకు వెళ్ళాడు. అంతర్జాతీయ వ్యవహారాల మంత్రి అయిన 'డాక్టర్ బేన్సు'ను కూడా కల్సుకున్నాడు.

తిరిగి ఆయన వియన్నా చేరుకున్నప్పుడు పటేల్ పరిస్థితి పూర్తి అధ్వాన్నంగా వుండటం వలన వారుభయులూ "నియాన్"కు వెళ్ళారు. కానీ కొద్దికాలంలోనే పటేల్ మృత్యుదేవతకు ఆహుతి అయ్యాడు. ఆయన భౌతికదేహం భారత దేశానికి మళ్లింది. "మార్సెలీస్" వరకు సుబాస్‌బోస్ దాన్ని వెంబడించాడు.

ఆయన అదృశ్యం జాతికి, దేశానికి తీరనినష్టం. అంతే కాదు తాను ఏ సిద్ధాంతాల కొరకైతే నిల్చున్నాడో వాటికి ఒక అగ్నిపరీక్ష. ఆయనకు భారతదేశానికి అనుకూలమైన ప్రచారం ఇతర దేశాల్లో చేయాలనే దృఢ సంకల్పంవుంది.

సుభాస్‌తో కలసి అందుకోసరం మంచి కార్యాచరణ నియమా వళిని తయారుచేశాడు. అయితే ఆయన త్వరలో మరణించటం వలన యూరప్‌లో ఇండియా తరఫున చేయవలసిన కృషిని సాగించటంలో సుభాస్‌బోస్ ఏకాకి అయ్యాడు.

తిరిగివచ్చిన తరువాత కొంతకాలం జనీవాలో వుండి తదుపరి ఫ్రాన్సువెళ్ళి, అక్కడ కొంతకాలం వున్నాడు. ఇటలీ లోని అఖిలాసియా విద్యార్థి సమావేశం ఒకటి జరుపబడితే, సుభాస్ అందులో పాల్గొన్నాడు. ఆయన కొన్నిరోజులు రోమ్‌లో నివశించి మొగటిసారిగా ఆ ప్రజల్లోని క్రమశిక్షణా యుతమైన యువజనోద్యమాల్ని సుదీర్ఘంగా పరిశీలించాడు.

తాత్కాలికంగా – జర్మనీని సందర్శించ కూడదు, అన్న నిషేధం తొలగిపోయి ఆ తరువాత పోవటానికి ప్రభుత్వంచే అనుమతి యివ్వబడింది. అయితే దీర్ఘకాలంవరకు తన అనా రోగ్యతవలన సుభాస్ పోలేకపోయాడు.

1934 ఏప్రియల్‌లో సందర్శించిన చిన్నచిన్న బాల్కన్ దేశాలలో భారతదేశం తరఫున గొప్ప సానుభూతి లభించింది. "సాఫియాలో – బుడాపెస్టులో, బుఖారెస్టులో" "ప్రతిచోటా ప్రజలు భారతదేశాన్నిగూర్చి ఆయన ఏమైతే చెప్పాడో దాన్ని ఆదుర్దాగా విన్నారు. "బెల్‌గ్రేడ్" విషయంలో కొంత శ్రమతప్పలేదు. బెల్‌గ్రేడ్‌లోని ప్రముఖ "పొలిటికా" అనేవార్తా పత్రిక ఆయన "యుగోస్లావ్" ముఖ్యపట్టణం చేరుకునేప్పటికి ఆయన్ను కల్సుకునే నిమిత్తం ఒక ప్రతినిధిని పంపించింది.

ఆ ప్రతినిధి, భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనకు సుముఖంగా బెల్ గ్రేడ్ నుంచి ప్రకటిస్తూ పోతూ "రాంపూర్ నవాబు" చే వ్రాయించిన ఒక వ్యాసం ఇటీవల తను పత్రిక ప్రకటించిందని చెప్పాడు. అయితే బ్రిటిష్ పరిపాలనపై ఒక భారత జాతీయవాది భావాలు కావాలని కోరాడు. సుభాస్ అందుకు సమ్మతించాడు. ఇంతలో ఫారన్ ఆఫీస్ బోస్ వ్యాసాన్ని నిషేధించినదని ఆ సాయంత్రమే సంపాదకుడు టెలిఫోన్ లో మాట్లాడుతూ, తన ప్రతినిధికి తెలియచేశాడు. విచారిస్తే బ్రిటిష్ కౌన్సల్ జోక్యం ఫలితంగా వ్యాసప్రకటన ఆగిపోయిందని తెలిసింది. అసలు విషయానికి నుసిపూయటానికి రాయిటర్ సంస్థ సుభాస్ బోస్ ను బెల్ గ్రేడ్ లో సక్రమంగా ఆహ్వానించలేదని, కారణమేమిటంటే ఆయన ఒక ప్రకటనలో బెల్ గ్రేడ్ ఉద్యోగుల్ని విమర్శించినందువలన, ఆ వ్యాసం ప్రకటితం కాలేదని, అంతేకాకుండా అభాండాలు వెదజల్లింది. తక్షణమే బోస్ అసలు విషయాన్ని వివరించేప్పటికి అప్పుడు ప్రపంచమంతా సత్యాన్ని గ్రహించింది.

ఈ బ్రిటిష్ కౌన్సిల్ జోక్యమే ఒక ప్రత్యేక సంఘటన కాదు. ఆయన పోలీసుల తనిఖీకి కూడా గురిఅయ్యాడు. "క్రిస్టియన్ పెసిఫిస్ట్ కాంగ్రిగేషనల్ క్రూసేడ్" అనే ఒక మాస పత్రికలో తనువ్రాసిన వ్యాసంద్వారా శ్రీయుత బోస్ పోలీస్ ప్రవర్తన పై ఫిర్యాదు చేశాడుకూడా.

**జానకీనాథబోస్ మరణం:—** ఇదిజరిగిన కొద్ది రోజుల అనంతరం తండ్రి చాలా అపాయకరమైన జబ్బులో

వున్నాడని సుభాస్ బోస్‌కు ఒక వార్త చేరింది. తక్షణం భారత దేశానికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. బెంగాల్ క్రిమినల్ లా ఎమెండ్‌మెంటుఆక్టు క్రింద ఆయన కరాచీ గడ్డమీద కాలు పెట్టాడో లేదో ఒక ఉత్తర్వు చేతికిచ్చారు. సి. ఐ. డి ఉద్యోగి ఆయన పెట్టెలను గాలించి 'భారత పోరాటం గ్రంథానికి' సంబంధించిన టైపు ప్రతిని స్వాధీనం చేసుకున్నాడు. అక్కడే తండ్రి మరణించాడని తెల్సింది. సంతాపంలో మునిగిపోయాడు. తిరిగి "డండం" విమానాశ్రయానికి చేరుకోగానే మరో ఉత్తర్వు అందించారు. అందులోని నిబంధనలు ఇవి :

(1) తమపేరి ఉత్తర్వులు అందుకునేంత వరకూ ఎలిగిన్ రోడ్‌లోని 30/2 వ నెంబరు ఇంటికి వెళ్ళటం.

(2) ఏ సమయంలో ఏ వ్యక్తినీ సందర్శించటానికి వీలు లేదు. గృహకృత్యాలందే నిమగ్నుడవ్వాలి.

(3) ఏ వ్యక్తితోనైనా ఏవిధంగానైనా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపటంకానీ సంభాషణలతో స[illegible]ంపు లేక కల్సి మెల్సి వుండటం; 30/2 ఎలిగిన్ రోడ్ గృహం నీ గృహస్థులకు మించి ఈ నిబంధనల్ని అతిక్రమిస్తే నిన్ను ఎవ్వరూ రక్షించుకోలేవు.

(4) నీపేరు మీదకానీ, నీ తరఫున, నీ పరోక్షంలో నీ సేవకులు తదితర కుటుంబసభ్యుల పేర్ల మీదకానీ, రాకడ పోకడలు, టెలిగ్రాంల మతలబులు, ఉత్తరాలు, పోస్టు పాకేజీలు తత్సంబంధమైనవి – జరిగేవికానీ; అన్ని పుస్తకాలు లావాదేవీలు నీచే గ్రహించబడేవికానీ. కలకత్తా ప్రత్యేక

పోలీస్ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ చే నియామితుడైన ఉద్యోగి పరీక్షించకుండా యథావిధిగా చూడటానికికానీ వీలు లేదు.

(5) ప్రత్యేకశాఖపోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ చేకానీ, ఏ మాజిస్ట్రేట్ చేకానీ, చట్టబద్ధమైన, కార్యార్థం - నీవు నివశిస్తున్న గృహాపు హద్దుల్లో, అన్యక్తులు - పై విధంగా కోరినప్పుడు నీవు తోడ్పడాలి.

(6) నీకు తెలియజేసిన ఈ విషయాల్ని బుద్ధిపూర్వకంగా అతిక్రమించినట్లయితే నీవు ఏడు సంవత్సరాలకు తక్కువ కాని శిక్షకు, జరిమానాకు పాత్రుడవై కఠినంగా శిక్షించబడుతావు.

సుభాస్ బోస్ దేశంలోనికి కాలుబెట్టిన రోజే ఆయన తండ్రి ఆత్మశరీరాలు వేరు పడినందున, తండ్రి అంత్యక్రియలలో పాల్గొనే అవకాశం మాత్రం లభించింది. కొంత కాలంపాటు తన మాతృదేశంలో ఉండదల్చుకున్నాడు కానీ, ప్రభుత్వం ఒక వారంరోజుల్లో తిరుగు ప్రయాణం కావాలని ఉత్తర్వు చేసింది. సుభాస్ బోస్ ఒక మాసంవరకు ఉండటానికి అనుమతి యివ్వమని వ్రాశాడు. "బైట స్వతంత్రుడ్నిగా వుండేదానికంటే మాతృభూమిలో బంధిఖానాలో వుండటమే ఉచితం" అని కూడా విశదం చేసినా; ఆయన కోర్కె ప్రకారం ఒకమాసం వరకూ ఉండటానికి, ప్రభుత్వం అనుమతించలేదు. అంతే కాకుండా తిరిగి ఆయన ఆరోగ్యం పూర్తిగా మారిపోవటం వలన తన వైద్యులు వెంటనే వియన్నాకు మరలటం మంచిదని

సలహా ఇచ్చాడు. 1934 జనవరి 10వ తేదీన, భారత దేశాన్నుంచి తిరిగి ప్రయాణమయ్యాడు. పోబోయేముందు పత్రికా ప్రతినిధులకు ఇచ్చిన "ఇంటర్వ్యూ సందర్భంలో తాను భారత దేశస్థితి గతులగురించి ప్రకటించేందుకు, తన పరిస్థితినే తాను చక్క దిద్దుకోలేకున్న ఋతరుణంలో, ఎవరితోనూ పోట్లాడటం లేదని స్పష్టంచేశాడు. "అయితే, మనం ఒక రాజకీయ అఘాతాన్ని దాటుతున్నాం. మన ప్రముఖ కర్తవ్యం, ప్రజోత్సాహాన్ని పటుతరం చేయడమే!" అనిమాత్రం చెప్పాడు.

**బోస్ తిరిగి ఐరోపాకు**:- రాబోవు పుటల్లో సుభాస్ చంద్రబోస్ యొక్క ఈసందర్శన ఆయన జీవిత దృక్పథంలోనే ఒక బ్రహ్మాండమైన మార్పు తెచ్చినట్లు విదితమౌతుంది. అయితే తన మొదటిసందర్శన సమయంలో గడిపిన ఆ జీవితం అతిక్లిష్ట భూయిష్టమైంది. తను నిర్వహించవలసివున్న కార్యభారం అనంతమైనప్పుడే, ఆయన ఆరోగ్యం అవక తవకలుగా వుంది. పటేల్ అస్వస్థత; తన కార్య విధానాలలో జోక్యం కల్పించుకొని అవరోధాల్ని సృష్టిస్తున్న బైటప్రభుత్వ ప్రతినిధులు, ఇవన్నీ ఆయన్ను అప్పుడు చికాకుపర్చినయ్. తన కార్యరంగం ఎంత విస్తృతమైనప్పటికీ మారుతున్న పరిణామాల విపరీతవైఖరి, తన ప్రశాంత వాతావరణ దృక్పథానికి ఇరువైపులా పెనుభూతాలై నిల్చున్నయ్. అటువంటి సందర్భంలో కూడా, తనమొదటి సందర్శనా సమయంలోనే, యూరప్ మధ్యలోవుండి. తన అభిప్రాయాల్ని విశదీకరిస్తూ ఒక ఉద్గ్రంథం వ్రాయగలిగాడు. పుస్తకంపేరు, "భారతపోరాటం. (1920-34)"

ఇది ఇంగ్లీషులో ప్రకటించబడింది. అది దౌర్జన్యాన్ని ప్రోత్సహిస్తుంది అనే నెపంక్రింద, సర్ శ్యామ్యుల్ హోర్ దీనిని భారత దేశంలోనికి ప్రవేశించకుండా నిషేధించాడు.

ఆయన ద్వితీయ సందర్శన ఫలితంగా తన ఉద్దేశ్యాలు స్థిరపడినయ్. మొదట "నేపిల్స్"లో దిగి, తరువాత "రోమ్" వెళ్ళి అక్కడ ఒక వారం రోజులు గడిపాడు. రోమ్ గొప్పగా తన ప్రేమను చూరగొన్న కారణాల్ని ఇలా చెప్పాడు "ఇదిపురాతన నవీనతల సమ్మిశ్రమం" ఈసారి సందర్శనా సందర్భంలోని కాలమంతా పురపాలక సంఘాల పరిపాలనా విధానాల్ని పరిశీలిస్తూ; ఆయా ప్రాంతీయ దృశ్యాల్ని తిలకిస్తూ గడిపాడు.

ఆఫ్ఘనిస్తానపు మాజీ రాజు అయిన "అమానుల్లాను" రోమ్‌లో కల్సుకున్నాడు. ఆఫ్ఘన్ రాజు భారత విషయాలపై అత్యంత ఆశక్తిని ప్రదర్శించాడు. భారతజాతీయ కాంగ్రెస్‌కు సంబంధించిన, ఇంకా ఇతర విషయాల్ని గురించి సుభాస్ బోస్‌ను అడిగి తెల్సుకున్నాడు. తాను ఎల్లప్పుడూ భారత యోగక్షేమాల్ని వాంఛిస్తానని చెప్పాడు. నిరంకుశుడైనా ఆపాటికొద్ది సానుభూతిని ప్రదర్శించిన ఆ కర్దైన్యావస్థలోనివ్యక్తిత్వం బోస్‌ను ఆకర్షించింది.

రోమ్‌నుంచి సుబాస్ వియన్నాకువెళ్ళి, వియన్నాలోని ప్రఖ్యాతవైద్యుడైన "న్యూమెన్" వైద్యసహాయం కోసరం వుండిపోయాడు. ఆ తరువాత ఆయన పటేల్ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు "జనీవా" వెళ్ళి, తదుపరి ఆటవిక జబ్బుల్ని

గురించి చర్చించేనిమిత్తం, పారిస్‌లో ఒక ప్రత్యేక వైద్యుని దగ్గరకు వెళ్ళాడు. తన రిస్థితి కొంతలో కొంత యథారూపం దాల్చసాగాడు, తిరిగి భారతవిషయాల్లో జోక్యం ప్రారంభించాడు. భారత దేశంలోని స్థితిగతులన్నీ తెలియజేయబడినయ్. బెంగాల్ పరిస్థితి మాత్రం అధ్వాన్నంగావుంది. కాంగ్రెస్ వ్యక్తులు స్వల్ప విషయాలలో సరం సతమతమౌతున్నారని తెల్సుకుని బాధ పడ్డాడు. బెంగాల్ కాంగ్రెస్ కమిటీలోని తన అనుచరులకు సేన్ గుప్తా వర్గంవారితో సమాన ప్రాతిపదికపై చేతులు కలుప మని వ్రాశాడు

**ఖండన - మండనలు** :— సుభాస్ చంద్రబోస్ తన బహిష్కరణ సమయంలో, బైటనివశిస్తున్న కాలంలో, తనశక్తినంతా, దేశాన్ని బలపరుస్తూ ధారబోసిన ఒకవిషయం వుంది. అదే అంతార్జాతీయ ప్రచారకులు మన దేశానికి వ్యతిరేకంగా కల్పిత ప్రచారం చేయటాన్ని ఖండించటం. వారు ఇప్పటి వరకూ భారత దేశానికి సంబంధించిన వికృతమైన చిత్ర పటాల్ని ప్రదర్శించారు. యూరప్‌లోని అనేక మంది ప్రజలు; భారత దేశం ఒక అంటరానిభూమి — అంటరానితనం దానికి ఒక ప్రముఖమైన సమస్య — అంతేకానీ, ఆకలి - పరపాలన కాదు అని నమ్మేటట్లు చేశారు. ఆయనవ్రాసిన ఒకవ్యాసంలో ఏవిధంగా భారత దేశంపై విరుద్ధ ప్రచారం జరిగిందో అమిత బాధతో వివరించాడు.

"మేము ఈ ప్రశ్నని గురించి అంత నిశ్చలులమైవున్న ప్పటికీ, నాగరికుల వడపోత స్వరూపాలైన మతబోధకులు తది

తరులు మొద్దబ్బాయిలుగా లేరులే! అనేక దశాబ్దాల పర్యం తరం, వితంతువుల్ని కాల్చివేసి ఐదారు సంవత్సరాలు వయసు లోనే బాలికలకు వివాహంచేసే గోచీపెట్టుకోవటంకూడా తెలి యని ప్రజానీకం నివశిస్తున్న భారతదేశం అని చిత్రించారు.

"నేను 1920 సం॥ ఇంగ్లండులో వున్నపుడు ఒక నూత ప్రచారకుని, భారతదేశాన్ని గురించి ఇచ్చిన, చిత్రప్రదర్శనా యుక్తమైన ఉపన్యాసం విన్నవిషయం, నాకు ఇంకాబాగ గుర్తు వున్నది. ప్రదర్శనంలో సగం దిశమొలలో, వికృతంగా వున్న స్త్రీ - పురుషుల్ని చూపించాడు. కాబట్టి ఆయన తన జ్ఞాన జ్యోతిలో కనీసభేదం లేకుండా, మెరుగు పెట్టదల్చుకున్నాడు. 1933 చివరి భాగంలో, మధ్య భారతదేశాన్ని సందర్శించాలని కోరిన జర్మన్ పత్రికారచయిత ఒకడు, "మ్యూనిచ్" పత్రికలో; భారతదేశంలో వితంతువుల్ని కాలుస్తారనీ, బొంబాయివీధుల్లో నిర్లక్ష్యంగా పడవేసి వుంచిన శవాలుంటాయని వ్రాశాడు.

"ఇటీవల వియన్నాలో (సచిత్ర వారపత్రికలైన బిల్డర్ ది. 30. 6) పురుగులలో లుకలుకలాడుతున్న ఒక శవాన్ని ముద్రించి క్రింద వివరిస్తూ— అది ఒక సాధువు శవం. హిందువులలో సాధువు మరణించిన, సాధారణ మానవుడు తీసివేయటానికి వీలులేదనేది హిందూనమ్మకం. కాబట్టి అది అనేక రోజులనుంచీ తీసివేయబడని ఒక సన్యాసి దేహం అని వ్రాసింది. ఇంత జాగ్రత్తగా ప్రకటన విధానాన్ని ఎన్నుకో వటం, తద్వారా భారతదేశాన్ని ప్రపంచం ముందు హీనాతి

హీనంగా చిత్రించి, అసహనత - అసహ్యత కల్పించటం— చూస్తే నాకాశ్చర్యం వేసింది.

"సచిత్రవార పత్రికలకు చలనచిత్రాలు ఏమాత్రం తీసిపోవు, ఇండియా వ్యతిరేక ప్రచారం "భారతీయుడు మాట్లాడును." — "బెంగాలీ" అనే చిత్రాల ద్వారా ప్రచారం ప్రారంభించబడినప్పుడు, అప్పుడే ఇండియాలో దాని వాసన బారింది, నేను వాటిని విమర్శించాల్సిన అవసరం లేదు. అయితే మోసమంతా ప్రదర్శించటం లేదనే నేను బాధపడు తున్నాను. "ప్రతివాడు సంగతుల్ని ప్రేమిస్తాడు"అనే చిత్రంలో మహాత్మాగాంధీ కొల్లాయి బట్టలు ధరించి ఒక యూరోపియన్ పడుచుతో నాట్యంచేయటం అందులో కనుపిస్తుంది."

బ్రిటీషువారి దనున పాలనను "బెంగాలీ" అన్న చిత్రం కప్పిపుచ్చుతుంది. బ్రిటీష్‌వారు భారతీయుల రక్షకులుగా నిరూపించారు. దీనికి వ్యతిరేకంగా "కార్డినల్ విన్నిడ్జర్ వియన్నా ఆర్చి బిషప్"ను సుభాస్ అతిశీఘ్రంగా ఎదుర్కొన్నాడు. బ్రిటీషువారు భారదేశాన్ని జయించారు అన్నంత వరకు అనుమానమేమీ లేదు. అయితే వారు భారతదేశ రక్షకులుగా వుండటానికి ప్రజలు ఈనాడు తమహక్కు ఏమిటో గుర్తించారు. అంతటచిత్రం ప్రచారాన్నుంచి క్రమేణరద్దు పర్చబడింది.

సుబాస్‌బోస్ యూరప్‌లో వున్నపుడు హిట్లర్ తెల్ల జాతుల అంతిమలక్ష్యం నల్ల జాతుల్ని పరిపాలించటం అని

స్పష్టంగా తన ప్రఖ్యాతమైన ఉపన్యాసంద్వారా ఉద్ఘాటించాడు. ఈ ప్రకటన విశాలప్రపంచ వ్యతిరేకతకు గురిఅయింది. అనేకమంది రంగుజాతుల ప్రజలతోపాటు సుభాస్‌బోస్‌కూడ హిట్లర్ నోరు పట్టకుండా చెప్పిన కోర్కెకు అమితంగా ఆగ్రహావు డయ్యాడు. నాజీలు అంతట ఆదుర్దాతో అది జపాన్ ఇండియాలకు అనువర్తించదని విశదం చేశారు. అయితే ఈ విశదీకరణ ఎవరినీ తృప్తిపరచలేదు, హిట్లర్ తన ఉపన్యాసాన్ని బైట పెట్టినప్పుడు ప్రపంచంలోని వార్తా పత్రికలన్నీ దగ్ధమై పోలేదని బోస్ వాదించాడు.

రెండవ సందర్శన సమయంలో డివెలరాను కల్సుకోవటం ముఖ్యాతిముఖ్యమైన సంఘటనల్లో ఒకటి. 1936 ఫిబ్రవరిలో ఆయన "డబ్లిన్‌కు" చేరగానే రాజ్యాంగ ఉద్యోగులు-మేయరు ఆయన్ను సన్మానించారు. తరువాత డివెలరాను కల్సుకుని వారు భారత ఐర్లాండుల స్థితిగతుల్ని గురించి ముచ్చటించుకున్నారు. డివెలరా ప్రత్యేకంగా బ్రిటన్‌తో సంబంధ బాంధవ్యాలు, ఐరిష్ విధానం సుభాస్‌బోస్‌కు విశదం చేశాడు.

ఐర్లండ్ - ఇండియాలు నైజంలో ఒకటిగా కనుపించటానికి ఉభయ దేశాలలోని పరిస్థితులే అందుకు కారణమని, ఐరిష్ ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి భారతీయుల పూర్తి సానుభూతి వున్నదనీ సుభాస్‌బోస్ ప్రకటించాడు. డివెలరా మంత్రివర్గంలోని భూ - వ్యవసాయపు మంత్రిని స్థానిక స్వప్రభుత్వ మంత్రిని "సిన్‌ఫిన్ అధ్యక్షుడ్ని, ఐరిష్‌ప్రెస్ పత్రికా సంపాదకుడ్ని రిపబ్లికన్ పార్టీ ఉద్యోగుల్ని కూడా సందర్శిం

చాడు. ఈ రెండు అణగారిన దేశాలమధ్య సన్నిహితమైత్రి ఏర్పడగలదని ఆయన ఆశించి, అది జయప్రదం కావటానికి కొంతమంది భారతీయ విద్యార్థులు, ఆచార్యులు ఐర్లండ్‌ను సందర్శించి ఆ విశ్వవిద్యాలయాలలో చదువుకునే అవకాశం కల్పించమని డివెలరాను కోరాడు. అటువంటి అత్యుత్తమ ప్రతిపాదనను డివెలరా హృదయ పూర్వకంగా స్వీకరించాడు. ఎందుకంటే, ఉభయ దేశాలమధ్య ఇంతకుముందు వున్న సంబంధ బాంధవ్యాలు ఆ విధంగా పటుతర మౌతాయని విశ్వ శించాడు.

**ప్రజాభిమానం చూరగొన్నాడు:-** 1936 లో భారత జాతీయ కాంగ్రెస్ "లక్నో"లో జరుగవలసి వుంది. అధ్యక్షుడుగా ఎన్నికైన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో పర్యటించాడు. ప్రజావాణి బోస్ కూడా హాజరు కావాలని కోరింది. వియన్నాలోని బోస్‌కు పండిట్ నెహ్రూ ప్రజా వాంఛ తెలియజేశాడు. ఆయన ఇండియాకు రావటానికి ఆహ్వానాన్ని పొడిగించాడు కూడా. మరోవైపున భారత ప్రభుత్వం దేశంలో ఆయన అడుగుపెట్టటానికి అంగీకరించటం లేదు.

తిరిగి వచ్చినట్లయితే అరెస్టు చేయబడతావని బోస్‌కు తెలియజేయబడింది. వియన్నాలోని హిజ్ మెజిస్టీస్ కౌన్సిల్‌కు సంబంధించిన మిస్టర్. జె. డబ్ల్యు టేలర్ ఈ క్రింది హెచ్చరికను అందించాడు.

"నీకు హెచ్చరిక చేయమని దేశ అంతర్జాతీయ వ్యవహారాల కార్యదర్శి ఈరోజు నాకు కొన్ని సూచనల్ని పంపించాడు. పత్రికా ప్రకటనల ద్వారా భారత ప్రభుత్వం. నీవు ఈనెల ఇండియాకు రావటానికి ఉద్దేశించినట్లు తెలుసుకుంది. ప్రభుత్వం నీకు తేటతెల్లంగా చెప్పదల్చిందేమంటే నీవు అలా చేస్తే అక్కడ స్వేచ్ఛాజీవిగా వుంటావని భ్రమపడబోకు."

ఈ హెచ్చరిక ప్రత్యక్షమైన తరువాత తన దేశీయుల వాంఛాను యుక్తంగా ఇంటికై పురు నడువటమూ లేక హెచ్చరికకు లొంగటమూ – అధిగమించటమూ అనేవిషయాన్ని బోస్ తేల్చుకోవల్సి వుంది. అక్రమం – అన్యాయాల ముందు ఆయన దాసోహమనటం దాసోహమౌతాడని భావించటం, అసంభవం. అంతేకాక అదెప్పటికీ జరుగనట్టిది. కాబట్టి ఆయన ప్రజలుకోరినట్లుగా చేయటానికి నిశ్చయించుకొని "యస్. యస్. కాంటివర్. డె" అనేఒక ఇటలీ నావలో ఇండియాకు బయలుదేరాడు.

ఒకని మాతృభూమిలో నిర్బంధం, బహిష్కరణ కంటే ఉత్తమమని ఆయన భావించాడు. మార్చి 17న ఆయనబయలు దేరబోయేముందు "మాంచెష్టర్ గార్డియన్" పత్రికకు, తన కిచ్చిన ఉత్తర్వును తీవ్రంగా నిరశిస్తూ ఒక సుదీర్ఘ వ్యాసాన్ని పంపించాడు. ఆ వ్యాసంలో:—

"నేనిప్పుడు మాతృదేశానికి వెళ్ళాలనుకుంటే ఈ అధికారుల బెదరింపుపత్రం నాకుచేరింది. నాకీనిర్బంధం న్యాయసబంధంగానూ, నైతికంగానూ ఏమాత్రం ఉచితమైందికాదు.

అయితే నేనిప్పుడు ఇండియాకు తిరిగి వెళ్తున్న తరుణంలో తెలిపిన నిర్బంధవిధానం ఇంతకుముందు వాటన్నింటినీ తుడిచి వేస్తుంది. నూతన రాజ్యాంగంద్వారా విస్తృతం చేయబడిన స్వేచ్ఛాస్వరూపం ఇదే అయితే బ్రిటీష్ చట్టాలలో భారత దేశాన్ని పరిపాలించేది ఇలానేగా అని నేను అడుగుతున్నాను."

1937 ఏప్రిల్ 11 వ తేదీన ఓడ బొంబాయిసముద్రబడ్డుకు చేరుకుంది. వేలాది స్త్రీ పురుషులు ఈ గొప్ప భరతదేశధీరో దాత్త భక్తుని ఆహ్వానించటానికి తీరం చేరుకున్నారు. అయితే బోస్ నావనుంచి క్రింద అడుగుపెట్టాడో లేదో వెంటనే 1818 బెంగాల్ రెగ్యులేషన్‌లోని మూడవ శెక్షన్ 3 వ రెగ్యులేషన్ ప్రకారం ఆయన్ను బంధించి 'యరవాడ' జైలుకు తీసుకుపోవటం ప్రజోత్సాహాన్ని ఖూనీచేయటమైంది. విడిచి పోబోయేముందు దేశానికి "స్వేచ్ఛాపతాకం నిరంతరం ఎగుర నివ్వండి" అన్న ఉద్రేక సందేశం యిచ్చాడు.

పండిట్ జవహరిలాల్ నెహ్రూ భావించిన ప్రకారం. "ఈ నిర్బంధం భారతదేశంలోని పౌరహక్కుల్ని దేశమంతటా ఎలాదారుణంగా కుదించివేస్తుంది ఇది ఒక ప్రత్యక్షసంఘటన" ఇంతేకాదు ఈ అరెస్టుకు వ్యతిరేకంగా దేశమంతటా గంభీర మైన గగ్గోలు బయలు దేరింది. ఇంగ్లండ్‌లోకూడా ఈ సంబంధ మైన ప్రశ్నలు బయలుదేరినయ్. భారతదేశంలో కేంద్ర శాసనసభా ప్రతిపక్షనాయకుడైన శ్రీ భులాభాయిదేశాయి ఒక కోత తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక తీర్మానం చేసింది. ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా

ఖండిస్తూ కాంగ్రెస్ సోషలిష్టుపార్టీ ఒక ప్రకటన చేసింది. మిష్టర్ మాక్ట్సన్, కాంప్‌బెల్, షీఫనులు ఎదురుచూస్తున్నపుడు బట్లర్ ఒక రాయబార బృందంతో వెళ్ళి ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని అర్థించాడు. కామన్సు సభలో విచారణ రహితంగా ఆయన్ను కాలనిర్ణయం లేని నిర్బంధంలో వుంచటానికిగల హేతువుల్ని వ్యక్తీకరించమని ప్రశ్నలవర్షం కురిపించారు. ప్రభుత్వానికి అంతటితో నర పటుత్వం తగ్గింది. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ కామన్సు సభలో భారతదేశపు అండర్ శెక్రెటరీ భారతదేశంలోని ప్రముఖమైన ఒక విప్లవ పార్టీతో సుభాస్‌బోస్ సన్నిహిత సంబంధం కలిగి వున్నాడని వివరించాడు.

ఇంగ్లండ్‌లోను ఇండియాలోను ప్రత్యక్షమైన ప్రజా వాణియొక్క బ్రహ్మాండమైన వత్తిడి ప్రభుత్వాన్ని ఆ సమస్యపై ఆలోచించేట్లు ముంచి తేల్చింది. విశేష మేమంటే, ఇండియా యాక్టులోని మొదటి భాగమైన "రాష్ట్రప్రతిపత్తి"ని అమలు జరిపే విషయంలో, కాంగ్రెస్ సహకారాన్ని ప్రభుత్వం వాంఛించి నందువలన, 1937 మార్చి 17 వ తేదీన ఆ సహకారం లభించదేమోనను భయంతో, గవర్నర్ జనరల్ సుభాస్‌బోస్‌ను విడుదల చేయుటానికి ఉత్తర్వు ఇచ్చాడు.

విడుదలానంతరం కొంత కాలంవరకు ఆయన కలకత్తా లోనే నివశించాడు. అయితే 1937 మే 1 వ తేదీన వైద్య సలహా ప్రకారం డాక్టర్ ధర్మవీర్ దంపతుల ప్రత్యేక పర్య వేక్షణక్రింద వైద్య సహాయం పొందేనిమిత్తం పంజాబ్‌లోని

డల్‌హౌస్‌కి బయలుదేరాడు. ఆయన అక్కడ తిరిగి ఆరోగ్యం పొందాడు. కానీ శీతాకాల ప్రవేశంతో కలకత్తాకు తిరిగి చేరుకుని అక్కడినుంచి పూర్తి ఆరోగ్యం నిమిత్తం యూరప్ బయలు దేరాడు.

వైద్యసహాయ నిమిత్తమే ఇంతకుముందు ఖైదీగా వుంటున్నపుడు యూరప్ సందర్శనలు జరిగినయ్. కానీ ఈసారి ఒక విధంగా కేవలం వినోదయాత్ర అనవలసి వుంటుంది. ఈ ప్రయాణంలో, లండన్‌లోని ఒక ప్రముఖ ఆహ్వానం సందర్భంలో, తన ప్రాథమికోపన్యాసంలో, ఇండియా ప్రభుత్వ చట్టంలోని ద్వితీయభాగమైన ఫెడరేషనులోని ప్రతిపండ్ల చక్రపు అంశాన్ని. కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని బహిర్గతం చేశాడు. ఈ సారి తాను కొద్దికాలం యూరప్‌లో వున్నప్పటికీ, దాదాపు అరడజను ఉపన్యాసాలు యిచ్చాడు. ప్రతిచోటా ఇండియా ప్రభుత్వ చట్టంలోని ఈ భాగాన్ని దేశం అంగీకరించదని పదేపదే విశదీకరించాడు. అయితే ప్రభుత్వం ఒకవేళ బలవంతంగా దాన్నంగీకరింపచేసే ఎత్తుగడల్ని వేస్తే మాత్రం కాంగ్రెస్ తన శక్తినంతా కేంద్రీకరించి వ్యతిరేకిస్తుందని కూడ స్పష్టం చేశాడు. ఈమారు ఆస్ట్రియాలోని "బాడ్‌గెష్టిన్"లో ఆరు వారాలుండి చికిత్స పొందాడు.

## రాజీనామా

**హరిపూర్ కాంగ్రెస్:-** ఇది 51వ కాంగ్రెస్ సమావేశాన్ని హరిపూర్‌లో జరుపవలసిన సమయం. నాలుగు పేర్లు అధ్యక్ష స్థానానికి సూచించబడినయ్. (1) సుభాస్ చంద్రబోస్ (2) మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్, (3) జవహరిలాల్ నెహ్రూ (4) ఖాన్ అబ్దుల్ ఘఫర్ ఖాన్. వీరందరూ గొప్ప మేధాశక్తి, దేశభక్తి కలిగిన ధీయుతులే. వారిలో ప్రతియొక్కరూ దేశంకోసరం తమసర్వస్వాన్ని ధారపోసిన వారే; అయితే సుబాస్ తనకష్టదశను గడిచి గట్టెక్కిన తరువాత ఆయన హక్కు సరైనది, సమర్థనీయమైనది యని అందరూ భావించారు. అవకాశాలున్న అభ్యర్థులు గూడా ఒడంబడి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసరం జేసిన స్వార్థరహిత త్యాగాల్ని హర్షిస్తూ తమతమఅభ్యర్థిత్వాల్ని రద్దుచేసుకున్నారు. ఆవిధంగా 1938 భారత జాతీయ కాంగ్రెసుకు పోటీలేని అధ్యక్షుడుగా సుబాస్ ఎన్నికైనాడు. తన అనారోగ్యత వలన అంత విస్తృత బాధ్యతను భరించలేకున్నప్పటికీ, ఆయన దేశీయుల వాంఛలకు బద్ధుడై పద్నాల్గవ తేదీన విమానంలో తనదేశానికి చేరుకున్నాడు. అధ్యక్ష హోదాపై కరాచి విమానాశ్రయంలో బ్రహ్మాండమైన స్వాగతమీయబడింది. దేశమంతా ఆయన్ని ఆహ్వానించింది. తనువున్నపదవీ నిర్వాహణ, సమర్థతతో సాగించమని మహాత్మ గాంధీ ఆశీర్వదించాడు. మిత్రులు అభినందించారు.

హరిపురంలో తపతీనది ఒడ్డున కాంగ్రెసు సమావేశ స్థలం నిర్ణయించబడింది. కేంద్రశాసన సభాధ్యక్షుడైన కీ. శే. శ్రీయుత విఠల్‌భాయ్ పటేల్ గౌరవసూచకమైన జ్ఞాపకార్థంగా కాంగ్రెస్ నగరానికి విఠల్ నగరమని నామకరణం చేయబడింది. 51వ సమావేశాన్ని పురస్కరించుకొని ప్రత్యేకోద్దేశంతో ఆహ్వానసంఘం పందిరికి 51 ద్వారాల్ని ఏర్పాటుచేసి, 51 పతాకాల్ని ప్రతిష్ఠింపజేసి, 51 జతల యెద్దులతో అధ్యక్షుని వూరేగింపును నడిపించి, 51 జాతీయ గీతాల్ని పాడించింది. దేశం నలుమూలలనుండి వేంచేసిన ఖద్దరుటోపీదారులు రాజకీయ సంభాషణలు ఎడతెరిపి లేకుండా సాగిస్తున్నారు. వీరందరికి తోడుగా అనేకమంది ప్రతినిధులు, ప్రేక్షకుల, వివిధరాష్ట్ర మంత్రుల రాకతో హరిపూర్ కిటకిట లాడుతుంది.

భారత ప్రజానీకానికి స్వేచ్ఛ లభిస్తుందనే నమ్మకాన్ని విశదీకరించే సుదీర్ఘ సందేశం, గృహపరిశ్రమాలయంపై త్రివర్ణపతాక ప్రతిష్ఠాపన జరుగడంతో మహాత్మునుంచి లభించింది. తమ యువనాయకులైన అధ్యక్షుడు – పండిట్ నెహ్రూల దర్శనార్థం వారి మకాంముల ముందు ఎప్పుడూ ప్రజా సమూహం క్రిక్కిరిసి వుంటుండేది. కార్యవర్గ సమావేశం ఫిబ్రవరి 14వ తేదీన జరుగవలసివుంది. కాంగ్రెసు చరిత్రలో అరుదుగా గోచరించిన అద్భుత వూరేగింపుతో అధ్యక్షుని బైటకు తీసుకొని వెళ్ళారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పదహారవ తేదీన సమావేశమై మాజీ అధ్యక్షుడు జవహరిలాల్ నెహ్రూ గతసంవత్సర స్థితిగతుల నివేదిక సమర్పించి, అధ్య

క్షుని ఆసనం అలంకరించమని కోరినప్పుడు; వందేమాతరం నినాదశబ్దానికి, భూనభోంతరాలు మారుమ్రోగుతుంటే, ప్రజల హర్ష పూరిత కరతాళ ధ్వనుల మధ్య అధ్యక్షుడు ఆసనాన్ని అలంకరించాడు.

ఈమారు కమిటీముందు తీరిక లేని, కార్యక్రమంవుంది. దేశంలో రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనే ప్రశ్నపై గవర్నర్ల చేతుల్లో యు. పి. బీహార్ల ప్రధాన మంత్రులైన గోవింద వల్లభ పంత్ – శ్రీకృష్ణ సిన్హాలు, తమ మంత్రివర్గ రాజీనామా కాగితాల్ని దాఖలుచేశారు. మరోవైపు యుద్ధ మేఘాలు యూరోపు గగనాన్ని ఆవరిస్తున్నయ్. ఇవిరెండూ కాంగ్రెస్ నెదుర్కొంటున్న ప్రముఖ సమస్యలు. పార్లమెంటు కమిటీని, కాంగ్రెస్ ప్రస్తుత కార్యవర్గంపై, బీహారు, యు. పి. సమస్యలపై మొత్తం సమస్త రాష్ట్రాల్లోను రాజ్యాంగ ప్రతిష్టంభన సృష్టించాలని సోషలిస్టు నాయకులు విపరీతమైన ఒత్తిడి తెచ్చారు. ఐరోపా యుద్ధసమస్యకూడ వారిని ఆకర్షించి సూక్ష్మ దృక్పథానికి హేతువయింది.

ఫిబ్రవరి 19 వ తేదీన కాంగ్రెస్ బహిరంగ సమావేశం జరగవలసి వుంది. ప్రభాత భేరీల మారుమ్రోతలకు వేకువ ఝామునునే విఠల్‌నగరం మేల్కొంది.

జండాచౌకులో జండా ప్రతిష్ఠాపనా సందర్భంలో వాయించబడిన ఆరాగాలాపన ప్రతివారి హృదంలో ప్రతిధ్వనించింది. అనంత అవిచ్ఛిన్నమైన ప్రజాసమూహం బారులుతీరి

జాతీయగీతాల్ని పాడుకుంటూ ఆ స్థలాన్ని చేరుకున్నయ్. ఒక పులకరెత్తించే గీతపు రాగాలాపనలో సుభాస్ చంద్రబోస్ జాతీయ జండాను ఎగురవేశాడు.

బహిరంగ సమావేశంలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు దర్బార్ గోపాల్‌దాస్, కాంగ్రెసు సమావేశానికి విచ్చేసిన అధ్యక్షుణ్ణి, ప్రేక్షకుల్ని, ప్రతినిధుల్ని ఆహ్వానించాడు. ఆహ్వాన సంఘాధ్యక్షుడు 1921 కార్యక్రమంలో, కాంగ్రెస్ నాయకత్వంలో తన విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ చేసిన ఉపన్యాసం చిన్నదైనప్పటికీ అది ఆకర్షణంతంగాను, అత్యద్భుతంగానూ యున్నది. "రాజకీయంగానూ, తదితర విధంగానూ ఉపన్యసించవలసింది నేనుగాదు. కాంగ్రెస్ అధ్యక్షుడు. గుజరాత్ తరఫున మిమ్మందరిని ఆహ్వానించడం నావిధి. తన జీవితంలో యెడతెగని త్యాగాలు, సేవజేసి బాధలుపొందిన యీ మహావ్యక్తి అధ్యక్షతవలన మనం అదృష్టవంతులమయ్యాం. మన అధ్యక్షుని విజ్ఞానపూరిత సమయోచిత పర్యవేక్షణక్రింద మనం మన అంతిమ లక్ష్యాన్ని చేరుకోగల పవిత్రమైన చారిత్రక అధ్యాయాన్ని సృష్టించగలమని విశ్వసిస్తూ సృష్టించమని ప్రార్థిస్తున్నాను." అన్నాడు దర్బార్ గోపాల్‌దాస్.

పరిస్థితుల దృష్ట్యా గొప్ప రాజకీయ దూరదృష్టితో, విజ్ఞానంతో తయారుచేసిన అధ్యక్షోపన్యాసం దీని అనంతరం చదువబడింది. ఆయన సాధారణంగా క్రమబద్ధ విశ్వాస పూరిత వ్యక్తిగా మాట్లాడాడు. ప్రతిమాటలో గూడ సత్యసంధత అంతర్జాతీయ దూరదృష్టి గోచరమైనయ్. అన్ని రకా

లైన పత్రికలు ప్రతియొక్క మాటకూ తమ హర్షాన్ని వెలి బుచ్చినయ్.

కాంగ్రెస్‌ను సంపూర్తిగా పర్శించటంగానీ, లేక కాంగ్రెస్ సమావేశపు అంతిమఘడియలు, నివేదిక తెలియచేయడంగానీ యీ పుస్తకం యొక్క వుద్దేశం కాదు. ఆశ, విశ్వాసాల మధ్య అన్నిరకాలైన సమావేశాలు — ముఖ్యతీర్మానాలు చేయ బడిన అనంతరం, మామూలుగానే నడిచి ముగిసిపోయిందని క్లుప్తంగా చెప్పవచ్చు.

సుబాస్‌బోస్ శారీరక దౌర్బల్యంతో వున్నా తాను కార్యాలయంలో వున్నంతకాలం ఒక్కరోజైనా విశ్రాంతి తీసుకోకుండా కాంగ్రెస్ సిద్ధాంత ప్రచారాన్ని శక్తివంచన లేకుండా సాగించాడు. అనేక దేశైక పర్యటనల్ని చేసి లెక్కలేని వుపన్యాసాలిచ్చిన శ్రమంతా వృధాపోకుండా ఫెడరల్ ప్రణాళికని వ్యతిరేకించేందుకు తోడ్పడింది.

**త్రిపురీ కాంగ్రెస్ :—** త్రిపురీ కాంగ్రెస్‌ఘట్టం కాంగ్రెస్ చరిత్రలో అత్యంత ప్రధానమైంది. అది కేవలం అంతప్రాధాన్యమైందే కాదు: అంతకు రెట్టింపు నష్టకష్టాలకు దోహదమైందికూడ. వందలాది మూలనున్న రహస్యమైన సమస్యలు మితవాద వామపక్షాల సంఘర్షణ ఫలితంగా, ప్రకాశవంతమైన తర్కచక్రంలోనికి వచ్చినయ్. కాంగ్రెస్ వర్గాలలోని భేదాభిప్రాయాలు పెచ్చుపెరిగి యింతకుముందు సంఘట్టనలలో యేదీకూడ తుల్యంగాని బ్రహ్మాండమైన అగ్ని

కాంగ్రెస్‌లో యేర్పడింది. విభిన్న వర్గాల్ని నడపిస్తున్న నాయకులు అధికారంలోనికి రానడానికి తమ శక్తి వంచనలేని కృషి చేసారు. ఈ సంఘర్షణ ఫలితంగా భారత రాజకీయాలల్లో, అతివాద - మితవాద పక్షాలు యెన్నడూ కని విని యెరుగనటువంటి దీక్షకు బద్ధమైనయ్.

ఈ రోజు కాంగ్రెస్ వున్నత కార్యవర్గ నిర్మాణం ప్రకారం అది యెన్ని ఘనకార్యాల్ని సాధించినా, మహా విలువైన త్యాగాలుచేసినా, యెన్నడూ తన పురాతన ధోరణి వదలిపెట్టలేదు. గాంధీజీ ఆయన సహచరుల నాయకత్వం క్రింద, కాంగ్రెస్ నిస్సందేహంగా అనేక పోరాటాల్ని నడిపింది. అయినప్పటికీ యెల్లప్పుడు యేదోఒక రాజీబేరంతో, ఆ పోరాటాలు అంత్యమై పోయినయ్ అనే సత్యాన్ని యెవ్వరూ మరుగుపర్చలేరు.

అయితే యిప్పుడు వామపక్ష దృక్పధం కలిగి రాజీ బేరాలకు పూర్తి విముఖుడై యుంటున్న, ఒకనాయకుడు అందులో యున్నాడు. బ్రిటీషు సామ్రాజ్యంలో యేరాజీ బేరాలు పెట్టినా ఆయన ప్రబల శత్రువు. నిష్పాక్షికం-నిర్యోగమాటం ప్రదర్శించే దృక్పధంగల కార్యదక్షుడు. త్రిపురిలో కాంగ్రెస్ వున్నత కార్యవర్గంలో తన తగాయిదాకు, ఒకవేళ, యివే తెరమరుగు కారణాలు కానచ్చు.

సాధారణ కాంగ్రెస్ వ్యక్తుల దగ్గరనుంచి మహా నాయకుల వరకు, ఫెడరేషన్ సమస్యమీాద ఒకరి కొకరికి, తీవ్రమైన

అభిప్రాయ భేదాలున్నాయ్ అనేది, యీ సంఘర్షణలో యిమిడియున్న సత్యానికి సూత్రం అనవచ్చు. గతసంవత్సరం అధ్యక్షుడుగావుండి సుభాస్‌బోస్ చేసిన కృషిద్వారా ఏ సవరణ రూపంలో ఫెడరేషన్ తీర్మానాంగీకార సమస్య వచ్చినా ఆయన ఆ స్థానంలో యున్నంతకాలం, అది అంగీకారానికి రాదు; రాజాలదు., అనే విషయం ఋజువు పడింది. అలాంటప్పుడు యింతకుముందు రాష్ట్రప్రతిపత్తి తీర్మాన విషయంలో, ఒక సవరణలో పట్టుపట్టి అంగీకరింప జేసిన యొక బలీయవర్గం కాంగ్రెస్‌లో వ్యతిరేకంగా నిలబడియుంది. ఈ సమస్యమీద సుభాస్‌చంద్రబోస్‌కు గాంధీ అనుచరవర్గానికి మధ్యవచ్చిన అభిప్రాయభేదాలు, రాబోవు సంవత్సరానికికూడా సుభాస్‌బోస్‌ను అధ్యక్షునిగా చేయగలవని మహాత్మా వేసుకున్న అంచనా ఫలించింది. కాబట్టి మితవాదనాయకులు యెన్నికల విషయంలో అమిత ఆతురతను ప్రదర్శించారు. మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్, డాక్టరు పట్టాభి శీతారామయ్య, శ్రీ సుభాస్‌చంద్రబోస్ యీ ముగ్గురే ముగ్గులో కన్పిస్తున్న అభ్యర్థులు. అనారోగ్య కారణాలవలన మౌలానా అజాద్ ఆ గురుతర బాధ్యత అంగీకరించ నిరాకరించాడు. అందుకని పోటీనుంచి తాను విరమించుకొని తన నిశ్చితాభిప్రాయాన్ని యీ దిగువ ప్రకటనద్వారా బహిర్గతం చేశాడు.

"నేను పట్టాభి శీతారామయ్య పేరు గూడా సూచించబడినందుకు సంతోషిస్తున్నాను. నేను నా అభ్యర్థిత్వాన్నుంచి విరమించుకోనేమోనను

వుద్దేశ్యంతో ఆయన తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసుకోవడానికి నిశ్చయించుకున్నాడు. ఆయన్ను ఆ విధంగా చేయవద్దు అని వాంఛిస్తున్నట్లు చెప్పడానికి సంతోషిస్తున్నాను. కాంగ్రెసు కార్యవర్గానికి ఆయన యెప్పటినుంచో సభ్యుడు. గొప్ప కార్యకర్త కూడా. నేను యెన్నిక ప్రతినిధులకు ఆయన పేరు ధృవపరుస్తున్నాను. పోటీ లేకుండా యెన్నుకోబడతాడని నమ్ముతున్నాను."

ఆ ప్రకటన జేస్తూ ఆ అభ్యర్థిత్వవిరమణ జరుగటం, అధ్యక్ష యెన్నికలో అంతులేని చైతన్యానికి దారితీసింది. మౌలానా ప్రకటన అనంతరం యేదో కూడుపుఠాణి తెర మాటున సాగిందని దేశానికి విదితమైంది. కాని, జాతీయ ప్రముఖ అవసరాల సాధననిమిత్తం శ్రీయుత బోస్ ధైర్యంగా నిలబడటానికే నిశ్చయించుకొని పత్రికలద్వారా తాను పోటీనుంచి విముక్తి పొందటానికి తనకు హక్కు లేదని ప్రకటించాడు.

"సమస్యని మరిస్తే, దీనికి యెంత నూతన అపార్థతను ఆపాదింపచేయాలో అంతాజోడించారు. ఇది వ్యక్తిగత సమస్యమాత్రంగాదు. భారతదేశంలో అధ్యక్షుపు యెన్నిక నిశ్చితసమస్యలమీద నిర్మాణకార్యక్రమంమీద జరుగవలసి యుంటుంద"ని చెప్పాడు.

చివరకు ఆయనిలా చెప్పాడు. "మౌలానా అజాద్"ల వంటి మహానాయకుల అభ్యర్థన ఫలితంగా, అధిక సంఖ్యాక ప్రతినిధులు, నాతరఫున యెన్నికకు భిన్నంగా ఓటుచేసేటట్లయితే, యేమైనప్పటికీ, వారి నిర్ణయానికి నేను విధేయతతో కట్టుబడియుండి, ఒక సామాన్య సైనికునివలె కాంగ్రెస్‌కు వినయతతో, దేశానికిభక్తితో, సేవను యధావిధిగానే చేస్తాను."

శ్రీ బోస్ ఎన్నికలలో తాను పోటీ చేయాలని నిశ్చయించుకున్న నిర్ణయానికి, అనుగుణ్యంగా చూపించిన తర్కయుక్తకారణాలు, పూర్తి సమర్థనీయంగా యున్నయ్. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌వారి సంయుక్తాభిప్రాయాలు పంచుకోబడినయ్. పోతే ఆయనకున్న ఒకేఒక సక్రమమార్గం యేమిటంటే అన్ని యితర దేశాలలోమాదిరి, కాంగ్రెస్ యెన్నికల పోటీగూడ, నిర్ణీత సిద్ధాంతాలకు - నియమావళికి, దూరం కాగూడదు అనే విషయాన్ని, వారందరకు గుర్తు చేయడమే! ఆయన ధైర్యానికి ప్రతి ప్రాంతంనుంచి అభివందనాలు లభించినయ్. అంతేగాదు తనపోటీకి ఎందుకో చూపించిన కారణాలు గూడ అసంఖ్యాకమైన కాంగ్రెస్‌వాదులపై బాగాపనిచేసినయ్. తత్ఫలితంగా దేశంలోని యువకులేగాదు, అధిక సంఖ్యాక ప్రతినిధులనుంచిగూడ, మరో సంవత్సరంపాటు ఆయన అధ్యక్షుడుగా యుండటానికి, తాము సుముఖులుగా ఉన్నామని టెలిగ్రాములు, లెక్కకుమించి చేరినయ్. మరోవైపున ముసలి కాంగ్రెస్ నాయకత్వం ఫ్రాడపీకి వేయాలని అమిత ఉత్సాహంతోవుంది. అయితే దేశంలో ఫెడరేషన్‌ను వ్యతిరేకిస్తున్న

అధిక సంఖ్యాకులు ఆయనను తిరిగి యెన్నుకుంటారేమోఅనే భయం వెన్నాడుతూనే వుంది. అందుకని వారు తమతమ వ్యక్తిగత పలుకుబడుల్ని, ప్రతినిధులపై ప్రసరింప చేయడానికి నిర్ణయించుకుని – సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబు రాజేంద్ర ప్రసాద్, శ్రీ జైరామ్‌దాస్ దౌలత్‌రామ్, ఆచార్య కృపలాని, శంకర్‌రావ్ దేవ్, శ్రీ భులాభాయ్ దేశాయ్ యీ ఆరుగురు ప్రముఖ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, పట్టాభిని సమర్థిస్తూనే గాక – పత్రికల్లోయొక ప్రకటన చేశారు.

"డాక్టర్ పట్టాభి కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి సరిగ్గా సరిపోతాడని మేము నమ్ముతున్నాం. ఆయన పాతబడిన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులలో ఒకడు. ఆయన తన ప్రజా సేవలో, ఒక తెంపులేని దీర్ఘ ప్రబంధ సృష్టికర్త. కాబట్టి ప్రతినిధులందరికీ ఆయన పేరును మేం ప్రతిపాదిస్తున్నాం"

ఒక మితవాదపక్ష పత్రిక పట్టాభిని సమర్థిస్తూ యీ ఆరుగురు ప్రముఖకాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుచేసిన ప్రకటన పురస్కరించుకొని, పట్టాభి సీతారామయ్య ఆ నెందుకు కాంగ్రెస్ అధ్యక్షుడుగా యెన్నుకోబడాలనో, ఒక ప్రకటన ద్వారా వివరించాడు.

"నేను యెన్నుకోబడినట్లయితే, అది నేను రాష్ట్రా లకు చేసిన సేవయొక్క-ఫలితమని తృప్తిపడ తాను. నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘా నకి అధ్యక్షుడుగా పని చేస్తూ, కాంగ్రెస్ కార్య

> వర్గంలో సభ్యుడుగా వుంటున్నాను. కాంగ్రెస్ కార్యవర్గాంలో క్రమశిక్షణలేకపోవడం, కుళ్ళు కంపులు ప్రవేశించటం పరిశీలించాను. నేను యెన్నుకోబడినట్లయితే మన స్వగృహాన్ని క్రమబద్ధంగా సరిదిద్దడానికి నా సర్వశక్తిని ధారపోస్తాను."

బోస్ చేత యెవరూ వూహించనటువంటి సత్యాన్ని బట్టబయలు చేసేకొన్ని ముఖ్యప్రకటనలు చేయబడినయ్. అవి సర్దార్ పటేల్, ఆయన సహచరులపైన నాటుబాంబులై పని చేసినయ్.

దేశం అత్యంత ఉత్సాహంతో, యీపోటీని పరీక్షిస్తున్న సమయంలో, మితవాదినాయకులు తమపై బోస్ తెచ్చిన అభియోగాల్ని అంగీకరించడమో లేక యెన్నుకునేవారిముందు తమ నిజస్వరూపాల్ని బైటపెట్టుకోవడమో తేలిపోతుంది.

సత్యాన్ని మరుగుపరచడానికి ప్రయత్నంజేస్తూ తన పార్టీతరపున సర్దార్ వల్లభాయిపటేల్ పత్రికలో ఒక ప్రకటన చేశాడు.

పర్వాలేదు. ఒక పక్షంగా కాని, పోటీపక్షంగా కానీ, బహిర్గతమైన ప్రకటనలు అసలు సమస్యమీద అనుమానాన్ని అమాంతంగా తుడిచిపెట్టినయ్. సర్దార్ పటేల్ ఆయన పంచ మిత్ర బృందంచేసిన సంయుక్త ప్రకటన, ప్రతినిధుల్ని ఒత్తిడి పెట్టలేకపోవడమేగాక, అది వారిమీద యేవిధంగానూ

ప్రయోగం కాలేదని ప్రస్ఫుటంగా ఋజువైంది. ఒక గంభీర వ్యక్తిత్వం లేనంతకాలం, పోటీ ఉండకూడదు; అనేటువంటి ఆ రోజుల్లోని నినాదం, కాంగ్రెస్ రక్షకుల్ని, మార్గదర్శకుల్ని ఒక విధంగా వుత్సాహంతో వుత్సవంలో గౌరవించేందుకు మాత్రమే. యింతవరకూ యీ అధ్యక్షస్థానం పనికివచ్చిందనే సత్యాన్ని, దేశం బాగా అర్థం చేసుకుంది. దేశంలో అభిప్రాయాల మధ్య పోటీ లేనంతకాలం, పోటీరహిత యెన్నిక జరగటం సంభవమౌతుంది కాని, అక్కడ సిద్ధాంతరీత్యా, కార్యక్రమ రీత్యా పోటీ జరుగుచున్నంతకాలం, యేకగ్రీవంగా యెన్నుకోండి, అని చేసే అభ్యర్థన, అర్థరహితం, అసలు సమస్యకు చాలా దూరం. విషయరీత్యా తన యిటీవలి స్వాభిప్రాయాల్ని ఒక ప్రకటనద్వారా ఎవరైనసరే, ఒకరు, ఫెడరేషన్‌ను వ్యతిరేకిస్తున్న వామపక్షవ్యక్తి, తన బదులుగా అభ్యర్థిగా యున్నట్లయితే, తాను తనమట్టుకు పోటీనుంచి విరమించుకోగలనని బోస్ చూపిన భావం ఆయన్నూ, ఆ సమస్యనూ, ప్రేమించే బృందంలోని అనేకమందిని అమితంగా ఆకర్షించింది. పదవి అయిపోవడంతోనే తృప్తిపడి ఆయన పరుగెత్తి పోవడం లేదు; ఒక సిద్ధాంతానికి కట్టుబడి, యెన్నికలో పోటీ చేయడానికి నిశ్చయించుకున్నాడు—అని దేశం పూర్తిగా ఆత్మవిమర్శనద్వారా గ్రహించింది. "అధ్యక్ష స్థానానికి పేరు సూచించబడడం నిజానికి నాకే బాధగావుంది. వామపక్షంనుంచి ఒక నూతనవ్యక్తి యీ సంవత్సరానికి యేర్పాటు కావాలని, అసంఖ్యాక మిత్రులకు విన్నవించాను. అయితే దురదృష్టవశాత్తు అది జరుగలేదు.

సరిగదా, పైపెచ్చు, అనేక రాష్ట్రాలనుంచి నాపేరే సూచించబడింది." దీని తరువాత ప్రకటనలో బోస్, పోటీని తొలగించడానికి మరో అడుగుముందుకు వచ్చాడు. అయితే మితవాద నాయకులు, తమవిజయం తథ్యంఅని వూహించుకున్నందువల్ల వారు యీ అవకాశాన్ని పరిగ్రహించ నిరాకరించారు.

ఒక ప్రకటనలో బోస్ యీవిధంగా చెప్పాడు. "నేను ఒకటికి పదిమారులు వ్యక్తీకరించినట్లుగా వామపక్ష విశ్వాసాన్ని చూరగొన్న యేవ్యక్తి పైనైనా, మితవాదవర్గం ధృవపరిస్తే యిప్పటికైనా పోటీరద్దయి పోయే అవకాశాలు లేకపోలేదు. పోటీ జరుగటం సంభవించి, భావభేదం అంతులేకుండా పెరిగిపోవడం తథ్యమైతే, కాంగ్రెస్‌నువిభజించిన యీబాధ్యత సంపూర్తిగా, మితవాదుల నెత్తిపైనే పడుతుంది. ఈ తుది ఘడియలలోనైనాసరే, వారు ఆ బాధ్యతను భరించడానికే సిద్ధమవుతారా? లేక అభ్యుదయకరమైన కార్యక్రమంతో, దేశఐక్యతకు సుస్థిరతకు నిలబడతారా?"

మితవాద నాయకత్వం బోస్ పెట్టిన యీమార్గాన్ని అవలంభించి నట్లయితే, ప్రస్తుతనిర్ణయం అసలు జరిగివుండేదే గాదు. ఈ మార్గాన్ని అసలు వారులక్ష్య పెట్టనేలేదు. సిద్ధించవలసిన ఫలితమేమో సిద్ధించింది. ఎన్నికలు అనివార్యమయినయ్. అన్నిరాష్ట్రాలనుంచి మొత్తంపోలయిన ఓట్లసంఖ్య 2957, వాటిలో బోస్‌కు 1580 లభించినయ్. పట్టాభి సీతారామయ్యకు 1377 వచ్చినయ్. 200కు పైబడిన మెజారిటీతో, బోస్ ఎన్నికైనట్లు ప్రకటించబడింది.

త్రిపురీకాంగ్రెస్ అనంతరం- అధ్యక్షుడుగా:-

బోస్‌కు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు నిర్ణయమైనప్పుడు, ఆయన దీనికనుగుణంగా తగిన యుక్తిమార్గాన్ని అనుసరించాడు. భారత స్వాతంత్ర్యానికి ప్రతిబంధకం కల్పిస్తూ, కాంగ్రెస్‌లో చీలికల కోసరం యెదురు చూస్తూవున్న శత్రువుల్ని హెచ్చరించాడు.

"ఇది విజయోత్సవంతో విర్రవీగే సమయంకాదు." అని ప్రకటించాడు శ్రీబోస్ "మరోవిధంగా హృదయ పరిశోధనకు, భవిష్యత్తును గురించి జాగ్రత్త పడేందుకు యిది సమయం. విపరీతమైన గౌరవంతో, విధేయతతో మనం యీ పోటీ ఫలితాన్ని అంగీకరిద్దాం. నేను రేపటికి సంబంధించిన, అనేక ఆలోచనలతో నిమగ్నుడనై యున్నాను. అదేవిధంగా, నా కనుకూలంగా ఓటుచేసిన ప్రతి సభ్యుడూ వుండాలని కోరుతున్నాను.

"భారత స్వాతంత్ర్య ప్రతిబంధక శక్తులు, కాంగ్రెస్ సంస్థలో చీలికలు ఏర్పడినాయ్" అని, ఒకవైపున చంకలెగురేస్తున్నా, యిదివరకు మాదిరిగానే, కాంగ్రెస్ సంయుక్తంగా యేకత్రాటిపై నడుస్తుందనే సత్యాన్ని, సన్నుస్పష్టంగా విశదం చేయనివ్వండి, కాంగ్రెస్ వ్యక్తులమధ్య, కొన్ని విషయాలకు సంబంధించిన అభిప్రాయభేదాలుంటే వుండవచ్చు. అయితే సామ్రాజ్యవాదంపై జరిగే పోరాటం యెక్కడైతే యుంటుందో, అక్కడవారంతా యేకమే!

అదేమాదిరిగ్నోగణితో, అంతకంటే ఆకర్షవంతమైన మాటలలో, తను జయలక్ష్మిని వరించి పోటీలో నెగ్గినందుకు, తమసంతోషాన్ని ప్రకటించేనిమిత్తం కలకత్తాలో జరుపబడిన ఒక బహిరంగ సమావేశంలో అదేమాదిరి అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. "మన ప్రతినిధులు యీ పోటీ ప్రతిఫలాన్ని అత్యంతానందభరితంగా గాని, లేక తృణీకారభావంతోగాని, చూచేటంత బుద్ధిహీనులుగా మారగూడదు. పైపెచ్చు విపరీతమైన బాధ్యతతో మనం యీ పోటీ ఫలితాన్ని గ్రహించాలి. ఈ విజయ ఘడియలలో యితరుల భావాలకు భిన్నంగా గాని, వారి హృదయాలకు తగిలే సూటిపోటిమాటలతోగాని, వారికి బాధాకరంగా ఒక్క మాటగూడ పలుకవద్దు !!

అధ్యక్షుడు తనంతటతాను యెన్నికలఫలితంపై నిర్వచించకుండా వూరుకున్నప్పటికీ, తన అనుచరులందరికీ అట్టి సలహాలిచ్చినప్పటికీ, దేశమంతటా రాజకీయంగా అధ్యక్ష యెన్నిక విషయం, ఒక పిచ్చాపాటీగ మారిపోయింది. కొన్ని పత్రికలు అది మితవాదవర్గపు సిద్ధాంతాలకు నిజానికి అపజయం అని; కాంగ్రెస్ జీవితంలో గాంధీయుగానికి స్వస్తివచనం వంటిదని భావించినందుకు, బాధ్యతారహితంగా యిలా నిర్వహించే వ్యక్తుల్ని అంతటితో ఆపేందుకు, మహోవృత్తమ పద్ధతిని బోస్ అనుసరించాడు. మహాత్మాగాంధీ విశ్వాసం చూరగొనడానికి, సాధించటానికి నేనెప్పుడూ ప్రయత్నం చేయడమే నా ప్రధానోద్దేశ్యం. దానికి ఒకే ఒక చిన్న కారణంవుంది. భారతదేశపు ప్రాఖ్యాతపురుషుని విశ్వాసాన్ని నేను పొందలేక యిత

రుల అభిమానాన్ని పొందటంలో కృతకృత్యుడనైతే నాకది ఒక దుఃఖభూయిష్టమైన విషయం."

బోస్ చేసిన ప్రకటన ప్రత్యక్షం కావటంతో, ప్రజలు ఇక ఇంతటి మితవాదవర్గం ఈ ఓటమి, 'ఆటలోని దెబ్బ అరటి పండన్న, నవోత్సాహాలతో చూస్తుందని; అసంతృప్తితో పోటీఅనంతరం చేయదల్చుకొన్న వ్యతిరేక కార్యవిధానం నుంచి విరమించుకుంటారని, భావించటం జరిగింది. అయితే దురదృష్టవశాత్తు, ఎన్నికల ఫలితాలు తేలిన అనంతరం మహాత్మ గాంధీ చేసిన బహిరంగ ప్రకటన మరోమారు అనంత వ్యతిరేక అసంతృప్తులకు దోహందమైంది. ఫలితంగా కాంగ్రెసు లోని నిరంతర చీలిక ఏర్పడింది. అసంతృప్తిఅనే తిరుగుబాటు గోచరించింది. కాంగ్రెసులోని ప్రజాస్వామ్య పద్ధతికి పాడె కట్టినట్లయింది.

ఎవరైనా ఒక అభ్యుదయ కాముకుడైన కాంగ్రెస్ నాయకుడు అధ్యక్షుని వృత్తను పలహీను పాటించి ద్వేష భూయిష్టమైన ప్రకటనలు చేయకుండా చూడకలిగినట్లయితే అది దేశానికేకాక వుభయులకూ క్షేమదాయకంగా వుండివుండేది. అయితే దురదృష్టవశాత్తు అలా జరగలేదు.

"నేను ఆదినుంచీ అతని పునరెన్నికకు భిన్నంగా నాకృత నిశ్చయతను ప్రదర్శిస్తున్న విషయాన్ని, హృదయపూర్వకంగా అంగీకరిస్తాను: ఎందుకో -? ఆ కారణాల జోలికి మాత్రం నేను పోదల్చుకో లేదు. అభ్యర్థిత్వాన్నుంచి తను విరమించుకో నక్క-

ల్లేదని, డాక్టర్ పట్టాభిని ప్రోత్సహించటంలో, నేను ప్రముఖ పాత్రను గ్రహించినందుకు. ఈ ఓటమి ఆయనకంటే నాకే అధికం. కొన్ని నిశ్చిత సిద్ధాంతాలకు ఒక విధానానికి ప్రాతినిధ్యం వహించలేకపోతే, నేను; నా వ్యక్తిత్వం మట్టిపాలే! కాబట్టి ప్రతిధులలో అధిక సంఖ్యాకులు నా సిద్ధాంతాలకు, నా విధానానికి వ్యతిరేకులుగావుండి, వాటిని తృణీకరిస్తున్నారనేది ఖశ్చితంగా తేలిపోయింది. కాన నేను ఆయన ఓటమిలో భాగం పంచుకుంటున్నాను." అని ప్రకటించాడు గాంధీజి.

"విజయవంతులైన అత్యధిక సంఖ్యాకవర్గపు విధానాన్ని కార్యక్రమాన్ని అల్పసంఖ్యాకవర్గం అనుసరించాల్సి వుంటుంది. వారు తదనుకూలంగా సహనతను చూపెట్టలేకుంటే. కాంగ్రెసు నుంచి బయటకురావాలి; కాక బుద్ధిగావుంటే అధిక సంఖ్యాకులబలాన్ని రెట్టింపు చేయాలి. ఏ విషయాన్ని అల్ప సంఖ్యాక బృందం అడ్డుపర్చ లేదు. వారు సహాకారంచేయ లేనప్పుడు, వ్యతిరేకులుగావుండాలి. నేను కాంగ్రెసు వ్యక్తులకు గుర్తుచేసేదేమంటే; ఆ పనిని వారి తత్వానికి అనుగుణంగా, కాంగ్రెస్ భావాలకు బైటవుంటేనే, మిన్నగా చేయగలరు. కాబట్టి కాంగ్రెస్‌లో వుండటానికి ఎవరైతే అంతరాత్మకు విరుద్ధంగా బాధపడుతున్నారో, వారు నిరుత్సాహులు కాకుండా అకుంఠితకార్యాచరణ సేవాతత్పరతల దీక్షతో, కాంగ్రెస్‌నుంచి బయటకు రావచ్చు." అనికూడా గాంధీజీ పై ప్రకటనకు జోడించాడు.

తన అనుచరులకు మహాత్మాగాంధీ ఇచ్చిన అత్యంత అపాయకరమైన, ప్రజాస్వామ్య విరుద్ధమైన ఈ సలహా, వారిపై

సులభంగా పనిచేసింది. అసలు పోటీ జరుగక పూర్వమే, సర్దార్ పటేల్ - ఆయన సన్నిహిత మిత్రులద్వారా, కాంగ్రెస్ ఉన్నత నైతికమేధ అయిన మహాత్మయొక్క, బోస్ పునరెన్ని కకు సంబంధించిన - వ్యతిరేకాభిప్రాయాలు, నిర్వచించబడిన విషయం ఎన్నికలగురించి వుత్సాహ పూరితులైన అన్ని వర్గాలకు, బాహాటంగా తెల్సిందే! గత ఇరవైఅయిదు సంవత్సరాలనుంచి మహాత్మ సలహాల విధానం కాంగ్రెస్‌లో అత్యధిక ప్రాధాన్యతను పొందివున్నపుడు, బోస్ స్వతంత్రాభిప్రాయాలతోవుండి అవసర మొచ్చినపుడు గాంధీ విధానానికి భిన్నంగా ప్రవర్తించ గలిగిన ధైర్యంగా వుండటం, దేశంలోవున్న రాజకీయాభిలాషులకు, పరిశీలకులకు - గాంధీజీ కారణాలను విశదీకరించక పోయినా, బోస్ ఆయన అభిమానాన్ని చూరగొనలేకపోయిన కారణాలు మాత్రం ఇంతవరకేనని స్పష్టంగా తెలుసు.

అలా కాకపోయినట్లయితే మహాత్మ పునరెన్నికను వ్యతిరేకించి బోస్ విజయాన్ని తన అపజయం అని ఆమోదించటం ఎందుకో ఎంతగాలించినా కారణం కనుపించదు. శ్రీయుత బోస్ మహాత్మ గాంధీతో మైత్రిగా వుండటానికి, తన గౌరవాన్ని పణంగా అర్పించిన ఆఖరి అవకాశం తీసుకున్నప్పటికీ, గాంధేయ పత్రికల విపరీత విమర్శలనుంచి తన విధానాన్ని సమర్థించి నప్పటికీ. మహాత్మా చేసిన ఈ ప్రకటన కాంగ్రెస్‌సంస్థలో బ్రహ్మాండమైన విభజనకు; అనుకోనని విధంగా బోస్‌ను త్రోసివేయటానికి; బెంగాల్ రాష్ట్రకాంగ్రెస్

కార్యవర్గం బాహాటంగా తిరుగుబాటు చేయటానికి, ఫార్వర్డ్
బ్లాక్ పార్టీ నిర్మాణానికి ఒక సుదీర్ఘమైన దారితీసింది.

కాంగ్రెస్‌లో మహా వుద్ధృతంగా రాబోయే చీలికను
అరికట్టటానికి ప్రయత్నిస్తున్న శ్రీయుత బోస్, ప్రస్తుతం ప్రత్య
క్షమై వేధిస్తున్న సమస్యను ఎదుర్కొనటానికి మరో విధమైన
అత్యుత్తమ మార్గం ఆలోచించి, మహాత్మగాంధీ ఆశీర్వచనాలు
తీసుకునే నిమిత్తం "వార్ధా" యాత్రచేయుటానికి నిశ్చయించు
కున్నాడు. అస్వస్థతా పూరితుడై వున్నప్పటికీ, వైద్యుల సల
హాను సహితం తృణీకరించి, ఫిబ్రవరి పదిహేనవ తేదీన
"వార్ధా"కు బయలుదేరాడు. మహాత్మాజీతో మూడుగంటల
సేపు సంభాషించాడు. ఈ సమావేశమైన అనంతరం, మహాత్మ
తన సహజ అలవాటు ప్రకారం తనను ఆహ్వానించాడనీ,
ఆయన సహకారం తనకు పూర్తిగా లభించటంలో, తన
కేమాత్రం సందేహం లేదనీ, ప్రకటించాడు. తదుపరి జ్వాలాయ
మానమైన, తాత్కాలిక సమస్యలను మూడు గంటలసేపు
పరస్పర సుహృద్భావంతో చర్చించినప్పటికీ, తుదినిర్ణయానికి
రాకుండా, కొన్నికొన్ని నిర్ణీత అభిప్రాయాలకు చేరుకున్నామనీ
వ్యక్తీకరించాడు. ఆ తదుపరి పత్రికల్ని - ప్రజల్ని ఓర్పును
ప్రదర్శించవలసిందని "మా విషయాలను వ్యాపింప చేయ
కుండా వుంచటం వారి విద్యుక్త - ప్రాథమికధర్మం" అని
కూడా అర్థిస్తూ ప్రకటించాడు. మహాత్మ అనుమతిపొంది బోస్
ఈ ప్రకటన బహిర్గతం చేశాడు. అలా అనుమతితో బోస్
చేసిన ప్రకటన కనుపించగానే మహాత్మా నోటినుంచి, ఏదైనా

మాట వస్తుందని ఎవరూ ఊహించలేదు. అయితే వార్థానుంచి అనుకోని, ఊహించని పిడుగులుపడినయ్. మహాత్మాగాంధీ ఒక సందర్శన సందర్భంలో, సందర్శకునికి—తను నూతన కార్యవర్గం నిర్మించేవిషయంలో తన మాజీసహాచరులనుంచి, సహాకారం లభించగలదని, ఏవిధంగానూ భ్రమపడవద్దని, బోస్‌కు అనుమాన రహితంగా తేల్చివేసి చెప్పాననీ, కార్యవర్గం లోని మితవాదసభ్యులు తమ ప్రకటన విషయంలో అవాంతరాలు లనీ, త్రిపురీకాంగ్రెస్ సందర్భంలో కానీ, దానికి ముందు కానీ, వెనుక కానీ కాంగ్రెస్ విధానానికి పూర్వాపూర్వాపి, ఊహించుచ్చే విషయాలలో, వారికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పాడు. ఆ తరువాత అతనికి యింకా యిలా ఏం చెప్పా డంటే: ప్రతినిధులు గాంధేయతను శక్తి హీనులు, ఆ ప్రతి నిధులతో బోస్ అధిక సంఖ్యాక బలాన్ని కాంగ్రెస్‌లో సము పార్జించుకున్నాడు. కాబట్టి, తన యిష్టానికి అనుకూల వర్గాన్ని ఏర్పాటుచేసుకుని, కాంగ్రెస్ కార్యవిధానాన్ని నడపాలు జరుపుకోగల అవకాశాలు వుంటే తన సలహా పర్యవేక్షణలతో బోస్‌కు నిమిత్తం లేదన్నాడు.

ఉభయ నాయకుల మధ్య సాగిన సంభాషణలపై బోస్ ఒక ప్రకటనచేసిన అనంతరం, ఈ అసంగతం జరుగుతుందని ఎవరూ ఊహించుకో లేదు. అయితే తెరమాటున సహాయ నిరాకరణకు క్రమబద్ధమైన ఎత్తుగడ ఒకటి వేయబడినట్లు గోచ రిస్తుంది. మహాత్మా గాంధీ పరిశీలన పూర్తిఅయిన వెంటనే సర్దార్ పటేల్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, బాబూ

రాజేంద్రప్రసాద్, శ్రీమతి సరోజినీనాయుడు, శ్రీ భులాభాయి దేశాయి, డాక్టర్ పట్టాభి శీతారామయ్య, శ్రీ శంకరరావు దేవ్, శ్రీ హరేకృష్ణ మెహతాబ్, ఆచార్య కృపలానీ శ్రీ జైరాందాస్ దౌలత్‌రామ్, సేట్ జమ్నాలాల్ బజాజీలతో కూడిన, ఈ పన్నెండుమంది మితవాద కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, సంయుక్తంగా రాజీనామా చేయుటం సంభవించింది.

అగస్మాత్తుగ సర్దార్ పటేల్. ఆయన సహచరుల తరఫున రాజీనామాను అంగీకరించమని టెలిగ్రామ్ ఒకటి బోస్‌కు పంపించినపుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు 103 డిగ్రీల ఉధృత జ్వరంలో వున్నాడు. ఈ టెలిగ్రాం వెంబడే పన్నెండుమంది కాంగ్రెస్ అధిష్టాన వర్గసభ్యులు రాజీనామ సంతకాలు చేసిన ఒకవుత్తరం కూడా అధ్యక్షునికి చేరింది.

అభ్యుదయ కాముకులైన దేశంలోని సోషలిష్టులు - వామపక్షీయులు, కాంగ్రెస్‌లో ఐక్యత నిలపెట్టేటందుకు తమ శక్తి వంచనలేని కృషిసాగించారు. అంతేకాకుండా చీలిక బయలు దేరకుండా, నివారించటానికి తమసర్వశక్తినీ ధార పోసినా, అధిష్టానవర్గం నుంచి రాజీనామా యిచ్చిపోయే సభ్యుల్ని, ఐక్యతాభిప్రాయానికి బద్ధుల్ని చేసే విషయంలో కృతకృత్యులు కాలేక పోయారు. వారు అధ్యక్షునితో సహాయ నిరాకరణ చేసిన తమవిధానాన్ని సమర్థించుకుంటూ, "ఎవరైతే దృక్పథంలో అభ్యుదయ కాముకులని వామపక్షీయుల మని బహిరంగంగా చెప్పుకుంటుంటారో—వారు—అది మంచో, చెడో; మేం అనుసరించిన విధానాన్ని గురించి విమర్శించ

కుండా పూర్తిబాధ్యత స్వీకరించాల్సి వుంటుంది, ఈ విధమైన చర్యల్ని చాలాకాలంవరకు సహించటం జరిగింది-..

"ఇప్పుడో, వామపక్షం అత్యధికబలం సాధించుకుంది. కాంగ్రెస్ యంత్రాన్ని నడిపేవిషయంలో వారి చేతికి అడ్డు లేదు." అని సంయుక్తంగా ప్రకటించారు. తదుపరి "వామపక్షం అలాచేయలేని పక్షంలో, దేశం వారికో రేకు-మీాద ఒక గుణ పాఠం చెప్పగలదు." అని హెచ్చరించారుకూడ. వారిలో వారికి ఏర్పడిన మైత్రిని పురస్కరించుకుని ఈ ప్రగల్భాలు పల్కారే కానీ, సంస్థ క్షేమందృష్ట్యా - పూర్తి అగౌరవంగా, స్వాతంత్ర్య మార్గానికి అవరోధంగా, అనేక సంవత్సరాలు కష్టనష్టాలకు ఓర్చి కట్టుకున్న స్వాతంత్ర్య భవనం, వారి ఎడిబాటువలన విచ్ఛిన్నమౌతున్నట్లుగా ప్రవర్తిస్తున్నామనే విషయాన్ని మాత్రం విస్మరించారు.

కాంగ్రెస్ త్రిపురీలో సమావేశం కావటానికి, ఇక కొద్ది వారాల వ్యవధి మాత్రమేవుంది. కార్యవర్గానికి రాజీనామా యిచ్చిన సభ్యుల చర్యపై, తాను కలకత్తాలో అందుకున్న అనేక సందేశాల్ని, విచారణల్ని చదివేదానికైనా, అధ్యక్షుడు జబ్బుతో అశక్తుడుగా మంచంమీాదనే వున్నాడు. ఆ సందర్భంగా కనీసం తన అభిప్రాయాన్ని తెలిపేటందుకు అనుమతించ టాని కైనా, ఆయన పరిస్థితులు అత్యంత ప్రమాదభరితంగా వున్న వని వైద్యులు అభిప్రాయపడ్డారు.

జాతీయ చరిత్ర అతిక్లిష్ట భూయిష్టమైన ఘట్టంలో పడిన ఆ సందర్భంలో, భారత స్వాతంత్ర్యంకొరకు తన సర్వ

స్వాన్ని పణంగాపెట్టిన, ఆ ప్రచండ స్వతంత్రవీరుడు వైద్యుల మధ్య కంటికి రెప్పలాగా కాపాడబడు తున్నపుడు; తెలివితప్పి ప్రక్కమీద పడివున్న తరుణంలో, రాజీనామాలు యివ్వటం దేశభక్తికి దూరపరాటమేకాక, ఆ చర్య న్యాయవిరుద్ధం - దుర్మార్గం, అనికూడా చెప్పవలసి వుంటుంది. వారు ఇంతటి సానుభూతి రహితమైన చర్యలో దూరమైపోయారు.

నిరంతరం ఉన్నతోద్దేశాలతో కూడిన, అహింసాయుత సిద్ధాంతాల్ని ఏకరువుపెట్టి, వాటిమీందు విశ్వాసం కుదురు కునేట్లు బోధించి, వారిజీవితాలు ధారపోసి సేవచేసిన, ఆ అత్యున్నత ఆశయానికి ఈ చర్య నిజంగా వెన్నుపోటు వంటిది. కాంగ్రెస్ కార్యవర్గం నుంచి రాజీనామాలనిచ్చి నిష్క్రమించే సభ్యుల ఈవిపరీత చర్య, దేశానికి నిరుత్సాహ భూతమైంది. ఈ న్యాయవిరుద్ధమైన చైతన్యానికి ప్రధానసూత్రధారుడు మహాత్మాగాంధీ అనటం, సత్య విదూరంకాదు. ఈ పరిస్థితులలో ఆయన మితవాదులలో ఎదురులేని విధేయతకు పెత్తనం వహించారు. బోస్ ఆఖరిసారి వార్ధాకు ప్రయాణం చేసినప్పుడు ఆయన వామపక్షంలో సహా పరిస్థితిని అదుపులో పెట్టగలిగి వుండేవాడే! అయితే తనముఖ్య అనుచరుల అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని, పరిణామాల్ని పూర్తిగా విస్మరించటమే కాక, చీలిక ఏర్పడటానికి దోహదమిచ్చాడు.

బోస్ ఆరోగ్యంలో కొంచెం అభివృద్ధి కనుపించగానే పన్నెండుమంది కార్యవర్గసభ్యుల రాజీనామాలను పరిగణించి వాటిని ఆమోదించ నిర్ణయించుకున్నాడు. "బాబూ! మీ రాజీ

నామాలు రద్దుపర్చుకోండి అనివారిని అధ్యక్షుడు అర్థించినంత మాత్రాన, కలుగబోయే ఫలితం శూన్యం అని ఆయన గ్రహించిన అనంతరం, సంతకందార్లు కూడా అదే అభిప్రాయాన్ని తెలిపినందుకు, అతిపరి ఒక్కమైన ఆలోచనల మధ్య అధ్యక్షుడు వాటిని ఆమోదించాడు.

సందర్భాను సారంగా, ఈవిధంగా, రాజీనామాలను అంగీకరించిన ఫలితంగా, కార్యవర్గ సభ్యులందరూ పంచుకో వలసిన గురుతర బాధ్యతంతా, ఆయన ఒక్కని భుజాలపై పడింది. సర్దార్ పటేల్, మౌలానా అజాద్, బాబూ రాజేంద్ర ప్రసాద్ ఈముగ్గురూ కాంగ్రెస్ పార్లమెంటరీ ఉపసంఘ సభ్యులుగా వుండి, రాజీనామాలను దాఖలుచేసి నందువలన ఆ కమిటీ అనుకోనివిధంగా రద్దయింది. ఆచార్య కృపలానికూడా రాజీనామా పెట్టటం వలన, అధ్యక్షుడే కార్యనిర్వాహణ బాధ్యతలన్నీ చూచుకోవాల్సివచ్చింది. ఇంతటి బ్రహ్మాండమైన విడబాటు సమయంలో, చెడిపోయిన తన ఆరోగ్యాన్ని దృష్టిలో నుంచి తొలగించుకొని, ధైర్యాన్ని కోల్పోక, శ్రీయుత బోస్ కాంగ్రెస్ యొక్క పూర్తిబాధ్యతను నిర్వహించాడు.

**అధ్యక్షుని అనారోగ్యం:-** ఒకవారం ఆప్రాంతంలో ప్రసిద్ధమైన కాంగ్రెస్ సమావేశం త్రిపురీలో జరుగబోతుంది. ఏవిధమైన ఒడంబడిక చేసుకోవటానికి వీలులేనివిధంగా, కాంగ్రెస్ వర్గాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రోజులు అమితవేగంగా, గడిచి పోతున్నా, అధ్యక్షుని ఆరోగ్యంలో అభివృద్ధి అణుమాత్రమైనా

కనుపించలేదు. బోస్‌ను పరీక్షించి ఫిబ్రవరి 27వ తేదీన డాక్టర్ - సర్. నీలరతన్ సర్కార్ ఆయనపరిస్థితిని గురించి ఒకప్రకటన చేశాడు.

"...కనీసం ఒకపక్షంరోజుల వరకైనా ప్రక్కమీద నుంచి ఆయన్ను కదుపటం, నాసలహాకు పూర్తివిరుద్ధం. ఆయన ఈ పక్షంలోపుగా ఉత్సాహ వంతమైన ఏపనిచేసినా, అపాయా నికి దోహదకరం కావచ్చునని నేను భయపడుతున్నాను. అది శారీరక పతనమో లేక అసలుజబ్బు అధికం కావటమో సంభ వించవచ్చు."

ఈ ప్రకటన కనుపించటంతో, సమావేశం వాయిదా పడటమూ లేక బోస్ అధ్యక్షపదవికి రాజీనామా పెట్టటమూ, అనే సందిగ్ధావస్థలో ప్రతిచోట అంచనాలు బయలుదేరినయ్. అయితే ఈ రెండింటిలో ఏదీ సంభవించలేదు. వాస్తవానికి ఆయన కార్యాలయంనుంచి నిష్క్రమించేటంత వత్తిడిని సృష్టిం చినయ్ పరిస్థితులు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా వుంటున్న ముగ్గురు కేంద్రశాసనసభా సభ్యులు, కాంగ్రెస్ కార్యవర్గంలోని ఇతర సభ్యులపై అధ్యక్షుడు తెచ్చిన అభియో గాలు ఉపసంహరించుకోక పోయినట్లయితే, లేక వాటిని అణచి పెట్టకపోతే, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో, ఒక కొత్త తీర్మానం ప్రవేశ పెట్టెదమనీ, ఒకవేళ సిద్ధాంతరీత్యావారి ప్రతిపాదన అనంగీకారమైతే, "మీరు కార్యాలయాన్ని వదలి వేయునట్లు సభ మిమ్మల్ని కోరగలదు" అని బోస్‌కు ఒక ఉత్తరం వ్రాశారు.

అంతేకాకుండా ఆహ్వాన సంఘంలోని ఒక ప్రముఖ సభ్యుడైన, శ్రీ శంభూదయాల్ మిశ్రా కూడా అధ్యక్షునిపై విశ్వాసరాహిత్య తీర్మాన ప్రతిపాదనకు సుముఖుడుగా ఒక తీర్మానం ప్రతిపాదించాడు. దేశరాజకీయ జీవితంనుంచి, అధ్యక్ష పదవినుంచి, ఆయన్ను బర్తరఫ్ చేయడానికి కాంగ్రెస్ వృద్ధ వ్యక్తులబృందం ప్రమాణాలు స్వీకరించిన ఆ విపరీత – విపత్కర పరిస్థితుల్లో, శ్రీయుత బోస్, ఆసంవత్సరం అధ్యక్షస్థానం వలన ఏర్పడిన అన్నివిధాలైన సాధక బాధకాల్ని, ఎదుర్కోవటానికే నిశ్చయించి, మార్చి ఆరవ తేదీన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, అందరూ విస్తుపోతుండగా, ఆకస్మికంగా, ఒక "ఆంబ్యులెన్సు కారులో" త్రిపురీ హృదయంలోనికి జొరబడ్డాడు.

త్రిపురీలో ఏంజరిగింది? ఇదివరకు జరిగిన వాటన్నింటినీ త్రోసిరాజంటూ, హృదయవిదారక సంఘటనలు జరిగినయ్. అనుమాన రహితంగా ఇది అతిబాధకరమైన కథ. అయితే విప్లవవర్గ ప్రధానమేధగా తన అధిష్టానవర్గ సభ్యులకు వ్యతిరేకంగా, శ్రీయుత బోస్ మార్గటాసికిగల – ఒత్తిడిపెట్టిన ప్రబల హేతువుల్ని మరుగు పర్చటం భావ్యంకాదు.

అధ్యక్షుడు కాంగ్రెస్‌ను నడిపేవిషయంలో, సర్వ స్వతంత్రుడని మితవాదసభ్యులు, స్వార్థరాహిత్యాల మాదిరి చెప్పినప్పటికీ, వారు దానికి బద్ధులు కాలేదు సరికదా ఎన్ని నీచాతినీచమైన ఎత్తుగడల్ని పన్నాలనో అవన్నీ పన్ని ప్రయోగం చేశారు. కాంగ్రెస్ ప్రతినిధుల వాంఛకు ప్రతిఫలంగా మహాత్మాగాంధీకానీ, ఆయన విశ్వాసపాత్రులైన సహచరులు

కానీ, వాస్తవానికి బోస్ నిర్వహించవలసిన గురుతర బాధ్యతలు సక్రమంగా నెరవేర్చనట్లు, సహకారం నెరపటం వారి నైతిక ధర్మం.

అధిక సంఖ్యాకుల్ని తమ పక్షంగా త్రిప్పుకోవటానికి వారింకా ఒక సంవత్సరంపాటు నిరీక్షిస్తూ వుండవలసింది. అయితే వ్యక్తిగత దురభిప్రాయాలు, అది సాధ్యంకాదని వారిని దుర్నీతికి ప్రోత్సహించినట్లు గోచరిస్తున్నయ్. అందుకే వారి బలాన్ని తేల్చుకునేందుకు పూర్తిగా ముస్తాబై త్రిపురికి వేంచేశారు. ప్రముఖ రాజ్యాంగవేత్త—మాజీ సంయుక్తరాష్ట్రాల ప్రధానమంత్రి — అయిన పండిత గోవిందవల్లభపంత్, ఆ చైతన్య బాధ్యతని గ్రహించి, అఖిలభారత కాంగ్రెస్ సంఘ సమావేశంలో, ఈ క్రింది తీర్మానం ప్రతిపాదించారు.

**పంత్ తీర్మానం:**—"గత కొన్నిఏండ్లుగా, మహాత్మాగాంధీ సారథ్యంలో, కాంగ్రెస్ తన విధానాన్ని పాలించిన, దాని నగ్నసిద్ధాంతాలపట్ల, ఈ సభ తన దృఢవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, ఈ విధానాలలో అణుమాత్రమైనా మార్పు రావటానికి వీలులేదని, భవిష్యత్‌లోకూడా అదేవిధంగా కాంగ్రెస్ విధానం పాలించబడాలనీ, యీ సభ స్పష్టంగా ప్రకటిస్తుంది. ఈ సభ గతసంవత్సరం కాంగ్రెస్ కార్యవర్గం చేసిన కృషిలో విశ్వాసాన్ని చూపుతూ; ఆ సభ్యులపైన ప్రతిబింబించే ఏ రకమైన అభియోగాలనైనా నిరశిస్తుంది. జరుగబోవు సంవత్సరంలో విపత్కర పరిస్థితులు అభివృద్ధి అయ్యేసూచనలు గోచరించటాన్ని దృష్టిలో పెట్టుకుని, మహాత్మాగాంధీ ఒక్కడే

కాంగ్రెస్‌ను చక్కగా నడుపు ఏకైక నాయకుడుగా భావించి ఈ క్లిష్టదశలో, విజయోన్ముఖంగా దేశం పురోగమించే టందుకు—అది సంభవమని అభిప్రాయపడి—కాంగ్రెస్ కార్య నిర్వాహక అధిష్టానవర్గం ఆయన దృఢవిశ్వాసాన్ని పొందే టందుకు, ఈ సభ గాంధీజీ ఇష్టానుసారంగా రాబోవు సంవత్స రానికి కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని అధ్యక్షుని అర్ధిస్తుంది"

ప్రతి భారతీయుని హృదయంలో ఇదొకనూతన విషయ కంగా, ఆలోచనకు ఆస్కారమేర్పడినప్పుడు, తీర్మానంపై చెలరేగిన తీవ్ర వాదోపవాదాల్ని మనం తర్కించబోవటం లేదు. అయితే ఒకవిషయం మాత్రం ఇక్కడ బైటపెట్టవలసి వుంది. నియమావళి ననుసరించి, ఆతీర్మానాన్ని త్రోసిపుచ్చ టానికి, అధ్యక్షునికి పూర్తిఅధికారం వున్నప్పటికీ, ప్రఖ్యాత పురుషులైన సర్దార్ శార్దూలసింగ్ కవీషర్, యం. యన్. రాయ్, యం. యస్. ఆనేలు తీర్మానాన్ని త్రోసిపుచ్చటానికి నియమావళి సూత్రాల్ని ఎత్తి చూపెట్టినప్పటికీ, ఆ విధానం అందులోని అనేకమందికి బాధకల్పించి, పంత్ తీర్మానానికి బలం చేకూర్చుతుందేమోనని భావపడినందువలన బోస్ అలా చేయలేక పోయాడు. అనేక సవరణలు ప్రతిపాదించ బడినయ్. కానీ అసలుతీర్మానంలో ఒక్క ముక్కనైనా మార్చటానికి పంత్ అంగీకరింపలేదు.

సవరణలన్నీ ఉపసంహరించు కోవటమో లేక ఓడింప బడటమో జరిగింది. గాంధేయులనాటి బలం అలావుంది. అయితే దురదృష్టవశాత్తు చీలికకు విత్తులు విత్తారు. ఏకైక

జాతీయవాణిని ప్రభోదిస్తున్నటువంటి సంస్థ - ఆ భావించిన దానిలో తిరుగుబాటుకు క్రమవిరుద్ధతకు ఇంతటితో రాచబాట ఏర్పడింది.

ఇక ఇప్పుడు అధ్యక్షుడు, తన స్థానికి రాజీనామా పెడతాడనీ, అలా బహిరంగసభలో ప్రకటించవచ్చునని భావించబడింది మునుపటికంటే, అధ్యక్షునిజబ్బు అధికమై అధ్వాన్నత చూపిస్తుంది. శరీరంలోని వేడి అకస్మాత్తుగా పెచ్చు పెరిగింది. జబ్బల్‌పూర్ సివిల్ సర్జన్ "మిస్టర్ హాన్నెసి" బోస్‌ను పరీక్షించి "బ్రాంకోన్యుమోనియా" (గుండెపడిశం) అతిబలంగా వుందనీ, "కుడిపార్శ్వపు ఊపిరితిత్తి పూర్తిగా దెబ్బతిన్న చిహ్నం కనుపిస్తుంది" అని ప్రకటించాడు. కాబట్టి తక్షణమే జబ్బల్‌పూర్ సివిల్‌హాస్పిటల్‌కు తీసుకు పోబడాలని సలహాయిచ్చాడు. "డాక్టర్ గిల్డర్" కూడా బోస్‌ను పరీక్షించి ఒక ప్రకటనచేస్తూ "కుడిఊపిరితిత్తి బ్రాంకో న్యుమోనియా నమూనాకు గురి అయింది. ఆయన అతిబలహీనుడుగా సర్వం కోల్పోయినస్థితిలో వున్నాడు. కాబట్టి, మానశిక శారీరక సంబంధమైన ఏపనికైనా ఆయన పూర్తి అసమర్థుడు. సేవాగృహానికి కానీ, లేక వైద్యశాలకు కానీ ఆయన్ను పంపటం ఉత్తమమని నాసలహా" అని ఆ ప్రకటనలో చెప్పాడు.

దేశభక్తుల మకుటమైన ఈ వీరపురుషుడు, అంతటి అపాయకరమైన జబ్బులో వున్నాడు—ఆయన తన జీవితంలో ఒక్కక్షణమైనా వృధాపుచ్చకుండా, దేశసేవకు వినియోగించినా ప్రస్తుతస్థితి రాతిగుండె హృదయాలు కల్గిన శత్రువుల్ని కదుప

లేకపోయింది. అయితే ఆయన్ను వ్యతిరేకించేవారు, ఆయన్ను పతనం చేయటానికి, అవమానించటానికి ఈ జబ్బును అవకాశంగా తీసుకుని, ఒక్క క్షణమైనా వ్యర్థం చేయలేదనే సత్యం మరుగుపర్చినా దాగదు.

**జవహర్‌బాబు జోక్యానికి జవాబు:-** "నే నిక్కడకు వచ్చింది జబ్బల్‌పూర్ హాస్పిటల్‌కు పోవటానికి కాదు. సమావేశం పరిసమాప్తి కాకుండా వేరేచోటికి తీసుకుని పోబడే దానికంటే ఈ స్థలంలోనే మరణించటం ఉత్తమం".

ఈ వీరోచితమైన మాటలు, పండిత జవహరిలాల్ నెహ్రూ, ఆయన జబ్బల్‌పూర్ హాస్పిటల్‌కు పోవటానికి ఆమోదించేట్లు చేయటానికి ప్రయత్నిస్తున్నపుడు అప్రయత్నంగా బోస్ నోటినుంచి వచ్చినయ్.

ఈ సందర్భంలో రాజకోటలో ఉపవాసం చేస్తున్న మహాత్మాగాంధీకో, అధ్యక్షుని అస్వస్థతనుగురించి త్రిపురీలో సాగిపోతున్న తుఫాన్‌వంటి ప్రదర్శనల్ని వర్ణిస్తూ, టెలిఫోన్ ద్వారా జవహరిలాల్ నెహ్రూ ముచ్చటించినట్లు వదంతి కూడా వున్నది. అయినా, మహాత్మాగాంధీ పాషాణంవలె నిశ్చలంగా వున్నాడు. అధ్యక్షునికి ఈక్షణమో మరుక్షణమో, అపాయం సంభవించనున్నదనే వర్తమానం సహితం, ఆయన దయకు పాత్రం కాలేకపోయింది. బహిరంగ సమావేశం రెండు రోజుల అనంతరంకానీ జరుగదు. అధ్యక్షుని ఆరోగ్యం అంతకంతకు అభివృద్ధిచెందవలసిన దానికిబదులు అధ్వాన్నమౌతుంది.

తన గౌరవార్థంగా జరుపబడుతున్న అద్భుత ఊరేగింపు ఉత్సవంలో, తానుపాల్గొన లేకపోయాడు. అందుకని అధ్యక్షరథంపై, దీర్ఘమైన ఆయనపటాన్ని అందంగా అమర్చి, అమిత సౌందర్యంగా తీర్చి దిద్ది అలంకరించబడిన, ఏబదిరెండు ఏనుగులతో ఆ రథాన్ని లాగించారు.

మార్చి 10వ తేదీన త్రిపురీలో, కాంగ్రెస్ బహిరంగ సమావేశం ప్రారంభమైంది. అసలేబోస్ వున్నస్థితిలో ఆయనకు బాధకానీ, అవమానంకానీ, కలిగించవద్దని అనేక అభ్యర్థనలు బయలుదేరగా, అవన్నీ చెవిటివానిముందు శంఖూది నట్లయినయ్. అప్పటివరకు బోస్‌ను బలపరుస్తున్న కాంగ్రెస్ సోషలిష్టు పార్టీ తుట్టతుది ఘడియల్లో, ఆయన్ను అధఃపతనం చేయటానికి మోసంతో జారిపోయింది. తత్ఫలితంగా బహిరంగ సమావేశంలో కూడా విజయం గాంధేయులకే సిద్ధించింది. అసలు తీర్మానం అత్యధిక బలంతో నెగ్గింది.

**బోస్ రాజీనామా వదంతి:–** బహిరంగ సమావేశం అయిపోయింది. అయినా బోస్ రాజీనామా వదంతి మాత్రం ఋజువుకాలేదు. విషయనిర్ణయ సభలోనూ, బహిరంగ సభలోనూ ఆమోదించబడిన తీర్మానానికి అధ్యక్షుడు బద్ధుడై, తనకు తిరిగి ఆరోగ్యం కలుగగానే, భవిష్యత్ కార్యక్రమం గురించి, కార్యవర్గ సభ్యుల నియామకాన్ని గురించి, మహాత్మా గాంధీతో కలుసుకొని ముచ్చటించాలని నిశ్చయించుకొన్నాడు.

రోజులు అలానే గడిచి పోతున్నయ్. అయితే, అధ్యక్షుని ఆరోగ్యంలో సంతృప్తికరమైన పరిమితికి అభివృద్ధి గోచ

రించలేదు. అటువంటప్పుడు ఆయన చిక్కు విడదీయటానికి మహాత్మాగాంధీ దగ్గరకు ఎలాపోగలడు? ఎవరైతే ఆయన్ను వ్యతిరేకిస్తూ, పదత్యుతుని చేయాలని దృఢసంకల్పులై వున్నారో వారు ఈ అవకాశాన్ని పురస్కరించుకొని, కార్యక్రమంలో ప్రతిష్టంభనకు కారకుడయ్యాడని బోస్‌ను నిందించ మొదలు పెట్టారు.

కార్యనిర్వాహక బృందాన్ని ఏర్పాటుచేసే విషయంలో ఒక్కమారు కలకత్తా రావలసిందిగా ఆయన మహాత్మాగాంధీని బ్రతిమాలాడు అయితే ఈఅభ్యర్థన కూడా అందరూ పొందిన లాభాన్నే పొందింది. అయినప్పటికీ మహాత్మాగాంధీ చూపిం చిన ఈ అసహాయతను దృష్టిలోపెట్టుకోకుండా, ఆ విషయంలో మహాత్మాగాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించాడు.

గాంధీ బోస్ ఉత్తర ప్రత్యుత్తరాల్ని గురించి సంక్షి ప్తంగా నిర్వచిస్తూ, ఉభయుల పాత్రలను గురించి లాహోర్ లోని సివిల్ అండ్ మిలిటరీ గజట్ ఈక్రిందివిధంగా చక్కగా నిర్వచించింది:- గతాన్ని మనసులో పెట్టుకొని. ఆ విజ్ఞాన దృష్టితో, ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు చదివిన అనేకమందిలో ఉభయ వ్యక్తిత్వాల్ని గురించి - కార్య విధానాల్ని గురించి ఎలాంటి స్వాభిప్రాయాలున్నప్పటికీ, అత్యంత గౌరవప్రదంగా తన ఉద్దేశ వ్యక్తీకరణలో బోస్ ప్రవర్తించినట్లు ద్యోతకత మాతుంది. మహాత్మాగాంధీ ఎప్పుడూ ప్రతిపాదనకు ఎదురు ప్రతిపాదనతో ఆయన్ను మూలకు నెట్టివేయటానికే ప్రయ త్నించేవాడు. ఏధోరణినైతే బోస్ అంగీకరించాడో, దానిని

ఆ యథాప్రకార సహాయనిరాకరణతో, మహాత్మ సహజంగా సమాధానాలు యివ్వటం గోచరించింది."

ఈ పత్రికా సంపాదకుడు, ప్రజానీకానికి ఈ వుత్తర ప్రత్యుత్తరాల సారాంశాన్ని చక్కగా అందుబాటులో వుంచినా దానివలన అనుకున్నంత ఫలితం రాలేదు.

కాంగ్రెస్ విధానాలలో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించటానికి, బోస్ చాల ఆదుర్దాని ప్రకటించాడు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీని, కలకత్తాలో సమావేశపరచటానికి తాఖీదులు పంపడమొక్కటే సమస్యా పరిష్కారానికి వున్న అంతిమ మార్గం. అఖిలభారత కాంగ్రెస్ సంఘం, ఏప్రియల్ 28వ తేదీ సమావేశం కావటానికి నిర్ణయించ బడింది.

త్రిపురిలో జరిగిన అమర్యాదను దృష్టిలో పెట్టుకొని బెంగాల్ ప్రజానీకం, ఉద్రేకత చూపించవచ్చు కాబట్టి, కలకత్తాలో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం, జరుపరాదు; అనే ఒక అభిప్రాయం పత్రికల్లో కనుపించింది. ఇవన్నీ అవ్యక్తభావాలనే ఒకవిధంగా అనవచ్చు. అందుకని ఈ భయాందోళనలన్నింటినీ తెల్సుకున్న శ్రీయుత బోస్, పునర్హామీ నిస్తూ ఈదిగువప్రకటన చేశాడు.

"నా ఉద్దేశంలో, అలాంటి భయసందేహాల్ని ప్రదర్శించే వ్యక్తులు బెంగాలును అర్థంచేసుకోలేదన్నమాట. ఒక రాష్ట్రంలో అఖిలభారత కాంగ్రెస్ సమావేశం, జరుపుకోవటమంటే, అతిధి స్వాగతం యివ్వటానికి, గౌరవం పొందటానికి దానికి అదొక సదవకాశం. ఈ సందర్భంలో బెంగాల్ ప్రజా

నీకం – ప్రత్యేకంగా కలకత్తా పౌరులు, అఖిల భారతదేశానికి ఆతిథ్యమివ్వగలరు. ఏవంశ పారంపర్యంగా వస్తున్న దేశభక్తిని వినయ విధేయతల్ని చూచుకొని, బెంగాల్ గర్విస్తుందో, వాటితోనే మా ఆచారబద్ధమైన ఆనందోత్సాహాల్ని జతపర్చి, మా అతిథులకు అత్యంత గౌరవప్రదమైన స్వాగత మివ్వగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను.''

**కలకత్తా సమావేశం - రాజీనామా:-** నిర్ణీత తేదీకి సమావేశం ప్రారంభించ బడింది. ఒకటి రెండు సంఘటనలను మినహాయిస్తే – బెంగాల్ ప్రజానీకం ప్రేక్షకులకు, అతిథులకు అద్భుతమైన స్వాగతం చెప్పింది. కొంతమంది వేడిరక్తం ఉప్పొంగిన వంగ విద్యార్థులు, బాబూ రాజేంద్రప్రసాద్ – సర్దార్ పటేళ్ళపై చెప్పులు విసరి అసంగతంగా ప్రవర్తించినందువలన ఆ సంఘటనలు జరిగాయి. విద్యార్థులు అవ్యక్తంగా చూపిన ఈ నిరశన ప్రదర్శనానికి శ్రీయుత బోస్ బహిరంగంగా క్షమాపణ కోరాడు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో కూడా అనేక వ్యతిరేక దృశ్యాలు గోచరమైనయ్. మితవాద సభ్యులు త్రిపురీలో సాధించిన విజయాన్ని నిలుపుకోవటానికి, ఇక్కడికి అసంఖ్యాకంగా చేరుకున్నారు.

అయితే బెంగాల్ సభ్యులు మాత్రం, అప్పటి పరిస్థితులనుబట్టి జాతీయ ఐక్యతను నిలబెట్టండని అభ్యర్థించారు. శ్రీయుత బోస్ ఒకస్పష్టమైన పరిష్కారార్థం చూపిన మార్గాలన్నింటికీ అవరోధాలు కల్పించటం చూచినపుడు, దేశఐక్యతను

దృష్టిలో పెట్టుకుని, రాజీనామా చేయటానికే నిశ్చయించుకున్నాడు. అలా చేయకపోతే, కాంగ్రెస్‌లో చీలిక కోసరం తహతహలాడుతూ అగ్రులు చాచుకు చూస్తున్న శత్రువుల ఇనుపహస్తానికి, బలం చేకూరుతుంది. కాన ఆయన అఖిల భారత కాంగ్రెస్ ముందు తన రాజీనామా కాగితం దాఖలు చేశాడు.

పండిత జవహరిలాల్ నెహ్రూ, బోస్‌ను రాజీనామా ఉపసంహరించుకోమని, ఒకతీర్మానం ప్రతిపాదించాడు. కానీ ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. కారణం? బోస్‌చేత ఒకమాటు నిశ్చయం చేసుకోబడిన ఏ విషయమైనా, అది తుట్టతుదిమెట్టు. ఇక దానికి తిరుగువుండదు.

ఈ "త్రిపురి" యుద్ధంలో చిట్టచివరకు గాంధేయులే జయించారు. గాధీవిధానం మరోనూతన పంథానిగుత్తకు తీసుకుంది. పాట్నా – బొంబే – లక్నో – వార్ధాల మధ్య అభివందనలు, అటు – ఇటు పరంపరలై ప్రవహించినయ్. ఆవెనుకటి వృద్ధనాయకుడు సర్దార్ పటేల్, ఆయన మిత్రులు మరోమారు ఆధిక్యతకు వచ్చారు. బాబూ రాజేంద్రప్రసాద్‌ను తిరువాత అధ్యక్షునిగా జేశారు. చరకా స్వరాలతో, వందేమాతరం నినాదాలతో, విజయోత్సాహంతో ఈ సాహసికులు తమ నాయకుని చేరుకున్నారు. పాపం అలారంగులు ప్రదర్శించి, ఫిరాయించి రొంపినుంచి బైటపడ్డారు. వారు న్యాయశీల్లని హస్తగతం చేసుకోలేకపోయినా ఆ పరిస్థితుల్లో ఈవిజయం హృదయభారాన్ని కొంతవరకు తగ్గించి, ఆత్మతృప్తికి హేతువైంది. సాధించిన ఈ ఘనవిజయానికి వీరు శ్లాఘ్యపూజ్యులే!

# తిరుగుబాటు - జైలు

**ఫార్వర్డ్ బ్లాక్:-** "ఉద్రుత పరిస్థితుల్లో నిస్పృహకలిగి నప్పుడు, తత్ఫలితంగా విప్లవం ప్రకోపిస్తుంది. సహజ అభిరుచులు బలవంతంగా త్రోసివేయ బడినప్పుడు, న్యాయం నిష్పాక్షికం అనేవి మొత్తంగా మృగ్యమైనప్పుడు, సహజంగా విప్లవం బయలుదేరుతుంది."

పటేల్ వర్గం ప్రదర్శించే ఎత్తుగడలు - విధానంతో, సుభాస్ బోస్ విసుగు చెందాడు. కాంగ్రెస్ నాయకుల చేతుల నుంచి, న్యాయం - నిష్పాక్షికం అనేవి, సడలి జారి దూరమైన తరువాత, ఆయన అన్నివిధాల తృణీకరించ బడ్డాడు. ఉన్నత కార్యవర్గంలో ఆయన ప్రవేశించకుండా, అన్నిద్వారాలూ బంధించబడినయ్. ముదిరిపోయి విలయతాండవ మాడుతున్న అధికారుల లోనికుళ్ళును - నిరంకుశత్వాన్ని నిరశించి, విద్యార్థి దశలోనే తిరుగబడిన — జన్మతః విప్లవవాది అయిన, సుభాస్ ప్రస్తుతకాంగ్రెస్ మన స్తత్వంపైన తిరుగుబాటు చేయటం ఒక వింతైన విషయంకాదు. చాలాకాలంబట్టి కాంగ్రెస్‌ను విప్ల వాత్మకమైనదిగా చేయటానికి, అసలైన పోరాటసంస్థగా రూపొందించటానికి అనేక కలలు కన్నాడు. అయితే కరగత మైన ఆ సదవకాశం ఇప్పుడు దూరమైంది. ఆయన అమితంగా నిస్పృహ చెందినా, అదే సందర్భంలో విద్యార్థి సంస్థలు-ప్రజా ఉద్యమాలు, సుసంఘటితమైన నాయకత్వానికి దోహద మివ్వ

గలవనే దృఢవిశ్వాసంతోనే వున్నాడు. అందుకని ఆయన దేశానికి ఒక బహిరంగ సందేశం ఇచ్చి, కాంగ్రెస్‌లోని వామ పక్షాల్ని సమ్మిళితపర్చి సంకల్పించుకున్నాడు. అప్పటినుంచి కాంగ్రెస్‌లోని ఒక అభ్యుదయ సంస్థగా "ఫార్వర్డ్ బ్లాక్" ఉద్భవించింది. ఫార్వర్డ్ బ్లాక్ నిర్మాణం జరిగిన వెంటనే, దాని నిర్మాణాన్ని గురించి 1939 ఆగష్టులో నేతాజీ ఒక వ్యాసం వ్రాస్తూ ఇలాచెప్పాడు:—

"జాతీయ కాంగ్రెస్ పవిత్ర భారత దేశంనుంచే ఉద్భ వించిన ఒక మహాఉద్యమం. అది సమస్త భారత ప్రజానీకానికి ప్రధాన రాజకీయపక్షం. దానిలోనే వారి - ఆశలు - ఆశ యాలు అన్నీ మిళితమై వున్నయ్. అనంత అద్భుత బలసంప త్తితో ప్రవర్ధమానమౌతున్న మహాసంస్థ అది. భారతజాతికి ఎలా హద్దులనేవి లేవో, అలానే దాని అభివృద్ధికి కూడ హద్దులులేవు. ఈ కాంగ్రెస్‌కు ఇటువంటి అభివృద్ధి ముఖ్యంగా ఆంతరంగిక ఆవేశ విజృంభణ వలననే కలిగింది. దానికితోడు అనేక బాహ్యశక్తులు కూడ తగినదోహద మిచ్చినయ్. ఈ ఆంతరంగిక ఆవేశమే ముఖ్యంగా ఫార్వర్డ్ బ్లాక్ నిర్మాణానికి కూడా మూలకారణమైంది. భారత రాజకీయాల్లో ఈ నూతన పరిణామానికి కేవలం వ్యక్తిత్వ ప్రాబల్యాలుకానీ, దైవీకసంఘ టనలుకానీ కారణంకాదు. విప్లవపంథాలో ప్రస్తుతం కాంగ్రెస్ ఒకనూతన స్వరూపాన్ని ధరించ వలసిన అవసరం వచ్చింది కాబట్టి. ఫార్వర్డ్ బ్లాక్ స్థాపన అవసరమైంది.

"కానీ, కాంగ్రెస్‌లో ఈపరిణామం అభివృద్ధి ఎలా దోహదపడాతయ్? అందుకు ప్రధానమైన మూలసూత్రం ఏమిటి? ఈప్రశ్నకు సమాధానంగా అనేకమంది అనేకసిద్ధాంతాలు చెప్పవచ్చు. కానీ వాటన్నింటిలోకీ నాకన్ని విధాల నచ్చింది,వాస్తవికతకు సన్నిహితమైంది "హీగెల్ పరిణామవాదం"

"అభివృద్ధి అనేది ఎప్పుడూ సరళంగానూ, ప్రశాంతంగానూ జరుగుతుందను కోవటం పొరపాటు. అభివృద్ధి ఎప్పుడూ సంఘర్షణ ఫలితంగానే సాధ్యపడుతుంది.

"సిద్ధాంత ప్రతిసిద్ధాంతాల సంఘర్షణ ఫలితంగానే సమన్వయ సిద్ధాంతం ఉద్భవిస్తుంది. సృష్టిక్రమపు తదుపరిదశలో ఈసమన్వయ సిద్ధాంతమే సిద్ధాంతంగా మారుతుంది. ఈసిద్ధాతం తిరిగి మరో ప్రతిసిద్ధాంతాన్ని త్రోసిరాజని ఇంకో సమన్వయ సిద్ధాంతానికి దోహదమిస్తుంది. ఇలా అభ్యుదయచక్రం నిరంతరం దొర్లిపోతూనే వుంటుంది.

"ఒకప్పుడుగానీ మరొకప్పుడుగానీ లేక ఎల్లప్పుడుగానీ ఐక్యతా పాఠాలు వల్లించేవారు సృష్టిక్రమంలోని ప్రధాన సూత్రాల్ని విస్మరిస్తున్నారని చెప్పాల్సివుంటుంది. ఐక్యతకు కావలసిన ముఖ్య లక్షణాల్ని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. ఐక్యత నిజస్వరూపాన్నికూడా విమర్శించి చూచుకోవాలి. ఏది నిజమైన చైతన్యమో ఏదికాదో కూడ తెల్సుకోవాలి. ఏది అభివృద్ధిదాయకమో ఏది అభివృద్ధి నిరోధకమో స్థిరీకరించుకోవాలి. ఈ రోజు విప్లవచైతన్యం నశించి నిర్వీర్యులై

పోయిన వ్యక్తులనుంచి ఒక శుష్కనినాదం వినిపిస్తుంది." ఏ పరిస్థితుల్లోనూ ఏదోవిధమైన ఐక్యత సాధించాలి" అని వీరు ఆందోళన చేస్తున్నారు. కానీ వీరిచ్చే ఈ వ్యర్థనినాదానికి మోస పోగూడదు.

"చైతన్యవంతమైన ప్రతి ఉద్యమంలోనూ జీవం కలిగిన ఒక వామపక్షం వుంటుంది. వీరి ధోరణినే ప్రతిసిద్ధాంత మన వచ్చు. పరిస్థితులు సవ్యంగా వున్నపుడు వామపక్షం బలపడి క్రమేణ అభివృద్ధిచెంది ముందుకు సాగుతుంది. ఈ వామపక్షం సంపూర్ణ అభివృద్ధిని నిర్ణీత పరిపక్వ పరిస్థితుల్లో ఎలా పొంద గలుగుతుందో నిర్ణయించటానికి కేవలం రాజకీయ పరిజ్ఞానమే కాకుండా ఒక్కొక్కప్పుడు తాత్విక దూరదృష్టికూడ అవసరం. సాధారణంగా మితవాదవర్గంతో చేతులు కలిపిన వామపక్షం క్రమంగా సహకార సద్భావాలు ప్రదర్శించి తన పలుకుబడి పెంపొందించు కుంటున్నప్పటికీ, కొన్ని కొన్ని సందర్భాల్లో ఈ అవకాశం కలుగక పోవచ్చు. అప్పుడు వామపక్షం తన సర్వ శక్తిని సంఘటితపరచి, మితవాదవర్గంతో భేదించి పురోగమించ వలసిన అవసరం కలుగవచ్చు. ఒక సంస్థ పరిణామంలో వామ పక్ష అవసరం తప్పక కలిగి తీరుతుంది. మితవాదవర్గంతో ఏర్పడే సంఘర్షణ ఫలితంగాగానీ లేక మైత్రిద్వారాగానీ నిరం తర వామపక్షం అభివృద్ధి పొందుతూ తుదకు మితవాద వర్గాన్నే తనలో లీనంచేసుకుంటుంది.

ఈ పని జరిగిన తరువాత వామ పక్షం బలపడి ఆగి పోతుంది. దానితో అభివృద్ధికి అవకాశాలుండవు. అప్పుడు

చరిత్ర తిరిగి పునరావృతమౌతుంది. నిన్నటిదాక వామపక్షంగా వుండి పై విధంగా బలపడి ఇక అభివృద్ధి కున్న అవకాశాల్ని కోల్పోయిన యీ వామపక్షధోరణిని తోసి రాజనే దానికి తిరిగి మరో నూతన వామపక్షం నిర్మాణం కావాలి. ఉ॥గాంధే యులు 1920 లో కాంగ్రెస్‌లోని వామపక్షమే! అయినంత మాత్రాన మనం ఈ నాడుకూడా వారిని వామపక్షంగా పొర పాటునైనా భావించలేం. ఎప్పుడూ కాకపోయినా, ఒక విధంగా నిన్నటి వామపక్షం మితవాద వర్గంగా మరొకప్పుడు మారు తుంది. ఈ నాడు కాంగ్రెస్‌లో అతివాద మితవాద వర్గ భేదా లుండకూడదనీ, యావత్తు కాంగ్రెస్ వామపక్షమేనని వాదించ టం అర్థరహితమే కాకుండా, తెలివితక్కువనికూడా చెప్పవలసి వుంటుంది. అష్టకష్టా లనుభవించైనా వాస్తవిక పరిస్థితుల్ని ఎదు ర్కొవటానికి మనం సిద్ధంగా వుండాలి.

"కాంగ్రెస్‌లోని వామపక్షం 1936-38 సం॥రాల మధ్య కాలంలో, మితవాదుల తోటి చేతులు కలిపి చాల అభివృద్ధి అయింది. మొట్టమొదటి సారిగా 1938 సెప్టెంబరులో కాంగ్రెస్ మితవాదవర్గం ఆదుర్దాప్రదర్శించింది. వామపక్షం రోజు రోజుకు కంటకప్రాయమై పోతుందనీ, అందు వలన దానిని తనలో ఇముడ్చుకోవటం అసంభవమని మితవాదవర్గం తన అసంతృప్తి ప్రకటించ ప్రారంభించింది. ఈధోరణి 1939 నాటికి మితిమీరి పోయింది. వామపక్షంతో సహకరించమని మితవాదవర్గం తెగ వేసి చెప్పారు. ఏదో ఒక పక్షం వారే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో వుండాలని వాదించే మితవాదుల ధోరణిలోని అంత

ర్యం ఎమిటో మరోవిధంగా బోధపడదు. లేకపోతే, మూడేండ్లు వారు వామపక్షంతో సహకరించి పనిచేసి ఇక ముందుమాత్రం సహకరించ లేమనటంలోని అంతరార్థమేమిటో! దీని కంతా కారణం కాంగ్రెస్‌లో దిన దిన ప్రవర్ధమాన మౌతున్న వామ పక్ష పలుకుబడిని-బలాన్ని చూచి ఓర్వలేక పోవటమే.

“ఈ సమస్యా పరిష్కారానికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ 1939 ఏప్రియల్ 29న కలకత్తాలో సమావేశమైంది. సంయుక్త కార్యవర్గాన్నేర్పాటు చేయాలనీ, అలా అయితే మితవాదులతో సహకరించే దానికి ఎలాంటి అభ్యంతరం లేదని వామపక్షం అంది. కానీ మితవాదవర్గం ఈ ప్రతిపాదనకు అంగీక రించక ఏకపక్ష కార్యవర్గమే కావాలన్నారు. అలా మొండిపట్టుతో వామపక్ష రాజీపద్ధతికి, సహకారానికి, ఐక్యతకు అభ్యుదయానికి వెన్నుపోటు పొడిచారు. వామపక్షం తమ చెప్పుచేతలలో వుండి పనిచేయాలని మితవాదుల వాంఛ. దీనిని వామపక్షం అంగీక రించాలనా? అంగీకరిస్తే కలిగే ఫలితమేమిటి? తద్వారా అభ్యు దయచక్రం ముందుకు దొర్లుతుందా? లేక అసలు ఉద్యమంలోనే చైతన్యత నశించిపోతుందా?

“మితవాదవర్గం తన సహకారాన్ని ఎప్పుడైతే నిరాక రించిందో అప్పుడు కాంగ్రెస్‌లోని ఐక్యతను నిలబెట్టటానికి వామపక్షం ఒక వేళలొంగి మితవాదుల క్రిందవుండి పనిచేయా లంటే పెత్తనం ఏవరిదైనా - వామపక్ష కోర్కెమీరా మితవాద వర్గం విప్లవకార్య క్రమాన్నివ్వాల్సి వుంటుంది. అలా వామ

పక్షం లొంగిపోవటంలో అర్థంవుంది. కానీ దురదృష్టవశాత్తు నాకు - గాంధీజీకి ఏప్రియల్‌లో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల బట్టి, రాబోయే పోరాటాన్ని గురించి ఆయన అసలు ఆలోచించటమే లేదని అర్థమైంది. నేటి మంత్రివర్గాలు - కాంగ్రెస్ సంఘాలు విప్లవపోరాటాన్ని నడుపాలనే వుద్దేశంతోనే లేవు. ఇటువంటి పరిస్థితిలో వామపక్షం మితవాదులకు లొంగిపోయి కాంగ్రెస్‌లో నామకా ఐక్యతవున్నట్లు చూపించినా జరిగే దేమిటి? కాంగ్రెస్‌లో అభివృద్ధి నిరోధకత్వం బలిసిపోయి చైతన్యం నశిస్తుంది. కాబట్టి మనం ఆ విధంగా చేయలేం, చేయగూడదుకూడ.

"కాబట్టి మితవాదులతో పూర్తిగా భేదించి వామపక్షం తనశక్తిని సంఘటితపర్చుకోవలసిన సమయమొచ్చింది. అలాచేస్తే కాంగ్రెస్‌లో వామపక్షానికి హెచ్చుబలం వుండగలదు. ఆ తరువాత మనం భారతజాతీయ కాంగ్రెస్ పేరుతోనే స్వాతంత్ర్యపోరాట సన్నాహాలు జరుపటానికి ఉద్యుక్తులం కాగలం. ఇదే ఈనాటి వామపక్షం వారికర్తవ్యం. ఈకర్తవ్యాన్ని నెరవేర్చటానికే ఫార్వర్డ్ బ్లాక్ స్థాపించబడింది."

దేశంలో ఫార్వర్డ్ బ్లాక్ సంస్థ నిర్మించే ఉద్దేశ్యం, బోస్‌కు త్రిపురీ చరిత్రాత్మక సంఘటనల అనంతరమే కలిగిందని సాధారణంగా అభిప్రాయ పడతారు. వాస్తవానికి ఇది పొరపాటు, ఆయన రాజకీయ కార్యక్రమాల్లో, అన్ని అభ్యుదయ వామపక్ష సామ్రాజ్య వ్యతిరేక శక్తుల్ని సమీకరించి, భారత

స్వాతంత్ర్య పోరాటానికి, ఒకస్పష్టమైన విధానం అమలులో పెట్టాలనే, అత్యుత్తమభావం ఆయనలో ఆదినుంచీ వున్నది.

1927 లో మాండలే జైలునుంచి విడుదలైనప్పటి నుంచి, మితవాద ధోరణిలో సాగుతున్న ప్రతి కాంగ్రెస్ విధానాన్ని, సర్వదా వ్యతిరేకించటమే ఆయన పరమాశయం. డాక్టర్ అన్సారీ అధ్యక్షతక్రింద, మద్రాసు కాంగ్రెస్‌లో మొట్ట మొదటిసారిగా మితవాదంపై కత్తిదూశాడు. కాంగ్రెస్ అంతిమలక్ష్యం "సంపూర్ణ స్వరాజ్యం" అనే తీర్మాన ప్రతిపాదన జరిగింది. ఆ తరువాత వెన్వెంటనే, లక్నోలో అధినివేశ ప్రతిపత్తిపై ఆధారపడి రచించబడిన, నెహూౄరాజ్యాంగ విధానాన్ని అనుమతించ టానికి "సర్వపక్ష సమావేశం" ప్రారంభమైన పుడు, "కాంగ్రెస్ కన్సర్వేటివ్" విధానానికి బహిరంగంగా పోటీకి, పండిత జవహర్‌లాల్, తదితర వామపక్ష వ్యక్తులతో సహా విడివడి, ఆయన "ఇండిపెండెంట్ లీగ్" అనేపేరుతో ఒక వామపక్షం ఏర్పాటుచేశాడు. అదే సంవత్సరం డిసెంబరు మాసంలో కాంగ్రెస్ వార్షికసమావేశం కలకత్తాలో జరిగి నప్పుడు "ఇండిపెండెంట్‌లీగ్' సభ్యులు కాంగ్రెస్ భావంలో "సంపూర్ణ స్వరాజ్యం కాంగ్రెస్‌లక్ష్యం" అనేవరకు మార్చ టానికి, ఈవిస్పష్టమైన పదజాలంతో విశ్వప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్‌లోని ప్రధానమైన 'గాంధీబృందం' వారి తీవ్రవ్యతిరేకత వలన; వారి ప్రయత్నాలు ఫలించక పోయినప్ప టికీ, దేశంలోని యువకులకుకలకత్తా సంఘటనలు, కాంగ్రెస్‌లో వామపక్షక్రమీ అవిరళంగా సాగించవచ్చు; అనే ఆశాభావానికి

దోహద మిచ్చినయ్. కలకత్తా కాంగ్రెస్ జరిగిన సంవత్సర మంతా, విద్యార్థి సంఘాల్ని కార్మిక - కర్షక సంఘాల్ని నిర్మాణంచేసి, సోషలిష్టు - కమ్యూనిష్టు సంస్థలు సంఘటిత పర్చి, రాబోవు సంవత్సర మహాసభలో అద్భుతశక్తిని ప్రదర్శించటానికి, వామపక్ష వ్యక్తులందరూ అమోఘమైన కృషి చేశారు. అన్నిరాష్ట్రాలలో అసంఖ్యాకంగా సమావేశాలు జరిపి, ప్రతిచోట అఖండ సహోత్సాహాన్ని సృష్టించారు. తత్ఫలితంగా కలకత్తాలో, కాంగ్రెస్ దేన్ని నిరాకరించిందో, దాన్నే 'లాహోర్‌లో' బలవంతంగా అంగీకరించ వలసివచ్చింది.

1930 నుంచి 33 వరకూ వున్న ఈమధ్య కాలమంతా కాంగ్రెస్‌కు బాధల్ని కలిగించిన దుర్దినాలు. అన్నిరకాలైన కాంగ్రెస్ వ్యక్తులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపేపోరాటంలో సతమత మాతున్నారు. అయితే 1933లో గాంధీజీ చేత సాంఘిక అవిధేయతోద్యమం రద్దుచేయబడిన సమస్య, మళ్ళీ వామపక్ష దృష్టిలోనికి వచ్చింది. ఆసమయంలో సుబాస్ చంద్రబోస్ ఆరోగ్యం కోలుకుంటూ వియన్నాలో వున్నాడు. మాజీ కేంద్ర శాసన సభాధ్యక్షుడైన శ్రీయుత విఠల్‌భాయ్ పటేల్‌తో కాంగ్రెస్‌లో వామపక్ష నిర్మాణవిషయమై చర్చిస్తూ మార్గాన్వేషణలో వున్నాడు. అయితే దేశంలో ఇది జరిగిన తరువాత, ఆయన నిర్ణయం ఘనీభవించింది. కాంగ్రెస్ ప్రస్తుత విధానం సహించరాదని తాను పటేల్ సంయుక్తంగా వియన్నానుంచి చేసిన ప్రకటనద్వారా తెలుస్తుంది.

1934 సం॥లో కాం(గెస్ సోషలిస్టుపార్టీ ఉద్భవించింది. కాం(గెస్‌లో ఇది ఒక ముందడుగుగా ఆయన దాన్ని ఆహ్వానించాడు. కానీ దాని విధానాలతో ఆయన పూర్తిగా సంతృప్తి చెందలేక పోయాడు. 1938 హరిపూర్ కాం(గెస్‌లో తన అధ్యక్షోపన్యాసంలో "కాం(గెస్‌లోని కాం(గెస్ సోషలిష్టుపార్టీపాత్ర సా(మాజ్య వ్యతిరేక విధానంగా వుండాలి. కానీ సోషలిష్టు విధానంకాదు. మొదటి విధానం (పదర్శించి నందువలననే అది తన లక్ష్యానికి కావలసిన సూటి మార్గాన్ని అనుసరించ గలదు".

అప్పటినుంచీ 1937 సం॥ అర్ధభాగం వరకూ ఆయన జైలులోకానీ, యూరప్‌లోకానీ ఉండిపోవటం తటస్థించి నందువలన, కాం(గెస్‌ముందు తన విప్లవ కార్య(కమం పెట్టేందుకు వీలులేక పోయింది. అదే సంవత్సరంలో ఆయన విడుదల చేయబడిన అనంతరం ఆయన కాం(గెస్‌చూపే రాజ్యాంగ పద్ధతుల అభిరుచుల్ని తీ(వంగా వ్యతిరేకించటమే కాక "ఫెడరేషన్" విధానాన్ని ముక్తసరిగా ఎదుర్కొన్నాడు. 1938లో హరిపూర్ భారతజాతీయ కాం(గెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనాడు. దాని తరువాత వెంటనే కాం(గెస్‌లో వామపక్ష నిర్మాణం కొరకు తీ(వమైన కృషిచేశాడు. ఆయన స్వంతమాటల్లో "సోషలిష్టు-కమ్యూనిష్టు పార్టీలలో చేరటానికి నిరాకరించే కాం(గెస్‌లోని అన్ని అభ్యుదయ-సా(మాజ్య వ్యతిరేక వామపక్షాలు; ఒక సిద్ధాంత యుక్తమైన కనీస (పాతిపదికపై సంఘటిత పరచాలి అనేది మామూలు మాటే!"

"నే నింకా ఏమని అభిప్రాయ పడతానంటే:- ఆ పద్ధతి వలననే మితవాదుల దౌష్ట్యం అరికట్టబడి—దేశంలో సమవాద పార్టీ నిర్మాణానికి దోహదమిస్తుంది". హరిపూర్ - త్రిపురీ కాంగ్రెస్‌ల మధ్యవున్న వ్యవధి ఆయన కాంగ్రెస్‌లోని వామ పక్ష సమైక్యత సాధించటానికి ఒక సదవకాశంగా ఉపయోగ పడింది. త్రిపురీ అనంతరం ఏం జరిగిందో అది ముందు ముందు విశదీకరించ బడింది. కాన యిప్పుడు అప్రస్తుతం.

ఈ విధంగా ఫార్వర్డ్‌బ్లాక్ త్రిపురీ కాంగ్రెస్ అనంతర ఫలితాల వలన ఏర్పడిందని భావపడటం, కేవలం పొరపాటు, లాహోర్ మహా సభల అనంతరం నుంచీ, ఒక నూతన రాజ కీయ పక్ష నిర్మాణ విషయమై బోస్ ముక్తసరిగా తన నిశ్చి తాభిప్రాయాన్ని తెలియ జేస్తూనే వున్నాడు. ఇతర దేశాల సందర్శన ద్వారా, ఆ ఆవశ్యకత ధృవపడింది. తన మామూలు ఆరోగ్యం పొందిన వెంటనే, శ్రీయుత బోస్ ఒకమారు దేశైక పర్యటన జరిపి, పార్టీ నిర్ణయాల్ని సిద్ధాంతాల్ని వ్యక్తీకరించ టానికి విపరీత కృషిచేసి, అనతి కాలంలోనే దానిశాఖల్ని అఖిల భారత దేశంలో వ్యాపింప చేశాడు.

ఇలాంటి బోస్ విధానాలు, మితవాద కాంగ్రెస్ నాయకు లకు కంటక ప్రాయంగా వున్నయ్. తన అద్భుత వ్యక్తిత్వ ప్రదర్శన వలన, ఆయన అఖిల భారత దేశంలోని అధిక సంఖ్యాక కాంగ్రెస్ వ్యక్తుల మనస్తత్వాల్ని స్వాధీన పచ్చు కుని, తన పద్ధతుల కనుగుణ్యంగా వారిమద్దతు తీసుకోగలడు; అనేది ప్రతి ఒక్కరికీ తేటతెల్లమైంది. అందుకని ఆయన

చర్యల్ని అంతటితో ఆపటానికి, కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం నిర్ణయించుకుంది.

**కాంగ్రెస్ నుంచి బర్తరఫ్:** — రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గాలతో సంప్రదించ కుండానే రాష్ట్రమంత్రివర్గాలకు-రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గాలకు మధ్యవున్న సంబంధాలు నిర్వచిస్తూ, రాష్ట్రాల్లో సత్యాగ్రహాన్ని నిషేధిస్తూ, అఖిల భారత కాంగ్రెస్ సంఘం చేసిన ఇటీవలి రెండు తీర్మానాలతో, శ్రీయుత బోస్ నిర్మొగమాటంగా భేదించాడు. "ఈ రెండు తీర్మానాలు అఖిల భారత కాంగ్రెస్ సంఘం నుంచి సాధారణ కాంగ్రెస్ వ్యక్తుల్ని-రాష్ట్రప్రభుత్వాల్ని సామాన్య ప్రజానీకం నుంచి కాంగ్రెస్ కష్టార్జితంపైన విచిత్రంగా ఎడబాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వాల శక్తిని పలుకుబడిని ఇనుమడింప చేస్తూ రాజ్యాంగ విధానం వైపు ఈడ్చుకు పోయిన దానికి, సేవ చేయ టానికి, దోహదం కల్పిస్తున్నయ్" అని అభిప్రాయ పడ్డాడు.

కాబట్టి ఆయన అఖిలభారత కాంగ్రెస్ సంఘ నిర్ణ యానికి వ్యతిరేకంగా, నిరసన సమావేశాలు జరుప మని దేశాన్ని ఆదేశించాడు. శ్రీ బోస్ ఆయన అనుచరులు తీసు కున్న ఈ చర్యని, కాంగ్రెస్ అధ్యక్షుడు, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పైన తిరుగుబాటు చేయటమని భావించాడు. మామూలు ధోరణిలో పరస్పర ఉత్తర ప్రత్యుత్తరాలు బోస్-అధ్యక్షుని మధ్యకొంతవరకు నడిచిన తరువాత; కాంగ్రెస్ అధి

ష్ఠాన వర్గం "వార్ధా" లో సమావేశమై, ఈ క్రింది నిర్ణయాన్ని తీర్మానం ద్వారా తెలియజేసింది.

"(శ్రీ) సుభాస్‌చంద్రబోస్ వలన, క్రమశిక్షణలో నిశ్చిత మైన విపరీత విఘాతం ఏర్పడకుండా చేయగలిగిన ప్రయత్నా లన్నింటా, ఫలితం శూన్యమైనందుకు సానుభూతిని తెలుపుతూ, కాంగ్రెస్ కార్యవర్గం, అతి బాధాకరమైన నిర్ణయానికి రావాల్సి వచ్చింది.

"క్రమశిక్షణా రహితంగా, (శ్రీ) సుభాస్‌చంద్రబోస్ ప్రవర్తించినందుకు, ఆయన బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ సంఘా నికి అధ్యక్షుడుగా వుండేందుకు అనర్హుడనీ, 1939 ఆగస్టు నుంచి ఏ కాంగ్రెస్ ఎన్నికల సంఘానికైనా, మూడు సంవత్సరాల వరకూ అయోగ్యుడనీ, ఈ కాంగ్రెస్ కార్యవర్గం తీర్మానిస్తుంది"

ఈ వార్ధా కుంభకోణం ఆయనకు ఒక క్రొత్త ఏమీ కాదు కాన, ఈ వార్త అనుకుంటుండగానే ఆయనకు చేరింది. ఎవరో ఒకరు అధిష్టానవర్గపు ఈ నిర్ణయాన్ని ఆయనకు తెలియ జేయగానే "ఉస్ - ఇంతేనా !" అని భుజాలు ఎగురవేస్తూ చిరు నవ్వుతో అన్నాడుట !

ఇక బోస్ కాంగ్రెస్‌లో ఒక ప్రాథమిక సభ్యుడుకూడా కాడు. మరోవైపున బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్‌కమిటీ ఆయన్ను, బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకుంది. ఆయన నాయ కత్వ రహితమైన మనుగడకు అది యిష్టపడలేదు. తత్ఫలితంగా,

అధిష్టానవర్గం బెంగాల్ కాంగ్రెస్ సంఘాన్ని సహితం రద్దు చేసేంత వరకూ వెళ్ళింది.

బెంగాల్ కాంగ్రెస్ సంఘాన్ని రద్దుచేయటానికి గల కారణాల్ని, కాంగ్రెస్ పార్లమెంటరీ సంఘంనుంచి శరత్ చంద్ర బోసుని, ఆయన సహచరుల్ని త్రోసివేయటానికి గల హేతువుల్ని గురించి, లేక అధిష్టానవర్గంపై అనుకోని విధంగా బెంగాల్ తిరుగుబాటును గురించివున్న లోతుపాతుల్ని విమర్శించటం ఈ పుస్తకపు ప్రధానోద్దేశ్యం కాదు. ఆయన బహిరంగంగా కనుపడకుండా ఆగశ్మికంగా అదృశ్యమై, తదుపరి మహా విప్లవవీరుడని ఖ్యాతిబొంది, తిరిగి మరోమారు అదృశ్యమైన అనంతరం ఏర్పడిన పరిస్థితుల్ని గురించి క్లుప్తంగా మాత్రమే చర్చించ బడింది.

ఇంతకుముందు చెప్పినట్లు, శ్రీయుత బోస్ జన్మతః వీరుడు, గౌరవాన్ని సవాల్‌చేసే ఏవిషయాన్నైనా ఆయన ఒకనిమిషం కూడా సహించడు. చాలా కాలంనుంచి భారత ప్రజల గౌరవానికి భిన్నగా, కలకత్తాలో "హాల్‌వెల్‌మోన్యుమెంటు" అనే ఒకచిహ్నంవుంది. ఇంతకుపూర్వం దాన్ని తీసివేయించటానికి, అనేక ప్రయత్నాలు జరిగినయ్. కానీఫలితం మాత్రం శూన్యం. అందుకని శ్రీయుత బోస్ మరోమారు, ఆ చిహ్నం తీసివేయించ టానికి శాంతియుతమైన ఆందోళన చేయ సంకలించుకున్నాడు. ఆయన నాయకత్వంక్రింద నడువ టానికి తయారుగావున్న బెంగాల్ ప్రజానీకం, ఆయన మార్గ దర్శకత్వాన సంతోషపూర్వకంగా నడిచారు. ఉద్యమం

ప్రారంభమై ప్రజ్వరిల్లింది. బెంగాల్ ప్రభుత్వం భారతరక్షణ చట్టం క్రింద ఆయన్ను అరెస్టుచేసి కాలనిర్ణయం లేకుండా జైలులో వుంచింది.

బోస్ అరెస్టయినా, ఆయన ప్రారంభించిన ఉద్యమం మాత్రం అంతటితో ఆగలేదు. తత్ఫలితంగా బెంగాల్ ప్రభుత్వం ఆ చిహ్నాన్ని ఒక సురక్షిత ప్రాంతానికి మార్చుకుంది.

**ఉపవాసం - సందేశం:-** తనను ఇంకా నిర్బంధంలో ఉంచటం కేవలం న్యాయవిరుద్ధమని భావించి, ఆయన ఆరోగ్యం అసంతృప్తి కరంగా వున్నప్పటికీ, ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేక చిహ్నంగా, ఆకలి సమ్మె జైలులో ప్రారంభించాలని నిర్ణయించు కున్నాడు. "అదృష్టకర"మైన ఈచర్య తీసుకోబోయే ముందు మహా ఘనతవహించిన బెంగాల్ గవర్నర్‌కు, మహా ఘనతవహించిన ప్రధానమంత్రికి - మంత్రి వర్గానికి, 1940 నవంబరు 26వ తేదీన, ఒకసుదీర్ఘ ఉత్తరం వ్రాశాడు. దాన్ని ఆయన తన "రాజకీయ నిబంధన"గా వర్ణించాడు. ఇక్కడ ఉత్తరంలోని కొన్ని అంశాలు ఇవ్వబడినయ్.

"దీనిలో నాస్వవిషయాన్ని గురించి పునర్విమర్శించుకొని, మీకు తెలియచేయ నిశ్చయించు కున్నాను. నా జీవితంలో అదృష్టకరమైన ఈచర్యతీసుకో వలసిందిగా నన్ను ప్రోత్సహిస్తున్న నిర్ణయాలను కూడా, ప్రస్ఫుటంగా వ్రాయదల్చుకున్నాను. మీ ఇనుపహస్తాల తాకిడినుంచి నేను కోలుకో గలననే. నమ్మకం, నాకేమాత్రం లేదు. కాబట్టి నేను రెండు

కోర్కెలు కోరుతున్నాను. అయితే రెండవకోర్క, ఈ ఉత్త రంలోని చివరభాగంలో తెలియచేయ బడింది. నాప్రథమ వాంఛ ఏమంటే, మీ ప్రభుత్వంలోని వస్తు భద్రశాలలో కడు జాగ్రత్తగా దీన్నిదాచి పెట్టండి. భవిష్యత్‌లో మిమ్మల్ని కార్యాలయంనుంచి త్రోసిరాజని,మీప్రభుత్వాన్ని ఆక్రమించు కునే, నాదేశీయులకు ఇది లభించగలదు. ఇది నాదేశీయుల కివ్వబడిన ఒకసందేశం. కాబట్టి నారాజకీయ నిబంధన...

"మీ విధానంలో చట్టవిరుద్ధత - అన్యాయాలు గోచ రిస్తున్నయ్. ఈవిధమైన నావిచిత్ర ప్రవర్తనకు ఆధారంగా, నామనసుకు సంజాయిషీ చెప్పిన ఒక విషయం వుంది. అదే ఏకారణాలు లేకుండా నామీదమీరు దుర్భరవిధానం అమలు జరుపటం!

"దాదాపు రెండు మాసాలకు పైబడి, పదేపదే నా మానసిక ద్వారం వద్ద, ఈ సందర్భంలో నేనేం చేయ్యాలి? అనే సమస్యపై, తర్జన భర్జన జరిగింది.

"నేను నా మార్గంలో ఏది సంభవించినా అంగీకరించి, పరిస్థితులకు లొంగి పోవాలనా ? లేక, నా మనసుకు పక్ష పాతం, అన్యాయం, చట్ట విరుద్ధం ! మొదలైనవి ప్రత్యక్షమైన పుడు, వాటిని వ్యతిరేకించాలనా ? పరిస్థితులకు లొంగి పోవ టమా? అదెన్నటికీ జరుగని పని, ఒక తప్పు చేసే దానికంటే దానికి లొంగి పోవటం ఒక ఘోరమైన నేరం. కాబట్టి నేను వ్యతిరేకించాల్సిందే!

"అయితే ఇన్నాళ్ళ బట్టి వ్యతిరేకత సాగుతూనేవుంది. వ్యతిరేకించటానికి వున్న మామూలు మార్గాలన్నీ ఇక ఖాళీ అయిపోయినయ్. సభా వేదికల నుంచీ, పత్రికలనుంచీ జరిపిన ఆందోళన, ప్రభుత్వం వద్దకు రాయబారాలు, అసెంబ్లీలోని బుకాయింపులు ; చట్ట నిబంధనావళి వ్యక్తీకరణ, వీటన్నింటి సమిష్టి ప్రయత్నాలు–ఇంతకు ముందే జరుగటం నిష్ప్రయోజనమైపోవటం సంభవించినయ్. ఇక ఒకేపద్ధతి మిగిలివుంది. ఒకఖైదీ చేతిలోని చిట్టచివరి ఆయుధం – ఆకలిసమ్మె, లేక వుపవాసం. ఈచర్యకు సంబంధించిన అనేక సమస్యల్ని పరీక్షించి, తద్వారా సంభవించబోయే లాభాన్ని నష్టాన్ని అతి జాగ్రత్తగా తర్కప్రకాశంలో చక్కగాచూచాను. నేను నిరంకుశ ప్రభుత్వాలు – నిరంకుశ అధికారులు, ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో చూపించిన ప్రవర్తనల్ని బట్టి; ప్రస్తుతానికి పొందే లాభం మృగ్యమని గ్రహించటంలో అణుమాత్రమైనా సందేహం లేదు. ప్రఖ్యాతములై – కీర్తివంతములై ప్రకాశిస్తున్న "టెరెన్స్‌మాక్స్విని" * "జతిన్‌దాస్"ల ఆదర్శ ఉదహారణలు, నామానసిక నేత్రంముందు తాండవ మాడుతున్నయ్. తప్పును అనుసరించి, గౌరవ భూయిష్టమని భ్రమపడుతున్న తప్పుడు పంథాతో వున్న ఒకవిధానం, కదలించ బడటానికి దానికి హృదయం అంటూ వుంటేగా?

---

* ఐర్లండ్‌లో బ్రిటీషుప్రభుత్వ ధోరణికి నిరసనగా ఉపవాసం జేసి మరణించిన దేశభక్తుడు.

"ప్రస్తుత పరిస్థితుల్లో జీవించటం నాకు దుర్భరం, నా మనసుకు భిన్నమైన చట్టవిరుద్ధత, న్యాయ విరుద్ధతలతో రాజీ పడి, బ్రతుకును దొర్లించేవిధానం సహించలేను. నేను ఈ మూల్యం చెల్లించేదానికంటే, నా జీవితాన్ని పణంగా అర్పించటమే మేలు. నేను జవాబుగా మీకు చెప్పేదేమిటంటే, నన్ను విడుదల చేయండి; లేకపోతే నాకు బ్రతుకు మీద ఆశలేదు. అయితే, నేను బ్రతుకుటమో మరణించుటమో తేల్చుకోవడం నా వంతు.

"ఈ భౌతిక ప్రపంచంలో ప్రతివస్తువూ గోచరిస్తుంది, గోచరించగలదు కూడ, అయితే, అభిప్రాయాలు – ఆశయాలు– కలలు మాత్రం కాదు. ఒక వ్యక్తి ఒక అభిప్రాయం కోసరం మరణించవచ్చు. కానీ అతని మరణానంతరం, ఆ ఆశయం కొన్ని వేల జీవితాల్లో ప్రతిబింబిస్తుంది. ఈ విధంగా పరిణామ చక్రాలు తిరుగుతుంటయ్. అంతేకాక, ఆశయాలు, కలలు, ఒక యుగంనుంచి మరో యుగంలోని జనసమూహంలోనికి, జొరబడుతుంటయ్. బాధపడకుండా త్యాగంచేయకుండా, ఈ ప్రపంచంలో ఏ ఆశయలక్ష్యమూ పరిపూర్తి కాలేదు.

"ఒకవ్యక్తి ఒక సిద్ధాంతంకోసరం, బ్రతికినా – చచ్చినా, ఆ అనుభవం కంటె అత్యున్నతమైన సంతోషం ఆనందం, ఇంక దేనిలోవుంది? తన అసంపూర్తి కార్యవిధానాన్ని, సమైక్యతా శక్తులతో, స్వాభావికశక్తికి సమ్మిళితపర్చి, దాన్ని భరించి మోసే విజ్ఞానంకంటే, ఒక మానవుడు అధిక సంతోషాన్ని

దేనివలన పొందగలడు? గిరులు-శిఖరాలు అధిగమించి ప్రపంచంలోని మారుమూలలకు, విశాలమైదానాలకు — సముద్రాలను ఈది—దేశదేశాలకు విస్తరించే తన సందేశ సుస్థిరత కంటే, ఒక ఆత్మ కోరదగిన అధిక బహుమతి యింకేముంది? ఒకవ్యక్తి హృదయపూర్వకంగా నమ్మిన ఒక సిద్ధాంత సాధనకు ఆత్మ బలిదానం చేయటంలో లభించిన తృప్తికంటే అధికమైన ఘనత ఇంక దేనిద్వారా కలుగుతుంది?

"బాధలు భరించి, త్యాగాలుచేసి పోగొట్టుకున్నవారెవ్వరూ లేరనేది మనకు ఋజువుపడింది. ఒకవేళ భౌతిక సంబంధమైన భౌతికవస్తువును పోగొట్టుకున్నట్లయితే, కీర్తిశేష జీవితానికి వారసుడై అతడు అంతకు రెట్టింపుగా లాభిస్తాడు."

"ఇదే జీవిత రహస్యం. ఒక వ్యక్తి మరణించవచ్చు. అయినా జాతి సజీవంగానే వుంటుంది. ఈ రోజు నేను మరణించవచ్చు. అయినా భారతమాత స్వతంత్రమై కీర్తివంతమై, సజీవంగానే వుంటుంది."

"నా సోదర దేశీయులకు ఒకమాట:— ఒక బానిసగా మనటం కంటే, హీనాతిహీనమైన బ్రతుకు మరొకటి లేదని మర్చిపోవద్దు. అన్యాయం-అక్రమాలతో సంధి పడేదానికంటే నేరం మరొకటి లేదనేవిషయం మర్చిపోవద్దు. శాశ్వతచట్టం గుర్తుపెట్టుకోండి. దాని విలువెంతైనప్పటికీ అసమత్వానికి విరుద్ధంగా జరిగే యుద్ధంలో పవిత్రత ఇమిడివుంది.

"ఈ నాటి ప్రభుత్వానికి ఒకమాట:— మీ అన్యాయానికి అనుగుణ్యంగా, మతద్వేషతపై నడిపే పిచ్చినడకకు స్వస్తిచెప్పండి. ఇప్పటికీ మీ విధానం మార్చుకునేందుకు కాలహరణం కాలేదు. మిమ్మల్ని మీరు సమర్థించుకుని మోసపోతున్నారు. బెంగాల్‌ను మరో సింధుగామాత్రం మార్చవద్దు.

"నేను ముగించాను. మీ నుంచి నేనుకోరే నా తుది ద్వితీయవాంఛ ఏమంటే, నా ప్రశాంత అంతిమ దశలో మీరు బలవంతమైన జోక్యం కల్పించుకోవద్దు. ఇదివరకు "టెరెన్స్ మాస్వినీ - జతిన్‌దాస్ - మహాత్మాగాంధీల" విషయంలో; చివరకు 1926లో మాకు సంబంధించిన స్వవిషయంలో— మా ఉపవాసాల సందర్భంలో — ప్రజాప్రభుత్వం జోక్యం కల్పించుకో గూడదని నిర్ణయించుకుంది. అదేవిధంగా, ఈ సారి కూడా ప్రవర్తిస్తుందని భావిస్తాను. కాక బలవంతంగా నాకు తిండి పెట్టటానికి ప్రయత్నిస్తే, మరోవిధంగా పరిస్థితులు, అపాయానికి, నిరుత్సాహానికి దోహదమిచ్చినప్పటికీ నా శక్తినంతా వినియోగించి పోరాడుతాను. 1940 నవంబరు 29వ తేదీనుంచి నా నిరాహారదీక్ష ప్రారంభిస్తాను."

ఇది తన సిద్ధాంతాల సాధనకోసరం జీవితాన్ని పణంగా అర్పించ దల్చుకున్న మహా దేశభక్తునికి సంబంధించిన వాణి కానీ, కేవలం కుర్చీలు ఇరుగ్రదొక్కే మానశిక స్థిరత్వంలేని రాజకీయవాది కొట్టే గప్పాలు మాత్రం కావని బెంగాల్ ప్రభుత్వానికి బాగా తెల్సు. కొంతకాలం వరకూ ప్రభుత్వం నిశ్శ

బ్దంగావుంది. అయితే హెచ్చరిక కార్యరూపేణ ఆచరణకు రావటం తటస్థించి నప్పుడు, అధికారులు కలకత్తా ప్రెసిడెన్సీ మాజిస్ట్రేట్ కోర్టులో బోస్‌పైవున్న రెండు నేరాలను తిరిగి ఆయన ఆరోగ్యం కోలుకునేవరకు అమల్లో పెట్టివుంచి ఆయన స్వగృహంలో వైద్యసహాయతపొందే నిమిత్తం పోలీసు బందోబస్తుతో తాత్కాలిక విడుదలకు ఆమోదించి, బోస్‌ను విడుదలచేసి ఇంటిచుట్టూ పోలీస్ పహారా వుంచింది.

# అదృశ్యంలో వివాహం

**అపోహలు - అసలు రహస్యం:-** ఈసారి విడుదలానంతరం శ్రీయుత బోస్, మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ ల వంటి ఏకొద్దిమంది తోటో కొంత వ్యవహారరీత్యా వర్తించినా మొత్తంమీద పూర్తి ప్రశాంతంగా రోజులు గడిపాడనే చెప్పుకోవాలి. మతసంబంధమైన పూజా పునస్కారాలు చేసుకుంటూ, ఎవరినీచూడకుండా కనీసం తనకుటుంబ సభ్యులనైనా పలుకరించకుండా తన గదిలోనే నిశ్శబ్దంగా కాలం గడిపాడు. ఆయన ఈమారు మౌనము వహించాడు. అనేక రోజుల పర్యంతరం గాఢమైన భక్తిసాగరంలో, ఆత్మసంశోధనా కార్యక్రమంలో నిమగ్నుడై పండ్లరసం - పాలు మాత్రమే ఆహారంగా - అదృశ్యమయ్యే ఘడియవరకూ - పుచ్చుకుంటూ ఒక మహాఋషివలె జీవనంగడిపాడు. ఆయనకు తెల్సిన అనేక మంది ఈవీరుడు గ్రహించిన నూతనపంథాకు ఆశ్చర్యపోయారు.

**1941** జనవరి 26వ తేదీన శ్రీయుత బోస్ ఆయన స్వగృహంనుంచి అదృశ్యమైనట్లు ఆకస్మికవార్త చేరింది. దాదాపు ఒక సంవత్సరంపాటు ఆయన అదృశ్యగాధ ప్రభుత్వానికివలె మన ప్రజానీకానికి కూడా అగమ్యగోచరంగానే వుంది. అయితే ఈమారు సుబాస్‌బోస్ తనుతాను బుద్ధిపూర్వకంగా బహిష్కరించుకొని దేశాంతరుడై పోయాడు.

1941 జనవరి 26వ తేదీన ఆయన వ్యాధి పడకనుంచి అదృశ్యమైనట్లు ప్రకటించబడినప్పుడు, శ్రీ అరవింద ఘోష్ మాదిరి రాజకీయాలలో జనించిన నిస్పృహ ఆయనపై బాగ పనిచేసిందనీ; అందుకని ఆయన అనుకోకుండా ఒక సన్యాసి జీవితానికి అంకితమై పోయివుంటాడనీ కొన్ని ప్రాంతాల్లో భావించటం జరిగింది. మరికొంతమంది ఆయన ఇతర దేశాలకు ముఖ్యంగా జపాన్‌కు సురక్షితంగా వెళ్ళిపోయి వుంటాడనీ భావించారు. ఇంకొంతమంది హిమాలయ పర్వతాలకు పోయి వుండవచ్చునని ఊహించారు. బాల్యంలో బామరానుగూర్చి కథలు చెప్పుకున్నట్లు ప్రజలు కథలు చెప్పుకున్నారు. అయితే మనకు ఆ సంగతేమిటో యిప్పుడు ఉత్తమచంద్ కథనం ప్రకారం "నేతాజీ అంతర్ధానగాథ" వల్ల తెలిసిపోయింది.

కానీ, అప్పుడు, కామన్సు సభలో స్టేట్ కౌన్సిల్‌లో ప్రభుత్వ మాటకారులు మొట్టమొదట సుభాస్ బోస్ బెర్లిన్‌లో కానీ, రోమ్‌లో కానీ వుండవచ్చునని ప్రకటించారు. కానీ ప్రజలు వాటిని నమ్మలేదు. ఇండియా ప్రభుత్వ ఆంతరంగిక శాఖా కారదర్శి ఎరిక్ కానన్ చేసిన ప్రకటన ద్వారా మొదట ఈవర్తమానం ప్రభుత్వానికి చేరింది. అంతేకాకుండా కలకత్తాలో పంచిపెట్టబడిన కొన్ని కరపత్రాల ఆధారంతో "రోమ్-బెర్లిన్-టోకియో" రేడియోల ప్రసారాల ఆధారంతో ఆప్రకటన చేయబడింది.

కాలంగడిచే కొలది ఆ సమస్యమీద అసంఖ్యాకంగా— ప్రభుత్వభావాన్ని సమర్థిస్తూ వ్యాసాలు బయులుదేరినయ్.

బ్రిటీష్‌వార్తా తాబేదార్లు మంచి ఉత్సాహంగా గోరంతల్ని కొండంతలుగ చేశారు. కలకత్తా ఆంగ్లోఇండియన్ దినపత్రికైన "దిస్టేట్స్‌మన్" ఆయన భారత జాతీయకాంగ్రెస్ అధ్యక్షుడుగా వున్నపుడే ఫాసిస్టు దేశాలతో సంబంధాలు పెట్టుకొని వున్నాడనీ, భారతదేశంలో పంచమాంగదళం సృష్టించడానికి నియంతలు పంపించేడబ్బు ఆయనకు చేసుతూవుండేదనీ చిత్తాఖానీ చిత్తమొచ్చినట్లు వ్రాసింది. మొత్తంమీద మహాత్మాగాంధీ సుభాస్ బాబులమధ్య అభిప్రాయ భేదాలు ఆనాటి కానాటికి అభివృద్ధి కావటానికి కేవలం "ఫెడరేషన్" సమస్యేకాదనీ, బెంగాల్ ప్రభుత్వ మంత్రివర్గంలోని ఒక మంత్రి విదేశాలనుంచి ఆయనకు వచ్చిన ప్రత్యుత్తరాలను సెన్సార్ చేసి ఆ తదుపరి, దేశంలో మరెవ్వరికి తెలుపకుండా వాటిని మహాత్మాగాంధీకి చూపించి సందువలనేనని కూడా ఒక వందతివున్నది.

ఇలా రూయిటర్ సంస్థమొదలు ఇండియాలోని చిన్న చిన్న బ్రిటీషువార్తా సంస్థలవరకూ, సుభాస్‌బోస్ అక్షరాజ్యాలతో మైత్రి ఒడంబడిక చేసుకున్నాడనీ, కాబట్టి ఆయన రోమ్‌లో కానీ, బెర్లిన్‌లో కానీ, వుండవచ్చునని ప్రకటనలు చేసినయ్. 1942 మార్చి 28వ తేదీన "లైయన్స్ రేడియో టోకియోవార్తా భోగట్టానుబట్టి సుభాస్ చంద్రబోస్ జపాన్ సముద్రతీరంలో మరణించాడు" అని ప్రకటించినప్పుడు దేశం ఇంకా ఆ విషయమై తర్కిస్తూనే ఉన్నది. ఆ వార్తాసంస్థ ఈ క్రిందివిధంగా కూడా ప్రకటించింది. "టోకియో వార్తనుబట్టి — 'స్వతంత్ర భారత కాంగ్రెస్' సమావేశానికి హాజరుకావ

టూనికి విమానంలో ప్రయాణంచేస్తూ, జపాన్ సముద్రతీరంలో ప్రమాదవశాత్తు ఎగురుతున్న విమానం బ్రద్దలుకావటం వలన శ్రీ సుభాస్‌చంద్రబోస్ విగత జీవుడయ్యాడు. ఆయనతోపాటు ఆయన సహచరులు, ఇంకా అనేకమంది భారతీయులు కూడా వున్నారు."

అయితే తక్షణమే ఈవార్త ఖండించబడింది. సుభాస్ చంద్రబోస్ చనిపోలేదు. సురక్షితంగా వున్నాడని తేలిపోయింది. "బొంబే క్రానికల్" పత్రిక లండన్ రచయిత సుభాస్ బోస్ బెర్లిన్‌లో వున్నాడనీ, పత్రికా రచయితలకు జర్మనీ నియంత ఆయన్ను పరిచయంచేస్తూ "మహా ఘనతవహించిన భారత నాయకుడు" అన్న సంబోధనా నామంతో అభినందించాడనీ, ఆ పరాయిదేశంలో ఆయనస్థానం అంతర్జాతీయ రాయబార త్వమని తెలియజేశాడు. మాజీభారత జాతీయకాంగ్రెస్ అధ్యక్షుడైన ఈయనపై బయలుదేరిన వివిధ అపోహాలబట్టి సుభాస్ చంద్రబోస్ రోమ్‌లోకానీ, బెర్లిన్ - టోకియోల్లోకానీ ఉండి వుంటాడనే నమ్మకం ఏర్పడింది. బ్రిటీష్ భారత పత్రికల్లో బోస్ అక్షరాజ్యాలతో మైత్రిచేసుకుని తాను ఫాసిస్టు రాజ్యాలతో చేసుకున్న సంధిపై నిజంగా సంతకం కూడా పెట్టాడనీ ఇలావార్తలు కనుపిస్తూనే వున్నాయ్.

ఆయన ఆవిధంగా చేసివుంటే అది ఎంతవరకు సమర్థనీయం ?

1940 డిసెంబరు మాసంలో నిరశన వ్రతంద్వారా కారాగార విముక్తుడైన అనంతరం ఒకసారి దేశపరిస్థితుల్ని

సింహావలోకనచేసిచూస్తే; రాజకీయపార్టీల పంథాలు, జాతీయ నాయకుల రాజీప్రవర్తన నేతాజీకి నచ్చలేదు. మనలోమనం ఇంకాదీనిని గురించి తగాయిదా ఆడుతూ లభించిన ఈ అమూల్య అవకాశం జారవిడవటం కంటే అవ్యాక్తం మరొకటి లేదని నిశ్చయించుకున్నాడు.

ఇంతటి పెద్ద బ్రిటీషు సామ్రాజ్యమే నేడు అశక్తతతో తనరక్షణకు అనుక్షణం అమెరికా సహాయం కాంక్షించు చున్నపుడు, మనవంటి బానిసదేశం తన సహజ స్వాతంత్ర్యం పొందటానికి మరో స్వతంత్రదేశ సహాయం ఎందుకు కోర గూడదు? అనే ధర్మసందేహం కలిగింది బోస్‌బాబుకు. ఈ సమయంలో మితవాదుల మాట అటువుంచి అతివాదులైన కమ్యూనిష్టు - సోషలిష్టు, రాడికల్ మొదలైనవారు కూడా ప్రతికూలంగా వున్నందువలన దేశంలోనే అదిసాధ్యం కాలేదు. మన స్వాతంత్ర్య సముపార్జనకు ఈయుద్ధం చక్కని అవకాశమని భావించి దానికి తగిన సాధనసంపత్తి పరదేశాల్లోనే సాధించా లని భావపడినందున, బోస్ మారువేషాలతో దేశాంతరుడు కావలసి వచ్చింది.

దేశం కోసరం ప్రజలకోసరం, సర్వసౌఖ్యాలు తృణ ప్రాయంగా విడిచిపుచ్చి, కాబూలు వాని వేషం ధరించి రాత్రనక-పగలనక, కష్టమనక-నష్టమనక, ప్రాణాలకు తెగించి. కాలినడకతో, మారు వేషాలతో, పెట్టని గోడవలె ఉత్తరాన వున్న ఆ బ్రహ్మాండమైన హిమవత్పర్వతాల్లోని అడవుల్ని దాటి, ఒడిదుడుకులతో ఉరకలు పెడుతున్న నదులు సెల

పళ్ళను దాటి, క్రూర మృగాల బారి నుండి తప్పించుకుని ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి కాళ్ళూ చేతులు కొంగర్లు పోతున్నా లెక్క-చేయక, అనుక్షణం ప్రతి బంధకం కల్పిస్తున్న సి. ఐ. డి. లను ముప్పతిప్పలు బెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తూ సురక్షితంగా వెళ్లిపోయాడు వీర సుబాస్. దేశ మంతా ఒక్క-మారు విస్తుపోయింది.

ఈ సమయంలో క్రిప్సు బూటక రాయబార నాటకం ప్రారంభమైంది. బ్రిటీషు ప్రభుత్వ ధోరణి పూర్తిగా అర్ధమై పోయింది. మహాత్మా గాంధీ హరిజన పత్రిక ద్వారా బ్రిటీషు ప్రభుత్వాన్ని జడిపించ ప్రారంభించాడు. యుద్ధ వ్యతిరేక నినాదం ప్రజ్వరిల్లింది. నైత్రాయి తనకున్న ప్రత్యేకాధి కారాన్ని పురస్క-రించుకుని 1942 జూన్ 22 తేదీని "ఫార్వర్డ్ బ్లాక్" చట్ట విరుద్ధమైన సంస్థగా ప్రకటిస్తూ ఒక ప్రత్యేక ఉత్తర్వు జారీచేశాడు. మహాత్మ గాంధీజీకూడా "క్విట్ ఇండియా" నినాదం యిచ్చాడు.

సామ్రాజ్యవాద దేశాలమధ్య యుద్ధం రావటం సంభ విస్తే, వాటిక్రిందవున్న వలస దేశాల్లోని విప్లవం, ఆయా దేశ స్వాతంత్ర్యాలకు సులువైన మార్గం" అనేది కారల్ మార్క్సు ప్రవచనం. అయినా, విప్లవం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి అని చేతులెత్తి, గుప్పెళ్ళుబట్టి, బల్లలుగుద్ది కేకలు బొబ్బలు పెట్టిన కమ్యూనిష్టులు, మార్క్సు అనుచరులం దేశ భక్తులం, వీరులం, ధీరులం అని సభామంటపముల మీద, అశేష ప్రజానీకం ఎదుట ఎలుగెత్తి, కంఠీరస్వరంతో గప్పాలు

కొట్టిన కమ్యూనిస్టులు, ఈ యుద్ధం లోనికి రష్యాదిగగానే దీన్ని ప్రజాయుద్ధంగా చిత్రించటంతో బ్రిటీషు వారికి సాయ శక్తుల సహాయపడతామని హామీయిచ్చుటంతో వారిమీద ఇంతకు ముందున్న నిషేధంరద్దయింది.

దేశాన్నుంచి బోసుకు ఎలాంటి సహాయం లభించక పోయినా తానుచలించలేదు. తిరిగి అనేక బాధలకు గురౌతూ జలాంతర్గామిలో జర్మనీనుంచి జపాన్‌వరకు ప్రయాణంచేసి టోకియో సురక్షితంగా చేరుకున్నాడు. మాతృదేశ స్వతంత్రం కోసర పోరాడిన నేరానికి బ్రిటీషు తుపాకుల మధ్యనుంచి తప్పించుకు పోయిన, రాష్ విహారీఘోష్ "ఇండియన్ ఇండిపెండెన్స్‌లీగ్" ద్వారా నేతాజీని ఆహ్వానించి తన బలాన్ని అప్ప గించాడు. వెంటనే గౌరవానికి భిన్నంగాని విధంగా నేతాజీ తన ధీశక్తిని – మేధాశక్తిని ఉపయోగించి అప్పటికే బంధీలై వున్న భారతీయ సైనికుల్ని విడుదల చేయించి వారిలో స్వాతంత్ర్య పిపాశ – దీక్షకలిగించి అజాద్ హింద్‌ఫౌజును తన నాయకత్వం క్రింద బలపరిచాడు. తదుపరి సామాన్య భారత ప్రజానీకంనుంచి స్త్రీలు – బాలురు కూడా ముందుకువచ్చి సైనికులుగా తయారైనారు.

సైనికతత్వం నేతాజీలో ఈనాడు ప్రత్యేకంగా కలిగింది కాదు. బెంగాల్‌లో ఆయన ప్రభుత్వమిచ్చిన సైనికశిక్షణలో ప్రత్యేకతను సాధించుకున్నాడు. ఆతరువాత వేలాది బెంగాల్ వాలంటీర్ల నాయకుడుగా వ్యవహరించాడు. గాంధీధృక్పధం కలవాళ్ళు ఆయన్ను విమర్శిస్తారు. ఈ హింసాహింసల విష

యంలో ఈ రెండు అద్భుతవ్యక్తిత్వాలు పరస్పర విరుద్ధభావాలు కలిగి వున్నారు. వీరివ్యక్తిత్వాల్ని గురించి "న్యూస్‌రివ్యూ" పత్రిక ఇచ్చిన అభిప్రాయాన్ని చూడండి.

భారతదేశ భవిష్యత్‌పై పూర్తి వామపక్ష భావాలు కలిగివున్న చైతన్య ప్రపూరితుడైన సుభాస్ చంద్రబోస్‌కు సాధుమూర్తి అయిన మహాత్మాగాంధీ సున్నిత విధానానికి భిన్నమైన ఒక కార్యక్రమంవుంది.

వాటిప్రధాన సూత్రావళి;—

(1) బ్రిటన్‌నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరు తున్నాడు సుభాస్‌బోస్.
మహాత్మాగాంధీ సంధికెప్పుడూ సిద్ధం.

(2) జాతీయోద్యమాన్ని నిరంతరాయంగా సాగించటం. గాంధీజీదీన్ని అప్పుడప్పుడు వాయిదా వేయ గోరుతాడు.

(3) అభ్యుదయకరమైన పారిశ్రామిక విధానం. గాంధీజీకి:— మద్యపాననిషేధం, చేతి పరిశ్రమల్ని పెంపొందించటం ప్రీతికరమైన పనులు.

కాబట్టి ఇప్పుడు పాఠకులు ఉభయనాయకుల మధ్య కొన్ని ప్రాథమికమైన ప్రత్యేక భేదాలున్నవని ఒక నిర్ణయం చేసుకోగల స్థితిలో వుంటారను కుంటాను.

మొత్తంమీద అధ్యక్షస్థానం నుంచి అనుకోని విధంగా బోస్‌ను దింపివేసిన, త్రిపురీలోని పండితపంత్ తీర్మానానికి బలం చేకూర్చటానికి—ఈ బడాబడా తటస్థవాదులు గుడారం

గుడారం తిరిగి ప్రచారం చేసినవిషయం క్షణికంగా మర్చిపోదాం. అదేమాదరి ప్రఖ్యాతమైన త్రిపురీ సమావేశానంతరం గాంధీగారి దయాగహితమైన, సమైక్యతా రహితమైన కరకు విభేదవిధానం, బోస్ క్రింద ఏర్పడినచీలికను బలపర్చటానికి, అమర్యాదగా మారోమారు ప్రయోగించి నప్పటికీ తుదిసారి ఉభయ నాయకులమధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల్ని బట్టి, ప్రతివిషయంలో—తుట్టతుదకు—శ్రీయుత బోస్ తన ప్రత్యేకతను కూడా వదలుకొని, ఆయన దాక్షిణ్యంపై ఆసమస్యను వదలివేసిన సందర్భంలో కూడా మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఒకటే ప్రభల హేతువని, నిష్పాక్షికంగా గ్రహించిన ఏపరిశీలకునికైనా గోచరిస్తుందే: ఆవిషయం కూడా క్షణికంగా మర్చిపోదాం.

అయితే జాతీయచరిత్రలో రాజకీయ బోటు క్లిష్టదశలో వున్నపుడు ఆయన అదృశ్యం జాతికి ఒక గొప్ప నష్టమని హృదయావేదనతో ప్రతిభారతీయుడూ అంగీకరించినా, అంగీకరించకపోయినా, ఒకగొప్ప వ్యక్తిత్వం కలిగిన—ఆయన అదృశ్యమైన హేతువంతా గాంధీజీ – ఆయన అనుచరులపై అధారపడివుంది. కాంగ్రెస్‌లో ఎదురులేని పెత్తనం సాధించాలనే పిచ్చభావం – భారతస్వాతంత్ర్య పోరాటంలో విపరీత ధైర్యం కలిగిన ఒక ఉన్నత వీరుని సహకారానికి పూర్తిగా దూరం చేసిందే – ఆవిషయం మాత్రం మర్చిపోలేం.

**బోస్ మనోభావం:-** సుభాస్ బోస్ తన జీవితమంతటా కూడ అచంచలమైన ఒక శక్తి ప్రపూరితుడు.

ఈనాటి సోషలిష్టుల మాదిరి కాక మానవత్వంపై, దేశంపై తన హృదయాన్ని ప్రేమపూరితం చేసుకున్న మతబద్ధుడైన వ్యక్తి. దేశసమస్య కోసరం అవసరమనుకుంటే భగవంతునిలో విశ్వాస ముంచి "చాందీకి" ( అగ్నికి ) జీవితాన్ని అర్పితంచేసి, నిప్పు మంటలోనికైనా పరుగులు తీయగలడు.

"అక్రమంతోటి అన్యాయంతోటి ఒడంబడిక చేసుకోవటం నేరాలన్నింటి లోకి గొప్ప నేరం"; అంతేకాక, బానిస బ్రతుకులో జీవించటం ఒక గొప్ప పాపమని ఆయన అభిప్రాయం. అసలైన అర్థంలో చెప్పుకోవాలంటే ఆయన సాధుజీవితం గడిపాడని చెప్పవచ్చు. అయితే మాత్రం తను చదువుకునే రోజుల్లో సన్యాసాహంలో హిమాలయాల నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచీ, అడవులకు - గుహలకు విరాగియై ప్రయాణాల్ని స్వీకరించే ఉద్దేశ్యాల్ని ఆయన నిరంతరం నిరశిస్తూనే వున్నాడు. ముఖ్యంగా నిందారహితమైన సప్తవ్యసనాలనుంచి వేరుచేసిన స్వతిశిఖున ప్రవర్తన ఆయనలో మూర్తీభవించివుంది.

ఆయన తుదకు పొగకూడా త్రాగడు. దేశంపైన మానవత్వంపైన ఆయనకున్న అకుంఠిత విశ్వాసం, ఇతర భావనలకు ఆయన ఆహుతి కాకుండా తప్పించింది. ఆయన యువకత్వంలో చేసిన త్యాగాలన్నింటిలోనికి దేశంకోసరం చేసిన త్యాగాలు అత్యుత్తమమైనవి. ఆయన తన 45 సం॥ జీవితమంతా బ్రహ్మచారిగానే వున్నాడు. ఎప్పుడైనా మిత్రులు బంధువులు ఆయన వివాహ ప్రసక్తి తీసుకువస్తే అవిముయుంచుకుంట ఆలోచించేందుకు

తనకు వ్యవధిలేదని చెప్పేవాడు. కానీ తన జర్మనీ ప్రయాణ సందర్భంలో "సెనార్ ఆర్లాండ్ మజోటా"అనే మారుపేరుతో తనకు యింతకు ముందే పరిచితురాలైన ఎమిల్లీ షెంకిల్ (ప్రస్తుతం 43 సం॥) అనే పేరుగలిగిన ఒక ఆస్ట్రియా, వియన్నా యువతిని పిలిపించుకుని జర్మనీలో వివాహం చేసుకుని జీవితంలో సాంఘిక వ్యవస్థకు అసంపూర్తిగా ఆ వ్యక్తినుంచి మిగిలిపోయిన కార్యభారాన్ని నెరవేర్చాడు. వారిద్దరికీ "ఎనీటా" అనే కుమార్తె పుట్టింది. ఆమె వయసు ఇప్పుడు 13 సంవత్సరాలు. నేతాజీ ఆ తల్లీ కూతుళ్ళమీంద ఎంతో విశ్వాసముంచాడు. తను అసంపూర్తిగా వదలివేసిన కార్యక్రమాన్ని వారు ముందుకు తీసుకుపోగలరనే ఆశాభావాల్ని తన అన్న శరత్ బోస్‌కు వ్రాసిన వీలునామా లేఖలో ఉదహరించాడు.

"శ్రీమతి ఎమిలీ షెంకిల్ అనే ఆమెను నేను ఇక్కడ వివాహం చేసుకున్నాను. మా ఇరువురికీ ఒక కుమార్తె కలిగింది. నాయందు నీవు కలిగివున్న ప్రేమాదరాభిమానాలను నా తదనంతరం నాభార్య కుమార్తెలమీంద కనుపరచవలసిందిగా కోరుచున్నాను. నేను అసంపూర్తిగా వదలివేసిన కార్యకలాపాలను నాభార్య – నాకుమార్తె విజయవంతంగా పూర్తిచేయగలరని నేను ఆశిస్తున్నాను." 1943 ఫిబ్రవరి 18.

నిరుత్సాహ నిస్పృహాలతో కార్యరంగంనుంచి నిష్క్రమించటం ఆయన ఏనాటికీ ఎరుగనిది. కార్యరంగంలోనికి దుమికి వెన్నుచూపి పరారయ్యేబదులు తన ప్రతి అవయం అణువణువులుగా ఛేదించబడేంతవరకూ నిలబడటానికే ఆయన

వాంఛిస్తాడు. ఆయన దేశగౌరవ మర్యాదలకు తగినట్లుగా తన స్వాభిప్రాయంతో, సునిశ్చయంతో అద్భుతంగా, ఒంటరిగా నైనా పోరాడగలిగిన ప్రచండవీరుడు.

ఆయన ఒక ఉన్నత కుటుంబంలో ఉద్భవించినా ఒక దృఢ నిశ్చయం కలిగిన ఉత్సాహ పూరితుడైన దక్షతను పెంపొందించుకున్నాడు. సంస్థయొక్క నిర్మాణాన్ని నడవడికల్ని సమర్థతగా కార్యరూపేణ నడిపేశక్తి బహుకరించ బడిన ఒక రాజకీయవేత్త. అంతేకాదు, కష్టపడి పనిచేయటంలో తిరుగు లేని సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాడు. ఆయన కేవలం భావనాపరుడే కాదు; తెలివి తేటల్లో రాజ్యాంగ వేత్తల్ని సహితం మరిపించ కలిగిన చురుకైనవేత్త.

**అద్భుత వ్యక్తిత్వం:—** ఈ గాథని పరిసమాప్తి చేయబోయేముందు, ఈ అద్భుత వ్యక్తిత్వం గురించి మరికొంత చెప్పవలసి వుంది.

ఎప్పుడైనా ఒకప్పుడు మహాత్మాగాంధీ అడుగులకు మడుగులొత్తే ఏ అసలైన కాంగ్రెస్ నాయకుడైనా దీన్ని గమ నించటం బహుకష్టం. సబర్మతీ పూజ్యనీయుడు అఖిలభారత కాంగ్రెస్ నాయకులపైన విజయవంతంగా తన వ్యక్తిత్వాన్ని ప్రయోగించగలిగాడు కానీ బోస్ విషయంలో మాత్రం, ఆయన ఏనాడూ గాంధేయతకు పూర్తిగా తల ఒగ్గ లేదనీ గాంధేయతలోని అనేక విషయాల్ని సర్వవిధాలా వ్యతిరేకిస్తూ ఒక నిప్పుకొరివి వంటివాడైనా బోస్ గాంధేయతను ఆమో దించినంతవరకూ అక్షరాల ఆచరణలో పెట్టి చూపించాడు.

ఈ శతాబ్దపు మూడో దశాబ్దంలో ఆయన యువకుడుగా వున్నపుడే, రాజకీయాల్లో తన మార్గాన్ని అన్వేషిస్తున్నపుడు, ఆయన్ను సి. ఆర్. దాస్ వ్యక్తిత్వం ఆకర్షించింది, కానీ, మహాత్మాగాంధీ వ్యక్తిత్వం కాదు. సి. ఆర్. దాస్ బ్రతికి వున్నంతకాలం, సుభాస్‌బోస్ ఆయనకు అతి సమర్థుడైన సహకారే కాదు, స్వరాజ్య వాదాన్ని అమితంగా బెంగాల్‌లో బలపర్చినవాడుకూడా. ఆయన మరణించినప్పుడు ఆ రాష్ట్రానికి బోస్ రాజకీయ వారసుడుగా ఎన్నుకో బడ్డాడు.

సుబాస్‌బోస్ భారత జాతీయకాంగ్రెస్ రాజకీయాలలో ప్రవేశించి అసలైనపాత్ర తీసుకున్న సరైన తేదీ 1921 సంవత్సరమని ఎవరైనా చెప్తారు. కానీ ఆయన అసలు రాజకీయ జీవిత చరిత్ర 1927 లో మాండలే జైలు విడుదలానంతరం నుంచి ప్రారంభమౌతుంది. దేశబంధు మరణానంతరం, నిస్పృహా పూరితులైన బెంగాల్ ప్రజానీకం, దేశబంధు విధానానికి దృఢమైన ప్రాతినిధ్యం వహించినందుకు తమను నడిపించమని వాంఛించటం నిస్సందేహంగా హర్షనీయం. పరిపూర్తి స్వతంత్ర భావాలలో ఋజువర్తనుడైన రాజజ్ఞుడుగా తన రాజకీయ జీవితంలో చూపించుకున్నాడు. ఆయనయందు దేశబంధులోవున్న విశేషాలలో అధికభాగం మూర్తీభవించి వున్నయ్.

వయసులో చిన్నవాడైనా, సాధారణంగా ప్రజ్ఞావంతులలో అధిక సంఖ్యాకులు చూపే బలీయమైన వ్యతిరేకతకు ధైర్యంగా తనస్వాభిప్రాయాలతో పోటీకి నిలబడేవారిలో ఆయన

వరకు ఆయనకు ఒక మంచిస్థానంవుంది. అఖండ ధైర్యస్థైర్యాలు కలిగిన లోకమాన్య బాలగంగాధరతిలక్, లాలాలజపతిరాయ్, పండితమోతీలాల్ నెహ్రూ, దేశబంధుచిత్తరంజన్‌దాస్‌లవంటి జాతీయ నాయకుల వరువడిలో బోస్ పోకడచూసడం గమనార్హం. ఆయన జీవితమంతా ఒక పోటీదారుడుగా, గాంధీజీని విమర్శించే వారిలో ఘటికుడుగా ప్రవర్తించాడు. అయితే గాంధీజీని ఎప్పుడూ పూజ్య "పిత బాపూజీ" అనే సంబోధించే వాడు. గాంధీజీ ఆయన్ను చూచి ఎంత హర్షిస్తుండేవాడో అంత భయపడుతూకూడ వుండేవాడు.

కాంగ్రెస్ రాజకీయాల్లో ఏకారణంచేతనైనా మహాత్మా మనసుకు కంటక ప్రాయమైన వ్యక్తి వున్నట్లయితే, ఆయా వ్యక్తిత్వాలకు ఎదురు తిరుగటానికి స్తోమత లేకుండా లేక ఆ ఎత్తు గడల్ని అర్థం కాకుండా ఒక క్రమపద్ధతిలో వారి కాంగ్రెస్ పదవుల్నుంచి ఈడ్చివేయబడే సత్యాన్ని ఎవరూ మభ్య పెట్టలేరు. బోస్ విషయం మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం.

ఆయన చేసిన ఎడతెగని త్యాగాలు, అనుభవించిన బాధల భోగట్టా ఆయనలోని రాజకీయశక్తి, ప్రత్యేక ప్రతిభలు, సాహస కృత్యాలు, కళంకరహితమైన పవిత్ర జీవితం, దేశస్వాతంత్ర్యం కోసరం అకుంఠిత దీక్ష, స్వాతంత్ర్య సమరంలో నెరపిన నిరంతర-విధానాలు ఇవన్నీ కలసి పూర్తి మిత వాద వర్గపు సుసంఘటిత పలుకుబడికి కానీ, గొప్ప మహాత్ముని

శక్తికి కానీ గ్రహణాత్మకం కాక—ఒక ఉన్నత స్థానం సంపాదించే విషయంలో ఆయనకు అమితంగా తోడ్పడినయ్.

ఈ అద్భుతవ్యక్తిత్వాన్ని స్మరించుకున్నపుడు ఒళ్ళు పులకరిస్తుంది. కారణం భారతదేశంలో ఒక శతాబ్దం పర్యంతరం రాజకీయ వీరుల సాహసోపేతమైన చర్యల్ని ఇతరులు చెబుతుంటే విని ఆశ్చర్యపోగలిగారే కానీ వారిని కండ్లతో చూడలేక పోయారు. అంతేకాదు, అలెగ్జాండర్, నెపోలియన్, పురుషోత్తమ్, పృధ్వీరాజ్, రాణాప్రతాప్, శివాజీ, గారిబాల్డీ, లెనిన్, పాషా, తాంతియాతోపె మొదలైన విప్లవ వీరుల వరువడి కలిగిన వ్యక్తిని ఏనాటికైనా మన కండ్లతో చూడగలమా అనే సందేహంతోనే వున్నది మొన్న మొన్నటివరకూ యువకలోకం.

గత యుద్ధ సమయంలో ఎన్నో రాత్రుళ్ళు, ఎన్నో పగళ్ళు బ్రిటీష్ అమెరికావారితో పోరాడి, ఎంతో మందిని ఢిల్లీకివెళ్ళే బాటకు బలియిచ్చి, బ్రహ్మాండమైన కొండల్ని—అడవుల్ని నదుల్ని దాటి ఎత్తుకు ఎదురెత్తులు వేస్తున్న బ్రిటీష్ వ్యూహాల్ని ఛేదించుకుని ఎంతో ఆతురతతో సంతోషంతో మాతృదేశంలో కాలుపెట్టి పవిత్ర భరతభూమిలో ప్రవేశించి మాతృదేవతకు ప్రణమిల్లిన వీరసైన్యాన్ని సృష్టించిన ఆ ఘనత మహాభారతీయ నాయకునికిలేదు.

ఎప్పుడూ కూడా ముందుకు నడువమని హెచ్చరించిన నేతాజీ పరిస్థితుల్ని తిలకించి తుదకు అపజయం తప్పదని

గ్రహించి ఈ స్థితిలో ఇక ఒకరి ప్రాణంకూడా బలియివ్వటానికి యిష్టపడక ఆత్మరక్షణ చేసుకుంటూ సైన్యాల్ని వెనక్కు రమ్మని ఉత్తర్వుచేస్తే ఎంతటి దీక్షకు-ప్రమాణశక్తికి వారు కట్టుబడేట్లు చేశాడో, ఆ సందర్భంలో జరిగిన విచిత్రకథనం వలన వ్యక్తమౌతుందే ఆ ఘనతకూడా ఆ వ్యక్తిత్వానిదే అనటంలో ఆశ్చర్యంలేదు.

నేతాజీ ఇలా కానని దేశాల్లోకాలు బెట్టి మొఖమెరుగని చోట మాట చెలాయించి సామ్రాజ్యాలకు సామ్రాజ్యాలనే దిగమింగగల రాజ్యాలతో స్నేహంచేసి, సహకారం సంపాదించి స్వతంత్రభారత సైన్యాన్ని నిర్మించాడు. తానొక మాయల మారిశక్తి పరుడుకాడు. ఒక రాజ్య తృష్ణ కలిగిన రాజుకాడు. ఆయా దేశీయుల రక్తస్పర్శకుడుకాడు. అక్కడెక్కడా జానెడు భూమికాని బెత్తెడుయిల్లుకానీలేవు. చివరకు చేతిలో చిల్లిగవ్వకూడా లేని సామాన్యుడు.

కానీ రాజులు, మహారాజులు, మంత్రులు, మహామంత్రులు, సామాన్యులు, నాయకులు, నాజీలు-ఫాసిస్టులు, బానిస దేశాలు, స్వతంత్రదేశాలు, మన భారత సింహానికి దాసోహమనక తప్పలేదు. నేతాజీ వద్ద ఆనాటికి ఉన్నదంతా అఖండమైన దేశభక్తి, కార్యదీక్ష, పట్టుదల, స్వాతంత్రేచ్ఛ; వీటన్నింటికీ తగిన బ్రహ్మచర్యం దీనికి తోడు ఆత్మశక్తిని మేధాశక్తిని, భుజశక్తిని జోడించగల విద్య.

వీటన్నింటి సహాయంతో తోడెవ్వరూ లేక పోయినా బ్రహ్మాండమైన సైన్యం నిర్మించాడు. ధనం తనవద్దలేకపోయినా

బ్యాంకిస్థాపించాడు. సైనికుడు కాకపోయినా సర్వ సేనాధిపతి అయినాడు. చివరకు తొలి తాత్కాలిక జాతీయ రాష్ట్ర ప్రభుత్వానికి అధ్యక్షుడై రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్య బలాన్ని ఢీకొని ఓడించి స్వతంత్రనాణేల్ని కూడా చెలాయించి, స్వతంత్ర భారత శుభచిహ్నంగా జాతీయపతాకాన్ని రెండేండ్లు స్వేచ్ఛగా ఎగురవేశాడు. ఆహా ! ఎటువంటి అద్భుతవ్యక్తిత్వం.

# నిజమా ? అబద్ధమా ?

**సెలవు?:—** చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ వలసినఘట్టం ముగిసిపోయింది. ముఖ్యంగా భారతవిప్లవచరిత్రకు ఆధిపత్యంవహించిన త్రిమూర్తులు రాయ్, బోస్, సావర్కారులు. ఈ మహానాయకులు ఆయా సందర్భాల్లో చూపించిన చాక చక్యం, ధీశక్తి యుగ యుగాల పర్యంతరం భారతమాత సగ ర్వంగా తలెత్తుకుని తిరిగే దానికి దోహదమైంది. భారత దేశా నికి చరిత్రలో కలిగిన కళంకం, అప్రతిష్ట తొలగిపోయినయ్.

పర ప్రభుత్వ దుర్భర పరిపాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో సుబాస్ బాబు ఏవిధంగా తన యువక దశనుంచి నేటి వరకూ పని చేసిందీ గ్రహించాం. ఆయన చేసిన కృషి అంతటిలోకెల్లా అజాద్ హింద్ ఫౌజు నిర్మాణం అనన్యసామాన్యమైనది. అంతే కాదు. ఆధునిక పరిస్థితుల్లో అది మానవాతీతమైన ప్రయత్నం కూడా ! నిజంగా ఈ సైనిక నిర్మాణంతోటే ఆయనలో మరుగుపడివున్న శక్తి విదితమై గాంధీజీని సహితం ముగ్ధుణ్ణిచేసింది. ఆ సైనిక నిర్మాణమే భారత స్వాతంత్ర్య మార్గంలో యుద్ధానంతరం ఎంతో సహా కరించింది. అజాద్ హింద్ ఫౌజు బ్రిటీష్ భారత సైన్యాల్లో బ్రహ్మాండమైన మార్పులు తెచ్చి గాంధీజీ లక్ష్యానికి చేదోడైంది.

ఈ నాడు దేశం స్వతంత్రమైంది. ఈ స్వాతంత్ర్యం కోసరం అహోరాత్రులు కృషిచేసిన నేతాజీ మాత్రం మనకు

కనుపించలేదు. అయితే ఎన్నో ఘనకార్యాల్ని సాధించిన అనంతరం నేతాజీ మళ్ళీ అదృశ్యం కావలసిన అవసరం ఏమొచ్చింది?

నేతాజీ మొదట అదృశ్యమైనప్పటినుంచీ కూడ బ్రిటీష్ అమెరికా వారు ఆయన మీద శీతకన్ను వేసే వుంచారు. భారత దేశంలో నేతాజీ మీద ఎన్నో ఆంక్షలు వున్నయ్ స్వతంత్రభారత ప్రభుత్వంఏర్పడేవరకు. ఈనాడుభారతప్రభుత్వం వాటన్నింటినీ తొలగించింది. అంతేగాక, అప్పటికీ ఇప్పటికీ గూడ అంతర్జాతీయంగా "ఫాసిస్టుమండలి" విధించిన యుద్ధ నేరస్తుడనే ఆంక్ష మిగిలివుంది. ఇలాంటి ఆంక్షలు ఎన్నివున్నా ఆయన యుద్ధంలో ఓటమిని గ్రహించగానే భారతదేశానికి రావటానికేసిద్ధపడ్డాడు. కానీ అజాద్ హింద్ ప్రభుత్వమంత్రులు, సన్నిహిత మిత్రులు ఆయన్ని ఆత్మరక్షణ చేసుకునే దానికి వెళ్ళిపోవలసిందిగా నిర్బంధ పెట్టారు.

'జయాప జయాల్లోనూ కష్టసుఖాల్లోనూ నేనుమీతోనే వుంటాన'న్న శపథం ఆసందర్భంలో ఆయన మనసుకు ఎంతో బాధకల్పించినా అనుచరుల అభ్యర్థన ఆలోచించి చూస్తే పరిస్థితుల దృష్ట్యా ఆమోదించక తప్పలేదు. దేశంలోనికి వెళ్ళిన తరువాత కాంగ్రెస్‌తో సహకరించి స్వతంత్రం కోసరం నిరంతర పోరాటం జరుపమని సైనికులకు, సన్నిహితులకు సలహాయిచ్చి ఒక ప్రయత్నంలో విజయం పొందలేకపోయినా, మరో సదవకాశంలో మనకు విజయం తథ్యమనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ సదవకాశం తిరిగి పది సంవత్సరాల్లో లభిస్తుందనే

ఆశతో అందరిదగ్గర సెలవు తీసుకుని 1945 ఆగష్టు 17 వతేదీన మరోమారు అదృశ్యమై పోయాడు నేతాజీ.

**రెండవ సారి విమాన ప్రమాదం:—** మొదట భారత దేశం నుంచి తప్పించుకుని పోయే సందర్భంలో ఆయన మనుగడకు ప్రమాదం లేకుండా జాగ్రత్తతీసుకునేందుకు శాలీ షర్, హుమాయుబోస్, ముకుందలాల్ మొదలైన అనుచరులు చేసిన ప్రయత్నాలు-ప్రకటనలు అనేక అపోహలకు విమర్శ లకు చేరుకుని, తరువాత జపాన్ సముద్రతీరంలో మరణానికి దారితీసి, బాంబే క్రానికల్ పత్రిక లండన్ రచయిత దివ్య దృష్టిలో బ్రతికి, ప్రాచ్యదేశంలో బ్రిటీష్ అమెరికా వారిమీద యుద్ధంచేసి ఓడిపోయిన బోస్ ఈసారి విమానంలో ప్రయాణం చేశాడనేంత వరకూ యదార్థమే కానీ, విమానం ప్రమా దానికి గురియైన విషయం యెంతవరకు యదార్థమో పరి శీలించాల్సిన అవసరముంది.

ఒకప్పుడు బి. బి. సి. రేడియోని బోగస్ బ్రాడ్ కాస్టింగ్ రేడియో అని వ్యాఖ్యానించాడని కలకత్తాలో నాకొక మిత్రుడు చెప్పాడు. మొదటి సారి విమానంలో ప్రయాణం చేయకపోయినా, చేసినట్లు, చనిపోయినట్లు అది ప్రసారం చేసింది. ఈసారిగూడా మొట్టమొదట నేతాజీ విమాన ప్రమాదంలో మరణించాడనేవార్త జపాన్‌లోని బ్రిటీష్ కార్యాలయాన్నుంచి టర్కీలోని బ్రిటీష్ విదేశాంగ కార్యాలయానికి వైర్‌లెస్ సమాచారంగా తెలిస్తే అది బి. బి. సి. దృష్టిలో బడి ప్రపంచానికి వెల్లడైంది. అయితే

ఈ ప్రకటనని ఈనాడు అనేకమంది అజాద్ హింద్ ఉద్యోగులు ఆమోదిస్తూ సమర్థిస్తున్నారు. ఈసందర్భంగా మనం ముఖ్యంగా పరిశీలించవలసిన ప్రకటనలు మూడువున్నయ్.

**అబీబుర్ రహమాన్ కథనం:—** "ఆగష్టు 17వ తేదీ సైగాన్" విమానాశ్రయం నుంచి మేం బయలుదేరిన రెండు గంటలకు 'ఇండోసీనా' లో వున్న 'తౌరియాన్' లో ఆరాత్రికి వుండిపోయాం. తిరిగి షుమారు సాయంత్రం రెండు గంటలయ్యే వరకు అక్కడి నుంచి చీకటిలో బయలుదేరి 'తైహోకు' విమానాశ్రయం చేరుకున్నాం. 18 వ తేదీన 2-35 గంటలకు మళ్ళీ బయలు దేరాం.

"మేం అప్పుడే మార్గం చూచుకుని రెండుమూడు వందల అడుగుల ఎత్తు వెళ్ళే సరికి అతిభయంకర మైన శబ్దం వినిపించింది నేనుదాన్ని శత్రువుల 'ఫైటర్' విమానం అని భావించాను. తరువాత 'పోర్టు ఇంజన్ (ప్రొపెల్లర్స్)' లో ఒకటి పగిలిపోయిందని గ్రహించాను. విమానం అప్పటి కప్పుడే తారుమారు ఔతుంటే. విమానచోదకుని చాకచక్యం వ్యర్థమై అది చివరకు ముందు భాగం నేలకు తగిలి ప్రేలిపోయి ఒక క్షణం వరకూ అంతా అయోమయమై పోయింది.

"కొద్దిక్షణాల అనంతరం, నేను తిరిగి తెలివిలోనికి వచ్చిన తరువాత అక్కడవున్న సామానంతా నా పైనబడిందని నాముందు నిప్పురగులు కున్నదని గ్రహించాను. కాబట్టి ఇలా వెనుక దారి సామాను అడ్డంపడి వుండటం వలన మూసుకు పోయింది. ఇక ముందువున్న దారికి నిప్పుకుండా పోతే సాధ్య

పడుతుంది. నేతాజీ తలకు మంచి దెబ్బతగిలింది. అయితే నిప్పులో నుంచి నా వైపుకు వచ్చేదానికి గిల గిల తన్నుకుంటున్నాడు నేతాజీ. అటువైపు ఏదారి లేకపోయి నందువలన "ఆగే సెని కలియె నేతాజీ" (ముందుకువచ్చి తప్పుకో నేతాజీ) అని నేను చెప్పాను. నిప్పులో నేతాజీ దారికోసరం సతమతమై తుదకు మంటకు 10 లేక 15 అడుగుల దూరంలో వెళ్ళినుల్చున్నాడు.

"విమానం బ్రద్ధలైన సందర్భంలో ఆయన ఖాదీదుస్తుల నిండా పెట్రోలు చింది పడటం వలన, ఆయన నిప్పులు లోగుండా వచ్చేటందుకు ప్రియత్నించినపుడు బట్టలకు నిప్పంటుకుంది. కాబట్టి ఆయన తన బుష్‌కోట్‌ను బంధించివున్న "బకుల్సును" విప్పేటందుకు తీవ్ర ప్రయత్నం చేస్తూ అక్కడే వున్నాడు. నేను ఆయన వైపుకు దూకి బెల్టులు విప్పేవిషయంలో సహాకరించటానికి ప్రయత్నించాను. అప్పుడు ఆయన ముఖం మీద ఇనుము వలన తగిలిన దెబ్బ, తిరిగి అదంతా నిప్పువలన కాలిపోవటం గమనించాను. కొద్ది నిముషాల తరువాత ఆయన స్పృహ తప్పి నేలమీద పడిపోయాడు. నేను కూడా అదేస్థితిలో ఆ ప్రక్కనే పడిపోయాను. ఇక తరువాత నాకు తెలియ వచ్చిందేమంటే నేతాజీ ప్రక్కని ఒకహాస్పిటల్ పరుపు మీద పడుకొని వున్నాను.

**నేతాజీ తుది పల్కులు:**—"ప్రమాదం జరిగిన 15 నిమిషాల అనంతరం, ఒక మిలటరీ అంబ్యులెన్సు కారు మా దగ్గరకు వచ్చి "తైహోకు" పట్టణ హాస్పిటల్‌కు తీసుకు పోయిందని తెల్సుకున్నాను. హాస్పిటల్‌కు చేరిన వెంటనే

నేతాజీ పూర్తిగా తెలివి కోల్పోయాడు. త్వరలోనే తిరిగి తేరుకున్నాడు. ఆయన తను అనుభవిస్తున్న ఆదుర్భర బాధను గురించి ఏమీ చెప్పలేదు. అప్పుడప్పుడు పరిమితంగా మాట్లాడుతూ మంచి తెలివిగానే వున్నాడు. ఆయన అంత్యం సమీపించబోయే ఒక క్షణం ముందు నాతో ఇలా చెప్పాడు, "నా అంత్యం చాలత్వరలో నేసమీపిస్తుంది. నా దేశస్వాతంత్ర్యం కోసరం నా జీవితమంతా పోరాడాను. నా దేశ స్వాతంత్యం కోసరమే నేను మరణిస్తున్నాను. భారత స్వాతంత్ర్య సమరాన్ని నిరంతరం సాగిస్తుండమని నువ్వెళ్ళి నా దేశీయులకు చెప్పు, కొద్ది కాలంలోనే భారత దేశం స్వతంత్రమై తీరుతుంది."

"నేతాజీని రక్షించటానికి జపాన్ వారు మానవాతీత ప్రయత్నాలన్నీ చేశారు. కానీ ఆ శ్రమంతా వృధాఅయింది. ఆరుగంటల తరువాత (అంటేరాత్రి 9 గంIIలకు) 1945 ఆగష్టు 18 వ తేదీన హాస్పిటల్‌కు తీసుకురా బడిన తర్వాతనే నేతాజీ అంత్యం ప్రశాంతంగా జరిగింది.

"నాకు బాగావారితో మాట్లాడ గలిగిన శక్తి వచ్చిన తరువాత జపాన్ వారిని, నేతాజీ భౌతిక దేహాన్ని విమానంలో సింగపూర్‌కు కానీ, టోకియోకు కానీ పంపించే ఏర్పాట్లు చేయవలసిందని అడిగాను. అలా చేస్తామని కూడా వాళుమాట యిచ్చారు. ఆ తరువాత నేతాజీ భౌతిక దేహాన్ని 'తైహోకు' నుంచి మరెక్కడికీ తీసుకు పోవటానికి సాధ్యపడదనీ, ఇక్కడే శవదహన ఏర్పాట్లు వీలైనంత త్వరలో చేయబడతాయనీ తెలియజేశారు. అందుకు నా ఆమోదాన్ని కోరారు. నేనిక

ఒప్పుకోవటం తప్ప మరోగత్యంతరం లేదు. 20 వ తేదీన హాస్పిటల్‌కు ఆనుకొని వున్న దేవస్థాన మైదానంలో సైనికమర్యాదలతో నేతాజీ శవదహనం జరిగింది.

"వారు నేతాజీ అస్థులను ఒక పాత్రలోవుంచి దైవపీఠ సన్నిధిన అక్కడే భద్రపరిచారు. మూడువారాల, తదుపరి ఒక చిన్న ఆంబ్యులెన్సు విమానం తైహోకును విడిచి వెడు తుందని తెలియజేశారు. నేతాజీ అస్థులను జాగ్రత్తగా తీసుకుని 1945 సెప్టెంబరు 6 వ తేదీన నేను టోకియో చేరుకున్నాను. నన్ను రహస్యంగా వుంచేదానికోసరం సరాసరి ఒకచిన్న పల్లెటూరికి తీసుకు పోయారు. రెండురోజుల తరువాత ముందు అస్థికల్ని అనంతరం నన్ను టోకియో చేర్చారు."

**యస్. ఎ. అయ్యర్ కథనం :—** నేతాజీ బోస్ కలనల్ అబీబుర్ రహమాన్‌తో గమ్యమెరుగని ప్రదేశానికి వెళ్ళాడట. జపాన్ అధికారులు 1945 ఆగస్టు 20 వ తేదీన సైగాన్ నుంచి జపాన్ వెళ్ళే ఒక విమానంలో సాధ్యమైనంత త్వరలో నేతాజీని కల్సుకునేటందుకు ఒక స్థానం ఖాళీవున్నదని అయ్యర్‌కు తెలియజేశారట. ఆయన సైగాన్ విమానాశ్రయానికి 1945 ఆగస్టు 20 వ తేదీన ఉదయం చేరుకుని అనుకోని విధంగా 'తూర్పు ఆసియా ప్రదేశడోమినస్యాస్ ఏజన్సీ' ప్రధానోద్యోగి అయిన "మిష్టర్ ఫ్యుకోకా"ను కల్సుకున్నాడట.

"నేతాజీని గురించి సానుభూతి తెలుపుతూ అతను నాకు విస్పష్టంగా చెప్పాడు. వాతావరణం అనుకూలంగా

లేనందు వలన నేతాజీ "ఫార్మోసా" లోనే ఆగిపోయాడనీ నాకు ముందు చెప్పాడు. కొద్దిసేపటికి నేను విమానం చేరు కోబోతుండగా 'జపాన్ నావికోద్యోగి' అయిన "రియర్ ఆడ్మిరల్ భుడా" నేతాజీ మరణించాడని చెప్పాడు. అయితే వివరాల్ని అడిగి తెల్సుకునే అవకాశం లేకపోయింది. కారణం ఏమంటే ఒక క్షణంలో విమానం బయలుదేరబోతుంది.

"మేము సాయంత్రం 5 గం॥లకు "కాంటన్" విమా నాశ్రయానికి చేరుకుని పెట్రోలు తదితర విషయాలు చూచు కోవటానికి ఆగి పోయిన సందర్భంలో నాతోని వస్తున్న "కల నల్ టాడా" నన్ను ప్రక్కకు తీసుకొనిపోయి మొట్ట మొదటి సారిగా, ఆగష్టు 18 వ తేదిన "ఫార్మోసా" లోని "తైహోకు" వద్ద నేతాజీ ప్రయాణం చేస్తున్న విమానం కూలిపోయి నేతాజీ తీవ్రంగా గాయపడి ఆరాత్రి ఆ గాయాల మూలంగా దివంగతు డైనాడనీ, కలనల్ రహమాన్ మాత్రం తీవ్రమైన ప్రమాదానికి గురికాలేదుగాబట్టి "తైహోకు"హాస్పిటల్‌లో బ్రతికే వున్నాడని చెప్పాడు. నేను అప్పుడు నన్ను తైహోకు తీసుకు పోవలసిందిగాకోరాను. ఆవిధంగా నేను నేతాజీశవాన్ని నా స్వంత కండ్లతో చూడగలననీ సరైన ఋజువు లభించనిదే ఈ కధని భారతదేశంలో ఎవరూ నమ్మరనీ, కలనల్ అబీబ్‌కు సేవచేయగలననీ ఆవిధంగాకోరాను. "కల్‌నల్‌టాడా" తైహోకు వెళ్ళగలమని నాకుమాటయిచ్చాడు. కానీ నేను తైహోకు మాత్రం తీసుకు పోబడలేదు.

"1945 ఆగష్టు మాసంలో సైగాన్ నుంచి టోకియోకు నన్ననుసరించిన కల్నల్ టాడాను (1951 'మే' మాసంలో) మళ్ళీ కలుసుకుని తన మాట ప్రకారం ఎందుకు తైహోకు నన్ను తీసుకుని పోలేదో ఆ విషయాన్ని అడిగాను. అది రాత్రి 10 గంll ల సమయం. అప్పుడు మనం "తైచూర్" చేరుకున్నాం — ఆ సమయంలో తైహోకు విమానాశ్రయపు పరిసరాలు కొండలోయలతో వుండటం వలన మనం తైహోకు వెళ్ళకుండా వుండటం మంచిదిగా భావించానని విశదం చేశాడు. అంతేకాకుండా జపాన్ దానికి అనుబంధించివున్న ప్రదేశాలలోని విమానాలన్నింటిని 1945 ఆగష్టు 21 తేదీ లోపల క్రిందికి దించి వేయాలని మిత్రమండలి పెట్టినషరతును దృష్టిలో పెట్టుకుని ఆ మనసటి దినమైనా తైహోకు చూడటానికి ఇష్టపడలేదు. ఒకవేళ నేతాజీ తైహోకులో అప్పటికి బ్రతికి వున్నట్లయితే వారు తైహోకునుంచు తీసుకు వెళ్ళేందుకు శ్రమపడి వుండవచ్చు. తుదకు తన ఆరు సంవత్సరాల కథ అంతా వర్ణించి అవసరమైన అన్ని విషయాల్ని సేకరించి విమాన ప్రమాద సత్యాన్ని ఎవరైనా అనుమానించినందువలన ఫలితం లేదని నాతో స్పష్టంగా చెప్పాడు.

"టోకియోలోవున్న "రెంకోజీ" దేవళంలో భద్రపర్చబడివున్న అస్థికలు నేతాజీవే అని అనటంలో నా మనసులో ఏ మాత్రం సందేహం లేదు"

జర్నలిష్టు కధనం:— యఫ్. యఫ్. ఆర్. 13వ దళంలోని ఒక మాజీ సైనికుడు (పంజాబి) c/o వె. ఫెరరే "పీపుల్సు"పత్రిక (బాంబె)జర్నలిస్టు.

"......మలయాలోని "తైపింగ్" కు 6 మైళ్ళలోవున్న "కాలాలిప్పిన్" విమానాశ్రయం నుంచి "జపాన్ పైలెట్ కాప్టెన్ టుమా మరోయీా" నడిపిన పసుపు విమానంలో వెళ్ళిపోతూ "ప్రస్తుతం నేను తలదాచు కోవటానికివున్న నెలవు "టిబెట్" ఒక్కటే'' అని చెప్పివెళ్ళాడు.

"నేతాజీ మమ్మల్ని శాశ్వతంగా వదలి వెళ్తున్నాడని తెల్పినపుడు మేమందరం ఎలుగెత్తి ఏడ్చాం. ఇంక మా గతేమిటని అభ్యర్థించాం. మేము ఇండియాకు తిరిగి వెళ్ళవలసిందేనా? అన్నాం. ఈ మాట వినగానే నేతాజీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవి వియోగభాష్పాలు. నేను ఆయనచెంత వున్న మొత్తం కాలం అంతటిలోనూ ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగటం అప్పుడు తప్ప ఇంకెప్పుడూ చూడలేదు.

"అంతట నేతాజీ నాతో ఇలా అన్నాడు. "మాట్లాడటానికి వ్యవధిలేదు. నాజాడ కనుగొని నన్ను అరెస్టు చేయడానికోసరం బ్రిటీష్ అమెరికన్ విమానాలు ఇండియా విమానాశ్రయాలనుంచి బయలుదేరి ఈ ప్రాంతమంతా గాలిస్తున్నవి. ఇక్కడినుంచి బయలు దేరబోయే ముందు అజాద్ హింద్ ఫౌజు వివిధ శిబిరాలను కేంద్రాలను సందర్శించి అత్యంత విశ్వాసపాత్రులైన అనుచరు లందరి దగ్గర నుంచి వీడ్కోలు తీసు

కోవాలని ఆలోచించాను. కానీ తీరా చూస్తే అందుకు వ్యవధి ఏమీలేదు. దానికి నేనెంతో విచారిస్తున్నాను. ఇంతకీ విధి వ్రాలు ఆలాగున్నది. జనరల్ అబీబుర్ రహమాన్‌తో నేనంతా చెప్పాను. నా శుభాకాంక్షలను కష్టసమయంలో సహచరులైన మీకు సోదర దేశీయులందరికీ ఆయన అందజేయ గలడు."

"ఇది వినగానే ప్రేమసింగ్ చేతులు జోడించి నేతాజీ నీవు ఏ దేశానికి వెళ్లుతున్నావో చెప్పు" అని ప్రార్థించాడు.

"ఇంతలో జనరల్ అబీబుర్ రహమాన్ అడ్డంవచ్చి ఇలాఅన్నాడు. "నేతాజీని ఇలాంటి ప్రశ్నలుఅడగటంతో వృధా కాల హరణం చేయకండి. అంతా నేను తరువాత చెబుతాను." శోకరుద్ధమైన కంఠంతో అశ్రుపూరిత నయనాలతో "తుదిసారి ఒక్కమారు మాట్లాడనివ్వుబాబూ" అని కెప్టెన్ 'ప్రేమసింగ్' జనరల్ అబీబుర్ రహమాన్‌ను బ్రతిమాలాడు. నేతాజీ హృదయం ప్రేమార్ద్రమై పోయింది. వెంటనే మా కేసి తిరిగి ఇలా అన్నాడు:—

"మిమ్మందర్ని ఒంటరిగా వదలి వెళ్ళడం నా కెంతో కష్టంగా వున్నది. ఈ ప్రపంచంలో నేను తలదాచుకోవటానికి ఇది ఎంతో సంకుచితమై పోయినట్లని పిస్తుంది. ఏ దేశం స్వేచ్ఛ కోసరం–స్వాతంత్ర్యం కోసరం మనమందరం పోరాడామో అట్టి నా మాతృదేశంలో నాకు తలదాచుకోవటానికి చోటు లేకుండా వున్నది. ప్రస్తుతం నేను తలదాచుకోవటానికి తగిన

నెలవు 'టిబెట్' ఒక్కటే! అక్కడగూడ బ్రిటిష్-అమెరికన్ గూఢ చారులు నన్ను వెంటాడితే నేను ఇండో చైనాకు వెడతాను. అంతట—

"ఈ గూఢచారులు ఇండో చైనాకు కూడ వస్తేనో...? అని నేను మళ్ళీ ప్రశ్నించాను. అప్పుడు నేను "మంచూరియా" వెడతాను. వాళ్ళు నన్ను అక్కడా వెంటాడితే అక్కడ నుంచి నేను రష్యాకు వెళ్తాను. ఆ దేశంలో నన్ను ఒక్క అమెరికన్ గూఢచారిగానీ బ్రిటిష్ గూఢచారిగానీ తేరిపార జూడలేడు. ఇతర దేశాలన్నీ నాకాశ్రయ మివ్వటానికి వెనుకంజవేసినా రష్యామాత్రం నన్ను కడుపులో పెట్టుకుని దాచుకుంటుంది. సర్వవిధాలనన్ను కాపాడుతుంది. భవిష్యత్‌లో ఎప్పుడో అప్పుడు ఎక్కడో అక్కడ మిమ్మందరినీ కల్సుకోగల ననే నా ఆశ"

"ఆయనకళ్ళు చెమ్మగిలినాయి. మా అందరితో కరస్పర్శ చేసి ఆయన విమానం వద్దకు నడిచి వెళ్ళాడు. జనరల్ అబీబుర్ రహమాన్ ఆయన వెనుకనే అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు. ఈ లోపల మేము ఆరుగురం మా మట్టుకు మేము సంభాషణలు ప్రారంభించాం, "మనల్ని కూడా తనతో తీసుకు వెళ్ళవలసిందని మరోమారు నేతాజీని కోరుదామని". మాలో ఒకరు నేతాజీకి సూచించారు. కానీ అలా అడుగటం మంచిది కాదు; జనరల్ అబీబుర్ రహమాన్‌నే తనతో తీసుకువెళ్ళటానికి నిరాకరించినప్పుడు మనల్ని ఎలాతీసుకు వెళతాడు? మనందర్ని తెరమరుగునుంచి రక్షణకల్పించటం ఆయనకు

అసాధ్య మౌతుంది. గూఢచారులకు మనమే ముందుగా పట్టుబడే ప్రమాదమున్నదని నేను చెప్పాను.

"అయినా కూడా ఖుషీరాం, నాద్ సింగులు విమానం వద్దకు వెళ్ళి నేతాజీని ఇలా అడిగారు. "మీ నుంచి మమ్మల్ని వేరుచేయ గలిగింది మృత్యువే! మీతోనే మేమూ వస్తాం" కానీ నేతాజీ వారిస్తూ ఇలాఅన్నాడు:—

**నేతాజీ తుది పలుకులు:—** "మీలో ఎవరినైనా సరే నా వెంట తీసుకుని వెళ్ళడం సాధ్యంకాదు. నాచివరి సలహాను జ్ఞాపకం పెట్టుకోండి. మీరు ఎవరినికలుసుకున్నా సరే 'నేతాజీ విమాన ప్రమాదంలో మరణించాడని ఆప్రమాదం లోనే జనరల్ అబీబుర్ రహమాన్‌కు కూడాగాయాలు తగిలినవని చెప్పండి; బ్రిటీషువారు ఇండియాలో ఉన్నంత వరకూ ఏదో విధంగా వారితో పోరుసాగిస్తూనే వుండండి. తీవ్రమైన ప్రచారాన్ని కొనసాగించండి. ఏదో ఒక రోజున ఈ దేశం స్వతంత్రం కావటం మీరుచూచి ఆనందిస్తారు."

"అటు తర్వాత—విమానం నెమ్మదిగా కదలి ఆకాశం లోనికి ఎగిరిపోయింది. వెనువెంటనే అది అదృశ్యమైపోయింది. మేమందరం విస్తుపోయి అలాగె నిలబడిపోయాం. విమానంలో ఇద్దరే వున్నారు. విమాన చోదకుడైన కాప్టెన్ టుమామురోయీ—నేతాజీలు. నేతాజీ అలా అంతిమయాత్ర సాగిస్తుండగా చూస్తూఅక్కడ నిలబడి వుంది తొమ్మిదిమంది. 1 నేతాజీ (2) కాప్టెన్‌టుమామరోయీ (3) జనరల్ అబీబుర్‌రహమాన్ (4) కాప్టెన్ ప్రేమసింగ్ (5) లెఫ్టినెంట్ పూరమన్‌సింగ్

(6) హావల్దార్ నాద్ సింగ్ (7) నాయక్ మున్షీరాం, (8) ఖుషీరాం (9) నేను బహుశా ఆరోజు 1948 జులై 11 వ తేదీ, అని నాకుజ్ఞాపకం. మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగింది అంతా. ఆకాశమంతా మేఘాచ్ఛిన్నమైవుంది. వర్షంపడబోతుంది.

"విమానం వెళ్ళిన తరువాత జనరల్ అబీబుర్ రహమాన్ మాతో క్రిందివిధంగా చెప్పాడు.

"బ్రిటిష్ అమెరికన్ విమానాలు త్వరలోనే ఇక్కడకు చేరుకోనున్నవి. మనపని త్వరగా ముగించేద్దాం. సమీపాన వున్నగ్రామానికి వెళ్ళి బలిష్టులైన 20 మంది గ్రామీణులను తీసుకురండి."

**చేతుల్తో తగులబెట్టిన విమానం:—** "నేను మున్షీరాం, హావల్దార్ నాద్ సింగ్ కలసి అక్కడకు అరమైలు దూరంలోవున్న బాదీర్ పట్టణానికివెళ్ళి బ్రిటిష్‌వారు మమ్మల్ని అక్కడకు పంపించారని చెప్పాం. అక్కడి జనాభా అంతా చాల కుతూహలం ప్రదర్శించి, మాతోపాటు విమానాశ్రయానికి బయలుదేరారు. 20 మందిని మాత్రమే పిల్చుకొని రమ్మన్నారని చెప్పి వారిని మాత్రమే మేం తోడితెచ్చాం. విమానాశ్రయానికి చేరుకోగానే బ్రిటిష్ వాళ్ళని చూపమని అడిగారు. శత్రువుల్ని పట్టుకోనటానికి వారు అడవిలోకి వెళ్ళారనీ ఈలోపల వారి ఉన్నతోద్యోగిని కావాలంటే చూడవచ్చుననీ, చెప్పాం. వారిని జనరల్ అబీబుర్ రహమాన్ వద్దకు తీసుకుని వెళ్ళాం. విమానాశ్రయంలో కల 60 విమానాలలోనూ ఒకదానిని లాక్కునివెళ్ళి అడవిలో పెట్టాలని ఆయన

ఆదేశించాడు. ఆ గ్రామీణులు వెంటనే ఆ ఆదేశాన్ని శిరసా వహించారు. కాప్టెన్ ప్రేంసింగ్ స్టీరింగ్ పుచ్చుకున్నాడు. మేమందరం విమానాన్ని అడవిలోనికి తోసుకొని వెళ్ళాం. విమానాశ్రయం నుంచి ఒక ఫర్లాంగుదూరం తీసుకెళ్ళామన్న మాట. అప్పుడు వారిని వెళ్ళమని చెప్పాం. వారక్కడి నుంచి వెళ్ళిన తరువాత ఇద్దరు జపానీయులు చైనీస్ సివిల్ డ్రెస్‌లో మావద్దకు వచ్చారు. వారు మామూలుగా అక్కడ నివసించే చైనీయులేనని మేం భావించాం. కానీ, "లెఫ్టినెంట్ ఖానోయ్" జనరల్ అబీబుర్‌రహమాన్ అడిగిన ప్రశ్నకు ఇంగ్లీషులో సమాధానం చెప్పాడు. "మిమ్మల్ని బాగఎరుగుదును. నేతాజీని, మిమ్మల్ని నేను ఒకటి రెండుసార్లు విమానంలో టోకియోకు తీసుకు వెళ్ళాను" అని అతడు చెప్పాడు.

అంతట లెఫ్టినెంట్ ఖానోయ్‌ని జనరల్ రహమాన్ చాటుకు తీసుకువెళ్ళి దాదాపు ఐదునిమిషాలసేపు సంభాషించాడు. ఆ సంభాషణ ముగిసిన తరువాత వారుభయులూ విమానంలోని పెట్రోలు టాంకి నుంచి ఒక డబ్బా పెట్రోలు తీసి దూరంగా పెట్టారు. అంతట లెఫ్టినెంట్ ఖానోయి నిప్పు పుల్ల వెలిగించి ఆ విమానం మీదకు విసరివేశాడు. అది అంటుకుంది. ఆ విమానం తగులబడిపోయిన తరువాత అబీబుర్ రహమాన్ ఆ పెట్రోలు డబ్బాతీసుకుని దానిని తనపైనే చల్లుకోవటం మొదలు పెట్టాడు. అలాచేయవద్దని మేము ఆరుగురం బ్రతిమాలుకున్నాం. గంభీరమైన కంఠస్వరంతో ఆయనిలా బదులు చెప్పాడు.

**ఒళ్లు కాల్చుకున్న రహమాన్:**— "నన్నుమీరేమీ అడ్డు పెట్టవద్దు. నేతాజీకి నేనిచ్చిన వాగ్దానాన్ని తీర్చుకుంటున్నాను. నాకు స్మృతితప్పి పోయిన తరువాత హాస్పిటల్‌కు తీసుకుపోయి విమాన ప్రమాదంలో నేతాజీ చనిపోయాడని చెప్పండి."

"తన తలపైన చేతులపైన తొడలపైన పెట్రోల్ పోసుకున్న తరువాత నిప్పుపుల్ల వెలిగించి అంటించుకున్నాడు. కన్నుమూసి తెరిచే లోపలనే నేతాజీ ప్రియసహచరుడు అగ్నిజ్వాలల్లో ఆహుతి కావటం మొదలు పెట్టాడు. ఒక్క అంగుళమైనా ఆయన అక్కడనుంచి కదలలేదు. శిలా ప్రతిమవలె అతను అక్కడ నిలబడి పోయాడు. భయంతో వణకి పోతూ బిగ్గరగా కేకలుపెట్టుకుంటూ మేం ఆయన వద్దకు వెళ్ళి మట్టి, ఇసుక, బురదనీరు ఆయన మీద కొట్టటం మొదలు పెట్టాం. స్మృతి తప్పిపడిపోయాడు. ముందు ఆయన్నక్కడినుంచి తొలగించి, ఆ గుడ్డలకు అంటుకున్న నిప్పును ఆర్పి వేశాం. ఆ ఇరువురు జపానీయులు కూడా మాతో కలిశారు. కాలిపోయిన శరీరం విపరీతమైన దుర్గంధం కొడుతుంది. కొంతవరకు తగలబడివున్న దుస్తులను లెఫ్టినెంట్ ఖానోయి తొలగించి వేశాడు. గుండె ఊపిరితిత్తులు వెన్నుపొట్టకొద్దిగా గాయపడ్డాయ్. తల నుదురు కనుబొమలు ముక్కు చేతులు బాగా కాలిపోయినయ్. కుళ్ళిపోయిన పండుతోలువలె చర్మంవచ్చేస్తుంది. ఏమాత్రం స్పర్శతగిలి నా శరీరం వణికి పోతుంది. అది చూడలేని భయంకర దృశ్యం. జనరల్ సాహెబ్‌ను వెంటనే హాస్పటల్‌కు

తీసుకుపోమని లెఫ్టినెంట్ ఖానోయ్ మాతో చెప్పాడు. తీవ్రమైన విమాన ప్రమాదం జరిగిందనీ నేతాజీ దానిలో కాలిపోయి చనిపోయాడనీ, జాపనీస్ పైలెట్ కూడా మృత్యు వాతపడ్డాడనీ, ఆయనకు మాత్రం ఈవిధంగా తీవ్రంగాగాయాలు తగిలినాయని ఆస్పత్రి అధికారులకు చెప్పమన్నాడు.

జనరల్ సాహెబును కోథంగ్ ఆస్పత్రికి తీసుకుపోయాము. తరువాత జపానీయులు మాకెక్కడాకనుపడలేదు. విమాన ప్రమాదం జరిగిందన్న కట్టుకథను కనుపడిన వారికల్లా మేం చెప్పేశాం. ఆలోచించుకున్నట్లు మేం ఆరుగురం కలసి 'బుక్కాటిమా' వద్దగల ఒకహిందూదేవాలయం ప్రక్కన కొన్ని అస్తులను నిక్షేపం చేశాం. విమానాశ్రయానికి ఇది నాలుగు మైళ్ళ దూరంలో వున్నది. ఇది మలయాకు వలస వచ్చిన దక్షిణ భారతీయులచే నిర్మించబడిన దేవాలయం. ఇవే నేతాజీ అస్థికలని ప్రచారం జరిగింది. అంతిమ యాత్రసాగించేముందు 'బుక్కాటిమా'లోనే నేతాజీ నాలుగు నెలలు గడిపాడు.

## మరికొన్ని ప్రముఖుల అభిప్రాయాలు:—

నేతాజీ భార్య ప్రస్తుతం వియన్నాలో నివశిస్తూవుంది. ఆమె నేతాజీ జపాన్ వెళ్ళినప్పటినుంచీ తన తల్లీకూతుళ్ళతో అవస్థలు పడుతూ ఒక టెలిఫోన్ ఆఫీసులో వుద్యోగం చేసుకుంటుంది. శ్రీమతి బోస్ విశ్వాసాన్ని 1951 మే 1 వ తేదీ సంచికలో "జై భారత్" ఇలా ప్రకటించింది. "నేతాజీ జాడలు ఆయన భార్యకు తెలియవు కానీ, త్వరలోనే తిరిగి వస్తాడని మాత్రం విశ్వసిస్తున్నది." ప్రస్తుతం వియన్నాలో ఉన్నత వైద్యపరీక్షలకు

చదువుతున్న శరత్ బోస్ కుమార్తె శ్రీమతి రామారే ఆమె భర్త సబీల్ రే నేతాజీ కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు; ధీరూ భాయి దేశాయి శరత్ బాబులు కూడా.

కోహిమాలోని నాగ జాతీయ సంఘాధ్యక్షుడు అయి జెడ్ ఫిజా 'హిందూస్థాన్ స్టాండర్డ్ పత్రికా' విలేఖరితో ఈ విధంగా చెప్పినట్లు 'జై భారత్' 1951 మే 6 వ తేదీ సంచిక ద్వారా తెలుస్తుంది - ద్వితీయ ప్రపంచసంగ్రామ సమయంలో నేతాజీ బర్మావచ్చినప్పటినుండీ నేతాజీ తనకు మిత్రుడైనాడనీ, అజాద్ హింద్ ఫౌజుమణిపూర్ దండయాత్ర సాగించి నప్పుడు ఇతడు సలహాదారుడుగా పనిచేశాడనీ తెలుస్తుంది. నేతాజీ విమాన ప్రమాదానికి గురియైనాడనే వార్త అబద్ధమనీ అతని ఉనికిని కప్పిపుచ్చటానికి ఆ విధంగా ప్రకటిస్తారనీ ముందుగానే నేతాజీ సహచరులకు తెలుసునీ, ఈయన వెల్లడించాడట. నేతాజీ ఔటర్ మంగోలియాలో కానీ, డాక్టర్ హోచిమిన్ క్రిందవున్న వియత్ నామిన్స్ లో కానీ లేక మలయా అరణ్యాలలో వుండవచ్చుననీ త్వరలోనే ఇండియాకు రాగలడనీ చెప్పాడట.

"ఇప్పుడు సుభాస్ బాబు నిజంగా సజీవుడైవున్నాడా లేడా అన్న విషయం ఎవరికీ తెలియదు. కొన్ని కారణాల వల్ల తెలియు వీలు లేదుకూడా" జై భారత్ సంపాదకీయం

1 మే–1951

**తీర్పువీరిదే:—** ఇంకా అనేకమైన ప్రకటనలువున్న ప్పటికీ గ్రంథ విస్తరణా భీతిచే వదలివేస్తున్నాను. మూడేండ్ల

క్రితమే "నేతాజీసజీవి" అనే గ్రంథంలో ఈ విషయాల్ని తర్కించటం జరిగింది. ప్రస్తుతం నేతాజీ సజీవా అమరజీవాఅనే విషయాల్ని తేల్చుకునే బాధ్యతను ఈ క్రింది అంశాలను మీా ముందు పెడుతూ మీాకే వదలి వేస్తున్నాను.

1. నేను కొంతమంది అజాద్‌హింద్ ఉద్యోగుల్ని కల్సుకోగా యస్. ఎ. అయ్యర్‌పైన బోస్‌కు ఏమంత విశ్వాస ముండేది కాదనీ, ఆయనకు రహస్యం తెలియ జేయటం బాగుండదనీ, నేతాజీ భావించినట్లు వారు చెప్పారు.

2. ప్రస్తుతం బొంబాయి ప్రభుత్వోన్నతోద్యోగాన్ని యస్. ఎ. అయ్యర్ నిర్వహిస్తున్నాడు. కాంగ్రెస్‌తో సహాక రించి పని చేసుకుంటున్నాడు.

3. అబీబుర్ రహామాన్ పాకిస్తాన్‌లో నివశిస్తున్నాడు. నేతాజీకి యుద్ధసమయంలో ప్రియసహచరుడు.

4. జపాన్ 1945 ఆగష్టు 14 వ తేదీనే లొంగి పోయి నట్లు ప్రకటించింది. అయినా 21 వ తేదీ విమానాలన్నింటినీ అప్పగించే దానికి ఆఖరుగడువు. నేతాజీ ప్రయాణంచేసింది 17 వ తేదీ.

5. జపాన్ లొంగిపోయి మిత్రమండలిని దాసోహ మంటుంటే ఈయన జపాన్ ఎందుకు పోవాలని అనుకున్నాడో ఎలాంటి రక్షణలభిస్తుందని భావించాడో అనూహ్యాం.

6. రహామాన్ చెప్తున్న ప్రకారం నేతాజీ "సైగాన్ విమానాశ్రయం నుంచి బయలు దేరాడు. ఒక లెఫ్టినెంట్ చెబుతున్న ప్రకారం మలయాలోని "తైపింగ్‌కు 6 మైళ్ళ

దూరాన వున్న "కాలాలిప్పిన్" విమానాశ్రయం నుంచి వెళ్ళాడు.

7. రహమాన్ 17 వ తేదీన వెళ్ళినట్లు తనుగూడా నేతాజీతో ప్రయాణం చేసినట్లుచెబితే; నేతాజీతో ఎవరూ పోలేదు.—(ఆయన వెళ్ళిన తేదీ 1949 జులై 11 తేదీ అని) జ్ఞాపకం అంటాడు లెఫ్టినెంట్.

8. రహమాన్ అయ్యర్లు టోకియోలో నివసించినట్లు మనకు ఋజువులు లేవు.

9. యస్. ఎ. అయ్యర్‌కు చెప్పిన జపాన్ ఉద్యోగులు ఇద్దరూ లెఫ్టినెంట్ ఖానోయ్ ఆయన సహచరులేమో ?

10. యస్. ఎ. అయ్యర్ తనను తైహోకుకు ఎందుకు తీసుకుపోలేదు అనేది కలనల్ టాడాను మూడేళ్ళ అనంతరం అడిగి తెల్సుకుంటే ఆయన ఆరేళ్ళ కథ చెప్పాడనటంలో సహేతుకత లేదు.

ఈ విధంగా వారి వారి ప్రకటనల్ని పరిశీలిస్తే వారి ప్రకటనల్ని వారే ఖండించుకున్నట్లు మీకు అర్థమౌతుంది. మొత్తంమీద నేతాజీ చనిపోయాడని చెప్పటానికిఆధారాలేమీ లేవని బ్రిటీష్ అమెరికన్ సి. ఐ. డిలు ఆమోదించారు.అయితే బ్రతికి బాగుండి ఫలానా ప్రదేశంలో వున్నాడని చెప్పటానికీ ఆధారాలు లేవు. ఈ సమస్య 1955వ సం॥లో, పరిష్కారమై పోతుందని నా నమ్మకం. ఈ మధ్య నమ్మిన వారికి నమ్మని వారికి ఆశాభంగం కలుగుతూ వుండటం సహజం.

# జైలులో తిరుగుబాటు

**అజాద్ హింద్ ఫౌజు:—** 40 కోట్ల మంది భారతీయుల్ని దాదాపు రెండువందల సంవత్సరాలపాటు షుమారు ఒకలక్షమంది బ్రిటీషు వ్యక్తులు నిరంకుశంగా ఎలా పరిపాలించారో ఆ వివరాల జోలికి మన మిప్పుడు పోనవసరం లేదుకాని ఆ పరిపాలనా విధానానికి మద్దతిచ్చింది మనలోని అమాయక అభాగ్య ప్రజానీకమేనని ఒకసత్యంగా ఆమోదిద్దాం. క్షుద్బాధ ధన ఆశవారి నీలాచేసింది.

అయితే నేతాజీ తీవ్రమైన కృషి.ఫలితంగా, ఏభారతీయ సైనికులు కడుపు కక్కుర్తికి గులాములై బ్రిటీష్ సామ్రాజ్యాన్ని రక్షించటానికి ఇంతవరకూ ఉపక్రమించి ఉపకరించారో, ఏభారతీయయువకులు అజ్ఞానాంధకారంలో మునిగి దేశద్రోహం చేశారో వారు ఆగ్నేయాసియాలో కండ్లు తెరిచారు. నేతాజీ బోధల వలన అఖండమైన దేశభక్తి అలవర్చుకున్నారు. దేశస్వాతంత్ర్యానికి సర్వకాల సర్వావస్థల్లోనూ ప్రాణ మివ్వటానికి సిద్ధమై అందుకు శాశ్వత చిహ్నంగా రక్తంచిందించి ప్రమాణ పత్రాలమీద సంతకం చేశారు. "స్వతంత్ర భారత సైన్యం" అనే పేరుతో వ్యవహరించుకున్నారు.

ఈ సైన్యంలో జాతి, కుల, మత, వర్గ, భాషాభేద ఈర్ష్యలు మటుమాయమై హిందూముస్లిం ఐక్యత అక్షరాలా ఆచరణలో పెట్టబడింది. స్త్రీ పురుష భేదం నశించి 12వందల మంది అపర ఝాన్సీలుదయించి యుద్ధంచేశారు. ఒక సంఘట్ట

నలో శత్రువులకు బానిసత్వంలోవుండి పంచభక్ష్యపరమాణ్ణము లను భక్షించేదానికంటే స్వతంత్రులమై ఆకూఅలం తిని బ్రతు కుటమేలు అనిసమాధానమిచ్చారు. ఒకప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడైన నేతాజీ, ఒక బెంగాలీబోస్, ఒక కాబూలుసుబాస్ ఇంతటి వీరుల్ని తయారుచేస్తాడని ఏనాడైనా అనుకున్నామా? గారిబాల్డిలోని సైనికనిర్మాణత్వం, లెనిన్‌లోని విప్లవతత్వం ఇంతటితో నేతాజీలో మూర్తీభవించినట్లు విశదమైంది.

జాతీయ పతాకచ్ఛాయను జాతీయ నాయకుల జ్ఞాప కార్థంగా, గాంధీ దళం, అజాద్ దళం, నెహూ్రు దళం, ఝాన్సీ దళం, అనే పేర్లతో జాతీయ సైనిక దళాలు ఏర్పా టైనయ్. ధనిక సామ్రాజ్యవాద దేశాలైన అమెరికా, బ్రిటన్‌ల మీద యుద్ధం ప్రకటించబడింది. ప్రతి రంగంలోనూ బాలురూ స్త్రీలు సహితం అద్భుతంగా పోరాడి అండమాన్ నికోబార్ దీవుల్లో స్వప్రభుత్వాన్ని స్థాపించుకుని భారత జాతీయ పౌరుషాన్ని ప్రకాశింపజేశారు. మచ్చుకొక విదే శీయుడుకూడా లేకుండ ఈ సైనిక నిర్మాణం జరిగింది.

నేతాజీ ఎంతగా తనశక్తి సామర్థ్యాలను వినియో గించినా ఆయుధాలు మాత్రం అనుకున్నన్ని లభించలేదు. జపాన్ తిరోమార్గం పట్టుటతో మందుగుండు సామగ్రికూడా మృగ్యమైంది. చేతిలో ఎంతడబ్బువున్నా నేతాజీకి ఈ లోటు మాత్రం తీరలేదు. అయినా సైనికులు వెనుదిరగటానికి ఇష్టపడ లేదు. బ్రిటీషు తుపాకులతో మల్లయుద్ధం చేయటానికే సిద్ధపడ్డారు.

క్షణ క్షణానికి అడుగడుక్కూ ఆర్థికంగా ప్రతిబంధకాలు కలుగుతున్నా, ప్రతిరక్తంలో ప్రతిరక్తనాళంలో జీర్ణించుకు పోయిన దేశభక్తి ప్రదర్శితమౌతుంటే, అనేకమార్లు ఆకూ అలము భక్షించి రోజుల పర్యంతరం నిద్రాహారాలు లేకుండా మొలలోతు నీళ్లలో వుండి బ్రిటీషు ప్రభుత్వాన్ని ఎదుర్కొన్న రోజులు చరిత్ర వున్నంతకాలం మరువలేం. మానవుల్లో— ముఖ్యంగా—భారతీయుల్లో విశ్వాసం, ప్రేమ, కృతజ్ఞత అనేవి సహజధర్మాలై ఈ నాటికీవుంటే వారుచేసిన త్యాగాల్ని మరువ లేరు.

అయితే భారతమాత దురదృష్టవశాత్తు ప్రకృతీయమైన పర్వతాలు, నదులు, వర్షాలే మన సేనలతో అనేకమార్లు యుద్ధం చేశాయి. ఇలా దాని కర్తవ్యాన్ని అది నిర్వహించింది.

## బర్మాలో ఫౌజు- నాయకుల అవస్థలు:—

(యఫ్. యఫ్. ఆర్. 13వ దళంలోని మాజీసైనికుడు చెప్పిన విషయాల్ని వె. ఫెరరే పేరుతో ప్రకటితమైన వ్యాసాన్ని 6 ఆగస్టు-1950 న ఆంధ్రప్రభలో ప్రచురించిన దాన్ని ఉన్నది ఉన్నట్లు గానే యిక్కడ ఉదహరిస్తున్నాను.)

“మా పని పూర్తిచేసుకుని షుమారు సాయంత్రం 7 గంటలకు బుకాౣతమ్మాకి బయలుదేరాం. భారత జాతీయ సేనల దళం ఏదైనా కనుపడుతుందేమోనని మా ఉద్దేశ్యం. బుకాౣతమ్మ నుంచి “తైపింగ్” రెండుమైళ్ళ దూరంలో వుంది. అందుకు తైపింగ్ వరకూ వెళ్ళాలని నిశ్చయించాం.

మేం తైపింగ్ చేరగానే తైపింగ్ సెంట్రల్ జైలులో భారత జాతీయ సైనికులు నిర్బంధించ బడివున్నారని అచ్చటి చైనా వారు మలయన్‌లు మాతో చెప్పారు. మేం జైలుగేటు దగ్గరకు వెళ్లే సరికి రాత్రి ఎనిమిది గంటలైంది. అచ్చటి మలయన్ కాపలావాడు కెప్టెన్ ప్రేంసింగ్‌ను కోపంతో తిడుతూ అదలించాడు. ప్రేమసింగ్ కూడా అలాగే సమాధాన మిచ్చాడు. సంఘర్షణ ప్రారంభం కాబోతుండగా జైలుఅధికారిగావున్న అమెరికన్ కాప్టెన్ వారించాడు. కాపలావాడు లోపలికివెళ్ళి కొత్తవాళ్ళు వచ్చిన సంగతి చెప్పాడు. తిరిగివానితో ఒక అమెరికన్ కెప్టెన్ ఆంగ్లోయిండియన్ మేజర్ రైఫల్సు ధరించిన ముగ్గురు బ్రిటీష్ సోల్జర్లు బైటకు వచ్చారు.

"ఆంగ్లో ఇండియన్ మేజర్ మమ్ముచూడగానే నోటికి వచ్చినట్లు తిట్టడం ప్రారంభించాడు. మా దుస్తులనుంచి త్రివర్ణ పతాకాలను అజాద్‌హింద్ సైనిక చిహ్నలను తీసివేయాలని ఉత్తర్వుచేశాడు. మమ్ములను సోదాచేసి ఒక నిక్కరు ఒకషర్టు మాత్రం ఒంటి మీద మిగిల్చాడు. మా అందరి వివరాలూ నమోదు చేసుకున్న పిమ్మట మరొక 80-90 మంది జాతీయ సైనికులతో కలిపి మమ్మల్ని ఒక చోట నిర్బంధించారు. రెండు రోజుల పాటు తిండి నీరుకూడ లేకుండా మమ్మల్నిలాకప్‌లో పడవేసి వుంచారు. మంచినీళ్ళు కావాలని మలయా కాపలా వాళ్ళని అడిగితే మా కేమైనా యివ్వడంగానీ చివరకు మాతో మాట్లాడటం కానీ పనికిరాదని తమకు కఠినంగా ఉత్తర్వుచేయ బడిందని చెప్పారు.

"నాలుగోనాడు లెఫ్టినెంట్ కలనల్ లాసీ అనే ఒక బ్రిటీషరు, ఒక అమెరికన్ కెప్టెన్, భారత సేనలకుచెందిన జమేదార్ జోషీలు, మరి ముగ్గురు బ్రిటీష్ సోల్జర్లతో కలసి జైలులోపలకువచ్చి మా ఆరుగురిని ఒక మోటారు ట్రక్కులోనికి ఎక్కించుకుని తీసుకుపోయారు. ఆ ట్రక్కును 80–90 మంది సభ్యులుగల ఒక పేరా చూట్ సైనికుల కేంద్రం వద్ద నిలిపారు. అక్కడ రావల్పిండి జిల్లాకు చెందిన ఒక బ్రాహ్మణ సుబేదారు, ఏడుగురు ఆఫ్రికన్ సోల్జర్లు ఈ దళంలో కలిశారు. కారులో బ్రిటీష్ సోల్జర్లకు అమెరికన్ సోల్జర్లకు ప్రక్కనే మమ్మల్ని కూర్చోబెట్టారు. బ్రిటీష్ కర్నల్, జమేదార్ జోషీ, బ్రాహ్మణసుబేదార్ ఏడుగురు ఆఫ్రికన్ సోల్జర్లు మరో ట్రక్కులో ఎక్కారు. ఉదయం తొమ్మిది గంట లయ్యేసరికి అందరం బుక్కాతమ్మి చేరాం. మేం భస్మం నిక్షేపించిన ఆలయ సమీప ప్రదేశంలోనికి మమ్ములను తీసుకు వెళ్లారు. బ్రిటీష్ లెఫ్టినెంట్, కలనల్ జమేదార్ జోషీని, బ్రాహ్మణ సుబేదార్‌ను ప్రక్కకు తీసుకొని పోయి వారితో పది నిముషాలసేపు సంభాషించాడు. ఈసంప్రదింపుల తరువాత మమ్మల్ని కారు దిగిరావలసిందిగా జమేదార్ జోషీ ఆజ్ఞాపించాడు. మాపై కాల్చటానికి వీలుగా చుట్టూ తగిన ప్రదేశాలలో సిద్ధంగా నిలబడాలని బ్రిటీష్ ఆఫ్రికన్ సోల్జర్లకు ఉత్తర్వు చేయబడింది.

"పిమ్మట బ్రాహ్మణ సుబేదారు సగర్వంగా ఒకనాడు మీరు విజయగర్వంతో కేరింతలు కొడితే ఇవ్వాళ ఆ వంతు

మాది" అన్నాడు. ఈ మాటలు వినేసరికి నాయిక్ ఫ్రూమన్ సింగ్ చెమ్మగిలిన కండ్లతో నావైపుచూచాడు. మేం మాట్లాడకుండా నిల్చున్నాం.

**దారుణహింస:** "ఇవిగో ఈ పరికరాలు పుచ్చుకుని నేతాజీ అవశేషాలను పాతిపెట్టామనే చోటుసుత్రివ్వండి' అని జమేదార్ జోషీ ఆజ్ఞాపించాడు. ఇలా అంటూనే అతడు నేతాజీని నోటికి వచ్చినట్లు తిట్టాడు. నాతాసింగ్ అడ్డువచ్చి నేతాజీని తిట్టవద్దని జోషీని అన్నాడు. దానితో జమేదార్ మండిపడి హవల్దార్ నాతాసింగ్ మెడపైన బాయినెట్ రైఫిల్ గురిపెట్టివుంచి నోరుఎత్తితే కాల్చివేయమని ఒక ఆఫ్రికన్ సోల్జరును ఆజ్ఞాపించాడు. ఇక నాతాసింగ్ ఊరుకున్నాడు. ఆ ప్రదేశం త్రవ్వి అచట ఏమున్నదీ చూపవలసిందిగా జమేదార్ జోషీ తిరిగి మమ్మల్ని ఆజ్ఞాపించాడు.

"ఏంచేసినా మేం త్రవ్వేది లేదు. కావాల్సివుంటే మీరే త్రివ్వుకోండి" అని కెప్టెన్ ప్రేంసింగ్ సమాధాన మిచ్చాడు. బ్రిటీష్ కలనల్ ఓర్పుపట్టలేక పోతున్నాడు. నాతాసింగ్ మెడమీద రైఫల్ పెట్టి నిల్చిన ఆఫ్రికన్ సోల్జరును యథాస్థానంలోనికి పొమ్మని ఆజ్ఞాపించాడు.

"పిమ్మట అమెరికన్ కెప్టెన్ బ్రిటీష్‌కలనల్ పదిహేను ఇరవై గజాల దూరానికి వెళ్లారు. "అప్నా కాం ఘురూకరో" (మీపని ప్రారంభించండి) అని బ్రాహ్మణ సుబేదారు జమేదార్ జోషీతో అన్నాడు. అతడు మావైపు వీపు పెట్టి నిల్చున్నాడు.

మీరు ఈ "ఘద్దార్ జమానేకా" (ఈయుగపు విప్లవ కారుని) గోతిని త్రవ్వండి. లేకపోతే మిమ్మల్ని కూడా ఆ విద్రోహి చెంతకే పంపుతాను అని జమేదార్ కోపంతో ఊంచుకున్నాడు. నేతాజీని ఈ విధంగా అవమానించడం నేను సహించలేక పోయాను. "సింహాకిశోరాలవంటి నేతాజీ సైని కుల జీవితాలు నాశనమైనట్టే" నని నేతాజీ తుదిక్షణంలో చెప్పనే చెప్పాడు, అనివెంటనే మాటకు మాట బదులు చెప్పాను.

"ఈ మాటలంటూ నేను రొమ్ము విరుచుకు నిలబడ్డాను. జమేదార్ జోషీకి విషసర్పం కాటు వేసినట్టని పించింది.

"అతడు నావైపుకు చూస్తూ ఇద్దరు ఆఫ్రికన్ సోల్జర్లను నాదగ్గరకు రమ్మనాడు. ఒకడు నాముందు ఒకడు నావెనుక నిలబడి నావీపుకు, రొమ్ముకు సూటిగా బాయి నెట్లను గురిపెట్టి నిల్చున్నాడు. వారలా నిల్చి తరువాతనే నేనెవరైనది చెప్పమని జమేదార్ జోషీని అడిగారు. "నేను నేతాజీ సైనికుణ్ణి" అని జవాబు చెప్పాను. జమేదార్ సహించ లేక పోయాడు, "భారత జాతీయ సైన్యంలో నీ హోదా ఏమిటి?" అని అరిచాడు.

"నేనొక లెఫ్టినెంటును."

"ఈ మాట విని జమేదార్ జోషీ నన్ను అతి నీచంగా అమ్మ ఆలీ బూతులు తిడుతూ నా ఎడమ గూబపై ఒక్క పెట్టు పెట్టాడు. అదే పనిగా కొడుతూనే వున్నాడు, భారత

జాతీయ సైన్యంలో చేరి నేతాజీ అనుచరుడుగా పనిచేస్తూ మాతృదేశ ప్రేమను దేశభక్తిని ప్రదర్శించిన కారణంగా, డోగ్రా క్షత్రియుని పట్టుకుని ఒక బ్రాహ్మణుడు కొట్టాడు. తిట్ట డమే కాక నన్ను కొట్టినంత సేపు అందరినీ ఉద్దేశించి వాడు ఇలా అరుస్తూనే వున్నాడు.

సంకరపు వెధవల్లారా! మీరంతా చేరి, బిగ్గరగా గొంతెత్తి 'హిందూస్థాన్ హమారా హై' అంటూ పాటలుపాడిన రోజులు జ్ఞాపకం వున్నాయా? ఈ నాడు మేం మీకు భలే స్వాతంత్ర్యాన్ని రుచిచూపిస్తాం. హిందూ దేశాన్నికూడా మీకు కట్టబెడతాం."

"ఇలా తిట్లు పడుతూ ఎడమచెవి-ఎడమ దవడ - కన్ను మీదపడే దెబ్బమీదదెబ్బ, గుద్దుమీద గుద్దులను భరిస్తూ చివ రకు స్పృహతప్పి పడిపోయాను. దాదాపు ఆరగంట దాటిన తరువాత నాకు స్పృహవచ్చింది. తిరిగి దెబ్బలు-గుద్దులమోత వినిపించింది. బరికె దెబ్బల ధ్వనితోపాటు నా సోదరసైనికుల ఆర్త నాదాలు కూడా వినిపించాయి. జమేదార్ జోషీవారిని దయాదాక్షిణ్యాం లేకుండా కొట్టాడు. కసాయివాడు ప్రాణం తీయబోయే ముందు బక్క-ఆవును ఎలాహింసిస్తాడో ఈ బ్రాహ్మణ పిశాచి మమ్మందర్నీ అలా హింసించాడు.

కసాయివాడు గోవును ముందుగా కొన్ని రోజులు ఎండకడతాడు. ఆవుచచ్చిన తరువాత చర్మం మందం తగ్గి పోకుండా ఉండటానికి ఇలాచేస్తాడు. ఆ తరువాత కబేలాకు తీసుకు వెళ్ళి పెద్ద ఇనుపదుంగతో కొడతాడు. ఆ దెబ్బతో

అదికిౖంద పడిన తరువాత మెడదగ్గర రక్తనాణాలు కోసి ఆవు గిజగిజా తన్నుకుంటూ నెమ్మదిగా చని పోయేట్లు చేస్తాడు. జమేదార్ జోషి పుట్టుక బ్రాహ్మణ పుట్టుక అయినా పరమ దుర్మార్గుడు. ఆతడు మాలోని ప్రతి ఒక్కరి దగ్గరకు వచ్చి నేతాజీ అవశేషాలను పాతిపెట్టిన చోటు త్రవ్వమన్నాడు. మేం ఆరుగురం త్రవ్వటానికి నిరాకరించి ఒక అమెరికన్ కెప్టెన్, ఒక బ్రిటీషు కలనల్ సమక్షంలో జమేదార్ చేతుల్లో నిర్దాక్షిణ్యంగా చచ్చే దెబ్బలు తిన్నాం.

**గంగానను బోలిన జోషి:** మూడుగంటలసేపు దారుణంగా దెబ్బలు తిని తిని తోడేళ్ళవాతపడిన మేకపిల్లలవలె బిక్క మొఖాలతో కూర్చున్నాం.

"జమేదార్ కొట్టిన దెబ్బలకు మున్షీరాం రెండు వేళ్లూ విరిగినవి. ప్రేమసింగ్ ముందుపళ్ళు రెండూ ఊడినవి. ఆ దెబ్బలు ఈ నాటికీ మాకు గుర్తున్నవి.

"కెప్టెన్ ప్రేమసింగ్‌కు పెద్ద ప్రమాదం వచ్చిపడింది నోటి వెంట రక్తం వస్తుంది. మూత్రకోశం వెంట రక్తం పడుతుంది. ఈ జబ్బు నివారణ కోసరం తనవద్ద చిల్లిగవ్వతో సహా అంతాఖర్చు చేసినా ఆయనకు ఈ వ్యాధి ఇంకా నయం కాలేదు.

"నేతాజీకి ప్రదానం చేసిన మారక్తం, దేశసేవకు విని యోగించ గలమని ప్రతిన యిచ్చిన మా రక్తం, బ్రిటీష్ ఉత్తర్వులతో, ఒక పంజాబీ బ్రాహ్మణుడు చేయిచేసుకున్న ఫలితంగా ఇలావృధాగా కారిపోయింది.

"ఈ సందర్భంలో 'గంగూ' అనే మరో భూసురోత్తముడు గురు గోవిందసింగ్ భార్యా పిల్లలకు చేసిన ద్రోహాచర్యకు సంబంధించిన పాతకథ ఒకటి నాకు గుర్తుకువస్తున్నది కూడ.

మా ఆరుగురినీ ఒక్క-చేతి మీదుగా తుక్కు తుక్కుగా కొట్టటానికి జమేదార్ జోషీకి రెండున్నర గంటలు పట్టింది. మా వెంట ఉన్న ఒకేఒక శిక్కు-మిత్రుడు చాలా దారుణంగా హింసించబడ్డాడు. ఉగ్రులమైన మేము మా దెబ్బలనూ గాయాలను మర్చిపోయి ఆయనను ఓదార్చటానికి ప్రయత్నించాం. అప్పుడు నేను కొంటెగా నవ్వుతూ ఆశిక్కు-మిత్రుని చెవులో ఇలాఅన్నాను.

"మిశిక్కు- గురువు ప్రియకుమారులకు వలె బ్రతికుండగానే గోడలలో బిగింప బడనందుకు సంతోషించు. ఈ జోషీ మరొక గంగూ" ఇది చెబుతూవుంటే, నేను నా మిత్రునికిఏమి చెబుతున్నానో తెల్సుకోవాలని జమేదార్ జోషీ బిగ్గరగా కేకేశాడు.

"ఇవంతా అయిన తరువాత మేమూ ఆరుగురం క్రిందబడి ఏడుస్తూ ఉబ్బిన మొహాలు, పాలిపోయిన కళ్ళతో నెత్తురు కక్కుకుంటూ పడివున్న చోటికి అమెరికన్ కెప్టెన్ వచ్చాడు. మా బట్టల నిండా రక్తం మరక లే! ఆయన మా కేసి జాలిగా చూచి నిట్టూర్చాడు. మమ్మల్నందరినీ ట్రక్కులోనికి ఎక్కించవలసిందని అమెరికన్ సైనికోద్యోగి జమేదార్ జోషీని ఆజ్ఞాపించాడు. మేమంతాముందు లేచినిలబడి ఆ తరువాత ట్రక్కులోనికి ఒకళ్ళకొకళ్ళం సాయంచేసుకుంటూ ఎవళ్ళ చోటులో

వాళ్ళు కూర్చున్నాం. ఈసారి తిరుగు ప్రయాణంలో బ్రాహ్మణ సుబేదారు జమేదార్ జోషీ ముగ్గురు బ్రిటీష్ సైనికులు సాయుధులై మా ట్రక్కులోనికెక్కారు. మమ్మల్నందర్నీ తీసుకుని ఈట్రక్కుపోతూవుంది, మాకు మొదటిట్రక్కుదోవచూపుతుంది. గంట అయ్యేసరికి మమ్మల్ని తిరిగి తైపింగ్ సెంట్రల్ జైలుకు తీసుకు వచ్చారు. ఈ ట్రక్కులు మెయిన్ గేట్ దగ్గర ఆపివేయ బడ్డాయి.

**జైల్లో తిరుగుబాటు:—** "మేం ఆరుగురం వాటి నుంచిబాధతో కుయ్యోమర్రో అని మొత్తుకుంటూ క్రిందకుదిగాం. బ్రిటీషు కలనల్ అమెరికన్ కెప్టెన్ జమేదార్ జోషీ బ్రాహ్మణ సుబేదారు ముగ్గురు బ్రిటీషు సిపాయీలు, ఏడుగురు ఆఫ్రికన్ సైనికలు మా చుట్టూ గిరిగట్టుకుని నిలబడ్డారు. మేము జైలు ఆవరణలోకి ప్రవేశించగానే ఖైదీలందర్నీ అక్కడ కూర్చో బెట్టారు. వారందరికీ మధ్యాహ్నపు భోజనం క్రింద వరి సంకటి ముద్దలు పెడుతున్నారు. మేం కాస్త ముందుకు పోయేసరికి అజాద్‌హింద్ ఫౌజు 7 వ గెరిల్లా దళాధిపతి "కలనల్, ఎ. యస్. దారా" మాకేసి వచ్చి మమ్మల్ని చూడగానే దిగ్భ్రాంతుడై పోయాడు. ఆయన మాతో ఏదో మాట్లాడా లను కుంటుండగా జమేదార్ జోషీ ఆయన్ను పిలచి నానా దుర్భాషలు ఆడి వెనక్కు పొమ్మనమని హుకుంచేశాడు. ఇది చూచి కలనల్ దారా ఉగ్రుడైపోయి జమేదార్ జోషీని చాచి గట్టిగా ఒకలెంపకాయ్ కొట్టాడు. "మేం ఇప్పుడే జైలులో వున్నాం. ఇక నువ్వు మమ్మల్ని చేసేదేమిటి నీ మొహం" అన్నాడు.

"చేతుల్లో వున్న సంకటి ముద్దల్ని విసరిపారవేసి నిల బడమని అజాద్‌హింద్ సైనికులందరినీ ఆయన ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ ఆజ్ఞను శిరసావహించి ఒక్కసారిగా లేచి నిల బడ్డారు. కలనల్ దారా—అజాద్‌హింద్ సైనికులు చేసిన పనిని చూచి బర్మారంగంలో నేతాజీతో కలసి పనిచేస్తున్న జపాన్ సేనాని మేజర్ జనరల్ గమాషిటా ఇండియా మిత్రులను అను సరించవలసిందని తన జపాన్ సైనికులను గూడా ఆజ్ఞాపించాడు. ఈ జైలులో మొత్తం 20 వేల మంది ఖైదీలుంటే అందులో 16 వేలమంది జపానీలు, నాలుగు వేలమంది భారతీయులు. కలనల్‌దారా మా కేసి చూశాడు. ఆయనకన్నులు క్రోధా రుణితాలైనవి. ఎంత ఆపుకున్నా తన్నుతాను నిగ్రహించు కోలేక పోయాడు. వెంటనే జమేదార్ జోషీని ఉరిమి చూచి "ఇక్కడి నుంచి పో! ఇది మీ అబ్బసొత్తేమీకాదు. మా అంతటి మేమే ఇక్కడికి వచ్చాం. నేనూ నా సహచరులు ఇక్కడవున్న ఈ యోధులందరూ మా మాతృదేశ స్వాతం త్ర్యం కోసరం పోరాడాం." అంటూ జాతీయ గీతం పాడవల సిందని భారతీయ సైనికులను ఆజ్ఞాపించాడు. అంతట భారతీయ సైనికులదదరూ "శుభసుఖ చైనకి బర్ఖాబాగ్సే భారత్ భాగ్ హై జగా..." అని ముక్తకంఠంతో పాడటం ప్రారంభించారు. జపాన్ సైనికులు కూడా తమ జాతీయ గీతం పాడటం మొదలు పెట్టారు.

చూస్తుండగా తమ కళ్ళ ఎదుట ఇది అంతా ఒక నాట కంలా జరిగిపోవటం చూచి అక్కడకాపలా వున్న బ్రిటీషు

కలనల్, బ్రాహ్మణ సుబేదారు, జమేదార్ జోషీ, మరి ముగ్గురు బ్రిటీషు సిపాయీలు ఏడుగురు ఆఫ్రికన్ సైనికులు మరి 15 లేక 20 మంది సైనికులు ప్రాణభీతితో జైలు నుంచి పలాయనం చిత్తగించారు. ఇక 20 మంది సివిల్ పోలీసులతో మలయన్ గస్తీలు మాత్రం మిగిలారు, మా వాళ్ళు వాళ్ళ దగ్గరినుంచి ఆయుధాలు మందుగుండు సామగ్రి పూర్తిగా లాక్కున్నారు. వాళ్ళు పారిపోయారు. ఈ హడా విడిలో జైలు సింహ ద్వారానికి తలుపులు వేయడం మర్చి పోయారు.

జాతీయ గీతం పాడటం ముగించిన తరువాత భారత సైనికులను ఉద్దేశించి కలనల్ దారా ఇలా ఉపన్యశించాడు.

ఇంతమాత్రాన నిరుత్సాహ పడకండి. బర్మారంగంలో మనం ఎదుర్కొంటుండే శత్రువులు వీళ్ళే ! వాళ్ళు పిరికిపందలు వాళ్ళు ఇక్కడ మనల్ని చూచినట్టుగా తన యుద్ధ ఖైదీలను ఏ నాగరిక ప్రభుత్వమూ చూడదు. భారతదేశంలో మన నాయకులైన గాంధీ మహాత్ముడు, జవహరిలాల్ నెహ్రూలు త్వరలోనె మలయాకు వస్తున్నారు. మనమంతా అతి త్వర లోనె విడుదల చేయబడతాం. మనం త్వరలోనె మన మాతృ దేశంలో వుంటాం. ధైర్యంతో విశ్వాసంతో వ్యవహరించండి. గాంధీ మహాత్ముని ఆదర్శాన్ని పాటించండి. ఆయన రోజులకు రోజుల తరబడి ఉపవాసం వుండగలడు. తిండీ తిప్పలు లేకుండా ఆయన 21 రోజులు ఉండగలడు. మనకీ వరిసంకటైనా దొరుకు తుంది. గాంధీజీవట్టి మంచినీళ్ళు త్రాగి మాత్రమే బ్రతుకు తాడు. ఏమీ నిరుత్సాహ పడకండి. మన కోసరం మననాయ

కులు శక్తి వంచన లేకుండా పాటుబడుతున్నారు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వగైరా మాతృదేశం కోసరం త్యాగం చేసిన మహాయోధులను సంస్మరించండి. వారిని బ్రిటీషువారు ఉరితీశారు. అయినా మన హృదయంలో నేటికీ సజీవులే!

"ఈ విధంగా కలనల్ దారా అరగంట సేపు వుపన్యసించి తన సహచరులలో నూతనోత్తేజాన్ని కల్పించాడు. ఆ సమయంలో మేజర్ జనరల్ గమాషిటా కూడా తన జపానీ సైనికులకు అదే విధంగా ఉపన్యసించాడు. వారిలో కూడా అదే విధంగా నవ్యోత్తేజం కలిగింది. ఈ ఉపన్యాసాలు జరుగుతూ వుండగా రెండంగుళాల, మూడంగుళాల ఫిరంగులనుంచి ఏ డెనిమిది తుపాకీ కాల్పులు వినిపించాయి. గుళ్ళు జైలుగోడలకు బైటపడ్డాయ్, కానీ ఆవరణలోనికి రాలేదు.

" తన ఉపన్యాసం ముగించుకుని కలనల్ ద్వారా మా దగ్గరకు వచ్చాడు. మేం ఈ విధంగా అవమానింపబడ్డందుకు, క్రూరంగా హింసించబడినందుకు ఆయన ఎంతో చింతించాడు. ఇంతలో రెండువందలమంది సాయుధ సైనికులతో ఒక బ్రిటిష్ జనరల్ సర్వ సన్నిద్ధుడై జైలుకు వచ్చాడు. ఈ సైనికులలో బ్రిటీషువారున్నారు. భారతీయులున్నారు. ఆఫ్రికను లున్నారు. ఆయన మమ్మల్ని ఉద్దేశించి హిందూస్థానీలో ఇలా ఉపన్యశించాడు."

మీరందరూ ఇండియాకు తిరిగి వెళ్ళదల్చుకుంటే భారతీయ సైన్యంలో ఉన్నపుడు ఎలాంటి క్రమశిక్షణ విధేయతల్ని

నేర్చుకున్నారో వానినే ఇప్పుడు పాటించండి. జపాన్ ఉద్యోగులదగ్గర మీరు నేర్చుకున్నదంతా మర్చిపొండి. మీరు ఇంకో విధంగా ప్రవర్తిస్తే ఇండియాను తిరిగి చూడటం కష్టం.

చైనా వీరబాలిక:— "మేజర్ జనరల్ గమాషి టాని, కలనల్ దారాని మిగతా యుద్ధఖైదీలందరి నుంచి విడదీసి వేరే ప్రత్యేకమైన గదుల్లో ఉంచవలసిందని ఉత్తరువులు జారీచేశాడు. వీరిద్దరినీ గార్డులు వారివారి గదులకు తీసుకు వెళ్ళుతుండగా జైలు ఆవరణకు 1½ మై. దూరంలో ఉన్న సింహద్వారం దగ్గర అతివిచిత్రంగా 18 సం. వయసుగల ఒక చైనా యువతి ప్రత్యక్షమై గేటుదగ్గర వెనుతిరిగి నిల్చున్న బ్రిటీషు కాపలా సైనికులమీద ఒక చేతిబాంబును విసరింది. ఈ ముగ్గురు సైనికులు అక్కడే మరణించారు. మరి ఏడుగురు గాయపడ్డారు. రెండవ చేతి బాంబునుగూడా ప్రేల్చటానికి ఆమె సిద్ధపడుతుండగా తక్షణమే అరెస్టు చేశారు.

"ఈ ఉదంతం వల్ల జైలులో పెద్ద కలకలం బయలు దేరింది. కానీ మరెట్టి సంఘటనా జరుగలేదు. ఈ బాలికను తీసుకువచ్చి బ్రిటీషు జనరల్ ఎదుట హాజరుపెట్టారు. అదే జైలులో ఆమెనుగూడా ఒక ప్రత్యేకమైన గదిలో నిర్బంధించవలసినదని ఆయన ఉత్తరువులు జారీచేశాడు. ఆ చైనీస్ పిల్లను నే నెరుగుదును, ఆవిడ సైపింగులో వుంటూవుండేది. అజాద్‌హింద్‌ఫౌజుకు బట్టలు వగైరా కొనడం కోసరం డబ్బు అత్యవసరంగా కావలసివచ్చినపుడు అనేక వేల డాలర్లను తీసుకు

వచ్చి ఆ బాలిక నేతాజీకి ఇచ్చింది. థాయిలండ్ సరిహద్దు ల్లోని చిత్రానగరం దగ్గర ఆలోస్టార్ మకాంలో ఈ డబ్బును ఆమె నేతాజీకి అందజేసింది. బాగా డబ్బు పలుకుబడి వున్న చైనీస్ శ్రీమంతుల కుటుంబానికి చెందినవ్యక్తి ఈమె. సింగపూర్ నుంచి ఇక్కడివరకూ ఈబాలిక అజాద్‌హింద్ ఫౌజుతో కాలినడకన వచ్చింది. ఈ వీరబాలిక తైపింగ్ జైలులో మాతోపాటు రెండు నెలలు యమచరలు అనుభవించింది. ఆ తరువాత మమ్మందరినీ పెనాంగ్ జైలుకు మార్చారు. అయితే భారతీయులను, భారతదేశాన్ని నిజమైన దేశభక్తుని వలె ప్రేమించిన ఈ వీరబాలిక అటుపిమ్మట ఏమైపోయింది నాకు తెలియదు.

---

దాస్ ఆర్టు ప్రెస్, తెనాలి.